

రాయచూర్: కాంగ్రెస్ నేతృత్వంలో నిర్వహించిన 'సామనాథ సమావేశ్'లో రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, సిద్ధరామయ్య

Estd 1938

ఆంధ్రప్రభ

www prabhanews com

Journalism first!

సంపుటి: 56 • సంచిక: 123 • ఆదివారం 13 ఆగస్టు 2017 • హైదరాబాద్ * పేజీలు: 10+4 • వెల: 6.00 Published from: Hyderabad | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Kurnool | Suryapet | Anantapur | Nellore | Nizamabad

ముహూర్తం | శ్రీ హేవళంబినామ సంవత్సరం, దక్షిణాయణం, వర్ష ఋతువు, శ్రావణ మాసం, తిథి: బహుళ షష్ఠి రా. 7.35 వరకు; అనంతరం సప్తమి; నక్షత్రం: అశ్విని తె. 4.30 వరకు; అనంతరం భరణి; అమృతకాలం: రా. 9.45 నుండి 11.15 వరకు; వర్జ్యం: రా. 12.39 నుండి 2.12 వరకు; దుర్ముహూర్తం: సా. 4.47 నుండి 5.38 వరకు; రాహుకాలం: సా. 4.30 నుండి 6.00 వరకు; యమగండం: మ. 12.00 నుండి 1.30 వరకు

కైలాస్ పర్వతంపై తొలి సూర్యకిరణాల ప్రతిబింబం







కైలాస్ పర్వతంపై తొలిసూర్య కిరణాలు పడ్డ అరుదైన దర్శనం. ఈ కిరణాలు కొన్ని గడియలు మాత్రమే ఉంటాయి. ఈ దర్శనం కోసం చాలా మంది సాధకులు పరితపిస్తుంటారు. ఇలాంటి అద్భుత దర్శనం కోసం ఏటా కైలాస్ యాత్ర చేస్తున్న వారు ఇప్పటికీ ఉన్నారు. అయినా ఇలాంటి దర్శనం కొందరికి మాత్రమే లభిస్తుంది. అలాంటి సందర్భంలో తీసిన ఈ వీడియో సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రసారమవుతోంది.

పాలేరు పాత కాల్వ

ట్రయల్ రన్ సక్సెస్



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఖమ్మం జిల్లా పాలేరు పాత కాలువ ట్రయల్ రన్ విజయవంతమైంది. నైజాం రాజులు నిర్మించిన ఈ కాలువ శిథిలావస్థకు చేరుకోగా ఈ ఏడాది ఫిబ్రవరి 16న రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి టీ హరీష్ రావు, ఆర్అండ్‌బి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. జూలై 31 పనులు పూర్తయ్యాయి. శనివారం సాయంత్రం 4 గంటలకు ఎన్ఎస్‌పి ఎస్ఈ సాయి బాబా, సీడీసీ ఆత్మ, మార్కెట్ కమిటీ చైర్మన్లు ట్రయల్ రన్ సందర్భంగా కాలువ వద్ద పూజలు చేశారు. ఆ తర్వాత గేట్లు ➩ 2వ పేజీలో...



ఎన్డీయేలోకి రండి కో-కన్వీనర్ మీరే

నితీశ్‌కు అమిత్ షా ఆహ్వానం

19న నిర్ణయిస్తాం: జేడీయూ

9లో



శరద్ యాదవ్‌కు ఉద్వాసన

జేడీయూ పార్లమెంటరీ పార్టీ నేతగా ఆర్సీసింగ్ నియామకం

జేడీయూ నాదే.. నితీశే బయటి వ్యక్తి: శరద్

9లో



వట్టిపోయిన ప్రాజెక్టులకు మళ్లీ వైభవం

పునరుజ్జీవన మంత్రం



పోచంపాడు పునరుజ్జీవన ప్రాజెక్టు పనులు ప్రారంభిస్తున్న సీఎం (ఫైల్)

భక్త రామదాసు స్ఫూర్తితో సాగునీటి పథకాలకు కొత్తరూపు

శ్రీరాంసాగర్ పునరుజ్జీవనంతో సర్కార్‌లో నూతనోత్సాహం

ఆర్డీఎస్ ఆయకట్టుకు తుమ్మిళ్ల ప్రాజెక్టుతో భరోసా

మల్లన్న సాగర్‌తో నిజాం సాగర్ జలాశయానికి జీవం

తక్కువ వ్యయం... తక్కువ సమయంలో పునరుజ్జీవన

ప్రాజెక్టుల పూర్తికి సీఎం కేసీఆర్ పకడ్బందీ ప్రణాళిక

భక్తరామదాసు ప్రాజెక్టును 11మాసాల్లోనే పూర్తిచేసి పాలేరు కరవు ప్రాంతానికి సాగునీరందించిన ప్రభుత్వం అదే స్ఫూర్తితో.. రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి ఫాస్ట్‌ట్రాక్ పునరుజ్జీవన పథకాలకు రూపకల్పన చేసింది. మంత్రులు హరీష్‌రావు, తుమ్మల నాగేశ్వరరావు నేతృత్వంలోని కేబినెట్ సబ్ కమిటీ పలు సిఫార్సులు చేసింది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పునరుజ్జీవన పథకానికి.. సీఎం కేసీఆర్ అనేకమంది నిపుణులతో చర్చించి, రూపకల్పన చేయగా దీనిపై ప్రశంసల జల్లు కురుస్తోంది. కేవలం రూ.వెయ్యి కోట్లతో అదనంగా 5లక్షల ఎకరాలకు నీరివ్వడం, మరో 9లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించే ప్రణాళిక సాగునీటి రంగంలో సరికొత్త సంచలనం.

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రప్రభుత్వం ఇపుడు పునరుజ్జీవన మంత్రాన్ని పఠిస్తోంది. అత్యంత తక్కువ వ్యయంతో.. అతితక్కువ సమయంలో.. భూసేకరణ వివాదాలు లేకుండా ఆయకట్టును పెంచే.. ఆయకట్టును పరిరక్షించే పథకాలను వాయువేగంతో చేపడుతోంది. ఈ పథకాలపై రైతుల్లోనూ ఉత్సాహం వ్యక్తమవుతుండడం, నిపుణులు కూడా ప్రశంసిస్తుండడంతో ప్రభుత్వం పునరుజ్జీవన పథకాలను ఫాస్ట్‌ట్రాక్‌లోకి తెచ్చింది. ముఖ్యమంత్రి కెసిఆర్ మదిలో పుట్టిన ఈ సరికొత్త ఆలోచన దశాబ్దాలుగా వట్టిపోయిన సాగునీటి ప్రాజెక్టులకు వైభవాన్ని తెస్తోంది. భక్తరామదాసు, శ్రీరాంసాగర్ పునరుజ్జీవన పథకాలే కాక.. ఈ బాటలో మరిన్ని పథకాలు దౌడు తీస్తున్నాయి. ఆర్డీఎస్ ఆయకట్టు పరిరక్షణకు తుమ్మిళ్ల ఎత్తిపోతల, నిజాంసాగర్ పునరుజ్జీవన పథకాలతో పాటు అనేక పథకాలు రూపుదిద్దుకుంటున్నాయి. ఇప్పటికే.. మిషన్ కాకతీయ ద్వారా చిన్నతరహా చెరువులు, జలవనరుల రక్షణ పనులను చేపట్టిన ప్రభుత్వం, మరోవైపు భారీ ప్రాజెక్టుల నిర్మాణానికి కూడా శ్రీకారం చుట్టింది. కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి, ➩ 3వ పేజీలో...

ఐటీలో హైదరాబాద్ 2

- ఎగుమతుల్లో బెంగళూరు ఫస్ట్
- రెండో స్థానంలో భాగ్యనగరం
- హార్డ్‌వేర్ ఉద్యోగాల్లో ఢిల్లీ టాప్
- తర్వాత బెంగళూరు, హైదరాబాద్
- యూత్ ఫర్ వర్క్ డాట్ కామ్ తాజా అధ్యయనంలో వెల్లడి



ఐటి ఉద్యోగాల్లో హైదరాబాద్ రెండోస్థానంలో నిలిచింది. ఐటి ఎగుమతుల్లో రూ.75వేల కోట్లకు చేరి మరో 2020 నాటికి లక్ష కోట్ల ఎగుమతులు సాధించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోంది. ఐటి విస్తరణకు కేసీఆర్ సర్కార్ తీసుకుంటున్న చొరవలతో బహుళజాతి సంస్థల పెట్టుబడులు రాష్ట్రానికి తరలివస్తున్నాయి. టిఎస్-ఐపాస్‌తో రెండేళ్ళలోనే రూ.74వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. హార్డ్‌వేర్ రంగంలోనూ హైదరాబాద్ దూసుకుపోతోంది. 6లో



టమోటా

టమోటా కిలో రూ.60

కిలో ఉల్లి రూ.30

అదేస్థాయిలో మిర్చి ధర

కొరతే ప్రధాన కారణం

అన్ని కూరగాయలపై తీవ్ర ప్రభావం

ఉల్లి కన్నీళ్లు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: గత కొద్ది రోజులుగా తెలుగు రాష్ట్రాల్లో అదుపుతప్పి పెరిగిన రూరగాయల ధరలు ఎంతకూ దిగిరావడం లేదు. మొన్నటి వరకు ప్రధానమైన టమాటో, పచ్చిమిర్చి ధరలు కొండెక్కి కూర్చుంటే, ఇప్పుడు అందుకు తోడు ఉల్లి ధర కూడా క్రమేపీ పెరుగుతోంది. నెల రోజుల ➩ 3వ పేజీలో...

మన్మోహన్‌తో వెంకయ్య భేటీ

న్యూఢిల్లీ: ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్‌తో భేటీ అయ్యారు. తన ఇంటికి స్వయంగా వచ్చిన వెంకయ్యకు పుష్పగుచ్చం ఇచ్చి ఆహ్వానించిన మన్మోహన్ కాసేపు ఆయనతో ముచ్చటించారు.రాజ్యసభ చైర్మన్ గా సభలో అన్ని పార్టీల వారికి మాట్లాడేందుకు సమయం ఇవ్వాలని ఈ సందర్భంగా మన్మోహన్ వెంకయ్యను కోరారు. సభలో పారదర్శకతకు పెద్దపీట వేయాలని సూచించారు. తాను మర్యాదపూర్వకంగానే మన్మోహన్‌ను కలిశానని వెంకయ్య తెలిపారు.



మృత్యుఘోష

యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ సొంత నియోజకవర్గంలో ఘటన

ఆక్సిజన్ అందక 63మంది చిన్నారులు మృత్యువాత

9లో



గోరఖ్‌పూర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులు



- సామాన్య కార్యకర్తనే...

3 నెలల్లో నేనేంటో నిరూపిస్తా

2019 ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం

అటు కేంద్రంలో.. ఇటు రాష్ట్రంలో గద్దెనెక్కుతాం

బూత్ స్థాయి నుంచి కాంగ్రెస్‌ను బలోపేతం

టీఆర్ఎస్‌కు సిద్ధాంతం లేదు అంతా రాద్ధాంతమే

రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ కుంతియా

8లో

మోడీ-షాల కొత్త సూత్రం



15 తర్వాత కేబినెట్ విస్తరణ • కొత్త గవర్నర్ల నియామకాలు

- పార్టీ ఎంతో ఇచ్చింది... ఇక తిరిగివ్వాలి
- ఈ సూత్రం ప్రాతిపదికగా కేబినెట్‌లో మార్పులు, చేర్పులకు ప్రధాని, బీజేపీ చీఫ్ కసరత్తు
- దాదాపు 20 మంత్రిత్వ శాఖల్లో మార్పులకు అవకాశం
- అన్నాడీఎంకెకు మూడు మంత్రి పదవులు?
- జేడీయూ నుంచి ఇద్దరికి చోటు?
- సార్వత్రిక ఎన్నికల సైన్యానికి రంగం సిద్ధం
- పనిలో పనిగా గవర్నర్ల నియామకం

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: "ఊరు మీకెంతో ఇచ్చింది, ఊరికి కొంతైనా మీరు తిరిగివ్వాలి" అన్న శ్రీమంతుడు సినిమా డైలాగ్‌ను తలపించే సరికొత్త కసరత్తుకు భారతీయ జనతా పార్టీ తెర లేపింది. పార్టీ ద్వారా రాజ్యసభ సభ్యులై, ఆ తర్వాత కేంద్ర మంత్రులైన వారికి పార్టీ కోసం పని చేయాలని హితబోధ చేస్తోంది. 2019లో జరగబోయే సార్వత్రిక ఎన్నికల కోసం ఇప్పుడే సైన్యాన్ని సిద్ధం చేస్తోంది. కేంద్ర మంత్రివర్గంలో ఏర్పడ్డ ఖాళీలతో పాటు గవర్నర్ల పదవుల భర్తీపై దృష్టి పెట్టిన అమిత్ షా, మోడీ ద్వయం, పనిలో పనిగా పార్టీలోనూ మార్పులు చేర్పులు చేయనున్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో కేంద్ర కేబినెట్ నుంచి కొందరిని పార్టీకి, పార్టీ నుంచి ఒకరిద్దరిని ప్రభుత్వంలోకి తీసుకునే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. ఓవైపు పార్లమెంటు సమావేశాలు, మరోవైపు రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి ఎన్నికల హడావుడితో ఆలస్యమైన పదవుల భర్తీ కసరత్తు ఇప్పుడు మొదలైందని సమాచారం. పంద్రాగస్టు వేడుకలు ముగిసాక పూర్తిగా దీనిపైనే దృష్టిపెట్టి ఈ నెల 18 నుంచి 20వ తేదీలోపు కేంద్ర కేబినెట్ పునర్వ్యవస్థీకరణ చేపట్టవచ్చని పార్టీ వర్గాల ద్వారా తెలుస్తోంది. ఈ క్రమంలో సుమారు 20 మంత్రిత్వ శాఖల్లో మార్పులు జరిగే సూచనలున్నాయి. ఐదారు నెలల నుంచే కేంద్ర ప్రభుత్వంలో పలు మంత్రుల పోస్టులతో పాటు, ➩ 3వ పేజీలో...



పల్లెకు పోదాం చలో చలో..

వరుసగా నాలుగు రోజులు సెలవులు

- సొంతూరికి పయనమైన నగరవాసి
- బస్సులు.. రైళ్లు కిటకిట
- టోల్‌ప్లాజాల వద్ద కి.మీ. మేర బారులుతీరిన వాహనాలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : వరుస వెంబడిగా నాలుగు రోజులు సెలవులు రావడంతో బస్‌స్టేషన్లు, రైల్వే స్టేషన్లు ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. హైదరాబాద్ నుంచి తమ తమ స్వస్థలానికి వెళ్లేందుకు ప్రజలు ఆసక్తిని కనబర్చడం, ఇటు బస్‌స్టేషన్లు, రైల్వేస్టేషన్లు రద్దీగా ఉండటంతో కొందరు ప్రైవేటు ట్రావెల్స్‌ను ఆశ్రయిస్తుండటంతో ఛాన్స్ వచ్చింది కదాని ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఛార్జీలను ఇష్టాను సారంగా పెంచేసీ మరీ వసూళ్లకు తెరదీస్తున్నాయి. తమ స్వస్థలాలకు త్వరగా చేరాలన్న ఉద్దేశంతో చార్జీల పెంపు భారమైన ప్రయాణికులు ప్రైవేటు ట్రావెల్స్‌ని ఆశ్రయించక తప్పినిసరి పరిస్థితి ఎదురైంది. ఏ బస్సులోనయినా సీటు దొరికితే చాలు అన్న స్థితి నెలకొని ఉంది. ప్రయాణికుల అవసరాన్ని తమకు అనుకూలంగా మలచుకుని ప్రైవేట్ ట్రావెల్స్ అమాంతం టికెట్స్ రేట్లు పెంచేశాయి.బస్సు టిక్కెట్‌కు అదనంగా రెండు, మూడింతల మేర రేట్లను పెంచేసి ప్రైవేటు ట్రావెల్స్ సొమ్ము చేసుకుంటుండటం గమనార్హం. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక రైళ్లు, స్పెషల్ బస్సులు సైతం అదనపు రుసుంతో నడుస్తున్నాయి. అవి కూడా ఖాళీలు ఉండటం లేదు. ఒక్క సారిగా బస్సులు బయల్దేరుతుండటంతో టోల్ గేట్ల వద్ద రద్దీ అధికంగా ఉంటోంది. గంటల తరబడి ట్రాఫిక్ జామ్‌లు కూడా నెలకొంటోంది. సమయాన్ని సద్వి నియో గం చేసుకోవాలన్న తపనతో ఒక్కసారిగా అంతా పట్నం నుంచి పల్లెబాట పడుతుండటంతో ఎక్కడ చూసినా రద్దీ వాతావరణం నెలకొంది. సహజంగా పట్న వాసులకు సెలవు లు రావడమన్నది అరుదు. అందునా ఒక్కసారిగా నాలుగు రోజులు సెలవులు రావడమన్నది గగనమే.



అలాంటి స్థితిలో ప్రస్తుతం నాలుగు రోజులు సెలవు ఒక్కసారిగా రావడంతో తమ బంధు, మిత్రులతో గడపాలని నిశ్చయించుకుని వారంతా ఒక్కసారిగా పల్లెబాట పట్టారు. ముందుగా కొందరు ఆన్‌లైన్ బుకింగ్ చేసుకున్నప్పటికీ చాలామంది అప్పటికప్పుడు వెళ్లవచ్చులే అనుకోవడం సహజ పరిణామం. ఆ క్రమంలో ఒక్కసారిగా వారంతా బస్‌స్టేషన్లు, రైల్వేస్టేషన్లు చేరుకుని టిక్కెట్ల కోసం బారులు తీరుతున్నారు. ఎక్కడ చూసినా చాంతాడంత క్యూలే దర్శన మిస్తున్నాయి. దీంతో కొందరు ప్రైవేటు బస్సులవైపు మొగ్గుచూపడమన్నది పరి పాటి. ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల వద్ద కూడా ఇంతకంటే భిన్నమైన వాతా వరణం ఏమీ కనిపించడం లేదు. అక్కడ కూడా రద్దీ అనివార్యమైంది.

ఏ విధంగానైనా త్వరితగతిన పల్లెకు చేరి తమ బంధు, మిత్రులతో ఎక్కువసేపు గడపాలని పట్నం వాసులు ఆకాంక్ష. ఆ ఆకాంక్షను నెరవేర్చుకునేందుకు టిక్కెట్ రేటు ఎంత అన్నది పట్టని విధంగా సీటు దొరికితే చాలు అని ఎగబడు తుండటం గమనార్హం. కొందరు కార్లను సైతం ఆశ్రయిస్తున్నా రు. అటు విజయవాడ నుంచిసైతం హైదరాబాద్‌కు వచ్చే వారి సంఖ్య కూడా అంతే స్థాయిలో ఉంది. ఇరువైపులా వందల సంఖ్యలో ప్రయాణికులతో వాహనాలు తరలివస్తుండటంతో టోల్‌గేట్ల వద్ద రద్దీ తీవ్రమైంది.

కేతేపల్లి, కెఎన్ఎన్ : వరుసగా నాలుగు రోజుల పాటు సెలవులు రావటంతో హైదరాబాద్ నుంచి సొంత గ్రామాలకు వెళ్లేదారి వాహనాలతో 65నెంబర్ జాతీయ రహదారి శనివారంగా రద్దీగా మారింది. శుక్రవారం రాత్రి నుండే జాతీయ రహదారిపై వాహనాల సందడి ప్రారంభమైంది. శనివారం నుంచి నాలుగు రోజుల పాటు సెలవులు ఉండటంతో హైదరాబాద్ నుంచి ఏపీలోని విజయవాడ, రాజమండ్రి, విశాఖపట్నం, తిరుపతి తదితర పట్టణాలతో పాటు తెలంగాణలోని పలు జిల్లాలకు వెళ్లే దారి వాహనాలు ఒకదాని వెంట ఒకటి భారీ సంఖ్యలో వెళ్లాయి. వాహనాల రద్దీ ఎక్కువగా ఉండటంతో

వాహనాలతో కిక్కిరిసిన 65వ నెం. జాతీయ రహదారి

మండలంలోని కొర్లపహాడ్ వద్ద జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన టోల్‌ప్లాజా వద్ద వాహనాలు బారులు తీరాయి. దీంతో హైద్రాబాద్ వైపు వెళ్లే వాహనాల నుంచి టోల్‌ఫీజు వసూలు చేసేందుకు టోల్‌ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన ఆరు కౌంట్లలో రెండింటిని నిర్వాహకులు విజయవాడ వైపు వెళ్లే వాహనాలకు అదనంగా కేటాయించారు.

అయినప్పటికీ విజయవాడ వైపు వెళ్లే కార్లు, ఆర్టీసీ, ప్రైవేటు బస్సులు భారీ సంఖ్యలో వస్తుండటంతో టోల్‌ప్లాజా వద్ద పలు మార్లు ట్రాఫిక్‌జామ్ ఏర్పడింది. మాములు రోజుల్లోనే రద్దీగా ఉండే జాతీయ రహదారిపై పండుగ సందర్భంగా విరామం లేకుండా వాహనాలు వెళ్తుండటంతో మండలంలోని జాతీయ రహదారి వెంట ఉన్న గ్రామాలలో రోడ్డు దాటేం దుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

కవిత్వం హృదయ భాష

- అట్టహాసంగా జాగృతి కవితాంజలి



నిజామాబాద్ సాంస్కృతికం, కెఎన్ఎన్ : కవిత్వం హృదయ భాష అని, ఉద్యమంలో కవిత్వం ప్రధాన పాత్ర పోషించిందని నిజామాబాద్ పార్లమెంట్ సభ్యురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. శనివారం నగరంలోని వంశీ హోటల్‌లో జాగృతి ఆధ్వర్యంలో కవితాంజలి కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడ్డాక 31 జిల్లాల్లో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అలా కార్యక్రమాలు నిర్వహించే సాహితి సంస్థ లేదన్నారు. కాళోజి జయంతిని పురస్కరించుకుని సెప్టెంబర్ 9 వరకు కవితాంజలి పేరుతో వంద మంది కవులు పాల్గొనేటట్టుగా సాహితి కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కవులను సమీక్ర తం చేసి సంకలనం తీసుకురావాలని ప్రయత్నిస్తున్నామన్నారు. సురవరం ప్రతాప రెడ్డి చూపిన తోవలో ముందుకెళ్తున్నామన్నారు. కాళోజి జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయనను గుర్తు చేసుకోవడం ఎందుకంటే ఆయన నికచ్చి గల వ్యక్తి అని కవితలతో తెలంగాణ అస్తిత్వాన్ని నిలిపారన్నారు. అక్టోబర్‌లో ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహించనున్నామన్నారు.


పాలేరు పాత కాల్వ ట్రయల్ రన్ సక్సెస్



(మొదటి పేజీ తరువాయి)

ఎత్తి కాల్వలో నీరు పారించారు. 200 క్యూసెక్కుల నీటిని కాలువలోకి వదిలినట్లు అధికారులు తెలిపారు. సాయంత్రం 4 గంటలకు 0 పాయింట్ వద్ద నీటిని విడుదల చేయగా,రాత్రి 7 గంటల సమయానికి 23.5 కిలోమీటర్ల దూరంలో ఉన్న చివరి ప్రాంతమైన నేలకొండపల్లి మండలం కొత్త కొత్తూరు గ్రామానికి చేరుకున్నాయి. ట్రయల్ రన్ సక్సెస్ కావడంతో అధికారులతో పాటు రైతులు సంబరపడ్డారు.

కశ్మీర్ బంద్... స్తంభించిన జనజీవనం



శ్రీనగర్: వేర్పాటువాదుల బంద్ పిలుపుతో కశ్మీర్‌లో జనజీవనం స్తంభించింది. ఆర్టికల్ 35 రద్దు చేయాలన్న కొన్ని వర్గాల డిమాండ్లకు వ్యతిరేకంగా ఇచ్చిన బంద్ పిలుపునకు స్కూళ్లు, కాలేజీలు, దుకాణాలు ఇతర కార్యాలయాలను మూసివేసారు. ప్రభుత్వ కారాలయాల్లోనూ హాజరు తక్కువగా ఉందని అధికారులు చెప్పారు. కొన్ని ప్రైవేటు వాహనాలు మాత్రం తిరిగినా రవాణా సౌకర్యాలు పెద్దగా లేవు. హురియత్‌లో పిడివాదవులు, ఉదారవాదుల గ్రూపులతో సహా జమ్మూ కశ్మీర్ లిబరేషన్ ఫ్రంట్ (జేకేఎల్ఎఫ్) ఇచ్చిన బంద్ పిలుపునకు స్పందన లభించింది. ఆర్టికల్ 35ఏను మారిస్తే జమ్మూ కశ్మీర్‌లో ముస్లిం మెజారిటీ తగ్గిపోతుందని వేర్పాటువాదుల అంచనాగా ఉంది. వీరు సైన్యం చేతిలో మిలిటెంట్లు మరణించడాన్ని కూడా తప్పుబడుతున్నారు. ఆర్టికల్ 35ఏను కొట్టివేయాలని దాఖలైన పిటిషన్‌పై కేంద్రం తన అభిప్రాయం చెప్పాలని సుప్రీం కోర్టు గత నెలలో కోరింది.

వృథా జలాలను ఒడిసి పడదాం

- 22 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తాం
- రెండున్నర సంవత్సరాలలో కాళేశ్వరం కాలువలను పూర్తి చేసిన ఘనత టీఆర్ఎస్ ప్రభుత్వానిదే
- భారీ నీటిపారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు



సిద్దిపేట, కెఎన్ఎన్ : గోదావరి జలాలతో తెలంగాణను సస్యశ్యామలం చేసే బృహోత్తర కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టిందని భారీ నీటి పారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. శనివారం సిద్దిపేట జిల్లా కేంద్రంతో పాటు సిద్దిపేట మండలం ఇర్కోడు, చిన్నగుండవెళ్లి గ్రామాలల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన ప్రారంభోత్సవాలు చేశారు. రాష్ట్రంలోనే మొట్టమొదటి సారిగా ప్రభుత్వం తరపున ఇర్కోడు గ్రామంలో సామూహిక గొర్రెల పాకను ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణలో తీవ్ర కరవు ఉన్నప్పటికి కాళేశ్వరం వద్ద 220 టీఎంసీల నీళ్లు వృధాగా సముద్రంలో కలుస్తున్నాయన్నా రు. వృధాగా సముద్రంలో కలుస్తున్న నీటితో 22 లక్షల ఎకరాలకు సాగునీరు అందించవచ్చన్నారు. ప్రస్తుతం గోదావరి నీటి కోసం తవ్వుతున్న సొరంగం ప్రాజెక్టు కాలువను తవ్వాలంటే ఆరేడు సంవత్సరాలు పడుతుందన్నారు. కానీ దేశంలోనే ఎక్కడా చేయని విధంగా తెలంగాణ ప్రభుత్వం రెండున్నర యేండ్లల్లోనే ప్రాజెక్టును పూర్తి చేసి, గోదావరి జలాలను తెచ్చేందుకు ప్రయత్నిస్తుందన్నారు. వర్షాభావ లేమితో మొక్కజొన్న పంటలు ఎండిపోయి రైతులు ఆందోళనలో ఉన్నారన్నారు. త్వరలోనే గోదావరి జలాలతో చెరువులు, వాగులు నింపుతామన్నారు. దీంతో రైతులను వెంటాడుతున్న కరువనేది శాశ్వతంగా పోతుందన్నారు. రైతుల కష్టాలు కడతేరాలంటే గోదావరి జలాలతోనే పరిష్కారం లభిస్తుందన్నారు. బడుగు, బలహీన వర్గాలకు ఉన్నత విద్యను అందించేందుకు కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. పేద ప్రజల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టి, కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ ఆసుపత్రులను తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. సామూహిక గొర్రెల పాకల ఏర్పాటు వలన ఐక్యత, అప్యాయత పెరుగుతుందన్నారు.

వితంతువుతో డబుల్‌బెడ్‌రూం ఇళ్లకు శంకుస్థాపన చేయించిన మంత్రి

విధి వక్రీకరించి భర్తను కొల్పోయినంత మాత్రాన శుభ కార్యక్రమాలకు పనికిరారనడం మూఢనమ్మకాలను తొలగించే విధంగా ఇర్కోడు గ్రామంలో నిర్మించనున్న డబుల్‌బెడ్‌రూం ఇళ్లకు వితంతు వృద్ధురాలైన రాఘవాపూర్ మల్లవ్వతో కలిసి మంత్రి హరీశ్‌రావు కొబ్బరికాయ కొట్టించి శంకుస్థాపన చేయించడం అందరిని ఆశ్చర్యానికి గురి చేసింది. ఏ శుభకార్యాలు జరిగిన భర్తను కొల్పోయిన మహిళలను దూరంగా ఉంచే సాంప్రదాయానికి ఈ శంకుస్థాపన స్వస్తి పలుకనుంది. విధి వక్రీకరించి భర్తను కొల్పోయినంత మాత్రాన శుభకార్యాలలో పాల్గొనవద్దనే నిబంధనలు లేవన్న సంకేతం ఈ శంకస్థాపనతో ఋజువైంది. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు ఎర్ర యాదయ్య, కూర మాణిక్యరెడ్డి, జాప శ్రీకాంత్‌రెడ్డి, ఇర్కోడు సర్పంచ్ వినీత-రవీందర్‌రెడ్డి,, చిన్నగుండవెళ్లి సర్పంచ్ కిషన్‌రెడ్డి, డీఆర్‌డీఏ జిల్లా అధికారి సురేష్‌బాబు, ఆర్ అండ్ బీ ఏఈ బాల్‌నర్సయ్య, విద్యుత్ ఎస్ఈ కర్ణాకర్‌బాబు, తహశీల్దార్ పరమేశ్వర్, ఎంపీడీవో సమ్మిరెడ్డి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఇక టార్గెట్ శశికళ

చెన్నై: ఇద్దరు వ్యక్తులకు ఒకరే శత్రువైన పక్షంలో, ఆ ఇద్దరు వ్యక్తులు ఒకప్పుడు శత్రువైనా, మిత్రులయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. అది లోకవిదితం. ఇది రాజకీయ సూత్రం కూడా. శత్రువు, శత్రువు మిత్రుడు, టార్గెట్ ఒక్కటే. విషయంలోకి వస్తే... తమిళనాడు ముఖ్యమంత్రి పళనిస్వామి, మాజీ సీఎం పన్నీర్ సెల్వం అక్షరాల ఇదే సూత్రాన్ని పాటిస్తున్నట్టు తెలుస్తోంది. అన్నాడీఎంకే(అమ్మ) ఉప ప్రధాన కార్యదర్శి, టీటీవీ దినకరన్‌ను పార్టీ నుంచి గెంటివేసిన ఎడపాడి తరువాతి వేటు తాత్కాలిక ప్రధాన కార్యదర్శి శశికళపై వేయనున్నట్టు సమాచారం. పన్నీర్‌సెల్వం విలీనం అంశంలోని ప్రధాన డిమాండ్లలో ఒకటైన శశికళ బహిష్కరణను నెరవేర్చడం ద్వారా ఇద్దరి మధ్య దోస్తీ కుదుర్చుకునే దిశగా పళనిస్వామి పావులు కదుపుతున్నారు.

తమిళనాడు రాష్ట్రంలో 'అమ్మ'లేని అనాథగా మారిన అన్నాడీఎంకేను బీజేపీ అక్కున చేర్చుకుంది. శశికళ కుటుంబమంటే సహించని ప్రధాని మోడీ ముందుగా పన్నీర్‌సెల్వంను చేరదీయగా, ఆ తరువాత ఎడపాడి కూడా చేరువయ్యారు. రాష్ట్రంలో బీజేపీ బలోపేతానికి అన్నాడీఎంకే మినహా మరే మార్గంలేని బీజేపీ ఎడపాడి, పన్నీర్‌లకు అన్ని రకాలుగా అండదండలు ఇస్తోంది. ఎడపాడి వద్దనున్న ఎమ్మెల్యేల బలం, పన్నీరు వద్ద ప్రజాబలం ఏకమైతే తమ ఆశయాలు నెరవేరుతాయని బీజేపీ బలంగా విశ్వసిస్తోంది. ఇందులో భాగంగానే పళని, పన్నీర్ వర్గాల విలీనంపై బీజేపీ పట్టుబడుతోంది.

పునరుజ్జీవంపై రాజకీయ అక్కసు

- కాంగ్రెస్, కోదండలపై మంత్రి పోచారం ధ్వజం



హైదరాబాద్, ఆంధ్రప్రభ: శ్రీరాంసాగర్ పునర్జీవన ప్రాజెక్టు పూర్తయితే తమకు రాజకీయంగా పునర్జన్మ ఉండదనే ఓర్వలేక కాంగ్రెస్ నేతలు ఆరోప ణలు చేస్తున్నారని రాష్ట్రవ్యవసాయశాఖా మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి ధ్వజమెత్తారు. శనివారం టిఆర్ఎస్ఎల్‌పి కార్యాలయంలో జరిగిన విలేఖరుల సమావేశం లో మిషన్ భగీరథ వైస్‌చైర్మన్ వేముల ప్రశాంత్‌రెడ్డి, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, హన్మంతు షిండేలతో కలిసి ఆయన మాట్లాడారు. గోదావరి, కృష్ణా చంకలో నుండి ప్రవహిస్తున్నా ఈ ప్రాంతం సాగునీటి అవసరాలు కాంగ్రెస్, టిడిపిలు ఎన్నడూ తీర్చలేకపోయాయన్నారు. మూడంచెల పద్దతిలో ముఖ్యమంత్రి కెసిఆర్ సాగునీటిరంగానికి జవసత్వాలు కల్పిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రజల కష్టాలు తెలిసిన వ్యక్తి అని, రైతులకు నీరు.. పెట్టుబడి ఇచ్చి పంటలకు తగిన ధర ఇచ్చి కొనుగోలు చేస్తే.. భవిష్యత్‌లో తెలంగాణ రైతాంగం దేశంలోనే నెంబర్‌వన్‌గా ఉంటారని, ఆత్మహత్యలనేవే కనబడవన్నారు. ఎస్సారెస్పీ పునర్జీవన ప్రాజెక్టు అత్యద్భుతమని, కేవలం 30మీ ఎత్తులేపి.. రూ.వేయి కోట్ల ఖర్చుతె 5లక్షల ఎకరాలకు పైగా అదనపు ఆయకట్టు తీసుకురావాలన్న ఆలోచన రావడం అద్భుతమన్నా రు. ఇది జరిగి తీరుతుందన్నారు. మొత్తం 14లక్షల ఎకరాలకు ఈ ప్రాజెక్టు ద్వారా నీరందుతుందని, సీజన్ ప్రారంభం కాకముందే ప్రాజెక్టు నింపి పెడితే రైతులు భరోసాతో సాగుకు సిద్ధమవుతారన్నారు. పునర్జీవన పథకం పూర్తయితే పూర్వ నిజామాబాద్, ఆదిలాబాద్, వరంగల్, కరీంనగర్, ఖమ్మం జిల్లాలకు సాగునీరు అందుతుందన్నారు. తాము ప్రాజెక్టులు మొదలు పెడుతుంటే కాంగ్రెస్ నాయకులు కుట్రతో కేసులు పెట్టి అడ్డుతగులుతున్నారన్నారు. ఒక్క కాళేశ్వరం ప్రాజెక్టు పైనే 119కి పైగా కేసులు పెట్టారన్నారు. ఇప్పటికే కరెంట్ సమస్య లేకుండా చేశామని, రానున్న రోజుల్లో నీటి సమస్య లేకుండా చేస్తామన్నారు. వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్ కూడా కేటాయిస్తామన్నారు. కాంగ్రెస్, టిడిపిలు ఉన్నపుడే ఈ పనులు చేసి ఉంటే.. రైతులకు ఇంతకాలం ఇబ్బందులు ఉండేవి కావన్నా రు. పోచంపాడు సభ విజయవంతంతో కాంగ్రెస్ నేతల కళ్ళు బైర్లు కమ్మాయని, పెద్ద ఎత్తున రైతాంగం ఈ సభకు హాజరై తన్మయత్వానికి గురయ్యారన్నారు.

కోదండరాంది.. కాంగ్రెస్ మాటే..


కోదండరాం మాట, కాంగ్రెస్ మాట్లాడే మాట ఒకటేనని మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి విమర్శించారు. ప్రాజెక్టులకింద నిర్వాసితులను రెచ్చగొట్టేందుకే కోదండరాం యాత్రలు చేస్తున్నారన్నారు. రైతులే కోదండరాంను అడ్డుకుంటున్నారని, వాళ్ళకు అన్యాయం చేస్తామంటే ఊరుకుంటారా అని ప్రశ్నించారు. కోదండరాంను అడ్డుకున్నది రైతులేనని, అందులో అన్ని పార్టీల వారు ఉండవచ్చన్నా రు. కోదండరాం ఇకనైనా ప్రాజెక్టులను అడ్డుకునే పనులు మానుకోవాలన్నారు.

వితంతువు బాగుకోసం సుప్రీం కమిటీ

న్యూఢిల్లీ: కుటుంబ సభ్యులు వదిలెసిన వితంతువుల పునరావాసం కోసం సుప్రీం కోర్టు ఒక కమిటీని ఏర్పాటు చేసింది. సంఘసేవకులు, లాయర్లతో కలిపి ఏర్పాటు చేసిన ఈ కమిటీ కుటుంబాలు వదిలేసిన వితంతువులను ఏం చేయాలో వారికి పునరావాసం ఎలా కల్పించాలో, వితంతు వివాహాలను ఎలా ప్రోత్సహించాలో కోర్టుకు సలహా ఇస్తుంది. ఉత్తర ప్రదేశ్‌లోని మథురలోని ఆశ్రమంలో ఉంటున్న వితంతువుల పరిస్థితి గురించి 2007లో దాఖలైన ఒక పిటిషన్ ను విచారించిన జస్టిస్ మదన్ బీ లోకూర్, జస్టిస్ దీపక్ గుప్తాలతో కూడిన ధర్మాసనం ఆరుగురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేసింది. సంఘసేవకులు సునీతా ధర్, మీరా ఖన్నా, అభా సింఘాల్ జోషి, లాయర్ అపరాజితా సింగ్, హెల్ప్ ఏజ్ అనే ఎన్జీవో నుంచి ఒక వ్యక్తి, సులభ్ ఇంటర్నేషనల్ నుంచి మరో వ్యక్తి కమిటీలో సభ్యులుగా ఉంటారు.

ఇళ్ల నిర్మాణం నత్తనడక

- రాష్ట్ర ప్రభుత్వంపై కేంద్రమంత్రి దత్తాత్రేయ ఆగ్రహం
- కేంద్ర సాయాన్ని సద్వినియోగం చేసుకోవడం లేదని ఆరోపణ
- ఆసుపత్రులు, పాఠశాలల నిర్వహణలోనూ అధ్వానం
- త్వరలో సంబంధిత మంత్రులతో సమీక్షా సమావేశం



హైదరాబాద్, ఆంధ్రప్రభః ఉచిత ఇళ్ళ నిర్మాణ పథకానికి ఉదారంగా ఆర్థిక సహాయం చేసేందుకు కేంద్రం సిద్దంగా ఉన్నప్పటికీ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దానిని సద్వినియోగం చేసుకునే పరిస్థితిల్లో లేకపోవడం విచారకరమని కేంద్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి బండారు దత్తాత్రేయ అన్నారు. ఫలితంగా రాష్ట్ర ఇళ్ళ నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయని ఆయన వ్యాఖ్యానించారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో తెరాస విజయం సాధించడానికి ప్రధాన పాత్ర పోషించిన వాటిల్లో డబుల్‌బెడ్‌రూమ్ పథకానిదే అగ్రస్తానమన్నారు. అయినప్పటికీ ఆ పథకాన్ని ఆశించిన స్థాయిలో వెగిర పరచడంలో తెరాస ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆయన తీవ్ర అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తం చేశారు.

శనివారం నగరంలోని ఆదర్శనగర్ ఇఎస్ఐసీ రీజినల్ కార్యాలయంలో ఇళ్ళనిర్మాణ పథకంతో పాటు ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రుల పనితీరు, ఎంఎంటిఎస్ ఫేజ్-2, సికింద్రాబాద్, నాంపల్లి రైల్వే స్టేషన్ల ఆధునీకరణ, కొత్తగా మరో రెండు స్టేషన్ల నిర్మాణ పనులు తదతర అంశాలపై దత్తాత్రేయ సమీక్షించారు. భాజపా శాసనసభ్యులు జి. కిషన్‌రెడ్డి, చింతల రామచంద్రారెడ్డితో కలిసి దత్తాత్రేయ సుమారు రెండు గంటల పాటు చర్చించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో దత్తాత్రేయ మాట్లాడుతూ, రాష్ట్రంలో డబుల్‌బెడ్ రూమ్ పనులకు అవసరమైన ల్యాండ్ బ్యాంకును ఏర్పాటు చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. కేంద్రం ప్రధాన మంత్రి ఆవాజ్‌యోజన పథకం కింద 1.41వేల ఇండ్లను మంజూరు చేసిందన్నారు. పట్టణ ప్రాంతాల్లో నిర్మించే ఇళ్ళ కోసం రూ.1207 కోట్లు, గ్రామీణ ప్రాంతాల్లో నిర్మించే ఇళ్ళకోసం రూ.508 కోట్లను కేటాయించిందన్నారు. ఈ ఇండ్లలో జీహెచ్ఎంసీ పరిధిలోనే 32,091 ఇళ్ళను కేంద్రం మంజూరు చేసిందన్నారు. కాగా తెరాస ప్రభుత్వం గ్రేటర్ ఫరిధిలో మొత్తంలో లక్షా ముప్పైవేల ఇళ్ళను నిర్మించాలని తలపెట్టి కేవలం ఎనభైవేల ఇళ్ళకు మాత్రమే ఫైనల్ చేసి, 40వేల ఇళ్ళ నిర్మాణ పనులను మాత్రమే ప్రారంభించిందని కేంద్రమంత్రి దత్తాత్రేయ వెల్లడించారు.త్వరలో డబల్‌బెడ్ రూమ్ ఇళ్ళ ప్రగతిపై రాష్ట్ర మంత్ర కేటీఆర్‌తో కలిసి మరోసారి చర్చించనున్నట్లు దత్తాత్రేయ పేర్కొన్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రుల్లో కనీస సౌకర్యాలు దారుమంగా ఉన్నాయని ఆయన తన అసంతృప్తిని వెల్లగక్కారు. ఈ మూడు అంశాలకు సంబంధించిన మంత్రులతో త్వరలోనే పూర్తిస్థాయిలో సమీక్షనిర్వహించనున్నట్లు ఆయన చెప్పారు. నగరంలోని నెలకొన్న ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు ఎంఎంటిఎస్ రెండవ దశ పనులను వచ్చే సంవత్సరం డిసెంబర్‌లోగా పూర్తి చేస్తామన్నారు. యాదాద్రి వరకు ఈ పనులను పొడగించినట్లు తెలిపారు. మొత్తం రూ.700 కోట్లతో ఈ పనులను చేపడతున్నట్లు దత్తాత్రేయ వివరించారు. ఇందులో 2/3వ వంతు రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుండగా, కేంద్రం 1/3 వంతు వాటాను చెల్లిస్తుందన్నారు. కరీంనగర్ నుంచి కొత్త రైల్‌ను, ఖాజీపేట్‌లో వ్యాగన్ కంపెనీని ఏర్పాటు చేయనున్నామని దత్తాత్రేయ చెప్పారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి మహబూబ్‌నగర్ వరకు డబలింగ్ పనులు, చర్లపల్లి, నాగులపల్లి (శేరిలింగంపల్లి) లో కొత్త రైల్వే స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నట్లు దత్తాత్రేయ పేర్కొన్నారు.

రూ. 100 కోట్లతో అర్బన్ పార్కుల అభివృద్ధి

- శివారు పార్కులను సందర్శించిన మంత్రి జోగు రామన్న

హైదరాబాద్, ఆంధ్రప్రభ : హైదరాబాద్ చుట్టూ పచ్చదనాన్ని పెంచి అటవి బ్లాకులను మరింత అభివృద్ధి చేయాలన్న ముఖ్యమంత్రి చంద్రశేఖరరావు సంకల్పం మేరకు రూ.100 కోట్లు ఖర్చు చేయనున్నట్లు అటవీశాఖ మంత్రి జోగు రామన్న చెప్పారు. దేశంలోని ఏ నగరానికి లేని ప్రత్యేకతలు హైదరాబాద్‌కు ఉన్నాయని, దాదాపు 99 పార్కులతో నగరం పచ్చదనంతో వెల్లివిరుస్తోందని చెప్పారు. నగర శివారు ప్రాంతాల్లోని పార్కులను శనివారం ఆయన సందర్శించారు. మంత్రితో పాటు మేయర్ బొంతు రామ్మోహన్, డిప్యూటి మేయర్ ఫసియుద్దీన్, జిహెచ్ఎంసి కమిషనర్ జనార్దన్‌రెడ్డి, హెచ్ఎండిఎ కమిషనర్ చిరంజీవులు, ప్రధాన అటవీ సంరక్షణాధికారి పీకే ఝా, అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు. అనంతరం పార్కుల అభివృద్ధిపై అధికారులతో ఆయన సమీక్షించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, అటవీ భూముల ఆక్రమణల నుంచి కాపాడి అభివృద్ధి చేస్తామని, పార్కుల వద్దనున్న చెత్త డంపింగ్ సమస్యలను పరిష్కరిస్తామన్నారు. హైదరాబాద్‌లో ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పాటు చేయడం, ఆరోగ్యకర రాజధానిగా తీర్చిదిద్దడం తమ ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత అన్నారు. జిహెచ్ఎంసి, హెచ్ఎండిఏల సమన్వయంతో ఈ కార్యక్రమాలు పూర్తి చేస్తామని, అందుకు తగ్గట్లుగా ప్రణాళికలు



రూపొందించాలని అధికారులకు సూచించారు. అర్బన్ పార్కుల ఏర్పాట్లపై మునిసిపల్ శాఖ మంత్రి కేటీ రామారావు ఎంతో పట్టుదలతో ఉన్నారని, త్వరలో ఆయన కూడా ఈ పార్కులను సందర్శిస్తారని జోగు రామన్న తెలిపారు.

శీనన్నా.. భలే చెబుతున్నవే

పోచారానికి కేసీఆర్ ప్రశంస

హైదరాబాద్, ఆంధ్రప్రభ: కేసీఆర్ కిట్.. రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో రద్దీని పెంచిన పథకం.. పేదకుటుంబాలకు ప్రసవభారం దించిన పథకం.. అయితే ఈ పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అందించే కిట్లను గురించి వివరించడంలో.. మాత్రం మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డికి మంచి మార్కులు పడుతున్నాయి. అదేంటి.. పోచారం ఆరోగ్యశాఖ మంత్రి కాదు కదా.. ఎలా చెప్పగలుగుతున్నాడనే డౌట్ రావొచ్చు.. కానీ పథకాన్ని ఓన్ చేసుకుని ఆయన వివరిస్తున్న తీరుకు సీఎం కేసీఆర్ కూడా ఫిదా అయ్యారు. శీనన్నా.. నువ్వు ఆరోగ్యమంత్రివి కాదు కదే.. ఆ కేసీఆర్ కిట్‌లోని ప్రతి వస్తువు గురించి బయటకు తీసి బాగా వివరి స్తున్నవంట.. ఆకట్టుకుంటున్నవంట.. ఇంటెలిజెన్సోళ్ళు చెప్పిండ్రు అంటూ పోచంపాడు సభకు వెళ్ళిన సిఎం పోచారంను ప్రశంసించారు. శనివారం నిజామాబాద్ ఎమ్మెల్యేలు.. తమ నియోజక వర్గానికి వచ్చి గంట సేపు మాట్లాడితే చాలు.. ఇక జనం ఇంకోదిక్కు చూడరు.. నీ మాటలకు.. చెప్పేతీరుకు అట్ల ఫిదా అయి ఉంటరు అంటూ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సిఎం కేసీఆర్ కిట్ గురించి చెప్పిన మాట లను మంత్రి గుర్తుచేశారు. పథకం బ్రహ్మాండంగా అమలు జరుగుతోందన్నారు.

ప్రత్యామ్నాయ చికిత్సలపై దృష్టి పెట్టాలి

మంత్రి లక్ష్మారెడ్డి



హైదరాబాద్,ఆంధ్రప్రభ: సంపూర్ణ ఆరోగ్యం చేకూర్చడానికి ప్రత్యామ్నాయ చికిత్సలపై కూడా దృష్టి సారించాల్సిన అవసరం ఉందని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి డాక్టర్ సి లక్ష్మారెడ్డి అన్నారు. ప్రివెంటీవ్ మెడిసిన్‌పై ప్రజల్లో అవగా హన పెరగాల్సిన అవసరం కూడా ఉందన్నారు. అసో సియే షన్ ఆఫ్ ఫిజిషియన్స్ అధ్వర్యంలో టిఎస్ అసికాన్- 2017 సదస్సును మంత్రి శనివారం గాంధీ ఆసుపత్రిలో ప్రారం భించారు. భారతీయ సంస్కృతిలో భాగంగా అనే వైద్య, చికి త్సా విధానాలు ఉన్నాయని మంత్రి గుర్తు చేశారు. వాటిలో దేనికదే ప్రత్యేకతను సంతరించు కుందన్నారు. మారుతున్న పరిస్థితులు, జీవన విధానాల నేపథ్యంలో ఏ ఒక్క వైద్య విధా నం కూడా పూర్తి ఆరోగ్యాన్ని అందించలేక పోతున్నాయని తెలిపారు. ప్రస్తుతం ప్రపంచం మొత్తం యోగా మీద దృష్టి పెట్టిందన్నారు. రోగాలు రాకుండా నిరో ధించడంతోపాటు రోగ నిరోధక శక్తిని పెంచడం వంటి పలు అంశాల్లో యోగా ప్రక్రియ బాగా పనిచేస్తుందన్నారు. తెలం గాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మెరుగైన వైద్యం అందించ డం కోసం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని మంత్రి చెప్పారు.

కేసీఆర్ సోషల్ ఇంజనీర్

వేముల ప్రశాంత్‌రెడ్డి

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రజలకు ఏం కావాలో తెలిసిన సోషల్ ఇంజనీర్ అని, ప్రజల కష్టాలు తీర్చడం కోసం నీటిగమనాన్ని ఒడిసిపట్టి ప్రాజెక్టులను రీడిజైన్ చేసేందుకు ఇంజనీర్‌లా మారారని మిషన్ భగీరథ వైస్‌చైర్మన్ వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ హయాంలో కాగితాలకే పరిమితమైన సాగునీటి ప్రాజెక్టులను ప్రజల అవసరాలకు అనుగుణంగా రీడిజైన్ చేసి వాటి ఫలాలను ప్రజలకు అందిస్తున్నారన్నారు. కాంగ్రెస్ హయాంలో శ్రీరాంసాగర్ పూర్తిగా నిండినా ఎన్నడూ 6లక్షల ఎకరాలకు మించి నీరు రాలేదని, ఇపుడు తమ ప్రభుత్వం 16లక్షల ఎకరాలకు నీరందించేందుకు పునర్జీవన పథకాన్ని రూపకల్పన చేసిందన్నారు.

కాంగ్రెస్ పాతరే: జీవన్‌రెడ్డి

కాంగ్రెస్ నేతలు శ్రీరాంసాగర్ పునర్జీవన పథకంపై చేస్తున్న ఆరోపణలు విస్మయపరుస్తున్నాయని, తప్పుడు ఆరోపణలు చేస్తున్న కాంగ్రెస్‌ను వందకిలోమీటర్ల లోతున పాతరేయడం ఖాయమని ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి అన్నారు.

పునరుజ్జీవన మంత్రం

(మొదటిపేజీ తరువాయి)

దేవాదుల వంటి ప్రాజెక్టుల నిర్మాణం జరుగుతుండగానే.. ఫాస్ట్‌ట్రాక్‌లో పునర్జీవన పథకాలను చేపట్టింది. భక్తరామదాసు ప్రాజెక్టును 11మాసాల్లోనే పూర్తిచేసి పాలేరు కరువుప్రాంతానికి సాగునీరందించిన ప్రభుత్వం అదే స్ఫూర్తితో.. రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి ఫాస్ట్‌ట్రాక్ పునరుజ్జీవన పథకాలకు రూపకల్పన చేసింది. మంత్రి హరీష్‌రావు, తుమ్మల నాగేశ్వరరావు నేతృత్వాల్లోని కేబినెట్ సబ్‌కమిటీ పలు సిఫార్సులు చేసింది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పునర్జీవన పథకానికి.. సిఎం అనేకమంది నిపుణులతో చర్చించి, రూపకల్పన చేయగా దీనిపై ప్రశంసల జల్లు కురుస్తోంది. కేవలం రూ.వేయి కోట్లతో ఏడాదిలో అదనంగా ఐదులక్షల ఎకరాలకు నీరివ్వడం, మరో 9లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించే ప్రణాళిక సాగునీటి రంగంలో సరికొత్త సంచలనం. వనరులను సమర్థంగా సద్వినియోగం చేసుకుంటూ.. ముందుకు తీసుకెళ్ళే ప్రణాళికలను ప్రభుత్వం చేపడుతోంది. వీటిపై ప్రజల్లోనూ హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. గోదావరి నదిపై నిర్మించిన శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఎగువ నుండి నీరు రాక వట్టిపోయింది. 1963లో చేపట్టిన ఈ ప్రాజెక్టు ద్వారా 11.24లక్షల ఎకరాలకు నీరివ్వాలన్న లక్ష్యం నిర్దేశించుకోగా, కాలం బ్రహ్మాండంగా జరిగిన రోజుల్లోనూ 6 లక్షల ఎకరాలకు మించి సాగు జరగలేదు. కాకతీయ కెనాల్ ద్వారా 9.11లక్షల ఎకరాలకు నీరివ్వాల్సి ఉండగా, 6లక్షల ఎకరాలకు.. లక్ష్మీకెనాల్ ద్వారా 34వేల ఎకరాలకు నీరివ్వాల్సి ఉండగా.. 10వేల ఎకరాలకు, సరస్వతి కెనాల్ ద్వారా 35వేల ఎకరాలకు నీరివ్వాల్సి ఉండగా..20వేల ఎకరాలకు, ఆలీసాగర్ కింద 53వేల ఎకరాలకు నీరివ్వాల్సి ఉండగా, 25వేల ఎకరాలకు, గుత్ప కింద 38వేల ఎకరాలకు నీరివ్వాల్సి ఉండగా, 20వేల



ఎకరాలకు, నిజామాబాద్, నిర్మల్ జిల్లాల్లోని మైనర్ ఎత్తిపోతల ద్వారా 50వేల ఎకరాలకు నీరివ్వాల్సి ఉండగా, 20వేల ఎకరాలకు గరిష్టంగా నీరందించినట్లు ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి. నిర్దేశిత ఆయకట్టు 11.24లక్షల ఎకరాలతో పాటు అదనంగా 5.36లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు సాగునీరందించేలా దీనిని రూపొందించారు. ఏడాదిలోనే పూర్తయ్యే ఈ పథకం ఉత్తర తెలంగాణ రైతాంగానికి భరోసాగా నిలవనుంది.

ఆర్డీఎస్ ఆయకట్టు పరిరక్షణకు తుమ్మిళ్ళ..

రాజోలిబండ డైవర్షన్ స్కీం పథకం ఉమ్మడిరాష్ట్రంలో నిర్లక్ష్యానికి గురికాగా, కర్ణాటకతో పొత్తుల వివాదాలతో ఆయకట్టుకు నీరందడం లేదు. దీంతో ఆయకట్టు పరిరక్షణకు రూ.493కోట్ల వ్యయంతో 55వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరందించేందుకు దీనిని చేపట్టాలని నిర్ణయించారు. ఆర్డీఎస్ కింద తెలంగాణకు 15.9టిఎంసిల తుంగభద్ర జలాల వాటా ఉన్నా ఎన్నడూ 4టిఎంసిలను మించి వాడుకోలేదు. ఈ లోటు పూడ్చడంతో పాటు పూర్తి ఆయకట్టుకు నీరందేలా తుమ్మిళ్ళను రూపొందించారు. ఇప్పటికే పథకానికి సీఎం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వగా.. గద్వాల జిల్లా రైతాంగానికి మేలు కలగనుంది.

మల్లన్నసాగర్ ద్వారా నిజాంసాగర్‌కు జీవం..

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించే మల్లన్నసాగర్ ద్వారా నిజాంసాగర్ ప్రాజెక్టుకు జీవం లభించనుంది. పునరుజ్జీవనం పొందనుంది. 2.50లక్షల ఎకరాలకు సాగునీరందించాల్సిన ఈ ప్రాజెక్టుకు ఈ ఏడాది చుక్కనీరు కూడా రాకపోగా, ఆయకట్టు రైతాంగం తీవ్ర ఆందోళనగా ఉంది. గోదావరి ప్రవాహాన్ని ఎగువప్రాజెక్టులు నిలవరిస్తుండడంతో ప్రాణహిత, ఇంద్రావతి నదీజలాలతో ప్రాజెక్టులకు ప్రాణప్రతిష్ట చేసేందుకు ప్రభుత్వం పక్కాగా వ్యవహరిస్తోంది. నీటిపారుదల ప్రాజెక్టుల పునరాకృతి, పునరుజ్జీవనాల కోసం వేలగంటలు శ్రమించి, గూగుల్ మ్యాప్‌లు, నదుల నడకలు.. నీటిమట్టాలతో కుస్తీపట్టి ముఖ్యమంత్రి కెసిఆర్ రూపొందించిన ప్రణాళికలు సాగునీటి రంగంలో సరికొత్త శకానికి నాందిగా నిలుస్తున్నాయి. ఈ ఏడాదే కాళేశ్వరం ప్రాజెక్టు తొలి ఫలితం దక్కబోతుండగా, వచ్చే ఏడాది పూర్తిస్థాయి ఫలితం దక్కనుంది.

36లక్షల ఎకరాలకు సాగునీరందించే ఈ ప్రాజెక్టుతో పాటు పునరుజ్జీవన పథకాలు మరిన్ని అందుబాటులోకి వస్తే.. ప్రభుత్వ లక్ష్యానికి చేరువ అయినట్లే. నాగార్జునసాగర్ పాతకాల్వ పునర్నిర్మాణం చేపట్టడంతో 20వేల ఎకరాలకు సాగునీరు అందనుంది. కాల్వ పనులకు ఈఏడాది ఫిబ్రవరి 16న రాష్ట్ర నీటిపారుదల శాఖామంత్రి హరీష్‌రావు శంకుస్థాపన చేశారు. త్వరితకాలంలోనే దీనిని పూర్తిచేశారు. చిన్నచిన్నపనులతో.. తక్కువ వ్యయంతో అత్యధిక మేలు చేకూర్చే పనులతో సాగునీటి ప్రాజెక్టులకు కొత్త భాష్యం చెప్పేదిశగా తెలంగాణ ప్రభుత్వం అడుగులు వేస్తోంది.

మోడీ-షాల కొత్త సూత్రం



(మొదటిపేజీ తరువాయి)

ఆరు రాష్ట్రాల్లో గవర్నర్ పదవులు ఖాళీగా ఉన్నాయి. ఏడాది ప్రారంభంలో జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల అనంతరం కేంద్ర రక్షణ శాఖ మంత్రిగా ఉన్న మనోహర్ పారికర్‌ను మళ్లీ తిరిగి గోవా ముఖ్యమంత్రిగా పంపడంతో కీలక రక్షణ శాఖ ఖాళీ అయింది. దీన్ని అప్పటి నుంచి ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ అదనపు బాధ్యతగా మోస్తూ వస్తున్నారు. ఆ తర్వాత అటవీ, పర్యావరణ శాఖ మంత్రిగా ఉన్న అనిల్ మాధవ్ దవే హఠాన్మరణంతో ఆ శాఖ ఖాళీ అయింది. హర్షవర్ధన్ అదనంగా ఈ శాఖ బాధ్యతలు చేపట్టారు. తాజాగా కేంద్ర మంత్రిగా ఉన్న ఎం. వెంకయ్య నాయుడును ఉప రాష్ట్రపతిని చేయడంతో ఆయన చేపట్టిన పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణ, పట్టణ పేదరిక నిర్మూల, సమాచార, ప్రసారాల శాఖలు ఖాళీ అయ్యాయి. వీటిని కూడా ఇతర మంత్రులకు అప్పగించారు. అయితే కీలకమైన రక్షణ శాఖకు పూర్తిస్థాయి మంత్రి లేని సమయంలో చైనాతో సరిహద్దు వివాదం చెలరేగింది. మరోవైపు పాకిస్తాన్‌తో వైరం ఎలాగూ ఉంది. వీలైనంత త్వరగా ఈ శాఖ సహా మిగతా శాఖలను భర్తీ చేయాల్సిన అవసరం ఏర్పడింది. ఈ క్రమంలోనే ప్రధాని మోడీ ఈ ఖాళీల భర్తీకి నడుం బిగించారు.

గవర్నర్ల పదవులకు, కేంద్ర మంత్రుల పదవులకు ఒకదానితో ఒకటి సంబంధం ఉండడం వల్ల ఈ రెండింటినీ కలిపి ఒకేసారి భర్తీ చేసేందుకు ప్రధాని మోడీ కసరత్తు చేస్తున్నారు. 75 ఏళ్లు పైబడిన వారిని మంత్రివర్గం నుంచి ఉద్వాసన పలుకుతున్న విషయం తెలిసిందే. కచ్చితంగా నిబంధన అంటూ ఏదీ లేనప్పటికీ మోడీ ప్రభుత్వం మాత్రం 75 ఏళ్లను కటాఫ్‌గా పెట్టుకుంది. అందుకే గతంలో జరిగిన కేబినెట్ విస్తరణ సమయంలో కేంద్ర మంత్రిగా ఉన్న నజ్మా హెప్తుల్లా తదితరులను మంత్రివర్గం నుంచి తప్పించి, గవర్నర్ పదవులతో విశ్రాంతి కల్పించారు. ఈసారి విస్తరణలోనూ వయస్సు సూత్రాన్ని వర్తింపజేస్తూ 76వ ఏట అడుగుపెట్టిన కేంద్ర చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కల్‌రాజ్ మిశ్రాకు విశ్రాంతినిచ్చే అవకాశం కనిపిస్తోంది. ఇలాంటి వారికి క్రియాశీల రాజకీయాలతో సంబంధం లేని గవర్నర్ పదవులు కట్టబెట్టే అవకాశముంది.

క్రియాశీలతే కీలకం

మంత్రి పదవుల భర్తీలో క్రియాశీలతే కీలకంగా మారింది. అత్యంత కీలకమైన రక్షణ శాఖకు సమర్థవంతమైన నేత కోసం మోడీ, అమిత్ షా గాలింపు చేపట్టారు. అలాగే మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో జేడీ(యూ), అన్నాడీఎంకేలకు కేంద్రంలో చోటు కల్పించనున్నారు. ఉభయ సభల్లో జేడీ(యూ)కు 12 మంది ఎంపీలుండగా, వారిలో ఇద్దరికి (1 కేబినెట్, 1 సహాయ) మంత్రి పదవులిచ్చే అవకాశముంది. ఏఐఏడీఎంకేకు మొత్తం 50 మంది ఎంపీలు ఉన్నారు. ఈ పార్టీకి 3 మంత్రి పదవులు (2 కేబినెట్, 1 సహాయ) ఇస్తారన్న వార్తలు వినిపిస్తున్నాయి. అయితే అన్నాడీఎంకే పదవుల భర్తీ కంటే ముందు రెండు ముక్కలైన ఆ పార్టీని ఏకం చేసే పనిలో బీజేపీ నిమగ్నమైంది. ఈసారి పునర్వ్యవస్థీకరణలో తమకు అదనంగా మరో మంత్రి పదవి దక్కుతుందన్న ఆశలో తెలుగుదేశం పార్టీ ఉంది. ఇప్పటికే ఆ పార్టీ నుంచి అశోక్ గజపతి రాజు కేబినెట్ మంత్రిగా ఉండగా, సుజనా చౌదరి (వైఎస్ చౌదరి) సహాయ మంత్రిగా పనిచేస్తున్నారు.

మిత్రపక్షాల సంగతెలా ఉన్నా సొంత పార్టీలో చురుగ్గా వ్యవహరించే నేతలకు ప్రాధాన్యత దక్కనుంది. గతంలో అటవీ, పర్యావరణ శాఖకు సహాయ మంత్రిగా పనిచేసిన ప్రకాశ్ జవదేకర్‌కు కేబినెట్ హోదా కల్పిస్తూ పదోన్నతి ఇవ్వడంతో పాటు కీలకమైన మానవ వనరుల అభివృద్ధి శాఖను అప్పగించారు. ఇదే తరహాలో సహాయ మంత్రుల్లో క్రియాశీలంగా వ్యవహరించిన వారికి పదోన్నతులు, కేబినెట్ మంత్రులుగా ఉన్నవారిలో కొందరికి ఉద్వాసన పలికే అవకాశాలున్నాయి. పార్టీ కోసం కష్టపడ్డ స్మృతి ఇరానీ, నిర్మలా సీతారామన్ వంటి నేతలకు రాజ్యసభ నుంచి ఎంపీ పదవులిచ్చి మరీ కేంద్ర మంత్రులుగా తీసుకున్నారు. అలా పార్టీ నుంచి ఎక్కువ లబ్ధిపొందిన వారిని గుర్తించి, వారికి మరోసారి పార్టీ బాధ్యతలు అప్పగిస్తారన్న ప్రచారం జరుగుతోంది. అంటే పార్టీ మీకెంతో ఇచ్చింది, మీరు పార్టీకి తిరిగి ఇవ్వాల్సిన సమయం వచ్చింది అన్నట్టుగా పార్టీ అధిష్టానం వ్యవహరించనుంది. కొందరు రాజ్యసభ నుంచి మంత్రులై వచ్చిన నేతలకు లోక్‌సభ క్షేత్రాలు ఎంచుకుని, అక్కడ గెలుపొందడానికి ఇప్పటి నుంచే ప్రయత్నాలు చేయాలని సూచించినట్టు తెలు స్తోంది. తద్వారా పెద్దల సభ నేతలు ప్రజాక్షేత్రంలోనూ బలాన్ని నిరూపించుకోవాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. అదే సమయంలో పార్టీ అప్పగించిన బాధ్యతలను అత్యంత సమర్థవంతంగా నిర్వహించిన నేతలకు ప్రభుత్వంలో చోటు కల్పించవచ్చని తెలుస్తోంది. ఈ క్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ నుంచి నేరుగా పార్టీ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టి జమ్ము- కాశ్మీర్ సహా ఈశాన్య రాష్ట్రాల్లో పార్టీని విస్తరించడంలో కీలక పాత్ర పోషించిన రాంమాధవ్‌ని కేంద్ర మంత్రిగా తీసుకుంటారని జోరుగా ప్రచారం జరుగుతోంది. అయితే ఆయన మాత్రం 2019లో ప్రజాక్షేత్రంలో తన బలాన్ని నిరూపించుకున్న తర్వాతనే ప్రభుత్వంలోకి అడుగు పెడతానని తన సన్నిహితులతో చెప్పినట్టు తెలుస్తోంది.

జోడు పదవులు రద్దు


ఇటు పార్టీలో, అటు ప్రభుత్వంలో రెండేసి పదవులు అనుభవిస్తున్న నేతలు కొందరున్నారు. వారిని ఏదో ఒక పదవికే పరిమితం చేయనున్నారు. ఉదాహరణకు పార్టీ జాతీయ ఉపాధ్యక్ష పదవుల్లో ఉన్న దత్తాత్రేయ, ముక్తార్ అబ్బాస్ నఖ్వీలు కేంద్ర మంత్రులుగా, దినేశ్ శర్మ యూపీ ఉప ముఖ్యమంత్రిగా పనిచేస్తున్నారు. ప్రధాన కార్యదర్శిగా ఉన్న జేపీ నడ్డా, రాజీవ్ ప్రతాప్ రూఢీ కేంద్ర మంత్రులుగానూ ఉన్నారు. జాతీయ కార్యదర్శులుగా పనిచేస్తున్న శ్రీకాంత్ శర్మ, సిద్ధార్థనాథ్ సింగ్ యూపీకి రాష్ట్ర మంత్రులుగా వెళ్లారు. ఓబీసీ మోర్చా అధ్యక్షుడు దారాసింగ్ చవాన్ యూపీ సర్కారులో చేరారు. ఇలాంటి నేతలను అటు ప్రభుత్వానికే పూర్తిగా పరిమితం చేసే అవకాశముంది. ఒకరిద్దరిని పార్టీకే పరిమితం చేసి ప్రభుత్వ పదవుల నుంచి తప్పించినా ఆశ్చర్యపోనవసరం లేదు.

తద్వారా 2019 ఎన్నికల్లో మరింత చురుగ్గా, పూర్తి ఏకాగ్రతతో పనిచేసే అవకాశం ఉంటుందని అమిత్ షా -మోడీలు భావిస్తున్నారు. అందుకే అమిత్ షా తాను రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైనంత మాత్రాన కేంద్ర మంత్రిని కానని తేల్చి చెప్పారు. తన దృష్టంతా 2019లో మరోసారి మోడీని ప్రధానిగా కూర్చోబెట్టడం మీదనే ఉందని స్పష్టం చేశారు. అంటే ఆయన పూర్తిగా పార్టీ మీదనే దృష్టి సారించారు. ప్రభుత్వంలో పని చేసే వారు పూర్తిగా ప్రభుత్వ పథకాలు మరింత సమర్థవంతంగా అమలు చేయడంపై దృష్టి పెట్టడం కోసం పార్టీ బాధ్యతల నుంచి తప్పించనున్నారు. మొత్తం ఈ మార్పులు, చేర్పులు పూర్తి చేసి మరో వారం పది రోజుల్లోనే కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ చేపట్టవచ్చని పార్టీ వర్గాల సమాచారం. ఈ పరిస్థితుల్లో ఎవరికి ఏ పదవి దక్కుతుంది? ఎవరికి ఉద్వాసన పలికే అవకాశం ఉంది? కొత్తగా గవర్నర్లు అవుతున్నవారెవరు? మంత్రులయ్యే ఛాన్స్ ఎవరికుంది? వంటి ప్రశ్నలు సర్వత్రా ఆసక్తి రేపుతున్నాయి. రాజకీయ వర్గాల్లో చర్చకు దారి తీస్తున్నాయి. ఆశావహుల్లో సమీకరణాలకు తావిస్తున్నాయి.

టమోటా

(మొదటిపేజీ తరువాయి)

క్రితం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోనే కనిపించిన కూరగాయల కొరత ప్రస్తుతం దేశ వ్యాప్తంగా విస్తరించిందని మార్కెటింగ్ నిపుణులు చెడుతున్నారు. దీన్నిబట్టి చూస్తే సమీప భవిష్యత్తులో ధరలు మరింతగా పెరిగినా ఆశ్చర్యం లేదంటున్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు కొని తినలేని విధంగా బహిరంగ మార్కెట్లో కొన్ని రకాల కూరగాయలు కిలో రూ.60 నుంచి రూ.100 వరకు పలుకుతున్నాయి. అదుపుతప్పి పెరుగుతున్న ఈ ధరలతో నిత్యజీవనం కష్టమవుతోంది. కష్టపడి పండించే రైతుకు కూడా దొరకని దుస్థితి నెలకొంది. గత నెలలో కిలో రూ.100కు పెరిగిన టమాటోల ధరలు ప్రస్తుతం రూ.60 వద్ద స్థిరంగా కొనసాగు తున్నాయి. అలాగే పచ్చిమిర్చి కిలో రూ.60 నుంచి రూ.80 మధ్య పలుకుతోంది. పక్షం రోజుల క్రితం కిలో రూ.10 నుంచి రూ.15 మధ్య పలికిన ఉల్లిపాయ ధర ఇప్పుడు రూ.30 దాటుతోంది. హోల్‌సేల్ వ్యాపా రుల సమాచారాన్ని బట్టి చూస్తే ఉల్లి కొరత మరింత తీవ్రమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో ఉల్లిపాయల ధర కిలో రూ.50కి పెరిగినా ఆశ్చర్యం లేదని వ్యాపారులంటున్నారు.



ఉల్లి ధరలు ఎప్పుడు చూసినా ఉంటే అతితక్కువ, లేకుంటే అతి ఎక్కువగా ఉంటున్నాయి. దీనికి ప్రధాన కారణం సాగు విస్తీర్ణంలో హెచ్చు తగ్గులు మాత్రమే. ధరలు ఆశాజనకంగా ఉన్న సందర్భాన్ని చూసి రైతులు ఈ పంటను ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేస్తున్నందున సమస్యలు తలెత్తుతున్నాయి. దీంతో వారికి కూడా పంట గిట్టుబాటు కాని పరిస్థితులు నెలకొంటున్నాయి. ఈ క్రమంలో వాతావరణ పరిస్థితులు సహకరించక ఈ పంటను సాగు చేయలేక రైతులకు, ధరలు విపరీతంగా పెరిగి పేద, మధ్య తరగతి వర్గాలకు ఉల్లి దూరమవుతోంది. గత కొన్నేళ్ళుగా రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఇవే పరిస్థితులు కొనసాగుతున్నాయి. ఈ ఏడాది ఖరీఫ్ సాగు స్థితిగతులను పరిశీలిస్తే... ఆంధ్రప్రదేశ్‌లో 26 వేల హెక్టార్లలో, తెలంగాణాలో 15వేల హెక్టార్లలో ఉల్లి పంట సాగవుతుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. పరిస్థితులు వికటించి ఇప్పటివరకు ఏ రాష్ట్రంలోనూ 4వేల హెక్టార్లు దాటలేదు. ఈ పరిస్థితులను బట్టి చూస్తే సమీప భవిష్యత్తులో ఉల్లి ధరలు ఇప్పుడున్న ధరలకు రెట్టింపయ్యే ప్రమాదం పొంచివుంది. నిత్యావసర కూరగాయల్లో ప్రధానమైన టమోటో దేశవ్యాప్తంగా కొరతను ఎదుర్కొంటున్నప్పటికీ తెలంగాణలో కొందామన్నా దొరకని పరిస్థితి నెలకొంది. మొన్నటి వరకు కిలో ధర రూ.100కు మించి అధిక ధర పలికిన కలిగించిన వినియోగదారులకు ప్రస్తుతం రూ.60కి దొరుకుతున్నా అన్ని చోట్లా అందుబాటులో ఉండడంలేదు. ప్రధాన మార్కెట్లు, రైతు బజార్లలో మాత్రమే టమాటోలు కనిపిస్తున్నాయి. అందుకు ప్రధాన కారణం ఈ పంట సాగు పూర్తిగా తగ్గిపోవడమేనని ఉద్యాన రంగ నిపుణులు స్పష్టంచేస్తున్నారు.

అన్ని రకాల కూరగాయల పైనా ప్రభావం

గడిచిన దశాబ్దకాల చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది తీవ్ర ప్రభావం చూపిన వేసవిలో సాగు చేసిన కూరగాయ తోటలన్నీ 90శాతం ఎండిపోయాయి. బోరుబావుల్లో నీరులేక, సాగు చేసే అవకాశం లేక రైతులు చేతులెత్తేశారు. అక్కడక్కడ కొద్దిపాటి జల వనరులు ఉన్నచోట మాత్రమే కొన్ని రకాల కూరగాయలు సాగయ్యాయి. దీంతో దాదాపు అన్ని రకాల కూరగాయల ధరలు బహిరంగ మార్కెట్‌లో మూడింతలు పెరిగిపోయాయి. అన్నింటికి మించి పచ్చిమిర్చి, టమోటో ధరలు ఈ ఏడాది వంద దాటాయి. మిగతా కూరగాయల ధరలు కూడా కిలో రూ.40 నుంచి 50 మధ్య పలుకు తున్నాయి. ప్రస్తుతం ఉభయ రాష్ట్రాల్లో ఎక్కడ చూసినా మార్కెట్లలో కూరగాయలు అంతంత మాత్రంగానే కనిపిస్తున్నాయి. రైతు బజార్లలోనూ అన్ని రకాల కూరగాయలు అందుబాటులో లేకపోవడంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. ఎక్కడో ఒకచోట కనిపించే టమాటోలు వ్యాపారులు నిర్ణయించే ధరలు పేద, మధ్య తరగతి వర్గాలకు అందకుండా పోతున్నాయి. డిమాండ్ భారీగా పెరగడంతో వ్యాపారులు అవసరాన్ని బట్టి ధరలను పెంచి విక్రయిస్తున్నారు. అదే స్థాయిలో పచ్చిమిర్చి ధరలు ఆకాశాన్నంటాయి. అవి కూడా ప్రధాన మార్కెట్లలో తప్ప ఎక్కడా దొరకని పరిస్థితి నెలకొంది.


90శాతం పొరుగు రాష్ట్రాల నుంచి దిగుమతి

గడిచిన రెండు నెలల కాలంగా రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడ కూడా కూరగాయలు అందుబాటులో లేకపోవడంతో వ్యాపారులు పొరుగు రాష్ట్రాల నుంచి తీసుకువస్తున్నారు. ఇండోర్ నుంచి క్యారెట్, చెన్నై నుంచి మునగ, టమాటో, మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాల నుంచి పచ్చిమిర్చి, ఇతర కూరగాయలు దిగుమతి చేసుకుంటున్న వ్యాపారులు వారి గిట్టు బాటు చూసుకుని ధరలు నిర్ణయిస్తున్నారు. ఈ పరి స్థితుల్లో వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఏమీ చేయలేకపోతోంది. ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవడానికి కూడా అవకాశం లేకపోవడంతో ధరల నియంత్రణపై అధికారులు చేతులెత్తేశారు. ప్రతిరోజూ రాజధాని నగరంలో విక్రయిస్తున్న వివిధ రకాల కూరగాయల్లో సుమారు 85 శాతానికిపైగా పొరుగు రాష్ట్రాల నుంచే తీసుకువస్తున్నారు. సుదూర ప్రాంతాల నుంచి తీసుకువచ్చే క్రమంలో రవాణా ఛార్జీలు కూరగాయల ధరలను దాదాపు నాలు గింతలు పెంచేస్తున్నాయి. పచ్చిమిర్చి మాత్రమే ఉంటాయి. కానీ ప్రధానమైన వీటికి మాత్రమే ఈ ఏడాది తీవ్రమైన కొరత నెలకొంది. ప్రతిరోజూ హైదరాబాద్ నగరానికి 12వేల మెట్రిక్ టన్నుల కూరగాయలు వివిధ రాష్ట్రాల నుంచి దిగుమతి అవుతాయని ఒక అంచనా. కానీ ఇప్పుడున్న పరిస్థితుల్లో ఈ అంచనాలు తారుమారై 5వేల మెట్రిక్ టన్నుల కూరగాయలు కూడా అందుబాటులో లేవు. పెరిగిన ధరలతో, ముఖ్యంగా కొరతతో వ్యాపారులకు గిట్టుబాటు కావడంలేదు. దీంతో ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకునే ప్రక్రియ కూడా స్తంభించింది.

కృష్ణమ్మకు న్యాయ పోరాటం తప్పదా?

• సాగు, తాగునీటికి కటకట • ఆల్మట్టి, నారాయణపూర్ ఫుల్ • దిగువున నిండుతున్న జలాశయాలు • లేఖలు రాసినా స్పందించని కర్ణాటక • అన్నదాతల్లో ఆందోళన

హైదరాబాద్, ఆంధ్రప్రభ: నీటి వాడకం విషయంలో కర్ణాటక అనుసరిస్తున్న వైఖరి పట్ల రెండు తెలుగు రాష్ట్రాలు మండిపడుతున్నాయి. ఎగువున ఉన్న ఆల్మట్టి, నారాయపూర్ రిజర్వాయర్లు పూర్తిగా నిండినా కూడా కర్ణాటక దిగువునకు చుక్క నీరు రాకుండా జాగ్రత్త పడింది. దీంతో దిగువున్న ఉన్న ఆంధ్రప్రదేశ్,తెలంగాణ రాష్ట్రాల్లో సాగు.తాగునీటికి కటకట ఏర్పడింది. రెండు రాష్ట్రాల్లో కూడా ఇంతవరకు సరైన వర్షాలు పడకపోవడంతో రిజర్వాయర్లు నిండని పరిస్దితి నెలకొన్న సంగతి తెలిసిందే. గత రెండు మూడు రోజులుగా రాష్ట్రంలో అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయే కాని ప్రాజక్టుల్లోకి భారీగా నీరొచ్చేటంతటి స్థాయిలో మాత్రం వర్షాలు కురవడం లేదు. తాగునీటి అవసరాలు తీర్చుకుందామన్నా కూడా అల్మట్టి, నారాయణపూర్ నుంచి చుక్క నీరు రాకపోవడంతో తెలుగు రాష్ట్రాలు నానా అవస్థలు పడాల్సి వస్తుంది. కర్ణాటక మాత్రం ప్రాజెక్టుల్లోకి వస్తున్న నీటిని ఇబ్బడిముబ్బడిగా వాడేసుకుంటుంటుంది. కాలువలు, ఎత్తిపోతల పథకాల ద్వారా ప్రాజెక్టుల్లోకి వచ్చి చేరుతున్న నీటినంతటినీ వాడేసుకుంటూ తెలివిగా వ్యవహరిస్తుండడంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ఇబ్బందికర పరిస్థితి తలెత్తిందంటున్నారు. అలమట్టి ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 129.72 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 128.19 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయి. యావరేజ్‌గా ఇన్‌ఫ్లో వచ్చేసి 6,003 క్యూసెక్కులుగా ఉంది. అదే విధంగా అవుట్‌ఫ్లో అంతే రీతిలో ఉందని గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఇక్కడ ప్రస్తుతం వరద ప్రవాహం 1.53 టీఎంసీలు మాత్రమే ఉంది. గత ఏడాది ఇదే సమయానికి ఈ రిజర్వాయర్‌లో 104.80 టీఎంసీలు నీరు నిల్వ ఉంది. గతేడాదితో పోలిస్తే ప్రస్తుతం రిజర్వాయర్‌లో 24 టీఎంసీలకంటే ఎక్కువగానే నీటి నిల్వలు ఉన్నాయి. అదే విధంగా నారాయపూర్ రిజర్వాయర్ పూర్తి సామర్థ్యం 37.65 టీఎంసీలు కాగా ప్రస్తుతం 32.10 టీఎంసీల నీటి నిల్వలు ఉండడం గమనార్హం. ప్రస్తుతం వరద ప్రవాహం 5.55 టీఎంసీలుగా ఉంది. ఇదే సమాయానికి గతేడాది రిజర్వాయర్‌లో 32.82 టీఎంసీలు ఉంది. పైన ఉన్న రిజర్వాయర్ల నుంచి దిగువకు నీటిని వదలకపోవడంతో కింద ఉన్న శ్రీశైలం ప్రాజెక్టులో నీటి నిల్వలు లేక వెలవెలబోతున్నది. ఈ ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 215.81 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో కేవలం 19.71 టీఎంసీలు మాత్రమే ఉండడం గమనార్హం. గతేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 149..78 టీఎంసీలు ఉన్నాయి. ఇక నాగార్జునసాగర్ ప్రాజెక్టు పరిస్థితి కూడా ఇందుకు భిన్నంగా లేదు. సాగర్ పూర్తి స్థాయి నీటి మట్టం 312.05 టీఎంసీలు కాగా ప్రస్థుతం కేవలం 115.94



టీ ఎం సీ ల ు మాత్రమే ఉంది.గతేడాదితో పోలిస్తే ఇదే సమయానికి 129,64 టీఎంసీలు ఉంది. నీటి నిల్వలు గణనీయంగా పడిపోవడానికి కారణం ఎగువున ఉన్న ఆల్మట్టి, నారాయణపూర్ జలాశయాలే ప్రధాన కారణంగా పేర్కొంటున్నారు. పైనుంచి నీరు రాకపోవడంతో ఆయా ప్రాజెక్టుల కింద ఉన్న ఆయకట్టు పరిస్దితి కొంత ఇబ్బందికరంగా మారడంతో అన్నదాతల్లో ఆందోళన కనిపిస్తుంది. దీంతో రెండు తెలుగు రాష్ట్రాలు కూడా ఈ విషయమై ఏదో ఒకటి చేయాలని సుదీర్ఘంగా ఆలోచిస్తున్నాయి. ఇప్పటికే ఈ రెండు రాష్ట్రాలకు చెందిన ముఖ్య మంత్రులు నారా చంద్రబాబు,కేసీఆర్‌లు విడివిడిగా కేంద్ర ప్రభుత్వానికి ప్రత్యేకించి, లేఖలు కూడా రాయడం జరిగింది. అంతేకాకుండా ఆయా రాష్ట్రాలకు చెందిన జలవనరుల శాఖాధికారులు కూడా పరిస్థితిని కేంద్రం దృష్టికి,కేంద్ర జలవనరుల సంఘం దృష్టికి తీసుకెళ్ళారు. అవసరమైతే న్యాయ పరంగా కూడా ముందుకెళ్లడానికి ఉన్న అవకాశాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సీరియస్‌గా ఆలోచి. కర్ణాటక వాడుతున్న నీటిని కనీసం రికార్డుల్లో కూడా చూపించకుండా జాగ్రత్తపడుతున్నదనే విమర్శలున్నాయి. నారాయణపూర్, అలమట్టి రిజర్వాయర్లలోకి సామర్ధ్యానికి మించి ప్రవాహం వచ్చినా దిగువకు సూత్రం నీరొదలడం లేదు. రిజర్వాయర్లలోని ప్రవాహానికి, బయటకు వదిలే నీటికి పొంతన ఉండడం లేదంటున్నారు. మరో వైపు తెలుగు రాష్ట్రాల్లోని ఆయకట్టు పరిస్థితి ఇబ్బంది కరంగా మారడంతో ఏమి చేయాలో అర్ధ ంకాక తర్జనభర్జనపడుతున్నాయి. జూలై నెలాఖరుకల్లా పై నుంచి శ్రీశైలంలోకి నీళ్లు రావచ్చని తొలుత అనుకున్నారు.కానీ ఆగస్టు రెండో వారం వచ్చినా ఇంతవరకు కిందకు చుక్క నీరురాకపోవడంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతున్నది. బచావత్ తీర్పు ప్రకారం కర్ణాటకును ఏమీ చేయలేని స్థితి ఉండడంతో న్యాయపరంగా వెళితే మంచిగా ఉంటేదేమోనని ఆలో చి స్తు న్నా ర ు. చే య ఁ డ గ లి గిం ద తక్కువేనని,ఏపీజలవ అధికారులు స్పష్టం చేశారు. నీటి లభ్యత ఆధారంగా బచావత్ ట్రిబ్యునల్ నీటి కేటాయింపు చేసింది. బచావత్ స్కీం ' ఎ 'ను అమలు చేస్తోంది. 75 శాతం నీటి లభ్యత ఆధారంగా పంపిణీ చేసిన 2130 టీఎంసీలలో మహారాష్ట్రకు 585 టీఎంసీలు, కర్ణాటకకు 734 టీఎంసీలు, ఉమ్మడి ఏపీకి 811 టీఎసీల వాటా ఉంది. దాని ప్రకారం కర్నాటక ఆల్మట్టి 519.6 మీటర్ల మేరకు నీటిని నిల్వ చేసుకుని వాడుకోవచ్చు. దీని ప్రకారం కొంత నీటిని దిగువకు వదలాలనే రూల్ ఏమి లేదు. దీంతో న్యాయపరంగా చేయడానికి కూడా ఏమి ఉండదని తెలియడంతో ఉభయ తెలుగు రాష్ట్రాలు మధ్యే మార్గంగా కర్ణాటకను రిక్వెస్ట్ చేసే పద్ధతినే అవలంభిస్తే మంచిదనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. ఈ ఏడాది పట్టిసీమ నుంచి గోదావరి నీటిని కృష్ణాడెల్టాకు మళ్లించి రైతులను ఆదుకోవడం తప్పా ఇతర ఏ ప్రాజెక్టుల కింద ఆయకట్టులేని దుస్థితి దాపురించింది. సాగర్‌లో ఉన్న నీటిని కేవలం తాగునీటి అవసరాలుకు మాత్రమే వాడుకునే పరిస్థితి ఉంది. సాగుకు వదిలే పరిస్థితి లేకపోవడంతో మరింత ఆందోళన వ్యక్తమవు తున్నది.



సరిహద్దుల్లో స్వరాజ్యమెప్పుడు?

కాల చక్ర భ్రమణంలో...మరో పంద్రాగస్టు...ఇప్పటికి డెబ్బయి ఏళ్ళుగా స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకుంటున్నాం...వందలాది సంవత్సరాలు పోరాడి సాధించుకున్న స్వాతంత్ర్యం తెచ్చుకున్నాం. ఎందుకు? మనల్ని మనం పాలించుకుందామని...మనల్ని మనం రక్షించుకుందామని... ! కానీ ఇప్పటికీ మన సరిహద్దుల్ని మనం క్షేమంగా ఉంచుకోగలుగుతున్నామా? నిర్దిష్ట ప్రాంతం మనది అని సర్వామోదితంగా చెప్పి ఒప్పించ గలుగుతున్నామా? ఓ వైపు పాకిస్తాన్‌తో...మరో వైపు బంగ్లాతో..। తాజాగా చైనాతో...! 71 వ స్వాతంత్ర్య దినోత్సవాన సవాల్‌గా నిలిచిన సరిహద్దు సమస్యపై సమగ్ర విశ్లేషణ.

అన్నం పెట్టే రైతు, శత్రువుల బారి నుంచి రక్షించే జవాన్ దేశానికి రెండు కళ్ళన్నారు మాజీ ప్రధాని లాల్ బహదూర్‌శాస్త్రి. ఆయన ప్రధానమంత్రి పదవిలో ఉన్నది స్వల్పకాలమైనా, దేశ ప్రజల్లో ఆత్మస్థైర్యాన్ని నింపిన నాయకునిగా చరిత్రలో శాశ్వత స్థానాన్ని సంపాదించుకున్నారు. ఆయన ఆనాడు ఇచ్చిన జై జవాన్, జై కిసాన్ నినాదం ఇప్పటికీ సజీవంగాఉంది. ఇప్పటికీ అనుసరణీయమైనదే. సరిహద్దుల్లో సైనికుల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉంటే, సరిహద్దు గ్రామాల ప్రజల పరిస్థితి అంతకన్నా దారుణంగా ఉంది. సరిహద్దుల్లో సైనికులను ఉత్తేజ పర్చేందుకు ప్రధాని నరేంద్రమోడీ సియాచిన్ ప్రాంతంలో వరుసగా రెండేళ్ళు సైనికులతో కలిసి దీపావళి పండుగ జరుపుకున్నారు. స్వాతంత్ర్యం వచ్చి 70 సంవత్సరాలు పూర్తయినా సరిహద్దుల భద్రత ప్రభుత్వాలకు ఓ సవాల్‌గానే మిగిలిపోవడం దురదృష్టకరం.

సరిహద్దు గ్రామాల్లో ప్రజలకు పౌర, మానవ హక్కులు మృగ్యం. వారు ఎటువైపు చెందిన వారో తెలియని విచిత్రమైన పరిస్థితి నెలకొని ఉంది. కాశ్మీర్‌లో అయితే మరీ దారుణం. అటు పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో ఉన్న ప్రజలూ, ఇటు మన కాశ్మీర్‌లో ఉన్నవారూ సగోత్రీకులే. రక్త సంబంధీకులే. వారి మధ్య తరతరాలుగా సంబంధ బాంధవ్యాలు ఉన్నాయి. అయినప్పటికీ పాక్ ఆక్రమణ కారణంగా వేర్వేరుగా జీవించాల్సి వస్తోంది. పొరుగుదేశాలైన చైనా, పాకిస్తాన్‌లు సమయం చిక్కినప్పుడల్లా మన సేనలను కవ్విస్తూ సవాళ్ళు విసురుతున్నాయి. మరో రెండురోజుల్లో 71వ స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకుంటున్న తరుణంలో దేశ సరిహద్దుల్లో పరిస్థితి గురించి సమీక్షించుకోవడం సందర్భోచితమే.

నిత్యం కవ్వింపులే: సరిహద్దు అనగానే మనకు ముందుగా గుర్తుకు వచ్చేది జమ్ము, కాశ్మీర్ సరిహద్దే. కాశ్మీర్‌లో కొంత భాగాన్ని పాకిస్తాన్ ఆక్రమించి ఏడుదశాబ్దాలు అయినా అది ఇంకా మనకు స్వాధీనం కాలేదు. పాక్ ఆక్రమణలో ఉన్న ప్రాంతంలో ఉన్నవారూ కాశ్మీరీలే. వారందరికీ మన కాశ్మీర్‌లోని కుటుంబాలతో తరతరాలుగా సంబంధ బాంధవ్యాలు ఉన్నాయి. ఆక్రమిత కాశ్మీర్ గ్రామాల నుంచి సరిహద్దు భద్రతాదళాల కన్నుగప్పి ఇటువైపు రావడం, ఇటువైపు వారు అటు వెళ్ళడం రహస్యంగా జరుగుతూనే ఉంది. ఇదంతా అనధికారికంగా సాగుతున్న వ్యవహారం. కాశ్మీర్‌లోకి జిహాదీల పేరిట చొరబాటుదారులను పంపించేందుకు పాక్ సైన్యం అలవాటు పడింది. పాక్ సైనికాధికారులు, సైనికులు అంతా డబ్బు కోసం కక్కుర్తి పడి చొరబాట్లను చూసీ చూడనట్టు వదిలి వేయడం దశాబ్దాలుగా సాగుతోంది. చొరబాట్లను మన సైనికులు అడ్డుకున్నప్పుడల్లా పాక్ సైన్యం కాల్పులు జరపడం, మన సైనికులు తిప్పికొట్టడం కూడా సర్వసాధారణం అయింది. ఈ నేపథ్యంలో మన సరిహద్దు గ్రామాలపై పాక్‌సైనికులు ఒక్క రోజు కూడా విరామం లేకుండా కాల్పులు జరుపుతూనే ఉన్నారు. పద్నాల్గేళ్ళ క్రితం ఆనాటి ప్రధాని వాజ్‌పేయి అప్పటి పాక్ ప్రధాని నవాజ్ షరీఫ్‌తో కాల్పుల విరమణ ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. ఆ ఒప్పందాన్ని పాక్ సైనికులు ఒక్కరోజు కూడా గౌరవించలేదు. మన సైనికులపై పాక్ సైనికులు జరిపిన కాల్పులు గురితప్పి సరిహద్దు గ్రామాల్లో ప్రజలను బలిగొనడం కూడా నిత్యకృత్యం అయింది. సరిహద్దు గ్రామాల్లో నిత్యం తుపాకీమోతలు, సైనికుల పదఘట్టనల హోరులో కంటి మీద కునుకు లేకుండా గడుపుతున్నారు. అంత అప్రమత్తంగా ఉన్నా సరే సరిహద్దు గ్రామాల పౌరులు ప్రాణాలు నిత్యం గాలిలో కలిసిపోతున్నాయి.

ఎల్ఓసీలో...: లైన్ ఆఫ్ కంట్రోల్ (ఎల్ఓసీ) ఎత్తైన కొండల మీదుగా ఉంది. దీనినే ఆధీన రేఖ అని కూడా అంటారు. కార్గిల్ జిల్లా మీదుగా వెళ్ళే ఈ అధీన రేఖవెంబడి గ్రామాలు మంచుతో గడ్డకట్టి ఉన్నా, తరతరాలుగా అక్కడే జీవనం సాగిస్తున్న కుటుంబాలు ఉన్నాయి. ఈ ప్రాంతంలో ఉన్న పెక్కు గ్రామాల్లో హుండర్‌మన్ అనే గ్రామం కూడా ఉంది. ఈ గ్రామంలో నిత్యం సమరమే. ఈ ప్రాంతం నాలుగు యుద్ధాలను చూసింది. ఈ ప్రాంతం నుంచి వాస్తవాధీన రేఖను మార్చడంతో ఇక్కడి కుటుంబాలు, బంధువులు, మిత్రులందరూ వేరుపడాల్సి వచ్చింది. ఇది ఒక విషాద ఘట్టం.వారికి రాజకీయాలతో సంబంధం లేకపోయినా, ఇరుగుపొరుగు దేశాల మధ్య పెరిగిన ఉద్రిక్తతల నేపథ్యంలో వేరు పడాల్సి వచ్చింది. ఎప్పుడు ఉద్రిక్తత ఏర్పడినా, యుద్ధం వచ్చినా ఈ గ్రామంలో ప్రజలకు నరకమే. ఏ సమయంలో ఎవరు చొరబడి విరుచుకుని పడతారో తెలియదు. కంటి మీద కునుకు లేకుండా గడపడానికి అక్కడి ప్రజలు అలవాటు పడిపోయారు. నిత్యం ఉద్రిక్తతల వల్ల నిత్యావసరాలకు ఎప్పుడూ కొరతే. ఎంత పొదుపుగా వాడుకున్నా, వారి వద్ద నిల్వలన్నీ హరించుకుని పోతుంటాయి. సరిహద్దుగ్రామాల ప్రజలకు కొత్త సమస్య కూడా వచ్చింది. వారు ఎప్పటికప్పుడు తమ నిజాయితీని రుజువు పర్చుకోవల్సి వస్తుంది. వారిని సైనికులు నిత్యం చూస్తున్నా, ఎప్పటికప్పుడు వచ్చి గద్దించి అడుగుతారు. హుండర్‌మాన్ గ్రామ ప్రజలు సరిహద్దుల్లో ఉండటం వల్ల రెంటికీ చెడిన రేవడులయ్యారు. 1949 నుంచి రెండు దశాబ్దాల పాటు వారు పాక్ జాతీయులు. ఆ తర్వాత వచ్చిన యుద్ధంలో వారు ఇటువైపు వచ్చారు. 1971లో బంగ్లాదేశ్ అవతరణకు దారితీసిన యుద్ధంలో గిల్జిత్-బాల్టిస్తాన్ ప్రాంతంలో 804 కిలో మీటర్ల భూభాగాన్ని మన సైనికులు కైవసం చేసుకున్నారు. ఈ భూభాగంలో చేరి ఉన్న గ్రామస్తులు అంతా భారత్‌లో భాగమయ్యారు. అయితే, వీరికి ఈనాటికీ గుర్తింపు రాలేదు. అందువల్ల దేశ పౌరులంతా పొందే సౌకర్యాలను వారు పొందలేకపోతున్నారు. నిత్యం పాక్‌సైనికులు జరుపుతున్న కాల్పుల హోరు వల్ల సరిహద్దు గ్రామాల్లో ప్రజల పరిస్థితిని ఏ ప్రభుత్వమూ పట్టించుకున్న దాఖలాలు లేవు. అయితే, వారి పేరు మీద రేషన్, నిత్యావసరాల వస్తువులను చౌక



దుకాణాల ద్వారా అక్రమార్కులు పొందుతున్నారు. అంటే అసలైన లబ్ధిదారులకు అవి అందడం లేదు. ఇది మొదట చాటుమాటుగా జరిగేది. రాజకీయ నాయకుల అండదండలతో ఇప్పుడది పబ్లిక్‌గానే జరుగుతోంది.

విభజన కాలం నుంచి: దేశ విభజన కాలం నుంచి సరిహద్దు గ్రామాల ప్రజల సమస్యలను ఎవరూ పట్టించుకోలేదు. పశువుల కాపరులు పశువులను తోలుకుంటూ సరిహద్దుదాటినప్పుడు వారిని పాక్ సైనికులు నిర్బంధించడం, అక్రమ కేసులు బనాయించడం మామూలే. సరబ్‌జిత్ సింగ్ అనే పశువుల కాపరి పశువులను కాస్తూ సరిహద్దు దాటి పాక్ సైనికుల చెరలోపడటం, అతడిపై చేయని నేరాన్ని మోపి అక్కడి కోర్టుల చేత ఉరిశిక్ష పడేట్టు చేయడంవంటి పరిణామాలన్నీ ఇంకా మన స్మృతిపథంలోనే ఉన్నాయి. ఇలాంటి సరబ్‌జిత్‌ల గాథలు ఎన్నో ఉన్నాయి. మీడియా దృష్టిలో పడినవే మనకు తెలుస్తున్నాయి. హుండర్‌మన్ గ్రామం 1971లో భారత సైనికుల వశమైనప్పుడు పాక్‌లో ఉండిపోయిన గులామ్ హుస్సేన్ అనే గ్రామస్తుడు తిరిగి రాలేదు. అతడి భార్యాబిడ్డలు గ్రామంలోనే ఉన్నారు. అతడిని స్వగ్రామంలోకి అనుమతించకపోవడం వల్ల భార్యా బిడ్డలకు దూరంగా గడుపుతున్నాడు. అలాంటి వ్యక్తులు ఎంతోమంది ఉన్నారు. కట్టుగుడ్డలతో విడిపోయిన వారు, రక్త సంబంధీకులకు దూరమైన వారు ఎంతో మంది ఉన్నారు. వీరి మొరను ఆలకించేందుకు ఏ అధికారులు అక్కడ కనిపించరు. సరిహద్దుల్లో పని చేసే సైనికులు, వారి పైఅధికారులకు ఇలాంటి వారి మొరవినే తీరికే ఉండదు. అన్నింటికన్నా సరిహద్దు గ్రామాల్లో కనీస సౌకర్యాలు ఉండవు. మంచినీటికి ఎప్పుడూ కటకటే. విద్యుత్ సౌకర్యం కూడా అంతంత మాత్రమే. కాల్పులు జరుగుతున్నప్పుడు ఎవరి మటుకు వారు ఇళ్ళలో బందీలు కావల్సిందే. ఒకవేళ పొరపాటున బయటికి వస్తే తుపాకీ గుళ్ళకు గురి కాకతప్పదు.

గుహలే బంకర్లు: యుద్ధ సమయాల్లో ఇరువైపులా సైనికులు హోరాహోరీ కాల్పులు జరుపుకునే సందర్భాల్లో సరిహద్దు గ్రామాల ప్రజలు ఆత్మరక్షణ కోసం కొండల్లో ఉన్న గుహలనే బంకర్లుగా ఉపయోగించుకుంటారు. మామూలు రోజుల్లో కూడా శత్రు దళాల నుంచి రక్షణకు వారికి ఈ గుహలే ఉపయోగపడుతున్నాయి.1999 కార్గిల్ యుద్ధంలో హుండర్‌మన్ గ్రామం పూర్తిగా శిథిలమైంది. ఇలాంటి యుద్ధాల్లో చారిత్రక, సాంస్కృతిక ప్రాధాన్యం ఉన్న ప్రదేశాలు శిథిలమైపోవడం, కాలగర్భంలో కలసిపోవడం ఆనాడే కాదు. ఈ మధ్య కూడా మనం చూశాం. ఉదాహరణకు సిరియాలో ఎంతో చారిత్రక ప్రాధాన్యం ఉన్న అప్పో అనే ప్రాంతం పూర్తిగా శిథిలమైంది. అలాగే, కార్గిల్ జిల్లాలో సరిహద్దుల్లో ఉన్న గ్రామాల్లో ఎంతో ప్రాధాన్యం ఉన్న ప్రాంతాలు దెబ్బతిన్నాయి. కాల్పుల సమయంలో గ్రామస్తులు కొండగుహల్లో దాక్కుని ప్రాణాలు కాపాడుకోవడం ఇక్కడ ఆనవాయితీయే.

మ్యూజియంగా మార్పు: కార్గిల్ యుద్ధం జరిగే సమయానికి 13 ఏళ్ళ బాలుడైన అన్సారీ ఇప్పుడు పెద్దవాడయ్యాడు. ఆ యుద్ధంలో బాగా దెబ్బతిన్న తమ పూర్వీకుల ఇంటిని అతడు రెండేళ్ళ క్రితం మ్యూజియంగా మార్చాడు. ఆ మ్యూజియంలో ఎన్నో పాత వస్తువులు ఉన్నాయి. ఇంతవరకూ ఈ మ్యూజియంను మూడువేల మంది సందర్శించినట్టు అతడు చెప్పాడు. కాల్పుల హోరు మధ్యలో కూడా ఈ మ్యూజియంను తిలకించేందుకు ఇంతమంది వచ్చారంటే చెప్పుకోదగిన విషయమే.

బంగ్లా సరిహద్దుల్లో: బంగ్లాదేశ్ సరిహద్దుల్లోని గ్రామాల్లో పరిస్థితి కొద్దిగా మెరుగుగా ఉంది. ఖాసీ కొండల్లో సిల్హెట్ గ్రామంలోకి సులభంగా ప్రవేశించవచ్చు. సిల్హెట్‌లో కొంత భాగం మన దేశంలోని అసోంలోనూ, మిగిలిన భాగం తూర్పు పాకిస్తాన్ (ప్రస్తుత బంగ్లాదేశ్)లోను ఉన్నాయి. ఇక్కడి కొండల్లో తేయాకు తోటల్లో పని చేసేందుకు బ్రిటిష్ వారి హయాంలో జార్ఖండ్ నుంచి ఆదివాసులను తీసుకుని వచ్చారు. వారే ఇక్కడ స్థిరపడ్డారు. దేశ విభజన తర్వాత ఈ ప్రాంతంలోని గ్రామాల పరిస్థితి దారుణంగా తయారైంది. బంగ్లాదేశ్ ఆవిర్భావం తర్వాతనైనా మెరుగుపడుతుందని చాలామంది ఆశించారు. కానీ పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. ప్రధాని నరేంద్రమోడీ బంగ్లాదేశ్ ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం భూభాగాల మార్పిడి జరిగినప్పటికీ, ఇప్పటికీ కొన్ని ప్రాంతాలు బంగ్లాదేశ్‌లోనే ఉండిపోయాయి. దాంతో బంధుమిత్రులు విడిపోయారు. సరిహద్దులను దాటి అక్రమంగా ప్రవేశించేవారిని సరిహద్దు భద్రతా దళాలు పట్టుకుని జైలులో ఉంచుతారు.

మంచినీటి కొరత: సరిహద్దు గ్రామాల్లో నీటి కొరత తీవ్రంగా ఉంటుంది. ఎదురుగా నీరు కనిపిస్తున్నా, వెళ్ళి తెచ్చుకోలేని దైన్య స్థితిలో ఉన్నారు. ఒక వైపు ఎండిపోయిన గుంటలు,మరో వైపు నీటి చెలమలు. బంగ్లాదేశ్ యుద్ధం సమయంలో లక్షలాది మంది శరణార్థులుగా మారారు. వీరిలో చాలామంది అసోం, త్రిపుర, బెంగాల్‌లోకి ప్రవేశించారు. ఇలా ప్రవేశించిన వారు పౌరసత్వం లేకుండా దశాబ్దాలుగా జీవిస్తున్నారు. వీరిని ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు ఓటు బ్యాంకులుగా ఉపయోగించుకుంటున్నాయి.అసోంలో విదేశీయుల సమస్యపై పోరాటం జరిపి అధికారంలోకి వచ్చిన గణపరిషత్ కూడా చివరికి ఇదే విష చక్రంలో పడిపోయింది. సరిహద్దుల్లోని గ్రామాల ప్రజలపై బంగ్లాదేశ్ రైఫిల్స్ దళాలు తరచుగా కాల్పులు జరుపుతున్నాయి. ఈ కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయినవారు ఎంతో మంది ఉన్నారు. అలాగే, గాయపడి అంగవైకల్యంతో జీవితాలను వెళ్ళదీస్తున్నవారున్నారు. వీరిలో ఏ దేశానికీ చెందని వారెంతో మంది ఉన్నారు.

ఓటు హక్కు లేదు: మేఘాలయలోని సరిహద్దు గ్రామాల ప్రజలకు ఓటు హక్కు లేదు. నాలుగైదు తరాల నుంచి ఇక్కడి సరిహద్దుల్లో ప్రజలు ఓటు హక్కు లేకుండానే గడుపుతున్నారు. వీరంతా తేయాకు తోటల్లో పని చేస్తున్నారు. మేఘాలయ సరిహద్దు గ్రామాల్లో మతం మార్పిడులు ఎక్కువ. క్రైస్తవ మిషనరీలు ఇక్కడ ఎక్కువగా పని చేస్తున్నాయి. సరిహద్దు గ్రామాల్లో ప్రజలకు పౌర, మానవ హక్కులు లేవు. నిత్యం నరకం అనుభవిస్తున్న వారెంతోమంది ఉన్నారు. మన దేశ సరిహద్దులు ఇంత బలహీనంగా ఉండటానికి ప్రభుత్వాల ఉదాసీనతే కారణం.

రక్షణ శాఖలో ఉదాసీనత: సరిహద్దులు బలహీనంగా ఉండటానికి రక్షణ శాఖ ఉదాసీనత కారణం. రక్షణరంగానికి చెందిన ఉన్నతాధికారులు సరిహద్దులను సందర్శించేసందర్భాలు చాలా తక్కువ. ఎక్కడో ప్రధాన కేంద్రాల్లో బస చేసి తమకు కావల్సిన సమాచారాన్ని సేకరించి వెళ్ళిపోతుంటారు. ఎత్తయిన మంచుకొండల్లోకి వెళ్ళేందుకు ఎవరూ రిస్క్ తీసుకోరు. ఈ విషయాలన్నీ ప్రభుత్వానికి తెలుసు. అక్కడ పని చేసే మన జవాన్లను ఉత్సాహ పర్చేందుకే ప్రధానమంత్రి పదవిని చేపట్టిన కొత్తలో మోడీ దీపావళి పండుగను సియాచిన్‌లో జరుపుకున్నారు.

డోక్లామ్ సరిహద్దుల్లో: తాజాగా దేశ ప్రజలందరి దృష్టి ఇప్పుడు డోక్లామ్ ఆకర్షిస్తోంది. సిక్కిం సరిహద్దుల్లో ఉన్న ఈ ప్రాంతంలో ట్రై జంక్షన్ ఉంది. చైనా, భూటాన్, సిక్కిం సరిహద్దు భూభాగాల కూడలి ప్రాంతమైన డోక్లామ్ గుండా మహామార్గాన్ని నిర్మించేందుకు చైనా సాగిస్తున్న యత్నాలకు మొదట భూటాన్ అడ్డు చెప్పింది. చైనా నిర్మించ తలపెట్టిన మహామార్గం డోక్లామ్ మీదుగా వస్తుంది. తన సరిహద్దుల్లోనే ఈ మార్గాన్ని నిర్మిస్తున్నట్టు చైనా చెబుతున్నప్పటికీ, అది భారత్, భూటాన్ భూ భాగాల్లోకి చొచ్చుకు వస్తోంది. దీనిపై ఇప్పుడు చైనాకూ, మన దేశానికీ మధ్య మాటల యుద్ధం సాగుతోంది. భూటాన్ కూడా తన అభ్యంతరాలను గతంలో కన్నా బహిరంగంగానే చెబుతోంది.

సిక్కింలో కూడా: డోక్లామ్‌లో ఉద్రిక్తత ప్రభావం సిక్కింలోని సరిహద్దు గ్రామాల్లో కూడా కనిపిస్తోంది. చైనా సైనికుల మోహరింపుతో మన సైనికులు కూడా అప్రమత్తమయ్యారు. సిక్కిం సరిహద్దుల్లో మన వైపు మన సైనికులు మోహరించారు. దీంతో గ్రామాల్లో పరిస్థితి బిక్కుబిక్కు మనే రీతిలో ఉంది. ఏ సమయంలో సైనిక దళాలు వచ్చి పడతాయోనని నిత్యం భయంతో సరిహద్దు గ్రామాల ప్రజలు గడుపుతున్నారు. సిక్కింకి డార్జిలింగ్ తాకిడి కూడా ఎక్కువగా ఉంది. గూర్ఖాలకు ప్రత్యేక రాష్ట్రం కావాలన్న డిమాండ్‌పై డార్జిలింగ్‌లో సాగుతున్న ఆందోళన హింసాత్మకంగా పరిణమించింది. ఈ ఆందోళనల కారణంగా డార్జిలింగ్ నుంచి గ్యాంగ్‌టక్ వెళ్లే వాహనాల రాకపోకలకు తరచూ ఆటంకం కలుగుతోంది. దాంతో సిక్కింకి నిత్యావసర వస్తువుల రవాణా స్తంభించి పోతోంది. ఈ విషయమై ముఖ్యమంత్రి పవాన్ చామ్లింగ్ బహిరంగంగానే ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పుడు చైనా చొరబాటుయత్నాల కారణంగా కూడా సిక్కిం సరిహద్దు గ్రామాల ప్రజలు నిత్యావసరాలకు ఇబ్బందులు పడుతున్నారు, ప్రభుత్వం నుంచి వారికి సరైన సహాయం లభించడం లేదు. ప్రజల కష్టాల గురించి వివరించే సందర్భంలో ముఖ్యమంత్రి చామ్లింగ్ చేసిన వ్యాఖ్యలు తీవ్రంగా ఉన్నాయి. ఇలా కష్టాలు పడటానికేనా మేం భారత్‌లో విలీనమైందంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు కేంద్ర ప్రభుత్వానికి హెచ్చరిక వంటివే. సరిహద్దు గ్రామాల్లో ప్రజలు పౌరహక్కులు లేక నిత్యం ప్రాణభయంతో బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు.

-ఎ.పి. స్వామి

ఏక్ నిరంజన్

మనమంతా ఈ లోకంలోకి ఒంటరిగానే వచ్చాం. ఒంటరిగానే పోతాం. ఈ భూమిపై కళ్లు తెరిచాకే బంధాలు, బాంధవ్యాలు ఏర్పడ్డాయి.

పుట్టగానే తల్లితో పేగుబంధం మొదలవుతుంది. ఆ తర్వాత ఆ బంధం తండ్రితో మారాకు వేస్తుంది. ఇక అక్క, అన్న, చెల్లి, తమ్ముడు, అత్త, మామ, తాత, అమ్మమ్మ, బామ్మ - ఇలా విస్తరిస్తూ బాంధవ్యాల తీగ అల్లుకుపోతుంది. వయసు పెరుగుతున్న కొద్దీ మరిన్ని సరికొత్త బంధాలు ఏర్పడతాయి. స్కూల్లో చేరినప్పటి నుంచి కొత్త స్నేహితులు ఏర్పడతారు. గురువులు జ్ఞానజ్యోతులు వెలిగించి బతుక్కు బాసట అవుతారు.

పెళ్లాయ్యాక వియ్యాలవారితో బంధం బలపడి పరిధి పెరుగుతుంది. మనం సంఘజీవులం. ఈ సమాజాన్ని వీడి ఒంటరిగా బతుకు వెళ్లదీయడం దుర్లభం. ఏ కాకులు దూరని కారడవికో వెళ్లి కాలక్షేపం చేద్దామంటే కొద్దిరోజుల వరకు పర్లేదేమో కానీ ఎల్లకాలం ఇలా ఎల్లలు దాటి బతకలేం.

ఈ సమాజంలో మనల్ని ప్రేమించే వారుంటారు. ద్వేషించే వారుంటారు. దగ్గరకు తీసే వారుంటారు. ఏవో కారణాలతో దూరం పెట్టేవారుంటారు. అవసరానికి వాడుకుని అవతల పెట్టేవారు. ఏ అవసరమూ లేకున్నా అవ్యాజమైన ప్రేమ కురిపించే వారు ఉంటారు. మన చుట్టూ మన వారున్నారన్న భావనే గొప్ప భరోసా ఇస్తుంది. కొండంత అండ దొరికినట్లనిపిస్తుంది.

టెక్నాలజీ వల్ల మనుషుల మధ్య దూరాలు తగ్గాయి. అమెరికాలోని వారి తోనూ వాట్సప్ కాల్స్‌తో గంటలకొద్దీ ఎదురెదురుగా కూచున్నట్లు మాట్లాడుకోగలుగుతున్నారు. దురదృష్టవశాత్తు, ఇవన్నీ మనుషులను మానసికంగా దగ్గర చేయడంలో ఎందుకూ కొరగాకుండా ఉన్నాయి.

పలు రకాల కారణాలతో మనుషుల మధ్య దూరాలు పెరిగి అందరి మధ్యలో ఉండీ, మానసికంగా ఒంటరిగా మిగిలిపోతున్నాడు.

తరాల అంతరాలు తల్లిదండ్రులకు పిల్లలనూ మధ్య పూడ్చలేని అగాధాలను మిగుల్చుతున్నాయి. ఉమ్మడి కుటుంబాలు అంతరించి ఎవరికి వారు వేరు కాపురాలు పెట్టడంతో తల్లిదండ్రులు బిక్కు బిక్కుమంటూ ఒంటరిగా కాలక్షేపం చేయవలసి వస్తోంది.

రక్తం పంచుకు పుట్టిన బిడ్డలతో హాయిగా మనసు విప్పి మాట్లాడుకోవాలన్నా సాధ్యం కావడంలేదు. వృద్ధాశ్రమాల ముంగిట్లో పిల్లల తలపుల్లో రోజులు దొర్లించేస్తున్నారు. వృద్ధ తల్లిదండ్రుల్లో ఎవరో ఒకరు కాలం చేస్తే ఆ ఒక్క ఆపేక్ష కురిపించే దిక్కులేక తల్లడిల్లుతున్నారు.


ఇద్దరి మధ్య పొసగక విడాకులు తీసుకుంటున్న వారి సంఖ్య ఇటీవలి కాలంలో పెరగడం ఆందోళన కలిగిస్తోంది. భర్త నుంచి విడిపోయి, ఉద్యోగాలు చేసుకుంటూ పిల్లల బాధ్యత చూసుకునే ఒంటరి తల్లుల వెతలు అన్నీ ఇన్నీ కావు.

మరోపక్క పలు కారణాల వల్ల పెళ్లీడు వయసులో శ్రద్ధ పెట్టకపోవడంతో చాలామంది యువతీయువకులు పెళ్లి చేసుకోకుండా ఒంటరి జీవితాలకే అంకితమవుతున్నారు.

మగవాడు ఏ వయసులో పెళ్లికి సిద్ధపడ్డా కిక్కురుమనని ఈ సమాజం ఆడపిల్లకు ముప్పై ఏళ్లు దాటితే సవాలక్ష కారణాలను వెదుకుతోంది. ఇదొక విషాదం.

విదేశీ చదువులనీ, ఉద్యోగాలనీ ఉన్న ఊరిని, కన్నవారినీ విడిచి ఖండాంతరాలకు వెళ్లాల్సి వస్తోంది. కొత్తచోట సరికొత్త బంధాలు చిగురించే వరకూ ఒంటరిత నం వెంటాడుతూనే ఉంటుంది. రోజూ ఫోన్లలో మాట్లాడుతూ నే ఉన్నా ఎదురుగా ఉంటే లభించే భరోసా కరువవుతోంది.

కుటుంబ సభ్యులందరూ ఒకే కప్పు కింద కలిసి ఉంటున్నా ఒకరి కొకరు పట్టకుండా ఎవరి లోకంలో వారు గడపటం ఈ కాలపు వైచిత్రి. కలిసి గడిపే సమయమే కుంచిం చుకు పోతోంది. ఆ కొద్ది సమ యంలో నూ హాయిగా మనసు విప్పి మాట్లాడుకునే అవకాశాలే ఉండ టంలేదు. ఎవరికి వారు స్మార్ట్ ఫోన్లతో తలవంచుకుని క్షణం తీరుబడి లేకుండా గడిపేస్తున్నారు.



మునుముందు రోజుల్లో ఒంటరిత నం సమస్యలు మరింత పెరిగే ప్రమాదా లున్నాయి. కనుక అందరూ ఉండీ మానసి కం గా ఏకాకిగా గడపటానికి సన్నద్ధులు కాక తప్పదు. ఒంటరితనం ఒక్కోసారి కుంగుబాటుకూ దారితీయవచ్చు. అనాలోచిత నిర్ణయాలకూ కారణ మవ్వచ్చు. ఒంటరిగానూ ఆనందంగా జీవించే మార్గాలను కనుగొనాలి. ఎక్కడికక్కడ కొత్త స్నేహాలను చిగురింపచేయాలి. కె.ఎల్.రెడ్డి అనే జర్నలిస్టు పెద్దాయనకు 85 ఏళ్ల వయసు. ఆయనది కొన్ని దశాబ్దాలుగా ఒంటరి జీవనం. అయినా ఆయన జీవనాసక్తిని కోల్పోలేదు. పడుతూ లేస్తూ ఇప్పటికీ వారానికి రెండు మూడు సినిమాలు చూస్తారు. తన వంటతానే చేసుకుంటారు. మిత్రులతో ఉల్లాసంగా కబుర్లు చెబుతారు.

ఎవరున్నా లేకున్నా ఎవరి బతుకు వారు బతకాల్సిందే గదా? ఎవరినడక వారే నడవాలి. ఎవరి తిండి వారే తినాలి. ఎన్ని కోట్లకు వారసులైనా మీ బాధను మరొకరు మోయరు.

ముఖేష్ అంబానీ కుమారుడు అనంత్ అంబానీ 18 నెలల్లో కఠిన పరిశ్రమతో 108 కిలోల బరువు తగ్గి ఆదర్శం గా నిలి చాడు. రోజూ 21 కిలో మీటర్లు నడిచాడు. జిమ్‌లో ఐదారు గంటల గడిపాడు. కోట్ల సంపదకు వారసుడైనా ఒళ్లు తగ్గించు కోవడం కోసం ఒంటరిగా తానొక్కడే కష్టపడక తప్పలేదు.

యాపిల్ కంపెనీ సృష్టికర్త స్టీవ్‌జాబ్స్ అనారోగ్యంతో ఆస్పత్రిలో ఉండి ఆఖరి రోజుల్లో డైరీలో రాసుకున్న మాటలు మనల్ని ఆలోచింపచేస్తాయి.

రోగంతో బాధపడుతూ ఆస్పత్రిలో పడుకున్న మంచం ఈ ప్రపంచంలో అత్యంత ఖరీదైన మంచం. నీ కారు నడపటానికి డ్రైవరును నియమించుకోగలవు. నీకోసం సంపాదించి పెట్టే ఉద్యోగులను నియమించుకోగలవు. కానీ నీ జబ్బునూ నీ బాధనూ అనుభవించే వ్యక్తిని మాత్రం ఎన్నికోట్లు పెట్టినా నువ్వు ఏర్పాటు చేసుకోలేవు. ఈ ప్రపంచంలో ఎవడి కష్టంవాడు పడాల్సిందే. ఎవరి నొప్పివారు భరించాల్సిందే. ఎవరి మాత్ర వారు మింగాల్సిందే.మిమ్మల్ని వీడి ఎవరైనా వెళ్లిపోతే వారిని వెళ్లనివ్వండి. మీ జీవితం వారితోనే ముడిపడి లేదు. మీ జీవితంలో వారిపాత్ర ముగిసిందని అనుకోవాలి.

అందరూ ఉన్నా లేకున్నా ప్రయాణం మాత్రం ఒంటరిగా సాగించక తప్పదన్న వాస్తవం గుర్తిస్తే చాలు. మనల్ని ఎవరో విడిచి వెళ్లారన్న బాధ మిగలదు.

ఎవరున్నా లేకున్నా రెండు చేతులనూ జేబులో పెట్టుకుని ఉత్సాహంగా నడవడం మొదలుపెట్టండి.

1970 లలో దివిసీమపై పెనుతుపాను విరుచుకుపడింది. వేల సంఖ్యలో ప్రాణాలు కోల్పోయారు. అపారనష్టం వాటిల్లింది. ఆ ఉపద్రవం నుంచి తేరుకోవటానికి చాలా సమయం పట్టింది. ఆ ఉప్పెనలో ఒక మత్స్యకారుడు, భార్యాబిడ్డలను, ఇంటిని, పడవను, వలలను సమస్తం కోల్పోయి ఒంటరిగా మిగిలాడు. అతడి విషాద గాథను పత్రికలన్నీ ప్రముఖంగా ప్రచురించాయి. ఏడాది గడిచింది. ఉప్పెన చేదు జ్ఞాపకాలను నెమరువేస్తూ కథనాలు ఇవ్వటానికి పాత్రికేయులు రంగంలోకి దిగారు. అందులో భాగంగా ఆ గ్రామానికీ వెళ్లారు. ఆ మత్స్యకారుడి కోసం వాకబు చేసి కలుసుకోగలిగారు.

ఈ ఏడాది కాలంలో అతడు మరో పెళ్లి చేసుకున్నాడు. పిల్లవాడికి జన్మనిచ్చాడు. గుడిసె వేసుకున్నాడు. పడవను కొన్నాడు. వలలూ సమకూర్చుకున్నాడు. యధావిధిగా చేపల వేటకు వెళ్లివస్తున్నాడు. అతడి బతుకు మళ్లీ చిగురించింది.

ఎంతటి గాఢాంధకారంలోనైనా వెలుతురు వేచి ఉంటుందన్న సత్యాన్ని ఈ సంఘటనే రుజువు చేస్తోంది.

ధైర్యం చేసి ఒంటరిగా ముందుకు సాగుతుంటే నిన్ను అనుసరించి వచ్చేవారు ఉంటారు అని ఇందిరాగాంధీకి నెహ్రూ సలహా ఇచ్చారు.

ఒంటరితనాన్ని ఒంటరిని చేయండి. మీ మనసు లోంచి ఒంటరి భావనను తరిమికొట్టండి.

ఇంతకీ జగమంత కుటుంబంలో ఏకాకి జీవితం గడపగల సన్నద్ధతలో మీరున్నారా?

-గోవిందరాజు చక్రధర్

98498 70250

ప్రసూన్ జోషీ... థండా కా మతలబ్



ఆగస్టు 11వ తేదీన కేంద్రం చేసిన ఓ నియామకం అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది. వివాదాస్పద నిర్ణయాలతో చికాకు పెట్టిన పహ్లాజ్ నిహలానీని కేంద్ర ప్రభుత్వం వదిలించుకుంది. ఆయన స్థానంలో సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సిబిఎఫ్‌సి) అధ్యక్షునిగా ప్రసూన్ జోషీని నియమించింది. జోషీ ప్రముఖ కవి మాత్రమే కాక, సినీ గీత రచయిత, స్క్రీన్ ప్లే రచయిత కూడానూ. ప్రకటనల రంగంలోనూ ఆయనకు విశేష అనుభవముంది. పహ్లాజ్ 2015 జనవరి నుంచి ఈ పదవిలో ఉన్నారు. ఆయన తొలగింపుతో సినీ పరిశ్రమ ఊపిరిపీల్చుకుంది. అదే సమయంలో ప్రసూన్ జోషీ నియామకాన్ని మనసారా, రెండు చేతులూ చాస్తూ ఆహ్వానించింది.


టీనేజిలోనే పుస్తక రచన

1971 సెప్టెంబర్ 16న జన్మించిన ప్రసూన్ జోషి మెకేన్న్ వరల్డ్ గ్రూప్ ఇండియాకు సిఇఓగా వ్యవహరిస్తున్నారు. మెకాన్ ఎరిక్సన్ సంస్థకు అనుబంధంగా ఉన్న ఆసియా పసిఫిక్‌కు ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఉత్తరాఖండ్‌లోని అల్మోరా విద్యాభ్యాసం పూర్తిచేసుకున్నారు. ఆయన తండ్రి డికె జోషి, పౌర సరఫరాల శాఖలో పనిచేశారు. అనంతరం, ఉత్తరాఖండ్ రాష్ట్ర విద్యా సర్వీసుల డైరెక్టరుగా బాధ్యతలు స్వీకరించారు. తల్లి సుష్మా జోషి రాజకీయ శాస్త్ర అధ్యాపకురాలు. ఆకాశవాణికి మూడు దశాబ్దాల పాటు సేవలందించారు. గాత్ర సంగీతంలో ప్రావీణ్యత గడించడంతో తల్లిదండ్రులు ప్రసూన్‌ను ప్రోత్సహించారు. అతని 17వ ఏటనే ఒక పుస్తకాన్ని ప్రచురించాడు. మై ఔర్ ఓ అనే పేరుతో ఆయనీ గ్రంథాన్ని రచించారు. ఫ్రెడరిక్ నీజెష్ రచన దజ్ స్పోక్ జరాతుస్త్ర కు ఆయన ప్రభావితుడై ఈ గ్రంథాన్ని రచించారు. తనతో తాను చర్చించుకున్న అంశాలను ఇందులో క్రోడీకరించారు. ఆయన పాటలను కూర్చి సన్‌షైన్ అనే పుస్తకాన్ని తాజాగా ప్రచురించారు. జైపూర్ లిటరేచర్ ఫెస్టివల్ సందర్భంగా 2013 జనవరిలో దీనిని ఆవిష్కరించారు. ఫిజిక్స్‌లో పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన అనంతరం, ఘజియాబాద్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ టెక్నాలజీ నుంచి ఎమ్బీఏ పట్టా పుచ్చుకున్నారు. ప్రకటనల రంగాన్ని ఎంచుకున్నారు.

థండా మతలబ్ యాడ్‌కు కేన్స్ అవార్డ్

ఒగిల్వీ అండ్ మేథర్ కంపెనీలో ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు. పదేళ్ళ అనంతరం ఆయన ముంబై కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ క్రియేటివ్ డైరెక్టర్‌గా పదోన్నతిని పొందారు. 2002లో మెకేన్ ఎరిక్సన్‌లో ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్‌గా నియమితులయ్యారు. 2006లో ఆసియా పసిఫిక్ గ్రూపునకు క్రియేటివ్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. అమీర్‌ఖాన్‌తో రూపొందించిన థండా మతలబ్ కోకోకోలా అనే ప్రకటన ఆయనకు కేన్స్ అవార్డును తెచ్చిపెట్టింది. ఎన్డీటీవీ రూపొందించిన సచ్ దిఖాతే హై తుమ్ జోషీ రూపకల్పనలో ప్రధానమైన వాటిలో ఒకటి. ఇండియా రైజింగ్ అంటూ సిఎన్ఎన్ అండ్ ఐబిఎస్ రూపొందించిన ప్రకటనకు ఆయన గీతాలను రచించారు. ఫన్నా, రంగ్ దే బసంతి, తారే జమీన్ పర్, బ్లాక్, ఢిల్లీ 6 చిత్రాలకు పనిచేశారు. రంగ్ దే బసంతితో ఆయన సంభాషణల రచయితగా మారారు. 2007, 2013 సంవత్సరాలలో తారే జమీన్ పర్, చిట్టగాంగ్ చిత్రాలకు జాతీ అవార్డులు లభించాయి. ఫనా చిత్రంలో చాంద్ సిఫారిష్ అనే పాటకు 2007లో ఫిల్మ్‌ఫేర్ ఉత్తమ రచయితగా ఎంపికయ్యారు. భాగ్ మిల్ఖా భాగ్ చిత్ర రచయితగా కూడా పనిచేశారు. 2015లో ఆయనను పద్మశ్రీ అవార్డు వరించింది. వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ ఆయనను 2006లో యంగ్ గ్లోబల్ లీడర్‌గా ఎంపిక చేసింది. 2010 కామన్‌వెల్త్ క్రీడల క్రియేటివ్ అడ్వైజరీ కమిటీలో సభ్యునిగా వ్యవహరించారు. తన కెరీర్‌లో జోషీ మొత్తం 200కు పైగా జాతీయ అంతర్జాతీయ అవార్డులను గెలుచుకున్నారు.


పూణే మహిళకు మోడీ ప్రశంస



ఎవరికైనా ఒక్కొక్క మానస పుత్రిక ఉంటుంది. వారే పనిలో ఉన్నా ఆ పని గురించే ఆలోచిస్తూ ఉంటారు. స్పందిస్తూ ఉంటారు. మన ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అందుకు అతీతుడేం కారు. ఆయనకూ ఓ మానస పుత్రికుంది.. అదే స్వచ్ఛ్ భారత్. నిరంతరం ఆయన తలపు దానిపైనే. మన్ కీ బాత్ ప్రతి కార్యక్రమంలోనూ ఆయన కచ్చితంగా ఆ కార్యక్రమం గురించి ప్రస్తావిస్తారు. తాజాగా ఆయనొక మహిళకు లేఖ రాశారు. పూణేకు చెందిన ప్రాచీ దేశ్ పాండే చేపట్టిన కార్యక్రమం ప్రధానికి విపరీతంగా నచ్చేసింది. తన మేడపై ప్రాచీ జీవ ఎరువులతో కాయగూరలు పండిస్తున్నారు. ఇందుకు అవసరమైన ఆర్గానిక్ ఎరువులను పొరుగు ఇళ్ళ నుంచీ, దేవాలయాల్నుంచీ ఆమె సేకరిస్తున్నారు. ఆ రకంగా పరిసరాల పరిశుభ్రతతో పాటు ఆర్గానిక్ ఫార్మింగ్ చేస్తున్న ప్రాచీ విజ్ఞత నరేంద్ర మోడీని ఆకట్టుకుంది. అందుకే ఆమె చేస్తున్న పనిని ప్రశంసిస్తూ నరేంద్ర భాయ్ మోడీ తన బెహన్‌కు లేఖ రాశారు. ప్రాచీ ప్రయత్నం సమాజంలో మంచి మార్పును తెస్తుందని ఆయన అందులో రాశారు. ప్రధాని నుంచి లేఖొచ్చిందంటే ఎవరికైనా సంతోషమే కదా!

భూముల లెక్క.. ఇక పక్కా

- ప్రక్షాళన దిశగా సర్కార్ అడుగులు
- గ్రామం యూనిట్‌గా భూముల సర్వే
- పూర్తి వివరాలతో ఆన్‌లైన్‌లో నమోదు
- ఆ తర్వాతనే ఈ-పాస్ పుస్తకాల పంపిణీ



నల్గొండ, కెఎన్ఎన్ బ్యూరో : భూముల రికార్డులన్నింటినీ ప్రక్షాళన చేయాలి.. ఏ భూమి ఎవరి పేరుతో ఉందో నిజం నిగ్గు తేల్చాలి.. భూముల అమ్మకాలు, కొనుగోళ్ళు పారదర్శకంగా ఉండాలి.. పట్టాదారు పాసుపుస్తకాలు, పహానీ పత్రాలు సరళంగా ఉండాలి.. భూముల లెక్క గందరగోళానికి తెరదించాలి.. బ్యాంకుల్లో లావాదేవీలు పారదర్శకంగా జరగాలి.. భూముల లెక్క తేల్చేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించండి.. అని ఉన్నతస్థాయి సమీక్షలో సీఎం కేసీఆర్ ఆదేశం.


ఎకరాకు 8వేల రూపాయలు ఎరువులు ఉచితం.. పంట రుణాల మాఫీ.. రైతన్నకు బ్యాంకుల్లో రుణాలు.. ఇలా సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతున్నారు. పెట్టబోతున్నారు. సంక్షేమ పథకాలు పకడ్బందీగా అమలు చేసేందుకు రైతు సమగ్ర సర్వే చేపట్టారు. జిల్లాలో దాదాపు పూర్తయ్యింది. అంతే కాకుండా నిజమైన లబ్ధిదారులతో పాటు భూముల లెక్కను తేల్చేందుకు ప్రభుత్వం సన్నద్ధమైంది. గ్రామం యూనిట్‌గా భూములన్నింటిని సర్వే చేసి ఎవరిపేరుతో ఎంత భూమి ఉంది? ఏ సర్వే నెంబర్‌లో ఎంత? రికార్డుల్లో ఎలా ఉంది? పహానీలో ఎలా ఉంది? కంప్యూటర్‌లో పేరు ఎవరిది చూపిస్తుంది? తదితర వివరాలు సేకరించి ఆన్‌లైన్‌లో పొందుపర్చనున్నారు. దీంతో భూముల లెక్క పక్కాగా తేలిపోనుంది. అంతే కాకుండా క్రయవిక్రయాల తగాదాలు తగ్గిపోవడం.. లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందనున్నాయి.

అయితే 80 ఏళ్ళక్రితం జరిగిన భూముల లెక్కలే ఇప్పుడు నడుస్తున్నాయి. దీంతో మరోసారి భూముల పూర్తిస్థాయి సర్వేతో అన్ని వివరాలు తేలిపోనున్నాయి. ఆ వివరాలన్నింటిని డేటాతో సహా కంప్యూటర్‌లో పొందుపర్చనున్నారు. ఆ తర్వాత ఆ సమాచారం ఆధారంగా రైతులకు ఈ-పాస్ పుస్తకాలు పంపిణీ చేయనున్నారు. అయితే భూముల సర్వేకు ప్రభుత్వం ఆదేశించడంతో అధికార యంత్రాంగం కదులుతోంది. ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు రాగానే ఒక్కొక్క గ్రామాన్ని యూనిట్‌గా తీసుకొని ఆ గ్రామంలోని భూములు ఎన్ని? పట్టాదారులెందరు? ఎన్ని సర్వే నెంబర్లు? ఎవరెవరి పేరుతో ఉన్నాయనే వివరాలు తేలిపోనున్నాయి. సీఎం కేసీఆర్ ఉన్నత స్థాయి సమీక్షలో అధికారులకు దిశానిర్ధేశం చేయడంతో ఆ వైపు అడుగులువేస్తున్నారు.

నల్గొండ జిల్లాలో 31 మండలాలు.. 566 రెవెన్యూ గ్రామాలు.. 275 క్లస్టర్ గ్రామాలు ఉన్నాయి. వాటి పరిధిలో 2,05,256 సర్వే నెంబర్లు.. 5,67,406 మంది పట్టాదారులు.. 15,69,894 హెక్టార్ల మొత్తం భూమి ఉంది. ప్రస్తుత లెక్కల ప్రకారం భూముల లెక్క ఇది. కానీ క్రయవిక్రయాలు జరగడం.. ఒకరి భూములు మరొకరు కొనుగోలు చేసినా వారి పేర్లపై పాసు పుస్తకాలు పొందకపోవడం.. తదితర భూతగాదాలు ఉన్నాయి. అధికారులు సర్వే చేసి లెక్కలతో తేలిస్తే అన్నింటికి పరిష్కారం జరగనుంది. అంతే కాకుండా ప్రభుత్వం పంపిణీ చేయాలనుకున్న ఖరీఫ్, రబీ కలిపి ఎకరాకు 8వేల రూపాయలు ఎరువులు ఉచితం పథకం సక్రమంగా అమలు చేయడం కూడా సాధ్యమవుతుంది.

అంతే కాకుండా బ్యాంకుల్లో నకిలీ పాస్ పుస్తకాలతో కోట్ల రూపాయల లోన్లు తీసుకుంటున్నారు. వీటన్నింటికి కూడా చెక్‌పెట్టినట్లు అవుతుంది. అన్నింటిని పరిగణలోకి తీసుకున్న తర్వాతనే ప్రభుత్వం భూముల సమగ్ర సర్వేకు ఆదేశించిందని అధికారులు చెప్తున్నారు. ఏది ఏమైనా గ్రామం యూనిట్‌గా భూముల సర్వే చేయడంతో లెక్క తేలిపోనుంది.

రుణ విమోచన కమిషన్ ఏర్పాటు ఎప్పుడు?



హైదరాబాద్, ఆంధ్రప్రభ : రైతుల ఆత్మహత్యలు నివారించే నిమిత్తం వ్యవసాయ నిపుణులతో తెలంగాణ రాష్ట్ర రుణ విమోచన కమిషన్‌ను ఎప్పుడు ఏర్పాటు చేస్తారో చెప్పాలని హైకోర్టు తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించింది. చిన్న, రైతులు, వ్యవసాయ కూలీల సంక్షేమం కోసం నిబంధనల మేరకు ఈ కమిషన్‌ను తప్పనిసరిగా ఏర్పాటు చేయాల్సి ఉంటుందని హైకోర్టు స్పష్టం చేసింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ జె.ఉమాదేవిలతో కూడిన డివిజన్ ఇటీవల ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ ఈ నెల 16 కు వాయిదా వేసింది. రాష్టంలో రైతుల ఆత్మహత్యలు నివారించేందుకు రుణ విమోచన కమిషన్ ఏర్పాటు చేసేలా తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించాలని అభ్యర్థిస్తూ భాజపా జాతీయ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే ఎన్. ఇంద్రసేనారెడ్డి హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యాన్ని దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా పిటిషనర్ తరపు న్యాయవాది వై.బాలాజీ వాదనలు వినిపిస్తూ...రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, ముఖ్యంగా ఆర్థిక ఇబ్బందుల గురించి ఈ కమిషన్ ముందు ప్రస్తావించే వెసులుబాటు ఉంటుందన్నారు. రైతుల దావాలపై తీర్పులను వెలువరించేందుకు ఈ కమిషన్‌కు అధికారం ఉంటుందన్నారు. పైగా పరిహారం చెల్లించాలని ప్రభుత్వానికి సిఫారసు చేసే అధికారం కూడా ఈ కమిషన్ కు ఉంటుందని విన్నవించారు.రాష్ట్రంలో ఈ కమిషన్ లేకపోవడం వల్ల రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారని నివేదించారు. అందువల్ల వెంటనే తెలంగాణ రాష్ట్ర రుణ విమోచన కమిషన్ ఏర్పాటు చేసేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని అభ్యర్థించారు.

గంజాయి ముఠా అరెస్టు

- మహిళ సహా ముగ్గురి అరెస్టు




హైదరాబాద్ (మోండా), కెఎన్ఎన్ : ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ రైల్లో గంజాయి తరలిస్తున్న ఓ ముఠాకు చెందిన ముగ్గురు నిందితులను సికింద్రబాద్ రైల్వే పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వీరివద్ద నుంచి 15 లక్షల విలువ చేసే 100 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఎస్‌పి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఇంచార్జీ ఎస్‌పి రాజేంద్రప్రసాద్ కేసు వివరాలను వెల్లడించారు. ఒడిషా రాష్ట్రానికి చెందిన బిద్యా సాగర్(25) స్థానికంగా వ్యవసాయం చేస్తుంటాడు. సులువుగా డబ్బు సంపాదించాలన్న ఆలోచనతో అక్రమ మార్గాన్ని ఎన్నుకున్నాడు. గంజాయి సరఫరా చేసే వ్యక్తులతో పరిచయం పెంచుకుని, గంజాయి అక్రమ రవాణాకు పూనుకున్నాడు. ఇందులో భాగంగానే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖపట్టణం దుమురుగూడెం గ్రామానికి చెందిన అక్కా, తమ్ముడు ఎం.బబిత(25), ఎం.సునిల్‌కుమార్‌లకు కమీషన్ ఆశచూపి వారితో కలసి శనివారం విశాఖ నుండి షోలాపూర్ వెల్లే ఎల్‌టిటి రైల్లో వంద కిలోల గంజాయిని తరలిస్తున్నాడు. రైలు సికింద్రబాద్ స్టేషన్‌కు చేరుకోగానే రోజూవారి తనిఖీలు చేస్తున్న పోలీసులకు వీరి ప్రవర్తన పట్ల అనుమానం కలిగి సోదా చేయగా అసలు నిజం బయటపడింది. కేసులు మందు చూపుతో వ్యవహరించిన ఎస్.చంద్రయ్య, బి. ప్రమోద్ కుమార్, వీరేశలింగంలతో పాటు సిబ్బందిని ఇంచార్జీ ఎస్‌పి రాజేంద్రప్రసాద్ అభినందించారు.

ఉన్నత చదువులు చదివి...

కేసులో నిందితురాలిగా ఉన్న విశాఖపట్టణం వాసి ఎం.బబితది నిరుపేద కుటుంబం..ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి ఆమె ఎంఎ, బిఇడి వరకు చదివింది. ఇంకా ఉన్నత చదువులు చదువాలన్న బలమైన కోరిక ఉండటం, ఇందుకు కుటుంబ ఆర్థిక పరిస్థితులు అడ్డుకావడంతో ఎలాగైన చదువుకోవాలన్న తపనతో అక్రమ మార్గం తొక్కింది. కమీషన్‌కు ఆశపడి గంజాయి రవాణా ముఠాతో చేతులు కలిపింది. గంజాయి తరళిస్తూ పోలీసులకు అడ్డంగా దొరికి తన బంగారు భవిష్యత్‌ను చీకటి చేసుకుంది. ఇలాంటి మోసగాళ్ళ మాయలో పడి భవిష్యత్‌ను ఫణంగా పెట్టవద్దని ఇంచార్జీ ఎస్‌పి రాజేంద్రప్రసాద్ యువతకు సూచించారు.

గ్రంథాలయాల పాత్ర గణనీయం

- ఉద్యోగులకు 010 పద్దు కింద వేతనాలు: డిప్యూటీ సీఎం కడియం



హైదరాబాద్,ఆంధ్రప్రభ : స్వాతంత్ర్య ఉద్యమంలో గ్రంధాలయాల పాత్ర ఎంతో ఉన్నదని డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి పేర్కొన్నారు. గ్రంధాలయాలను కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఆయన సూచించారు. రాష్టంలోని అన్ని జిల్లాలలో గ్రంధాలయాలకు పూర్వ వైభవాన్ని తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని ఆయన తెలిపారు. శనివారం రవీంద్ర భారతిలో జరిగిన గ్రంధాలయం ఆవిష్కరన దినోత్సవం సందర్భంగా కడియం మాట్లాడారు. సాంకేతిక పరంగా ఎంత ముందుకెళ్లినా పుస్తకానికున్న ఆధరణ ఏమాత్రం తగ్గదని కడియం చెప్పారు. జిల్లాలోని గ్రంధాలయాలకు సొంత భవనాలు, మౌలిక వసతులు, పుస్తకాలను సమకూర్చే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టనుందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పని చేస్తున్న గ్రంధాలయాల ఉద్యోగులకు 010 పద్దు కింత వేతనాలు ఇచ్చే విషయం సీఎం చంద్రశేఖర్‌రావు ఆలోచన చేస్తున్నారని శ్రీహరి వివరించారు. ఉద్యోగులకు న్యాయం జరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ విషయంపై సీఎం కేసీఆర్‌తో మరోసారి చర్చిస్తానని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమానికి గ్రంధాలయాల చైర్మన్ శ్రీధర్ అధ్యక్షత వహించగా ఎమ్మెల్యే మధన్‌రెడ్డి, దేశపతి శ్రీనివాస్ ఉద్యోగ సంఘాల నాయకులు దేవీప్రసాద్, కారెం రవీందర్‌రెడ్డి, మామిడాల హరికృష్ణతదితరులు హాజరై మాట్లాడారు.

విలువలతో కూడిన రాజకీయాలు రావాలి

- జేఏసీ చైర్మన్ ప్రొ. కోదండరాం



తూప్రాన్/హైదరాబాద్, కెఎన్ఎన్ : తెలంగాణ ప్రభుత్వం రాజకీయ ప్రయోజనాలపైనే ఆలోచన చేస్తున్నదని, ప్రజాస్వామ్యాన్ని మాత్రం పట్టించుకోవడం లేదని టీజేఏసీ చైర్మన్ కోదండరామ్ విమర్శించారు. జేఏసీ నిర్వహించిన యాత్రలు విజయవంతం అవుతుండటంతో ప్రభుత్వానికి భయం పట్టుకున్నదని ఆయన పేర్కొన్నారు. రాజకీయాలు సొంత ప్రయోజనాల కోసం ఉండకూడదని, విలువలతో కూడిన రాజకీయాలు అవసరమని కోదండరామ్ గుర్తు చేశారు. రాష్టంలో ప్రత్యామ్నాయ వేదిక అవసరమన్నారు. విపక్షాలు, ప్రజా సంఘాలు ఉమ్మడి పోరాటం చేసి ప్రభుత్వ దమనకాండను ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందన్నారు. కోదండరాం హైదరాబాద్ నుంచి జాతీయ రహదారి తూప్రాన్ మీదుగా నిజామాబాద్ సమావేశానికి వెళ్తుండగా మెదక్ జిల్లా, తూప్రాన్ మండలం అల్లాపూర్ టోల్‌గేట్ వద్ద ఆయనను పోలీసులు అరెస్టు చేసి నాటకీయ పరిణామాల మధ్య కౌడిపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం కోదండరాం టోల్‌గేట్ వద్ద విలేకరులతో మాట్లాడుతూ టీఆర్ఎస్ పార్టీ అధికార దుర్వినియోగం చేస్తున్నదని, నిజామాబాద్‌లో శనివారం బహిరంగసభ, ర్యాలీని రద్దు చేసుకుని, కేవలం ఒక హాల్‌లో జేఏసీ మీటింగ్‌కు వెళ్తున్న తనను పోలీసులు అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. మెదక్ జిల్లాసరిహద్దు మనోహరాబాద్ మండలం కాళ్లకల్ నుంచి ఐదు వాహనాల్లో పోలీసులు తమ ముందు వెనక వచ్చి టెర్రరిస్టుల మాది రిగా తనను అరెస్టు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. శుక్రవారం కామారెడ్డిలో జేఏసీ కార్యకర్తలపై దాడి చేసిన టిఆర్ఎస్ నాయకులను ఇప్పటి వరకు అరెస్టు చేయకపోవడం సమంజసం కాదన్నారు. తనకు ప్రభుత్వంపై ఎలాంటి కోపం లేదని, ఎందుకు అరెస్టు చేస్తున్నారో తెలపాలని పోలీసులతో వాగ్వాదానికి దిగారు. టిఆర్ఎస్ ప్రభుత్వం ఇసుక మాఫియా నడుపుతుందని, అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందన్నారు.

అరెస్టు అక్రమం


- షబ్బీర్, జీవన్‌రెడ్డి, మల్లు రవి



హైదరాబాద్, ఆంధ్రప్రభ : జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం యాత్రను అడ్డుకోవడం ప్రజాస్వామిక హక్కు లను కాలరాయడమేనని కాంగ్రెస్ పార్టీ ఆగ్రహం వ్యక్తం చేసింది. యాత్రకు అనుమతించి అర్ధాంతరంగా అరెస్టు చేయడం ద్వారా తమ రాజరిక దొరల పాలనను సీఎం కేసీఆర్ చాటుకున్నారని విమర్శించింది. మండలిలో విపక్ష నాయకుడు మహ్మద్ అలీ షబ్బీర్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లురవి, సీఎల్పీ ఉపనేత టీ జీవన్‌రెడ్డి ఒక ప్రకటనలో ప్రభుత్వ చర్యలను తీవ్రంగా ఖండించారు. కామారెడ్డిలో యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యుఐ ఇతర విద్యార్థులపై ఒక పథకం ప్రకారం టీఆర్ఎస్ గూండాలు దాడి చేసి కొట్టారని షబ్బీర్ అలీ మండిపడ్డారు. కోదండరాం సభకు వచ్చిన వారిని సైతం చితకబాదారని కర్రలు, రాళ్లతో కొట్టారని ఆరోపించారు. పోలీసులు కేసీఆర్ చెప్పినట్లు నడుచుకోవద్దనీ, తాము కూడా మంత్రులుగా పని చేశామని, ఇలాంటి పనులెప్పుడూ చేయలేదని విమర్శించారు. రాజ్యాంగం, చట్టం ప్రకారం బాధ్యతలు నిర్వహించండి తప్ప... టీఆర్ఎస్ కార్యకర్తలుగా వ్యవహరించి పోలీస్ శాఖ ప్రతిష్టను దిగజార్చవద్దని కోరారు.

మల్లు రవి మాట్లాడుతూ, రాష్టంలో రాజ్యహింస రోజురోజుకు పెరిగిపోతోందని, అందులో భాగంగానే పోలీసులు విచక్షణారహితంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రజా స్వామ్యంలో ధర్నాలు చేపట్టడం, యాత్రలు చేసే హక్కు ప్రతి పౌరుడికి ఉంటుందని, ఆ హక్కులను ప్రభుత్వం అణచివేస్తోందని ఆరోపించారు. కోదండరాం యాత్రను అడ్డుకోవడం దారుణమని సీఎల్పీ ఉప నేత టీ జీవ న్ రెడ్డి విమర్శించారు.

స్వైన్‌ఫ్లూతో బాలుడి మృతి



నల్లబెల్లి, కెఎన్ఎన్ : నెల రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఆరోగ్యం క్షీణించి బాలుడు మృతి చెందిన సంఘటన శనివారం వరంగల్ జిల్లా, నల్లబెల్లి మండలంలో జరిగింది. బాలుడి తల్లిదండ్రుల కథనం ప్రకారం గుండ్లపహాడ్ పంచాయతీ పరిధి గొల్లపల్లికి చెందిన బోయిని రాజు రేణుకల కుమారుడు బోయిని రుషి (5) నెల రోజుల క్రితం తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. బాలుడికి మెరుగైన వైద్యం అందించాలని హైదరాబాద్‌లోని రెయిన్ బో దవాఖానలో చేర్పించారు. శనివారం నాటికి సుమారు రూ. 25 లక్షలు వైద్య ఖర్చులు పెట్టామని తల్లిదండ్రులు తెలిపారు. చివరకు తమ కుమారుడు స్వైన్ ఫ్లూ వ్యాధి సోకి వైద్యం అందించినా లాభం లేకుండా పోయిందని తల్లిదండ్రులు రోదిస్తూ తెలిపారు. బాలుడి మృతితో గ్రామంలో విషాదం నెలకొంది.

జాతర సమీపిస్తున్నా అడుగు పడని అభివృద్ధి పనులు

- అంతర్జాతీయ స్థాయి జాతరకు ఆదరణ కరవు
- సమీక్షలు ముగిసేది ఎప్పుడు... పనులు ప్రారంభించేదెన్నడు?
- ఇప్పటికీ ప్రతిపాదనల దశలోనే జాతర పనులు
- టెండర్లు పూర్తిచేయరు... పనులు ప్రారంభించరు


మేడారం జాతర (ఫైల్ ఫొటో)

భూపాలపల్లి, కెఎన్ఎన్ : మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర సమీపిస్తున్నా భక్తులకు సౌకర్యాలు కల్పించేందుకు చేపట్టాల్సిన అభివృద్ధి పనులు అడుగు కూడా ముందుకు సాగడం లేదు. సంవత్సరం ముందే మహాజాతరకు సంబంధించిన అభివృద్ధి పనులను చేపడతామని పలుమార్లు జిల్లా మంత్రులు, అధికారులు ప్రకటనలు చేసినప్పటికీ కార్యరూపం దాల్చడం లేదు. రాష్ట్ర గిరిజన, పర్యాటక శాఖ మంత్రి అజ్మీరా చందూలాల్ రెండు నెలల క్రితం హైదరాబాద్‌లో వివిధ శాఖలకు చెందిన ప్రభుత్వ కార్యదర్శులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి ముందస్తుగానే జాతరలో అభివృద్ధి పనులు చేపట్టాలని వివిధ శాఖలకు చెందిన అధికారులందరు పూర్తి సహకారాన్ని అందించాలని ఆదేశించారు. జాతరలో రూ.140 కోట్లతో ఆరు నెలల క్రితం ప్రతిపాదనలు పంపితే నిధుల కేటాయింపులు తగ్గించాలని రాష్ట్ర ప్రభుత్వం తిప్పి పంపించింది. మళ్లీ నెల రోజుల గడువులో రూ.120 కోట్లతో తిరిగి ప్రతిపాదనలు పంపగా అప్పుడు కూడా ప్రభుత్వం ఆమోదించలేదు. దానితో రూ.100 కోట్లతో అధికారులు మూడవసారి ప్రతిపాదనలు పంపారు. ప్రతిపాదనలు పంపించిన ప్రతిసారి ఆమోదం పొందకుండా తిరిగిరావడంతో కాలయాపన జరిగిందే తప్ప జాతరలో అభివృద్ధి పనులను ప్రారంభించలేదు.

వాస్తవానికి జులై చివరి వారం నాటికి జాతర ప్రాంతంలో చేపట్టే శాశ్వత, తాత్కాలిక అభివృద్ధి పనులకు టెండర్లు పూర్తి చేసి ఆగస్టులో పనులు ప్రారంభించాలని ఇటీవల జిల్లా కలెక్టర్ ఆకునూరి మురళి అధ్యక్షతన జరిగిన సమావేశంలో నిర్ణయాలు తీసుకున్నారు. వివిధ శాఖలకు చెందిన అధికారులను ఆమోదించారు. అయినప్పటికీ అధికారుల్లో చలనం కనిపించలేదు. అభివృద్ధి పనులను ప్రారంభించిన దాఖలాలు కూడా లేవు. ఇలా అయితే ఎప్పటిలాగే జాతర ముందు హడావుడిగా పనులు చేపట్టి నాణ్యతకు తిలోదకాలు ఇవ్వాల్సి వస్తుంది. శ్రీసమ్మక్క-సారలమ్మ మహా మేడారం జాతర 2018 జనవరి 31 నుంచి ఫిబ్రవరి 3 వరకు జరగనుంది. జాతరకు మరో నాలుగు నెలల సమయం మాత్రమే మిగిలి ఉండడంతో కోటి మంది భక్తులు వచ్చే మహాజాతరలో సౌకర్యాలు కల్పించడం కష్టమే. ఈ సంవత్సరం జాతరలో చాలా అభివృద్ధి పనులను శాశ్వతంగా చేయాలని గత సమావేశాల్లో అధికారులు నిర్ణయం తీసుకున్నారు. అయితే మిగిలిన నాలుగు నెలల సమయంలో రోడ్ల నిర్మాణం, సబ్‌స్టేషన్, స్నానఘట్టాలు, శాశ్వత మరుగుదొడ్లు, ఇతర పనులను పూర్తిచేయడం కత్తిమీద సాము లాగా మారింది. జిల్లా కలెక్టర్ మురళి ప్రతి బుధవారం అధికారులతో సమీక్షసమావేశాలు నిర్వహిస్తున్నప్పటికీ అవి నామమాత్రంగానే మిగిలిపోతున్నాయి. మేడారం జాతరలో రవాణా, తాగునీటి వసతి, మరుగుదొడ్లు, స్నానఘట్టాలు, పార్కింగ్, విద్యుత్, వైద్య, క్యూలైన్ ఏర్పాట్లు తదితర వసతులన్నింటిని పకడ్బందీగా ఏర్పాటు చేయాల్సి ఉండగా అధికారులలో చితశుద్ధి కనిపించడంలేదు. అంతేకాకుండా ఇప్పటికే ఉన్న రహదారుల మరమ్మతు, నూతనంగా రోడ్లు వేయడం, పర్మినెంట్ మరుగుదొడ్ల నిర్మాణం, తాగునీటి పైప్‌లైన్, విద్యుత్ ఏర్పాట్లు, హెలిప్యాడ్ నిర్మాణం తదితర ఇంజనీరింగ్ శాఖల అధికారులు జాతరకు కేటాయించే సుమారు రూ.100కోట్ల నిధుల నుంచి ఖర్చు చేయాల్సి ఉంటుంది.



క్యాష్ కష్టాలు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ప్రజలు మళ్లీ నగదు కష్టాలు ఎదుర్కోనున్నారు. బ్యాంకులకు వరుసగా నాలుగు రోజులు సెలవులు రావడంతో ఇబ్బందులు రెట్టింపు అయ్యాయి. రెండో శనివారం, ఆదివారం, సోమవారం (కృష్ణాష్టమి), మంగళవారం (స్వాతంత్ర్య దినోత్సవం) సందర్భంగా బ్యాంకులు నాలుగు రోజులు మూత పడనున్నాయి. పెద్ద నోట్ల రద్దు తర్వాత నగరంలో 40 శాతానికి పైగా ఏటీఎంలు తెరుచుకోవడం లేదు. పనిచేస్తున్న ఏటీఎంలలో సైతం నగదు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్న దాఖలాలు తక్కువే. ఈ పరిస్థితుల్లో బ్యాంకులకు వరుస వెంబడి రోజుల సెలవులు రావడంతో నగరవాసుల్లో ఆందోళన తీవ్రమైంది. శుక్రవారం నుంచే చాలా ప్రాంతాల్లో ఏటీఎంలలో నో క్యాష్ బోర్డులు దర్శనమిచ్చాయి. నగదు ఉన్న చోట్ల ఏటీఎంల ముందు ప్రజలు పెద్ద ఎత్తు బారులు తీరారు. పెద్దనోట్ల రద్దు ప్రభావంతో నగరంలో ఏటీఎంల సేవలు అంతంత మాత్రంగా ఉండటంతో చాలా మంది ఖాతాదారులు నగదు కోసం బ్యాంకులకు వెళ్లేందుకు అలవాటు పడ్డారు. ఈ క్రమంలో బ్యాంకులకు వరుస సెలవులు రావడంతో శుక్రవారం నుంచే ప్రజలు నగదు ఇబ్బందులను చవిచూడాల్సి వచ్చింది. ఇదిలావుంటే, సెలవులున్నా ప్రైవేట్ బ్యాంకుల ఏటీఎంలలో నగదు పెద్ద మొత్తంలో అందుబాటులో ఉంచేందుకు ఏర్పాట్లు చేశామని ఏజెన్సీ వర్గాలు పేర్కొనడం గమనార్హం.

రాబడులు పెరిగితే జీఎస్టీ శ్లాబ్‌లు తగ్గుతాయ్

- కేంద్రమంత్రి అర్జున్‌కుమార్ మేఘవాల్



న్యూఢిల్లీ: పన్నుల రాబడులు ఆశించిన స్థాయిలో వృద్ధిచెందితే దశలవారీగా వస్తు సేవల పన్ను శ్లాబ్‌లను తగ్గిస్తామని కేంద్ర ఆర్థిక సహాయ, కార్పొరేట్ వ్యవహారాల మంత్రి అర్జున్ మేఘవాల్ తెలిపారు. ప్రస్తుతం నాలుగు రకాల్లో 5, 12, 18, 28 శాతాలుగా ఉన్నాయి. అయితే రాష్ట్రాల విజ్ఞప్తుల మేరకు మార్పులను పరిశీలిస్తాం. రాష్ట్రాల ఆమోదంతోనే కొత్త పన్నుల విధానం అమలుచేస్తున్నామే గానీ కేంద్రం బలవంతపు నిర్ణయం లేదు. జీఎస్టీ కౌన్సిల్‌లో మెజార్టీ ప్రాతిపదికన కేంద్రం నిర్ణయాలు తీసుకుంటుందే గానీ, స్వతంత్రంగా వ్యవహరించబోదని మేఘవాల్ చెప్పారు. ఈ మేరకు శనివారం ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. జీఎస్టీ అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి దాకా 13.2 లక్షల మంది కొత్త డీలర్లు స్వతహాగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. దేశంలోనే అత్యధికంగా పశ్చిమబెంగాల్ నుంచి 56వేల రిజిస్ట్రేషన్లు నమోదయ్యాయి. మొత్తంగా జీఎస్టీ పరిధిలో 8 లక్షల మంది డీలర్లుగా (జీఎస్‌టీఎన్) రిజిస్టర్ అయ్యారని మంత్రి మేఘవాల్ చెప్పారు. జీఎస్‌టీఎన్ డీలర్లు సాంకేతికపరంగా కొన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ, మొత్తంగా వ్యవస్థ పకడ్బందీగా ఉందని అన్నారు. ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్, రివర్స్ చార్జీల మెకానిజంకు సంబంధించి డీలర్లు కంప్యూటరైజ్‌డ్ రికార్డులను నిర్వహించాలని సూచించారు. తద్వారా నల్లధనాన్ని నియంత్రించవచ్చని చెప్పారు. ఈశాన్య రాష్ట్రాలైన ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాలకు పన్ను ప్రోత్సాహాలపై జీఎస్టీ కౌన్సిల్‌లో చర్చించి నిర్ణయం తీసుకోవడం జరుగుతుందన్నారు.



డీఎల్ఎఫ్ డీలా

- తొలిత్రైమాసిక లాభాల్లో 58శాతం క్షీణత

ఢిల్లీ: దేశీయ రియాల్టీ దిగ్గజం డీఎల్ఎఫ్ ప్రతికూల పరిణామాలు ఎదుర్కొంటోంది. రియాల్టీ రంగం మందగమనం డీఎల్ఎఫ్ తొలి త్రైమాసిక ఫలితాలపై తీవ్ర ప్రభావం చూపించింది. శనివారం ప్రకటించిన క్యూ 1 ఫలితాల్లో 109 కోట్ల నష్టాన్ని ప్రకటించింది. లాభాల్లో ఏకంగా 58శాతం తగ్గుదల నమోదైంది. గతేడాది ఇదే సమయానికి సంస్థ లాభాలు రూ. 261.85కోట్లుగా ప్రకటించింది. రెగ్యులేటరీకి నివేదించిన రిపోర్టు ప్రకారం 2016 తొలి త్రైమాసికంలో సంస్థ వాణిజ్య ఆదాయం 9 శాతం మేరకు వృద్ధిచెంది రూ. 2211.24 కోట్లకు చేరింది. కాగా, ఈసారి అది 2025.58 కోట్లకు మాత్రమే పరిమితం అయింది.


హింద్ కాపర్ లాభాల బాట

- క్యూ1 లాభం రూ. 10కోట్లు



న్యూఢిల్లీ: ప్రభుత్వరంగ ఉక్కు సంస్థ హిందుస్థాన్ కాపర్ మెరుగైన ఫలితాలను ప్రకటించింది. శనివారం ప్రకటించిన తొలి త్రైమాసిక ఫలితాల్లో సంస్థ రూ. 10 కోట్లు లాభాలు ఆర్జించినట్లు పేర్కొంది. తొలిసారి నష్టాల నుంచి లాభాల్లోకి చేరినట్లు వెల్లడించింది. గతేడాది ఇదే త్రైమాసికానికి 2.82 కోట్ల రూపాయల నికర నష్టాలను వెల్లడించిన సంస్థ తాజా ఫలితాల్లో 10.27 కోట్లు లాభాలు గడించినట్లు ప్రకటించింది. ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో మొత్తం ఆదాయం 406.08 కోట్లుగా పేర్కొన్నది. గతేడాది ఇది కేవలం రూ. 219.26 కోట్లుగా ఉండేదని బీఎస్‌ఈకి నివేదించింది. హిందుస్తాన్ కాపర్స్ గనులు, ప్లాంట్లు దేశవ్యాప్తంగా ఐదు చోట్ల కొనసాగుతున్నాయి. రాజస్థాన్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, జార్ఖండ్, గుజరాత్ రాష్ట్రాల్లో సంస్థ పాంట్లు తమ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. కాపర్ క్యాథోడ్స్, కాపర్ వైర్ బార్లు, కాపర్ రాడ్లు అనుబంధ ఉత్పత్తులను తయారు చేస్తుంది. కాపర్ సల్ఫేట్, కాపర్ సల్ఫ్యూరిక్ యాసిడ్‌తోపాటు బంగారం, వెండి ధాతువులు కలిగిన కాపర్ యానోడ్లకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది.

చైనాలో 360 విమానాలు రద్దు



బీజింగ్: ఎడతెరపి లేని వర్షాల కారణంగా చైనా రాజధాని నగరంలోని బీజింగ్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి వెళ్లాల్సిన 360 సర్వీసులను రద్దుచేశారు. శనివారం ఉదయం వరకు 234 విమానాలు బయట నుంచి రాగా, కేవలం 181 విమానాలు ఇక్కడ నుంచి టేకాఫ్ అయ్యాయని అధికారవర్గాలు తెలిపాయి. కాగా, శుక్రవారం 400 విమానాలు రద్దయ్యాయి. పలు సర్వీసుల ఆలస్యానికి సంబంధించి ఎల్లో హెచ్చరికలను జారీచేశారు.

ఐటీలో హైదరాబాద్ 2



- ఎగుమతుల్లో బెంగళూరు ఫస్ట్
- రెండో స్థానంల్లో భాగ్యనగరం
- హార్డ్‌వేర్ ఉద్యోగాల్లో ఢిల్లీ టాప్
- తర్వాత బెంగళూరు, హైదరాబాద్
- యూత్ ఫర్ వర్క్ డాట్ కామ్ తాజా అధ్యయనంలో వెల్లడి



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఐటి రంగంలో ప్రపంచ స్థాయి గుర్తింపు పొందిన భారత్‌లో ఐటి, దాని ఆధారిత సర్వీసులు (ఐటిఈఎస్) ఇప్పుడు దేశవ్యాప్తంగా విస్తరిస్తున్నాయి. దక్షిణాది రాష్ట్రాల్లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు, ఎగుమతుల్లో ఇప్పటికీ బెంగళూరు అగ్రస్థానంలో నిలువగా, హైదరాబాద్ ఆ తర్వాతి స్థానాన్ని దక్కించుకుంది. అయితే హార్డ్‌వేర్ ఉద్యోగాల్లో మాత్రం ఢిల్లీ అగ్రస్థానంలో నిలువగా, ఆ తర్వాత బెంగళూరు, హైదరాబాద్ ఉన్నాయి. దేశం మొత్తం ఐటి ఉద్యోగాల్లో దక్షిణాది రాష్ట్రాలదే పైచేయిగా నిలిచింది. దేశంలోని మొత్తం ఐటి నిపుణుల్లో 30శాతం మంది ఉద్యోగులు బెంగళూరు నగరానికి పరిమితం కాగా, 19శాతం ఉద్యోగులతో హైదరాబాద్ రెండోస్థానంలో నిలిచినట్లు యూత్ ఫర్ వర్క్ డాట్ కామ్ అధ్యయనం వెల్లడించింది. ఐటి ఎగుమతులు విస్తరిస్తూ పెద్దఎత్తున ఉద్యోగాలను తీసుకున్న కంపెనీలు గత రెండేళ్ళుగా సిబ్బందిని తగ్గించుకునే పనిలో ఉన్నాయి. ''ఐటి ఉద్యోగాల్లో హైదరాబాద్ ఇప్పటికీ రెండోస్థానంలో నిలిచింది. ఐటి ఎగుమతుల్లో కూడా రూ.75వేల కోట్లకు చేరి మరో 2020 నాటికి లక్ష కోట్ల ఎగుమతులు సాధించే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ఈ రంగానికి ప్రాధాన్యత ఇస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ఐటి విస్తరణకు తీసుకుంటున్న చొరవలతో బహుళజాతి సంస్థల పెట్టుబడులు రాష్ట్రానికి తరలివస్తున్నాయి. అలాగే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న టిఎస్-ఐపాస్‌తో రెండేళ్ళలోనే రూ.74వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. మరోవైపు హార్డ్‌వేర్ రంగలో కూడా హైదరాబాద్ పెద్దఎత్తున దూసుకుపోతోంది.''

మరోవైపు బెంగళూరు, హైదరాబాద్ తర్వాత 17శాతం ఉద్యోగులతో ఢిల్లీ మూడోస్థానంలో, 12 శాతంతో అహ్మదాబాద్ నాలుగోస్థానంలో, 11 శాతం ఉద్యోగులతో చెన్నై, ముంబైలు చివరిస్థానంలో నిలిచాయని ఆ అధ్యయనం వెల్లడించింది. హార్డ్‌వేర్‌లో ఢిల్లీ 26శాతంతో అగ్రస్థానంలో నిలువగా, ఆ తర్వాతి స్థానంలో బెంగళూరు 24శాతం, హైదరాబాద్ 20 శాతం ఉద్యోగులతో మూడోస్థానంలో నిలిచింది. గతంలో ఢిల్లీ, బెంగళూరు, హైదరాబాద్‌కే పరిమితమైన ఐటి ఉద్యోగాలు ఇప్పుడు దేశంలోని పది నగరాలకు విస్తరించింది. చెన్నై, పూణె, అహ్మదాబాద్, గుర్గావ్, గ్రేటర్ నోయిడా, ముంబై నగరాల్లో కూడా ఐటి పరిశ్రమ విస్తరించింది.


ఇదిలా ఉండగా, ఆంధ్రప్రదేశ్ విభజన తర్వాత ఐటి పరిశ్రమలన్నీ హైదరాబాద్‌కే పరిమితం కావడంతో ఇప్పుడు ఆ రాష్ట్రప్రభుత్వం కూడా ఈ రంగానికి ప్రాధాన్యత ఇస్తోంది. గతంలో ఐటి పరిశ్రమలను హైదరాబాద్‌లో అభివృద్ధి చేయడంలో విశేష కృషి చేసిన అప్పటి ముఖ్యమంత్రి, ప్రస్తుత ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బహుళజాతి సంస్థలను అమరావతికి రప్పించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఇందుకోసం భూ కేటాయింపులు, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోంది. అలాగే దక్షిణాదిలోనే మరో పెద్ద రాష్ట్రమైన తమిళనాడు ఐటి రంగానికి ప్రాధాన్యత ఇచ్చినప్పటికీ బెంగళూరు, హైదరాబాద్‌లను అధిగమించలేని పరిస్థితులు ఏర్పడింది. తమిళనాడులో ఆటోమొబైల్ రంగం పెట్టుబడులు ఈ రెండు రాష్ట్రాలకన్నా అధికంగా ఉండడంతో ప్రభుత్వం ఇప్పుడు ఐటిని విస్తరించేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తోంది.

ఐటి రంగంలో దక్షిణాది రాష్ట్రాలు అగ్రస్థానంలో నిలువగా, ఇప్పుడు ఉత్తరాది రాష్ట్రాల్లో కూడా ఈ రంగం వేగంగా అభివృద్ధి చెందుతోంది. దేశీయ, అంతర్జాతీయ స్థాయిలో నెట్‌వర్కింగ్ పెరగడంతో ఉత్తరాది రాష్ట్రాలు ఐటి రంగంపై దృష్టి సారించాయి. 2010లో కామన్వెల్త్ గేమ్స్ నిర్వహించినపుడు కేంద్ర ప్రభుత్వం పెద్దఎత్తున మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేయడంతో ఢిల్లీ, దాని పరిసర నగరాలైన గ్రేటర్ నోయిడా, గుర్గాం ఇప్పుడు ఐటి హబ్‌లుగా అభివృద్ధి చెందుతున్నాయి. ఎన్‌సిఆర్ - ఢిల్లీ, హర్యాణా, ఉత్తరప్రదేశ్‌లలో పారిశ్రామిక రంగంతో పాటు ఐటి రంగం కూడా విస్తరిస్తోంది. ఆ రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించి ఢిల్లీ చుట్టూ ఉన్న నగరాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి నెట్‌వర్కింగ్ అభివృద్ధి చేస్తున్నాయి. మరోవైపు గుర్గాం - ఢిల్లీ - నోయిడా మెట్రో ప్రాజెక్టు కనెక్టివిటీ పెరగడం, ఢిల్లీ చుట్టూ ఉన్న పట్టణాలకు ఆరులేన్ల జాతీయ రహదారులను నిర్మించడంతో పారిశ్రామిక పెట్టుబడులకు మరింత అవకాశం ఏర్పడింది. గతంలో ఎన్‌డీఏ ప్రభుత్వం చేపట్టిన స్వర్ణ త్రిముఖ ప్రాజెక్టులో భాగంగా ఢిల్లీ, గుర్గాం, నోయిడా నగరాలకు కనెక్టివిటీ ఏర్పడడంతో జాతీయ, బహుళజాతి ఐటి, ఐటి ఆధారిత సంస్థలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నాయి.

ఎన్‌సిఆర్ - ఢిల్లీలో ప్రభుత్వం ఆమోదించిన 30 ఐటి, ఐటిఈఎస్ సెజ్‌లలు ఇప్పటికే దాదాపు 250 కంపెనీలు తమ పేర్లు నమోదు చేసుకున్నాయి. ఇందులో 150 కంపెనీలు వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభించి గత పదేళ్ళుగా సాఫ్ట్‌వేర్ ఉత్పత్తులు ఎగుమతి చేస్తున్నాయి. ఐటి రంగం ప్రారంభంలో ఢిల్లీతో పాటు దక్షిణాది రాష్ట్రాలు ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, కర్నాటక, తమిళనాడులు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చి బహుళజాతి సంస్థలను రాబట్టడంలో విజయవంతమయ్యాయి. ఢిల్లీ సరిహద్దుల్లో ఉన్న రాజస్థాన్, హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వాలు కూడా ఇప్పుడు ఐటి రంగంవైపు దృష్టి సారించాయి. హిమాచల్‌ప్రదేశ్‌లో ఐటి పరిశ్రమ విస్తరణకు మంచి అవకాశాలు ఉన్నాయంటూ నాస్కామ్ అధ్యయనంలో వెల్లడించింది. సిమ్లాలో సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్కు, ఎర్త్ స్టేషన్‌లను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు, సోలన్‌లో ఐటి హబ్, కులూ, కాంగ్రా పట్టణాల్లో ఐటి, ఐటిఈఎస్ కంపెనీలను రాబట్టేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తోంది.

4 రోజుల్లో రూ. 6.4 లక్షల కోట్లు ఫట్

- అమెరికా-ఉ.కొరియా ఉద్రిక్తతలతో స్టాక్ మార్కెట్లు కుదేలు
- ఐదు రోజుల్లో 1100 పాయింట్లు పతనమైన సెన్సెక్స్
- రిలయన్స్, ఎస్‌బీఐ, ఎల్అండ్‌టీ షేర్లలో అమ్మకాల వెల్లువ



ముంబై: ఉత్తరకొరియా హెచ్చరికల దెబ్బకు భారతీయ స్టాక్‌మార్కెట్లు ఇన్వెస్టర్ల గుండెల్లో రైళ్లు పరిగెత్తాయి. దాదాపు రెండు నెలలుగా సిక్కిం సరిహద్దులో చైనాతో డోక్లాం వివాదం నడుస్తున్నప్పటికీ ఎలాంటి ఆందోళన లేకుండా పదివేల వైపు పరుగులు తీసిన నిఫ్టీ ఉ.కొరియా ధాటికి ఢబేల్‌మని పడిపోయింది. గతవారం ఐదు సెషన్లు నష్టాల బాటలోనే మార్కెట్లు నడిచాయి. ముఖ్యంగా గత నాలుగు సెషన్లలో దాదాపు 100 బిలియన్ డాలర్లు (రూ. 6.4 లక్షల కోట్లు) మదుపరుల సంపద ఆవిరైంది. దీంతో బాంబే స్టాక్ ఎక్చేంజ్ క్యాపిటలైజేషన్ విలువ రూ. 133.1 లక్షల కోట్లకు పరిమితమైంది. అంతకు ముందు ఆగస్టు 7న ఇది రూ. 139.5 లక్షల కోట్లుగా ఉన్నది. రూ. 133 లక్షల కోట్ల నుంచి 139.5 లక్షల కోట్లకు చేరేందుకు 23 సెషన్ల అవసరం కాగా, కేవలం నాలుగే రోజుల్లో ఆ పెరుగుదల క్షీణించడం గమనార్హం. ప్రపంచ వ్యాప్తంగా గతవారం ఒక ట్రిలియన్ డాలర్లు ఇన్వెస్టర్ల సంపదన ఆవిరైంది.

శుక్రవారం సెన్సెక్స్ ఒకశాతం (318 పాయింట్లు) క్షీణించి 31,214 పాయింట్ల వద్ద ముగిసింది. తద్వారా రెండు నెలల కనిష్టానికి చేరింది. అదేవిధంగా నిఫ్టీ 1.1శాతం క్షీణించి 9711 పాయింట్ల వద్ద ముగిసింది. మొత్తంగా గతవారం సెన్సెక్స్ ఏకంగా 1100 పాయింట్లు పతనమైంది. అంతర్జాతీయ పరిణామాలకు తోడు, డోక్లామ్ వివాదం, ట్రేడింగ్ నుంచి 331 డొల్ల కంపెనీలను సెబీ బహిష్కరించడం, నిరాశాజనక కార్పొరేట్ ఫలితాలు మార్కెట్ పతనానికి దోహదం చేశాయి. కాగా, గతవారం ప్రపంచ మార్కెట్లు కూడా నష్టాలబాటే పట్టాయి. మొత్తంగా దళాల్ స్ట్రీట్‌లో నెత్తుటేరులు పారాయి. గురువారం రాత్రి డౌజోన్స్ (అమెరికా) ఇండెక్స్ 1శాతం, ఎస్అండ్‌పీ 1.45 శాతం పతనం కాగా, యూరోప్ మార్కెట్లు 1.5శాతం మేరకు పతనం అయ్యాయి.

బ్యాడ్ వీక్

గత 18 నెలల కాలంలో భారతీయ స్టాక్ మార్కెట్లకు ఇది బ్యాడ్ వీక్ అని మార్కెట్ వర్గాలు అభివర్ణించాయి. అంతర్జాతీయ మార్కెట్లతోపాటు భారతీయ మార్కెట్లు కూడా అమ్మకాల ఒత్తిడికి గురయ్యాయి. మరికొన్ని సెషన్లలో కూడా దిద్దుబాటు తప్పక పోవచ్చన్నది విశ్లేషకుల అంచనా.

ముఖ్యంగా లార్జ్‌క్యాప్ ఈక్విటీ షేర్లలో విదేశీ పెట్టుబడులు బయటకు వెళ్లడం కూడా ఇండెక్స్‌పై ప్రభావం చూపింది. మరొకవైపు మదపర్లు సురక్షిత మార్గంగా తమ పెట్టుబడులను బాండ్లు, బంగారం వైపు మళ్లిస్తున్నారు. దేశీయ మ్యూచువల్‌ఫండ్స్ వద్ద ప్రస్తుతం 35వేల కోట్ల రూపాయల నగదు నిల్వలు ఉన్నాయి. ఈక్విటీ మార్కెట్లు మరికొంత దిద్దుబాటు జరిగితే పెద్దమొత్తం లో కొనుగోళ్లు జరిపేందుకు సిద్ధంగా ఉన్నట్లు శాంక్చమ్ వెల్త్ మేనేజ్‌మెంట్ తెలిపింది. గతవారం విదేశీ మదుపరులు 1943 కోట్లకు అమ్మకాలు చేయ గా, దేశీయంగా 2016 కోట్ల మేరకు కొనుగోళ్లు జరిగాయి.

చక్కెర నిల్వలు సరిపడా ఉన్నాయ్




న్యూఢిల్లీ: దేశీయ అవసరాలకు సరిపడా చక్కెర నిల్వలు అందుబాటులో ఉన్నాయని కేంద్ర ఆహారశాఖ మంత్రి రాంవిలాస్ పాశ్వాన్ తెలిపారు. దిగుమతులపై సుంకం ఎత్తివేత చర్యలకు సంబంధించి ప్రస్తుతానికి ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. అక్టోబర్ నుంచి ప్రారంభమయ్యే కొత్త సీజన్‌లో చెరకు క్రషింగ్ త్వరగా చేపట్టాలని మిల్లర్లను ఆదేశించినట్లు చెప్పారు. చక్కెర ధరలు ప్రస్తుతం స్థిరంగా కొనసాగుతున్నాయి. పండుగ సీజన్‌కు వరకు కూడా పెద్దగా మార్పులు ఉండవనే ఆశిస్తున్నాం. చౌక దిగుమతులను నియంత్రించడం కోసం గతనెలలో 50శాతం దిగుమతి సుంకం విధించిన విషయాన్ని మంత్రి గుర్తుచేశారు. గతేడాది 27.9 మిలియన్ టన్నుల చక్కెరను పంపిణీ చేయడం జరిగింది. ఈ సీజన్‌లో 20.4 మిలియన్ టన్నుల ఉత్పత్తి ఉంటుంది. దానికితోడు గత నిల్వలు 7మి.టన్నులు ఉంది. మరో ఐదు మి.టన్నులు దిగుమతి చేసుకుంటే సరిపోతుందని పాశ్వాన్ వెల్లడించారు.

గోధుమ దిగుమతులపై పన్నుపెంపు లేదు

ప్రస్తుతం ఉన్న 10శాతం దిగుమతి సుంకం యథావిధిగా కొనసాగుతుందని, తక్షణ పెంపు ఆలోచనేదీ ప్రభుత్వానికి లేదని పాశ్వాన్ వెల్లడించారు. 2016-17 పంట సీజన్‌లో దేశీయంగా రికార్డు స్థాయిలో 97.44 మి.టన్నులు గోధుమ పంట ఉత్పత్తి అయింది. దీంతో గత నాలుగు నెలల్లో దిగుమతి సుంకం పెంచాల్సిన అవసరం రాలేదు. తక్షణ పెంపు ఆలోచన కూడా లేదని పాశ్వాన్ తెలిపారు.


ఆర్‌కాం నష్టాలు రూ. 1210 కోట్లు



ముంబాయి: టెలికాం సంస్థ రిలయన్స్ కమ్యూనికేషన్‌స క్యూ 1 నికర నష్టం రూ. 1210 కోట్లుగా ప్రకటించింది. గడచిన జూన్ త్రైమాసిక ఫలితాలను ప్రకటించిన సంస్థ వరుసగా మూడోసారీ భారీ నష్టాలనే వెల్లడించింది. ప్రత్యర్థి పోటీ సంస్థల నుంచి ఎదురవుతున్న ధరల యుద్ధాన్ని ఎదుర్కొనే క్రమంలో భారీ నష్టాలు తప్పలేదని ముఖేష్ అంబానీ సారథ్యంలోని రిలయన్స్ కమ్యూనికేషన్స్ సంస్థ ప్రకటించింది. ఇదే త్రైమాసికంలో గతేడాది జియో 90 కోట్ల లాభాలను ఆర్జించింది. పోటీ తీవ్రత దృష్ట్యా 2017-18 ఆర్థిక సంవత్సరంలో టెలికాం రంగంలో ఒడి దొడుగులు తప్పకపోవచ్చని తాజా ప్రకటనలో ఆర్‌కాం తెలిపింది. గత ఆర్థిక సంవత్సరంలో క్యూ1లో 54 కోట్లు లాభాలను ఆర్జించిన సంస్థ ఆ తర్వాత వరుసగా మూడు త్రైమాసికాల్లో నష్టాలనే చవిచూడాల్సి వచ్చింది. 2016లో ఇదే సమయానికి రూ. 5361 కోట్లుగా ఉన్న నికర ఆదాయం ఏప్రిల్ - జూన్ 2017 నికర ఆదాయం 33శాతం క్షీణించి రూ. 3591కోట్లకు పడిపోయింది. 20 ఏళ్ల కాలంలో తొలిసారి టెలికాం తిరోగమనంలో పయనిస్తోందని ఆర్‌కాం తాజా ప్రకటనలో అభిప్రాయపడింది. ఇదివరకు ఆర్‌కాం 45వేల కోట్లు అప్పులను ప్రకటించింది. అయితే ఇటీవల ఎయిర్‌సెల్‌తో మొబైల్ వ్యాపారాన్ని మెర్జర్ చేయడం వల్ల దాదాపు 14 వేల కోట్ల మేరకు రుణభారం తగ్గింది. టవర్ల వ్యాపారాన్ని విక్రయించడం ద్వారా మరో 10వేల కోట్ల రూపాయల వరకు రుణభారాన్ని తగ్గించుకుంటామని సంస్థ తెలిపింది. ఈనెలాఖరులోగా సిస్టెమా శ్యామ్ టెలికాంతో విలీన ప్రక్రియ పూర్తయ్యే అవకాశం ఉంది. దీంతో ఎనిమిది టెలికాం సర్కిళ్లలో 30మె.హెర్ట్జ్ ఆఫ్ 850 ప్రీమియం బ్యాండ్ స్పెక్ట్రమ్ అందుబాటులోకి వస్తుంది. దీనిని 2033 సంవత్సరం వరకు ఉపయోగించుకునే వెసులుబాటు ఉంది.

656 ఎకరాల్లో స్టార్టప్ తొలిదశ

- అమరావతిలో స్టార్టప్ ప్రాంతం అభివృద్ధికి సన్నాహాలు
- 8 లక్షల చ.అ భవనాలు నిర్మాణానికి సన్నద్ధం
- ఈ నెలలోనే రెండో సమావేశం
- ఇంజినీరింగ్, న్యాయ, మార్కెటింగ్ విభాగాలు



అమరావతి, ఆంధ్రప్రభ: అమరావతి రాజధానిలో తమ సంస్థలు నెలకొల్పేం దుకు పలు దేశీయ, అంతర్జాతీయ సంస్థలు ముదుకు వస్తున్నాయి. ఇప్పటికే పలు సంస్థలు శంకుస్థాపనలు పూర్తిచేసుకోగా మరికొన్ని త్వరలో పునాది రాళ్లు వేయనున్నాయి. అదేవిధంగా అమరావతి రాజధానిలో స్టార్టప్(అకుర) ప్రాంత అభివృద్ధి ప్రాజెక్ట్‌ను దక్కించుకున్న సింగపూర్ సంస్థల కన్సార్టియం కూడా త్వరలోనే పనులు మొదలు పెట్టేందుకు సన్నాహాలు చేస్తుంది. దీనిలో బాగంగానే ఈప్రాజెక్ట్ కోసం సింగపూర్ కన్సార్టియం ఏర్పాటు చేసిన మూడు ప్రత్యేక బృందాలు ఇప్పటికే అమరావతిలో పర్యటించి సీఆర్‌డీఏ, ఏడీసీ అధికారులు, ఇంజనీర్లతో చర్చించారు. అదేవిధంగా తాము చేపట్టే పనులకు అవసరమైన సామగ్రి సరఫరాకు సింగపూర్ కన్సార్టియం ముందస్తు ఒప్పందాలు చేసుకుంది. వచ్చే రెండు మూడేళ్లలో ఎన్ని భవనాలు నిర్మిస్తారో వాటికి ఎంత సిమెంటు, ఇసుక, ఉక్కు తదితర పరికరాల ఎంత మేరకు కావలో ప్రణాళికలు తయారుచేసుకొని సరఫరా చేసే కంపెనీలతో ఒప్పందాల ప్రక్రియ ప్రారంభించింది. స్టార్టప్ ప్రాజెక్ట్‌ని స్విస్ చాలెంజ్‌లొ దక్కించుకున్న సింగపూర్ కన్సార్టియం పనులు ప్రారంభించేందుకు విజయవాడలో ఒక భవన్నాన్ని కూడా ఎంపిక చేసింది.

స్టార్టప్ ప్రాంత అభివృద్ధికి సంబంధించి ప్రక్రియను పూర్తిచేసేందుకు ప్రాజెక్ట్‌ని వేగవంతం చేసేందుకు సింగపూర్ కన్సార్టియం న్యాయ, ఇంజనీరింగ్, పెట్టుబడుల ప్రోత్సాహానికి మార్కెటింగ్ నిపుణులతో మూడు విభాగాలు ఏర్పాటు చేసింది. ప్రతినిధులు ఇప్పటికే ఒక ధఫా రాజధాని ప్రాంతంలో పర్యటించారు. రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ(సీఆర్‌డీఏ), ఏడీపీతో కుదుర్చుకున్న ఒప్పందం ఏవిధంగా ఉండాలి, న్యాయపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలేంటి వంటి అంశాలను నిపుణుల పరిశీలిస్తున్నారు. మరో పక్క ఇంజనీరింగ్ బృందం ప్రాజెక్ట్ నిర్మాణానికి అవసరమైన సన్నాహాలు చేస్తుంది.ఇంజనీరింగ్ పెట్టుబడుల ప్రోత్సాహక బృందాలు రాష్ట్రానికి చెందిన నైపుణ్యాభివృద్ధి సంస్థతో సమావేశమయి పలు విషయాలపై చర్చించారు. ప్రాజెక్ట్ నిర్వహణ నైపుణ్యాలపై సీఆర్‌డీఏ ఇంజనీర్లకు శిక్షణ ఇచ్చేందుకు సింగపూర్ కన్సార్టియం ముందుకు వచ్చింది..స్టార్టప్ ప్రాంతంలో మొదట 8 లక్షల చదరపు అడుగుల నిర్మిత ప్రాంతం కలిగిన భవనాలను కన్సార్టియం నిర్మించనుంది. స్టార్టప్ ప్రాంత ప్రధాన అభివృద్ధి దారునిగా ఎంపికైన ఆసెండాస్-సింగ్ బ్రిడ్జి, సెంబ్‌కార్ప్ సంస్థల కన్సార్టియం, అమరావతి అభివృద్ధి సంస్థ(ఏడిసి)తో కలిసి ఈప్రాజెక్ట్ ని చేపడుతుంది. సింగపూర్ కన్సార్టియం, ఏడీసీ కలిసి అమరావతి అభివృద్ధి బాగస్వామి(ఏడిసి) పేరుతో ప్రత్యేక ప్రయోజక వాహకాన్ని (ఎస్పీవీ) ఏర్పాటుచేస్తాయి.

గోబెల్స్ ప్రచారం మానుకోండి



హైదరాబాద్,ఆంధ్రప్రభ: కేంద్ర ప్రభుత్వానికి వ్యతి రేకంగా రాష్ట్ర మంత్రులు, టీఆర్ఎస్ నేతలు గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ ఫైర్ అయ్యారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం నిధులు ఇవ్వడానికి ముందుకు వచ్చినా.. రాష్ట్రప్రభుత్వం సద్వినియోగం చేసుకోవడం లేదని ఆయన మండిపడ్డారు. కేంద్రం నిధులు మంజూరు చేసినా.. రాష్ట్ర ప్రభుత్వం తన వాటా చెల్లించకపోవడం, భూములను సూచించకపోవడం వల్ల రైల్వే పనులు పెండింగ్‌లోనే ఉన్నాయని ఆయన వివరించారు. కేంద్ర మంత్రులు పలుమార్లు రాష్ట్ర ప్రభుత్వానికి లేఖలు రాసిన సీఎం చంద్రశేఖర్‌రావు స్పందించడం లేదని ఆయన దుయ్యబట్టారు. జీఎస్టీ విషయంలో రాష్ట్రానికి రూ. 19 వేల కోట్ల నష్టం వచ్చిందనడంలో వాస్తవం లేదన్నారు. శనివారం ఆయన పార్టీ నేతలు ఎస్. కుమార్, కె. మాదవి, ఎస్. మల్లారెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకానికి రాష్ట్రం వాటా చెల్లించకపోవడంతో రైతులకు నష్టం జరిగిందన్నారు. రైల్వేకు సంబంధించిన కొత్త లైన్లు, డబ్లింగ్, విద్యుదీకరణ, ఎంఎంటీఎస్, ఘట్కేసర్- యాదాద్రి వరకు ఎంఎంటీఎస్, కాజీపేటల్ వర్క్‌షాప్, సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ అంతర్జాతీయంగా తీర్చిదిద్దడం, లింగంపల్లి, చర్లపల్లి కొత్త టర్మినల్స్ తదిరత పనులపై కేంద్రం నిధులు విడుదల చేసినా రాష్ట్ర ప్రభుత్వం సద్వినియోగం చేసుకోవడం లేదన్నారు. ఎంఎంటీఎస్ రెండో దశకు రూ. 860 కోట్ల ఖర్చులో రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ. 566 కోట్లు కాగా కేవలం రూ. 60 కోట్లే విడుదల చేసిందన్నారు. రైల్వే శాఖ రూ. 395 కోట్లకు గాను అదనంగా మరో రూ. 112 కోట్లు కేటాయించిందన్నారు. శంషాబాద్ నుంచి విమానాశ్రయం వరకు జీఎంఆర్‌ను ఒప్పించి ఎంఎంటీఎస్ పొడగిస్తామని రైల్వే మంత్రి హామీ ఇచ్చారని లక్ష్మణ్ తెలిపారు.

బీసీ పాలసీపై పార్టీలు స్పందించాలి

● సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: దేశంలోని అరవైకోట్ల మంది బీసీల ప్రగాఢ ఆకాంక్షలను, అన్ని రాజకీయ పార్టీలు గుర్తించి తమ విధాన ప్రకటనను (పాలసీని) ప్రకటించాలని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. లేని పక్షంలో బీసీ వ్యతిరేక పార్టీలను గుర్తించి 2019 ఎన్నికల్లో ఆ పార్టీలకు బుద్ధి చెబుతామని హెచ్చరించింది. చట్టసభల్లో బీసీలకు 50శాతం రాజకీయ రిజర్వేషన్లు, ప్రమోషన్లలో రిజర్వేషన్లు, జాతీయ బీసీ కమిషనకు రాజ్యాంగ చట్టభద్దత కల్పించాలనే ప్రధాన డిమాండ్లతో ఢిల్లీలో నిర్వహించిన ఉద్యమం సెగ కేంద్రానికి తాకిందన్నారు. దీనికి దిగివచ్చి వచ్చే పార్లమెంట్ సమావేశాలలో బీసీ బిల్లు ప్రవేశపెట్టి ఆమోదిస్తామని స్వయంగా ప్రధానమంత్రి మోదీ ప్రకటించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఢిల్లీలో నిర్వహించిన ఆందోళన అనంతరం బీసీ సంక్షేమ సంఘం నేతలు శనివారం వరంగల్‌కు వచ్చారు. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్ మాట్లాడుతూ, ఢిల్లీ పర్యటనలో 26 రాష్ట్రాల బీసీ సంఘాలను 7వ తేదీన ఒక వేదికపైగా తీసుకరాగలిగామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం కేంద్ర కమిటీ అధ్యక్షుడు విక్రంగౌడ్, రాష్ట్ర అధ్యక్షుడు కె.శ్రీనివాస్‌ముదిరాజ్‌తో పాటు మాదగిరిగౌడ్, సతీష్‌కుమార్, మల్ల యాదవ్, రామకృష్ణాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీఏటీ ఆదేశాలపై సమీక్షించండి

● ఆంధ్రప్రదేశ్ సీఎస్‌కు హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్ పరిపాలనా ట్రిబ్యునల్ (ఏపీఏటీ) వివిధ సందర్భాల్లో వెలువరించిన తీర్పులను సంబంధిత ప్రభుత్వ శాఖలు అమలు చేయకపోవంపై హైకోర్టు అసహనం వ్యక్తం చేసింది. ట్రిబ్యునల్ ఆదేశాలపై శాఖల సమీక్ష నిర్వహించి వాటి అమలుకు తగిన చర్యలు తీసుకోవాలని ఏపీ ప్రభుత్వ ప్రధానకార్యదర్శిని ఆదేశించింది. ఆ ఉత్తర్వులను నిర్దిష్టగడువులోపు అమలు చేస్తామని హామీ ఇస్తూ కోర్టులో ప్రమాణ పత్రం దాఖలు చేయాలని ఏపీసీఎస్‌కు హైకోర్టు స్పష్టం చేసింది. ఏపీఏటీ ఇచ్చే ఉత్తర్వులను అమలు చేయకపోవడం న్యాయపాలనను అపహాస్యం చేసినట్లేనని హైకోర్టు తీవ్రమైన వ్యాఖ్య చేసింది. ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సి.వి.నాగారున రెడ్డి, జస్టిస్ జి.శ్యాంప్రసాద్ లతో కూడిన డివిజన్ బెంచ్ ఇటీవల ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి విచారణ ఈ నెల 28కి వాయిదా వేసింది. తమ ఉద్యోగాల్ని క్రమబద్ధీకరించే నిమిత్తం మూడు వారాల్లో ఉత్తర్వులు జారీ చేయాలని అధికారులను ఆదేశిస్తూ ఫిబ్రవరి 2014లో ఇచ్చిన ఏపీఏటీ ఉత్తర్వులను అమలు చేయలేదని పేర్కొంటూ తూర్పు గోదావరి జిల్లాకు చెందిన వెంకటేశ్వరరావు మరికొందరు హైకోర్టులో వ్యాజ్యం దాఖలు చేసిన విషయం తెలిసిందే. ప్రభుత్వ న్యాయవాది వాదనలు వినిపిస్తూ ..పిటిషనర్లు క్రమబద్ధీకరణకు అనర్హులయినందువల్లనే ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయలేదన్నారు. ఏపీఏటీ ఇచ్చిన న్యాయ సంబంధ ఉత్తర్వులను విస్మరించడం తగదన్నారు. ఉభయ రాష్ట్రాల్లో ఏపీఏటీ ఆదేశాల్ని అధికారులు విస్మరిస్తున్నారన్నారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ ఏపీఏటీ జారీ చేసిన ఉత్తర్వులు అధికారులు విస్మరించడం పట్ల అసంతృప్తిని వ్యక్తం చేసింది. ఉత్తర్వుల అమలు కోసం హైకోర్టులో దాఖలయ్యే వ్యాజ్యాల సంఖ్య పెరిపోతోందోనని గుర్తు చేసింది.

హుక్కా సెంటర్లపై దాడులు చేయండి



హైదరాబాద్,ఆంధ్రప్రభ: జంట నగరాల్లో నిబంధనలు పాటించని హుక్కా సెంటర్లపై దాడులు నిర్వహిస్తే తాము సహకరించేందుకు సిద్ధంగా ఉన్నామని ట్విన్‌సిటీస్ కాఫీషాప్స్ ఓనర్స్ అసోసియేషన్ స్పష్టం చేసింది. నిబంధనలు పాటిస్తూ చట్టబద్ధంగా నిర్వహిస్తున్న వాటిపై కూడా నగర పోలీసులు దాడులు నిర్వహిస్తూ వేధింపులకు గురి చేస్తున్నారని అసోసియేషన్ అధ్యక్షులు మోహిత్, న్యాయవాది రాజులు తెలిపారు. శనివారం వారు సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. ప్రత్యేక నిబంధనలు పాటిస్తూ హుక్కా సెంటర్లను నిర్వహించుకోవడానికి సుప్రీంకోర్టు అనుమతి ఇచ్చిందని వారు గుర్తు చేశారు. నిబంధనలు పాటించే వాటిపై కూడా పోలీసులు దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. హుక్కా సెంటర్లపై ఆధారపడి వందలాది మందిజీవిస్తున్నారని తెలిపారు. పోలీసుల దాడులు చేసి మానసికంగా వేధిస్తున్నారని, తమ హక్కులకు భంగం కలిగేలాగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం సూచించిన నిబంధనల మేరకు తాము హుక్కా సెంటర్లను నిర్వహించడానికి తాము సుముఖంగా ఉన్నామని, పోలీసులకు ఎటువంటి సహకారం కావాలన్నా ఇవ్వడానికి తాము సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఎస్సై ఖలీల్ మృతి




వికారాబాద్, కెఎన్ఎన్: రాజేందర్‌నగర్ హిమాయత్ సాగర్ ఔటర్ రింగ్ సర్వీస్ రోడ్‌పై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎస్‌బీ ఎస్ఐ ఖలీల్ దుర్మరణం చెందారు. వేగంగా వెళుతున్న కారు చెట్టును ఢీకొని ఈ సంఘటన చోటుచేసుకుంది. వికారాబాద్ ఎస్పీ కార్యాలయంలో ఎస్‌బీ ఎస్సైగా పని చేస్తున్న ఖలీల్ (45) సెలవులు రావడంతో ఇంటికి వెళుతుండగా ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. మాజీ సైనికుడు అయిన ఖలీల్ 2012లో వికారాబాద్ ఎస్పీ కార్యాలయంలో ఎస్సైగా చేరారు. ఈ ప్రమాదంలో మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.

‘మార్నింగ్ స్టార్’ కక్కుర్తి

● టోల్‌గేట్ తప్పించుకునేందుకు అడవి బాట

● డ్రైవర్ల తీరుపై ప్రయాణికులు మండిపాటు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: బెంగళూరు నుంచి హైదరాబాద్ వస్తున్న మార్నింగ్ స్టార్ ప్రైవేట్ ట్రావెల్స్‌కు చెందిన రెండు బస్సుల డ్రైవర్లు టోల్‌ట్యాక్స్ తప్పించుకునేందుకు శుక్రవారం రాత్రి అడవిలో బస్సును ఆపి ప్రయాణీకులకు నరకం చూపారు. ఆ బస్సుల డ్రైవర్ల కక్కుర్తి ప్రయాణీకులను భయాందోళనలకు గురిచేసింది. దీంతో ప్రయాణీకుల ఆగ్రహానికి గురయ్యారు. శుక్రవారం రాత్రి బెంగళూరు నుంచి బయల్దేరిన బస్సుల డ్రైవర్లు అంతర్రాష్టరవాణా పన్ను కట్టకుండా తప్పించుకునేందుకు వేరే మార్గంలోకి మళ్లించినట్లు ప్రయాణీకులు చెబుతున్నారు. అనంతపురం కర్నూలు మీదుగా హైదరాబాద్ చేరాల్సిన ఆ బస్సులు దారి మళ్లించి వేరేదారిలో తీసుకెళ్లారు. ఉదయం నిద్రలోంచి మేల్కొన్న ప్రయాణీకులు వేరే మార్గంలో వెళ్తున్నట్లు గ్రహించి బస్సు డ్రైవర్లను నిలదీశారు. ఉదయం 6 గంటలకు హైదరాబాద్ చేరు కోవాల్సిన బస్సు ఇంకా కర్ణాటక సరిహద్దు కూడా దాటకపోవడంతో ప్రయాణీకులు డ్రైవర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దాదాపు 12 గంటల పాటు ఆ బస్సులు అడవిలోనే తిరగడం గమనార్హం. కాగా, టోల్‌ట్యాక్స్ తప్పించుకునేందుకు బస్సును దారి మళ్లించినట్లు డ్రైవర్ తెలిపాడు. ఈ క్రమంలో కర్ణాటక సరిహద్దు ప్రాంతమైన బూదగుంపలో కొద్దిసేపు గందరగోళం తర్వాత శనివారం ఉదయం 10 గంటల సమయంలో బస్సు హైదరాబాద్ బయల్దేరింది. టోల్‌ట్యాక్స్ ఎగవేసేందుకు తమ ప్రాణాలను పణంగా పెడతారా అంటూ ప్రయాణీకులు డ్రైవర్‌పై మండిపడ్డారు. బస్సులను అడవిలో నిలిపివేశామని చెప్పడం అవాస్తవమని, కర్ణాటకలోనే ట్రాఫిక్ రద్దీ కారణంగా కొంత ఆలస్యం జరిగిందని, తమ బస్సులకు జీపీఎస్ సౌకర్యం ఉందని ట్రావెల్స్ యాజమాన్యం వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు.బస్సు లలో పిల్లలు, వృద్ధులు వున్నారని, ఏసీ బస్సులు కావడంతో కనీసం మంచి నీరు కూడా అందించకుండా నరకం చూపుతున్నారని ప్రయాణికులు ఆగ్రహించారు. ఇం కొందరైతే ఇలా ఇబ్బందులు వున్న ట్రావెల్స్‌కు చెందిన బస్సులను ఆన్‌లైన్‌లో బుకింగ్‌కు ఎలా అనుమతిస్తారని ప్రశ్నిస్తున్నారు. తాము హైదరాబాద్ చేరుకున్న వెం టనే ఈ విషయమై ఫిర్యాదు చేయగలమని కూడా తెలిపారు. అత్యంత దారుణ మేమంటే.. రూ.600 టిక్కెట్ అయితే ఒక్కొక్కరి వద్ద నుంచి రూ.3,000 వరకూ ఛార్జి చేసి మరీ తమను ఇక్కట్ల పాల్జేయడమేమిటన్నది ప్రయాణీకుల ఆవేదనగా ఉంది.

ఇక మిలిటెంట్ ఉద్యమాలు

రిజర్వేషన్ అంశంపై బీసీ సంఘాల ప్రకటన

హైదరాబాద్,ఆంధ్రప్రభ: చట్ట సభల్లో బీసీలకు రిజర్వేషన్లు సాధించడం కోసం ఇకపై మిలిటెంట్ ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉందని బీసీ సంఘాలు అభిప్రాయపడ్డాయి. పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టాలని డిమాండ్ చేస్తూ జాతీయ బీసీ సంక్షేమ సంఘం గత వారం రోజులుగా ఢిల్లీలో ధర్నాలు, ప్రదర్శనలు చేసినట్టు సం ఘం జాతీయ అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆర్ కృష్ణయ్య తెలిపారు.ఢిల్లీలో ఆందోళనలు చేసిన అనంతరం బీసీ సంక్షేమ సంఘం నేతలు శనివారం హైదరా బాద్‌లో మీడియాతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్య నారా యణ, జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ కృష్ణ కోట్ల శ్రీనివాస్, ఎస్ రామలింగం, గడ్డం నరసింహం, గుజ్జ రమేష్ తదితరులు మీడియా సమావేశంలో పాల్గొన్నారు. బీసీలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడిని కోరామన్నారు.

కృష్ణమ్మకు నిత్య హారతి

అమరావతి, ఆంధ్రప్రభ: విజయవాడలోని పవిత్ర సంగమం వద్ద కృష్ణమ్మకు ప్రత్యేక నిత్య హారతి కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. కృష్ణమ్మకు నిత్యహారతి ప్రారంభమై ఏడాది పూర్తయిన సంద ర్భంగా ఇబ్రహీంపట్నం వద్ద ఉన్న పవిత్ర సంగమం వద్ద నవ హారతి ప్రథమ వార్షికోత్సవాన్ని కన్నులపండువగా ఏర్పాటు చేశారు. దుర్గగుడి ఆధ్వర్యంలో 365 మంది మహిళలలో ప్రదర్శన,ప్రత్యేక నిత్యహారతి కార్యక్రమం ఎంతగానో ఆకట్టుకున్నది. స్థానికుల్ని అలరించింది. నృత్యాలు,కోలాటాలతో దుర్గామాతకు కళాకారిణులు పుష్పాంజలి సమర్పించారు. ఈ కార్యక్రమానికి హాజరైన దేవాదాయ శాఖా మంత్రి మాణిక్యాలరావు,దేవినేని ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కృష్ణమ్మ వల్ల నేడు అన్నదాతలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా పోయిందన్నారు. నదుల అనుసంధానం ద్వారా గోదావరి నీటిని కృష్ణాకు తీసుకువచ్చి,అన్నదాతలను ఆదుకోవడం జరుగుతుందనిపేర్కొన్నారు. ఏడాదిగా పవిత్ర సంగమం వద్ద నిత్య హారతి కార్యక్రమం జరగడం అభినందనీయమని అన్నారు.

ఎస్సీ కమీషన్ ఏమైంది?

మేడపల్లి సత్యం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో దళితులు తమ కష్టాలను చెప్పుకోవడానికి ఎస్సీ కమిషన్‌ను నియమించలేని దుస్థితిలో తెరాస ప్రభుత్వం ఉందని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మేడిపల్లి సత్యం విమర్శించారు. దళితులపట్ల సిఎం కేసీఆర్ చూపిస్తున్న వివక్షకు ఇది నిదర్శమని ఆయన మండిపడ్డారు. ఎస్సీ కమిషన్ ఏర్పాటు చేస్తామని చెప్పి మూడన్నర సంవత్సరాలు అవుతున్నప్పటికీ ఇప్పటి వరకు అది కార్యరూపం దాల్చకపోవడం సిగ్గుచేటని శనవారంనాడు సిఎం కేసీఆర్‌కు ఆయన ఒక బహిరంగ లేఖ రాశారు. భారత రాజ్యాంగంలోని 338(ఎ) ఆర్టికల్ ప్రకారం ప్రతి రాష్ట్రం ఖచ్చితంగా ఎస్సీ కమిషన్ ఏర్పాటు చేయాలనే నిబంధన ఉన్నా పట్టించుకోవడం లేదని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సీ కమిషన్ ఏర్పాటుపై హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం కూడా దాఖలు చేయడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. ఎండ్స్...

వరల్డ్ హెరిటేజ్ నమూనాలో ప్రతిపాదనలు పంపండి

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కొన్ని సందర్శనా క్షేత్రాలను వరల్డ్ హెరిటేజ్ జాబితాలో చేర్చేందుకు ఉన్న ప్రత్యేకతలు, యునెస్కో మార్గదర్శకాలకు అనుగుణంగా ఏ మేరకు ఉన్నాయో పూర్తి వివరాలతో ప్రతిపాదన పంపించాల్సిందిగా కేంద్ర పురావస్తు శాఖ డైరెక్టర్ డాక్టర్ ప్రవీణ్ కె.మిశ్రా అఖిల భారత పంచాయితీ పరిషత్ జాతీయ కార్యదర్శి జాస్తి వీరాంజనేయులును కోరారు. వరల్డ్ హెరిటేజ్ గుర్తింపునకు నిర్దిష్ట నమూనాలో పంపించాల్సిందిగా సూచిస్తూ ఈ మేరకు శనివారం ఆంజనేయులుకు ఆయన ఓ లేఖ రాశారు.రాష్ట్రంలోని శంకరం, గుంటుపల్లి, అమరావతి మహాస్థూపం, నాగార్జునకొండ, గండికోట పోర్టులను వరల్డ్ హెరిటేజ్ జాబితాలో చేర్చాలంటూ ఆంజనేయులు ఇటీవల కేంద్ర పురావస్తు శాఖకు లేఖ రాశారు. ఈ లేఖను పరిశీలించిన ప్రభుత్వం ఈ మేరకు ప్రతిపాదనలు పంపాల్సిందిగా తిరుగు లేఖలో పేర్కొంది.

ఘనంగా ట్రిపుల్ ఐటీ స్నాతకోత్సవం



హైదరాబాద్,ఆంధ్రప్రభ: ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(ఐఐటీ) హైదరాబాద్ 16వ వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. హైదరాబాద్‌లోని క్యాంపస్‌లో జరిగింది. 473 మందికి డిగ్రీ పట్టాలను ప్రధానం చేశారు. వారిలో 84 మంది పరిశోధనా విద్యార్థులున్నారు. 16 మందికి పిహెచ్‌డీ పట్టాలను ప్రధానం చేశారు. రెడ్డిస్ ల్యాబోరటీస్ సీఈవో జివి ప్రసాద్, ఐఐటీ హైదరాబాద్ గవర్నింగ్ కౌన్సిల్ చైర్మన్ ప్రొఫెసర్ రాజ్ రెడ్డి, డైరక్టర్ పిజె నారాయణన్ పాల్గొన్నారు.తాము నేర్చుకున్న విద్యతో విద్యార్థులు సమాజానికి సేవ చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. పరిశోధనలు సమాజంలో ప్రస్తుతం ఉన్న అవసరాల మేరకు చేపట్టాలని సూచించారు. నిత్యం అధ్యయనం చేస్తూ తగిన విధంగా జీవితంలో ఎదగాలని సూచించారు.

ఆన్‌లైన్‌లో ఓయూ దూర విద్యాకోర్సుల దరఖాస్తులు

హైదరాబాద్,ఆంధ్రప్రభ: ఉస్మానియా యూనివర్సిటీ ద్వారా దూర విద్య చదవాలనుకునే వారు ఇకపై ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవాలి. ఈ ఏడాది నుంచే ఆన్‌లైన్‌లో దరఖాస్తుల ప్రక్రియను ప్రారంభిస్తున్నట్టు ఓయూ వీసీ ప్రొఫెసర్ ఎస్ రామచంద్రం తెలిపారు. శనివారం దూరవిద్యా కేంద్రంలో ఇందుకు సంబంధించి రూపొందించిన బ్రోచర్‌ను, ప్రత్యేక పోర్టల్‌ను ఆయన ప్రారంభించారు. డిగ్రీ, పీజీ, పీజీ డిప్లమాలో చేరాలనుకునే వారు 16 నుంచి దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సమర్పించవచ్చని సూచించారు. పూర్తి వివరాలు పోర్టల్‌లో ఉన్నాయని తెలిపారు.

వేళంకిని ఉత్సవాలకు ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్,ఆంధ్రప్రభ: తమళనాడులోని వేళంకిని ఉత్సవాలకు రైల్వేశాఖ ప్రత్యేకరైళ్లను నడుపుతోంది. సికింద్రాబాద్ -వేళం కిని - సికింద్రాబాద్ ప్రత్యేకరైలు 07060 సెప్టెంబర్ 5 న ఉదయం 7.30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు 9.35 గంటలకు వేళంకిని చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో 07059 ప్రత్యేక రైలు వేలం కినిలో సెప్టెంబర్ 9 న 18.45 గంటలకు బయలుదేరి మరుసటి రోజు 20.05 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. మార్గమధ్యలో జనగామ, కాజిపేట, వరంగల్, ఖమ్మం, విజయవాడ, తెనాలి, నిడుబ్రోలు, బాపట్ల, చీరాల, ఒంగోలు, కావలి, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, కాట్పాడి, విల్లుపురం, తిరుపద్రిపులియార్, కొడలూరు పోర్టు, చిదంబరం, మైలాదుతురాయి, తిరువూరు, నాగపట్నం మీదుగా వేళంకిని చేరుకుంటాయి.అదే విధంగా వేళంకిని - విజయవాడ 07413 ప్రత్యేక రైలు సెప్టెంబర్ 6న 12.50 గంటలకు విజయవాడలో బయలుదేరి, మరుసటి రోజు7.30 గంటలకు విజయవాడ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో 07412 విజయవాడ -వేళంకిని ప్రత్యేక రైలు సెప్టెంబర్ 8 న 15.10 గంటలకు బయలుదేరి, మరుసటి రోజు 7.30 గంటలకు వేళంకిని చేరుకుంటుంది.

టీఎస్‌పీఎస్సీ సభ్యులకు వేతనాలు ఎందుకు పెంచారు?

హైదరాబాద్, ఆంధ్రప్రభ: టీఎస్‌పీఎస్సీ సభ్యుల వేతనాలను రాష్ట్ర ప్రభుత్వం భారీగా పెంచడం పట్ల తెదేపా రాష్ట్ర శాఖ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తీవ్ర అభ్యం తరం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఉద్యోగులు, కార్మికు లకు ఇచ్చిన హామీలను నెరవె ర్చకుండా నిర్లక్ష్యం చేస్తూ రాష్ట్ర ప్రతిష్టను దిగజార్చుతున్న వారి జీతాలను మూడు రెట్లు పెంటి, 30 లక్షల నజరా నతో ఇవ్వాలని నిర్ణయం కేసీ ఆర్ పక్షపాత ధోర ణికి నిదర్శనమని శనివారం విడుదల చేసిన ప్రకటనలో తెలి పారు.అటవి ఉద్యోగులు, కాంట్రాక్టు ఉద్యోగులు జీతాలను కూడా పెంచి గత సంవ త్సరం జనవరి నుంచి అమలు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

•మరో ముగ్గురికి గాయాలు •ఇటిక్యాల వద్ద ఘటన



గుడిసె హన్మంతు | రత్నం

ఇటిక్యాల, కెఎన్ఎన్: ఆగివున్న గూడ్స్ వాహనాన్ని ఢీకొన్న సంఘటనలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ముగ్గురికి తీవ్ర గాయాలైన సంఘటన 44వ జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. జోగులాంబ గద్వాల జిల్లా, ఇటిక్యాల ఎస్ఐ జగదీశ్వర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కర్నూలు జిల్లాలోని ముడుమాల గ్రామానికి చెందిన మల్లెపోగు రత్నం, ప్రభుదాసు, శ్యామల, లక్ష్మిదేవిలు హైదరాబాద్ పట్టణానికి వలస వెళ్లారు. మూడు రోజులు సెలవులు రావడంతో తమ పిల్లలను చూడడానికి శుక్రవారం అర్ధరాత్రి హైదరాబాద్ నుంచి బొలెరా వాహనంలో స్వగ్రామానికి బయలుదేరారు. ఈ క్రమంలో శనివారం తెల్లవారుజామున బీచుపల్లి స్టేజి సమీపంలో ఆగి వున్న గూడ్స్ వాహనాన్ని ఢీకొట్టడంతో మహబూబ్‌నగర్‌కు చెందిన డ్రైవర్ గుడిసె హన్మంతు(35), మల్లెపోగు రత్నం(35)లు అక్కడికక్కడే మృతి చెందారు. వీరితోపాటు ఉన్న ప్రభుదాసు, శ్యామల, లక్ష్మిదేవిలకు తీవ్ర గాయాలు అయ్యాయి. ఇది గమనించిన హైవే సిబ్బంది వారిని చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించారు. విషయం తెలుసుకున్న ఇటిక్యాల ఎస్ఐ తన సిబ్బందితో అక్కడికి చేరుకుని సంఘటన వివరాలను పరిశీలించి సమాచారాన్ని గద్వాల డీఎస్పీ బాలకోటికి తెలి యజేశారు. వెంటనే డీఎస్పీ అక్కడికి చేరుకుని సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

సబ్సిడీ ధరలకు ‘ఉల్లి’ విక్రయాలు

● రైతుబజార్లలో అందుబాటులో ఉంచాలి ● ఉల్లి ధరల నియంత్రణకు తక్షణ చర్యలు ● ప్రతీ రెండు గంటలకు ఒకసారి సమీక్ష ● ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశం



అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో ఉల్లిపాయల ధరలకు రెక్కలు రావడంతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించిన ప్రభుత్వం సబ్సిడీ ధరలకే రైతు బజార్ల ద్వారా ఉల్లిపాయలు విక్రయించాలని నిర్ణయించింది. ఈమేరకు శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వ్యవసాయశాఖ, పౌరసరఫరాలశాఖ కమిషనర్, మార్కెటింగ్‌శాఖ కమిషనర్, రైతుబజార్ల సీఈఓతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. గత వారం రోజులుగా రాష్ట్రంలో ఉల్లిధరలు కిలో రూ.30 నుండి రూ.45 వరకూ విక్రయించంతో ఈ అధిక ధరలను అదుపు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సంబంధితశాఖ అధికారులను ఆదేశించారు. అవసరమైతే ఉల్లి ధరలకు సబ్సిడీ ఇచ్చి రైతుబజార్ల ద్వారా విక్రయించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ధరల పెరుగుదలపై ప్రతీ 2 గంటలకు ఒకసారి సమీక్ష నిర్వహించుకోవాలని సిఎం స్పష్టం చేశారు. రాష్ట్రంలోని అన్ని రైతుబజార్లలో ఉల్లిపాయలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, అక్రమంగా ఉల్లిపాయల నిల్వలు చేస్తే వారిపై మార్కెటింగ్, సివిల్‌సప్లైశాఖ అధికారులు దాడులు నిర్వహించి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో ఉల్లిధరలపై 1100 టోల్‌ఫ్రీ నెంబరు ద్వారా ఫిర్యాదులు వస్తే ఆయా ప్రాంతాల్లో కొరతను నివారించేందుకు చర్యలు తీసుకోవాలని సిఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. అవసరమైతే మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల నుండి ఉల్లిని సేకరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రైతుబజార్లలో ఉల్లిపాయల ధరలు అదుపులో ఉండేలా చూడాలని, ఎక్కడా ఎలాంటి కొరత లేకుండా వ్యవహరించాలని రాష్ట్ర మార్కెటింగ్‌శాఖ కమిషనర్, పౌరసరఫరాలశాఖ కమిషనర్, రైతుబజార్ సీఈఓలను సిఎం ఆదేశించారు. వాస్తవానికి ఉల్లి ధరలను మార్కెటింగ్‌శాఖ రూ.18కే విక్రయించాని చెప్పడంతో ఈ పరిస్థితి నుండి వ్యాపారులు తప్పించుకోవడానికి బయటి మార్కెట్లకు తరలించి అధికలాభాలు ఆర్జిస్తున్నారు. ఇదిలా ఉండగా గత రెండు మూడు వారాలు టమోటా ధరలు రూ.60 నుండి రూ.100 వరకూ విక్రయించడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అయితే ఈధరలు కేవలం వారం రోజుల క్రితమే రూ.30కి దిగి వచ్చింది. టమోటా దిగుబడి గుంటూరు, కృష్ణా జిల్లాల నుండి రావడంతో ధరలు తగ్గుముఖం పట్టాయి. టమోటా ధరలపై ప్రజలు కాస్త ఊపిరి పీల్చుకున్న తరుణంలో ఉల్లి ధరలు మరింత ఘాటెక్కడంతో ప్రజలు మార్కెట్ వైపుకు వెళ్లడానికే ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

ప్రస్తుతం మన రాష్ట్రానికి మహారాష్ట్ర నుండి ఉల్లిపాయలు దిగుమతి అవుతున్నాయి. లాసూర్, నాసిక్, అహ్మద్‌నగర్, వైజాకూర్ ప్రాంతాల నుండి దిగుమతి అవుతోంది. అయితే అక్కడి నుండి వచ్చే ఉల్లి రవాణా ఖర్చులతో కలిపి కిలో రూ22 నుండి రూ. 25 వరకూ విక్రయించవచ్చును. అందుకు విరుద్ధంగా రూ.35 నుండి రూ.40 వరకూ విక్రయిస్తుండటంతో ఈ ధరలు మరింత పెరిగే అవకాశాలున్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి సమీక్షించి ఉల్లి ధరలను నియంత్రించాలని సంబంధితశాఖ ఉన్నతాధికారులను ఆదేశించడంతో మరో రెండు రోజుల్లో ధరలు తగ్గుముఖం పట్టే అవకాశాలున్నాయి.

మౌలిక వసతుల్లేకుండా వేధింపులా?

హైదరాబాద్,ఆంధ్రప్రభ: హైదరాబాద్ నగరంలో మౌలిక వసతులు కల్పిం చకుండా, రోడ్లపై గుంతలను పూడ్చకుండా పాయింట్ల పేర వాహన ఛోదకులను వేధించడం సరికాదని మాజీ మంత్రి దానం నాగేందర్ విమర్శించారు. పాయిం ట్లకు తాము వ్యతిరేకం కాదని, దాని ముసుగులో డబ్బులు దండుకోవడాన్నే వ్యతి రేకిస్తామన్నారు. శనివారం గాంధీభవన్‌లో పీసీసీ కిసాన్ సెల్ చైర్మన్ కోదండరెడ్డి, మాజీ డిప్యూటి మేయర్ రాజ్‌కుమార్, నాంపల్లి కాంగ్రెస్ నాయకుడు వినోద్‌తో కలిసి విలేఖరుల సమావేశంలో మాట్లాడారు.

2012 మాస్టర్ ప్లాన్ అమలు చేయండి: కోదండరెడ్డి

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో తాను హెచ్ఎండీఏ చైర్మన్‌గాఉన్నానని, అప్పుడే హైదరాబాద్ నగరాన్ని విశ్వ నగరంగా మార్చేందుకు 2012లో మాస్టర్ ప్లాన్ రూపొందించినట్లు కోదండరెడ్డి తెలిపారు. ఆ మాస్టర్ ప్లాన్‌ను ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు.

టాలీవుడ్‌లో ఆరని డ్రగ్స్ చిచ్చు

వర్మకు మెంటల్.. ఇద్దరు డాక్టర్లకు చూపించాలంటూ ‘మా’ ధ్యజం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: టాలీవుడ్‌లో డ్రగ్స్ చిచ్చు ఆరడం లేదు. ప్రస్తుతం దర్శకుడు రాంగోపాల్‌వర్మ మీద ఒంటికాలి మీద లేస్తోంది టాలీవుడ్. సినిమా వాళ్లను మాత్రమే అతిగా ఎక్స్‌పోజ్ చేస్తోందంటూ మీడియాను, పోలీసు డిపార్ట్ మెంట్‌ను తనదైన శైలిలో దుయ్యబట్టిన వర్మ తొలుత మంచి మార్కులే కొట్టేసినప్పటికీ క్రమంగా ఆయన వైఖరికి తెలుగు సినీ పరిశ్రమ దూరంగా జరుగుతోంది. సిట్ చీఫ్ అకున్ సబర్వాల్‌ను అందరూ బాహుబలితో పోలుస్తున్నారని, ఆయనతో రాజమౌళి బాహుబలి-3 సినిమా తీయాలని రామ్ గోపాల్‌వర్మ చేసిన కామెంట్ వాతావరణాన్ని వేడెక్కించిన సంగతి విదితమే. పోలీసు అధికారుల్ని రెచ్చగొట్టడం శ్రేయస్కరం కాదని అప్పట్లోనే మా అధ్యక్షుడు శివాజీరాజా వర్మ వ్యాఖ్యలపై కౌంటర్ ఇచ్చారు. మరోవైపు సెప్టెంబర్‌లో సెకండ్ లిస్ట్ లోనూ టాలీవుడ్‌లో మరికొందరు ప్రముఖుల పేర్లు ఉండవచ్చన్న ఊహాగానాలు వెలువడుతున్నాయి. దీంతో పరిశ్రమలో పెద్దలంతా పెదవి విప్పడం ప్రారం భించారు. డ్రగ్స్ వాడకం దారులను తామే గుర్తించి వారిని దారిలో పెట్టు కుంటామని పరిశ్రమ పెద్దలు చెబుతున్నారు.

ఈ మేరకు ప్రభుత్వానికి లేఖ రాశారు. మా.. మూవీ ఆర్టిస్టుల సంఘం, ఫిలిం ఛాంబర్ సంయుక్తంగా రాసిన లేఖ మీద కూడా వర్మ అప్పుడే తీవ్రంగా స్పందించారు. ఈ లేఖ ద్వారా తాము చెయ్యని తప్పును ఒప్పుకున్నట్లయిందని, ప్రభుత్వానికి క్షమాపణ చెప్పాల్సిన అవసరం ఏమొచ్చిందని వర్మ సోషల్ మీడియాలో కామెంట్ చేశారు. దీంతో మూవీ ఆర్టిస్టు అసోసియేషన్ వర్మను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించకూడదని నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఆర్జీవీకి నిజంగానే మెంటల్ ఎక్కింది. ఆయన్ను ఒక్కరు కాదు ఇద్దరు డాక్టర్లకు చూపించాలి అంటూ మా అధ్యక్షుడు శివాజీ రాజా మండి పడ్డారు. ఏది ఏమైనా ఓ వైపు ఎక్సైజ్ సిట్ దూకుడు.. మరో వైపు దర్శకుడు రాంగోపాల్‌వర్మ కామెంట్‌లతో పరిశ్రమ వణుకుతోంది.

స్వైన్‌ఫ్లూ కలకలం

•నాగర్‌కర్నూల్ నందివడ్డెమాన్‌కు చెందిన కుర్మయ్యకు వైద్య పరీక్షలు

•స్వైన్‌ఫ్లూ అనుమానంతో హైదరాబాద్ కిమ్స్‌కు తరలించిన వైద్యులు



బిజినేపల్లి/అమరచింత, కెఎన్ఎన్: నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల్లో శనివారం స్వైన్‌ఫ్లూ కలకలం స్థానికులను ఆందోళనకు గురిచేసింది.. నాగర్‌కర్నూల్ జిల్లా, బిజినేపల్లి మండల పరిధిలోని నందివడ్డెమాన్ గ్రామానికి చెందిన కుర్మయ్య (60 సంవత్సరాలు) అనే వ్యక్తికి స్వైన్‌ఫ్లూ సోకింది. వారం రోజులుగా ఆరోగ్యం బాగలేకపోవడంతో పాలెం పిహెచ్‌సిఎస్‌కు వైద్యం కోసం తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు స్వైన్‌ఫ్లూ వ్యాధి సోకిందనే అనుమానంతో హైదరాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రికి తరలించగా.. అక్కడి వైద్యులు అతనికి స్వైన్‌ఫ్లూ వ్యాధి సోకిందని నిర్ధారించారు. విషయం తెలుసుకున్న జిల్లా వైద్యాధికారులు శనివారం గ్రామంలో మెడికల్‌క్యాంపు ఏర్పాటు చేసి ఇంటింటికి తిరిగి స్వైన్‌ఫ్లూ వ్యాధిపైన ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామంలో ప్రజలకు, చిన్నారులకు స్వైన్‌ఫ్లూ మాత్రలు పంపిణీ చేశారు.

అమరచింతలో..

వనపర్తి జిల్లా, అమరచింత మండల కేంద్రంలో గత నాలుగు రోజుల క్రితం చిన్నారి వాలిని(4) మరణించింది.. ఆమె స్వైన్‌ఫ్లూ వ్యాధితోనే మరణించినట్లు పుకార్లు రావడంతో జిల్లా వైద్యాధికారులు అమరచింతకు తరలివచారు. వనపర్తి జిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ ఎ.శ్రీనివాస్‌లు, జి ల్లా హెల్త్ సూపర్‌వైజర్ నరసింహులు, హెచ్‌ఈవో సాయిరెడ్డిలు శనివారం అమరచింతలో పర్యటించారు. ఎస్సీ కాలనీలో పర్యటించి చిన్నారి మృతికి గల కారణాలను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.... శాలిని మృతికి స్వైన్ ఫ్లూ కారణమోకాదోనన్న విషయాన్ని పరిశీలిస్తున్నామని తెలిపారు. వాతావరణ ప్రభావం వలన అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రజలు అంటు వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని సూచించారు.

మూడు నెలల్లో నేనేంటో చూపిస్తా

● 2019లో విజయం కాంగ్రెస్‌దే
● తెరాసకు సిద్ధాంతంలేదు
● టీ, పీసీసీ చీఫ్‌గా ఉత్తమ్ కొనసాగుతారు
● దమ్ముంటే ఫిరాయింపు ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించాలి
● కేసీఆర్‌కు కుంతియా సవాల్

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 2సీట్లే వస్తాయని టీఆర్ఎస్ సర్వేలో తేలిందని సీఎం కేసీఆర్ చెప్పారని, అదే నిజమని నమ్మితే పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలతో రాజీనావూలు చేయించి గెలవడానికి భయమెందుకని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్,రాజ్యసభ సభ్యుడు డాక్టర్ రామచంద్ర కుంతియా సవాల్ చేశారు. నిజంగా కేసీఆర్‌కు దమ్ముంటే ..., రాజీనామాలు చేయించాలని, ఎవరి సత్తా ఏంటో తేల్చుకుందామని ఛాలెంజ్ చేశారు. మాటల గారడీతో మభ్యపెట్టడం కాదనీ, ఆచరణలో చూపించాలని కోరారు. 2014 ఎన్నికల్లో పలు కారణాలతో కాంగ్రెస్ ఓడిందని అంగీకరించారు. అందులో పార్టీపరమైన తప్పిదాలు కూడా ఉన్నాయన్నారు. రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్‌గా నియమితులైన సందర్భంగా తొలిసారి శనివారం ఆయన హైదరాబాద్ వచ్చారు. గాంధీభవన్‌లో విలేఖరులతో చిట్‌చాట్ చేశారు. ఈసందర్భంగా పలు విషయాలపై నిర్మోహమాటంగా మాట్లాడారు.2019 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలవబోతోందని ధీమా వ్యక్తంచేశారు. వచ్చే ఎన్నికల వరకు తానే ఇంచార్జ్‌గా ఉంటానని...,వచ్చే ఎన్నికల్లో పార్టీని గెలిపించుకురావాలని రాహుల్ గాంధీ సందేశం ఇచ్చి పంపారని చెప్పారు. తాను సామాన్య కార్యకర్తనని, 30 ఏళ్లుగా కార్మిక నాయకుడిగా ఉన్నానని, వారి సమస్యలేంటో తనకు తెలుసునని పేర్కొన్నారు. పార్టీ నాయకులు కూడా క్షేత్రస్థాయికి దిగిరావాల్సిందేనని హుకుం జారీ చేశారు. ఆదివారం జరిగే పీసీసీ విస్తృత స్థాయి సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకోబోతున్నామని, అందులో సంస్థాగతంగా పార్టీ పటిష్టత, వచ్చే ఎన్నికల్లో గెలుపు వ్యూహాలను రచిస్తామన్నారు. వచ్చే మూడు నెలల్లో బూత్, గ్రామ స్థాయిలో పార్టీ శాఖలే గాక అనుబంధ శాఖలు కూడా ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ఉన్నానని, హైదరాబాద్‌లో కూర్చుని పర్యవేక్షించే ప్రసక్తి లేదని, జిల్లా,నియోజకవర్గం, మండలాలతో పాటు గ్రామాలు కూడా పర్యటిస్తానన్నారు. పార్టీలో క్రమశిక్షణ, ఐక్యత ముఖ్యమని వాటిపై ప్రత్యేక దృష్టిసారిస్తానన్నారు.



తెరాసకు సిద్ధాంతం లేదు

టీఆర్ఎస్ పార్టీకి సిద్ధాంతమే లేదనీ.., అంతా రాద్ధాంతమేననీ..., ఏ సిద్ధాంతం ఉందో ఆ పార్టీ నేతలు చెప్పాలని డాక్టర్ కుంతియా కోరారు. టీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయంగా ప్రజలు ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ వైపే చూస్తున్నారని చెప్పారు. మళ్లీ అధికారంలోకి రావడమే ఆ పార్టీ లక్ష్యం తప్ప ప్రజలు బాగుపడాలని, రాష్ట్రం అభివృద్ధి పథంలో ఉండాలని కోరుకోవడం లేదని, అందుకే అప్రజాస్వామిక పాలనను కొనసాగిస్తోందని ఆరోపించారు. దళితులు, గిరిజనులు, బీసీలపై దాడులు కొనసాగిస్తోందని మండిపడ్డారు. ఖమ్మంలో గిరిజన రైతులకు బేడీలు వేయడం, నేరెళ్లలో దళిత,బహుజనులపై పోలీసులు చిత్రహింసలకు పాల్పడడం తదితర ఘటనలు జరగడం సీఎం కేసీఆర్ దాష్టికానికి నిదర్శనాలని ఆగ్రహం వ్యక్తంచేశారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తోందని మండిపడ్డారు. బీజేపీ రాష్ట్రంలో అధికారానికి వచ్చే ప్రసక్తిలేదని, టీడీపీ కూడా అంత బలంగా లేదని, వైఎస్ ఆర్ కాంగ్రెస్ కనుమరుగవు తోందన్నారు.

అయోమయంలో తెరాసకు పట్టం గట్టారు

తెలంగాణ రాష్ట్రా న్ని కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ ఇచ్చినప్పటికీ , పరిస్థితుల ను అనుకూలంగా మార్చుకోకపోవడం, అయోమయంలో ప్రజలు టీఆర్ఎస్ కు పట్టం గట్టారని చెప్పారు. అప్పటికే పదేళ్ల పాటు అధికారంలో ఉండడం.., అందులో నూ ఆంధ్రాప్రాంతానికి చెందినవారు ముఖ్య మంత్రులుగా కొనసాగడం.., చివరి సంవత్సరంలో సీఎంగా ఉన్న నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి బహాటంగా తెలంగాణ ఉద్యమాన్ని వ్యతిరేకించడం, ప్రభుత్వ వ్యతిరేక ఓటు కాంగ్రెస్‌ను ఓడించిందని డాక్టర్ రామచంద్ర కుంతియా స్పష్టం చేశారు. తెలంగాణ ఇచ్చిన విషయంతో పాటు ఒక భరోసా ఇవ్వలేకపోవడం కూడా తమ ఓటమికికారణమన్నారు. ప్రస్తుతం ఆ పరిస్థితిలో పార్టీ లేదన్నారు.

బహుజనులకే ప్రాధాన్యత..

పార్టీ పదవుల్లో ఎస్సీ,ఎస్టీ బీసీలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తామన్నారు. ఇప్పటికే పార్టీ పదవుల్లో వారి జనాభాకు అనుగుణంగా బాధ్యతలు అప్పగించామని, ఎక్కడైనా పొరపాట్లు జరిగితే సరిదిద్దుతామని భరోసా ఇచ్చారు. మహిళలకు కూడా ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఈ వర్గాల అభివృద్ధికి కృషి చేసిన పార్టీ కాంగ్రెస్ ఒక్కటేనన్నారు.

దూరమైన వారు పార్టీలోకి రండి...

కొన్ని కారణాల వల్ల పార్టీకి దూరమై వేరే పార్టీల్లో చేరిన వారిని డాక్టర్ కుంతియా పార్టీలోకి ఆహ్వానిం చారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల ను మాత్రం ఆహ్వానించడం లేదని చెప్పారు. సస్పెండ్ అయిన వారిపై సస్పెన్షన్ ఎత్తివేసేవిషయం పరిశీలి స్తామన్నారు.

ఉత్తమ్‌కు కితాబు.. వచ్చే ఎన్నికల వరకు ఆయనే అధ్యక్షుడు

పీసీసీ అధ్యక్షుడు ఎన్ ఉత్తమ్ కు మార్ రెడ్డి చాలా బాగా పని చేస్తున్నార ని కుంతియా కితాబిచ్చారు. కార్యక్ర మాలను కూడా చేపట్టి కార్యకర్తలను కార్యోన్ముఖులను చేస్తున్నారని ప్రశం సించారు. వచ్చే ఎన్నికల వరకు ఆయనే పీసీసీ అధ్యక్షుడిగా ఉంటారని స్పష్టం ఛేశారు. పీసీసీలో మార్పులు, చేర్పులు జరుగుతున్నాయని వస్తున్న వార్తలు అవాస్తవమని కొట్టేశారు. అలాగే వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లు భట్టి విక్రమార్క, సీఎల్పీ నేత కె జానారెడ్డి,మండలిలో విపక్ష నాయకుడు షబ్బీర్ అలీ పదవుల్లో కూడా మార్పులుండవన్నారు. ఎన్నికలకు ముందే సీఎం అభ్యర్థిని ప్రకటించే సంప్రదాయం కాంగ్రెస్ పార్టీలో లేదన్నారు.

డీఎస్ పార్టీలోకి వచ్చే విషయం తెలియదన్నారు. రాజ్యసభ సభ్యుడిగా రాజ్యసభలో కేకే తదితరులతో పాత పరిచయాలతో మాట్లాడుతుంటామని అంతమాత్రాన పార్టీలు మారతారని ప్రచారం చేయడం సరికాదన్నారు.

యాత్రలను ఆహ్వానిస్తున్నాం...

పార్టీ కోసం పలు అంశాలపై యాత్రలు చేసే వారిని ఆహ్వానిస్తామని, అయితే, ముందుగా పార్టీ అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. సొంత నియోజకవర్గంలోనైతే వారంతట వారే నిర్ణయాలు తీసుకోవచ్చని, జిల్లాల్లోనైతే డీసీసీల అనుమతి అవసరమన్నారు. వారియాత్రల వల్ల పార్టీకి మేలే జరుగుతుంది కదా అని కుంతియా వ్యాఖ్యానించారు.

పార్టీ బలోపేతం అయ్యేందుకు ముం దుకు వస్తామంటే వ్యతిరేకించాల్సిన అవసరం లేదన్నారు. ఈ చిట్‌చాట్‌లో పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మండలిలో విపక్ష నాయకుడు షబ్బీర్ అలీ, మల్లు రవి తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదాన్ని నిర్మూలిస్తాం

యూత్ కాంగ్రెస్ నేతల ప్రతిజ్ఞ



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : దేశంలో ఉగ్రవాదం, మతతత్వం, హింసావాదానికి వ్యతిరేకంగా పోరాడుతామని యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు ప్రతిజ్ఞ చేశారు. అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భాన్ని పురస్కరించుకుని గాంధీభవన్ ప్రాంగణంలో ఉన్న జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహానికి మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకరరెడ్డి, మాజీ మంత్రి దానం నాగేందర్, టీపీసీసీ కిసాన్ సెల్ చైర్మన్ కోదండరెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు అనిల్ కుమార్ యాదవ్, కార్యదర్శి వెంకట్ గురిజాల , సికింద్రాబాద్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కోటం అనిల్, నాంపల్లి అధ్యక్షుడు మెట్టు సాయికుమార్ తదితరులు పూలమాల వేశారు. అనంతరం పొంగులేటి సుధాకరరెడ్డి కార్యకర్తలతో ఉగ్రవాద వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

పార్టీ పటిష్టతకు కృషి చేయండి



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : రాష్ట్రంలో పార్టీ పటిష్టతకై విబేధాలను పక్కనబెట్టి కలిసి కట్టుగా కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జీ డాక్టర్ రామచంద్ర కుంతియా విజ్ఞప్తిచేశారు. ఆయన ఇంచార్జీగా నియమితులైన తర్వాత తొలిసారిగా హైదరాబాద్ వచ్చిన సందర్భంగా స్థానిక హోటల్‌లో టీపీసీసీ విందు కార్యక్రమం ఏర్పాటు చేసింది.ఈ సందర్భంగా తన లక్ష్యాలను ఆయన నాయకులకు వివరించారు. ఈ సందర్భంగా కొత్తగా ఇంచార్జి కార్యదర్శిగా నియమితులైన రమేష్‌జర్కుహోళీని ఆయన అందరికి పరిచయం చేశారు. పీసీసీ అధ్యక్షుడు ఎన్ ఉత్తమ్‌కుమార్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లు భట్టివిక్రమార్క, సీఎల్పీ నాయకుడు కె జానారెడ్డి, మండలిలో విపక్ష నాయకుడు కె జానారెడ్డి, ఎఐసీసీ కార్యదర్శి మధుయాష్కీ గౌడ్, ఎమ్మెల్యేలు డాక్టర్ జె గీతారెడ్డి, డీకే అరుణ, ఎస్ఎ సంపత్‌కుమార్, ఎంపి నందిఎల్లయ్య, పీసీసీ కోశాధికారి గూడూరు నారాయణరెడ్డి తదితరులతో ప్రత్యేకంగా మాట్లాడారు. రాష్ట్రంలో పార్టీ పరిస్థితిని గూర్చి అడిగి తెలుసుకున్నారు. ఈ విందు కార్యక్రమంలో ఎమ్మెల్సీలు, మాజీమంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, పీసీసీ ఆఫీస్ బేరర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వారందరితో కూడా ఆయన మాట్లాడి పార్టీ కోసం బాగా పని చేయాలని సూచించారు.

అద్దెకు ట్రంప్ ఇల్లు



వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌లా జీవించాలని అనుకుంటున్నారా? కాస్త ఖర్చయినా ఫరవాలేదనుకుంటే మీ కోరిక ఇట్టే తీరిపోతుంది. లిస్టింగ్ అనే ఆన్‌లైన్ సంస్థ ఇందుకు అవకాశం కల్పిస్తోంది. ట్రంప్ చిన్నతనంలో నివాసం ఉన్న ఇంటిలో మీరు దర్జాగా గడిపే అద్భుత అవకాశాన్ని వినియోగించుకోండి అంటూ లిస్టింగ్ ఆన్‌లైన్ సంస్థ ప్రకటనలు ఇస్తోంది. 1940ల నాటి రాజభవంతిని తలపించేలా ఉన్న న్యూయార్క్‌లోని క్వీన్స్ హౌస్‌లో ఐదు బెడ్‌రూంలు ఉన్నాయి. ఈ విశాల భవనంలో 20 మంది వరకు బస చేయొచ్చు. ఇందుకు ఒక రాత్రికి 725 డాలర్లను చెల్లించాల్సి ఉంటుంది. అయితే, విందులు, వినోదాలు, స్మోకింగ్‌చేయడాలు ఇక్కడ నిషిద్ధం. ట్రంప్ జ్ఞాపకాలు, ఇతర లగ్జరీ సౌకర్యాలతో పాటు లివింగ్‌హాల్‌లో ట్రంప్ భారీ కటౌట్ కూడా ఉంది. గత మార్చిలో ఈ ఇంటిని పారామౌంట్ అనే ఆక్షన్ సంస్థ 2.14 మిలియన్ డాలర్లకు విక్రయించింది.



మరణించినా...జీవిస్తారు

● అవయవ దానంపై అవగాహన పెరగాల్సిందే
● పెద్ద ఎత్తున ప్రచార దినోత్సవం అవసరం
● నేడు అవయవదాన దినోత్సవం

రంగారెడ్డి, కెఎన్ఎన్ : వ్యక్తి మరణించినా తన కళ్లు ఈ ప్రపంచాన్ని చూస్తూనే ఉంటాయి.... ఈ లోకంలో లేకపోయినా మూత్రపిండాలు రక్తాన్ని శుద్ధి చేస్తూనే ఉంటాయి....శ్వాస ఆగిపోయినా గుండె లబ్‌డబ్ అంటూనే ఉంటుంది.....ఇది కేవలం అవయవ దానం ద్వారానే సాధ్యం. చాలామంది బ్రెయిన్‌డెడ్ అయిన వ్యక్తి కుటుంబ సభ్యుల అనుమతితో బతికి ఉన్న వారికి అవయవాలు దానం చేస్తుంటారు. ఒకరు చనిపోతూ నలుగురికి జీవితాన్ని అందిస్తున్నారు. రోడ్డు ప్రమాదాలు, అనారోగ్యంతో మృతి చెందుతున్న వారి అవయవాలు మరో వ్యక్తికి ఏర్పాటు చేసే ప్రక్రియ కొనసాగుతోంది. కాకపోతే కుటుంబ సభ్యుల అనుమతితోనే బ్రెయిన్‌డెడ్‌కు గురైన వ్యక్తి అవయవాలు తీసుకుంటారు. తమ సంతానం లేకపోయినా అతని అవయవాలు మరో నలుగురికి ప్రాణం నిలిపాయనే సంతోషంతో చాలామంది ఉంటున్నారు. అందుకే చనిపోతూ మరో నలుగురు ప్రాణదానం చేయడమంటే పునర్జన్మను ఇవ్వడమే. కాకపోతే అవయవ దానం విషయమై ఇంకా ప్రజల్లో చాలా అవగాహన రావల్సిన అవసరం ఎంతైనా ఉంది. సరియైన సమయంలో అవయవాలు దొరక్క చాలామంది చనిపోతూనే ఉన్నారు. వారికి సరియైన సమయంలో అవయవాలు దొరికితే వాళ్లు నిండు నూరేళ్ల జీవితాన్ని కాపాడే వీలుంది. అవయవ దానం విషయమై ప్రజల్లో పెద్దఎత్తున అవగాహన వస్తే చాలామందికి ప్రయోజనం చేకూరనుం ది. దేశ వ్యాప్తంగా ప్రతి ఏడాది 2లక్షల మందికి కిడ్నీల మార్పిడి అవసరం కాగా ఐదువేల మంది వరకు మాత్రమే మార్పు చేస్తున్నారు. ఆర్థికంగా ఉన్న వాళ్లు కొనుగోలు చేసుకుంటున్నారు. పేదలు మాత్రం మృత్యువుతో పోరాడి ఓడిపోతున్నారు. గుండె మార్పిడిలు కూడా చాలా అవసరం ఉండగా దానికి అనుగుణంగా దొరకడం లేదు. మూఢనమ్మకాలతో చాలా మంది అవయవాలను దానం చేసేందుకు ముందుకు రావడం లేదు. చదవుకున్న వారిలో కూడా మార్పు రావల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అవయవ మార్పిడికి రోడ్డు ప్రమాదాలే పెద్ద వనరుగా మారింది. ప్రతిరోజు దేశ వ్యాప్తంగా 4 నుంచి 6 శాతం మేర రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డు ప్రమాదంలోనే ఎక్కువమంది తమ ప్రాణాలు కోల్పోతున్నారు. రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువమంది తలకు తీవ్రగాయాలై బ్రెయిన్‌డెడ్ అవుతున్నారు. ఇలాంటివారి అవయవాలను తీసుకుని మరో నలుగురికి ప్రాణాలు కాపాడుతున్నారు.



పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నాం: రెడ్‌క్రాస్ కార్యదర్శిసాయిచౌదరి

అవయవదానంపై రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ప్రచారం నిర్వహిస్తున్న ఆ సంస్థ కార్యదర్శి సాయిచౌదరి తెలిపారు. ముందుగా తాను అవయవ దానం చేస్తానని అంగీకర పత్రం ఇచ్చిన తరువాత కాలేజీలు, కర్మాగారాలకు వెళ్లి అక్కడి వారికి అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 1970 మంది తమ అవయవాలు దానం చేసేందుకు ముందుకు వచ్చారని మరింత మందికి అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని సాయిచౌదరి పేర్కొన్నారు.

సెర్ప్‌లో సంస్కరణలు

● పనితీరు ఆధారంగా గ్రేడ్లు ● గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకూ వర్తింపు
● ఏరియా కోఆర్డినేటర్ల వ్యవస్థ తొలగింపు ● మండలస్థాయిలో ఏపీఎంలకే బాధ్యతలు
● ముసాయిదాను సిద్ధం చేసిన సెర్ప్ ● త్వరలో అమలుకు శ్రీకారం



హైదరాబాద్, ఆంధ్రప్రభ:తెలంగాణ రాష్ట్ర గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్)లో భారీగా సంస్కరణలు చేసేందుకు అధికారులు సన్నద్ధమౌతున్నారు. గత కొంతకాలంగా సెర్ప్ కార్యకలపాలు ఇంఛార్జ్ సీఇఒలతోనే నడిచింది. ఇటీవల పూర్తిస్థాయి సీఇఒగా బాధ్యతలు చేపట్టిన పౌసమిబసు సెర్ప్‌కు పూర్వవైభవం తెచ్చేందుకు పూనుకున్నారు. గత రెండు నెలలుగా సెర్ప్ కార్యకలపాలపై సీఇఒ ప్రత్యేక దృష్టి కేంద్రీకరించింది. వృధాగా ఉన్న విభాగాలను ఎత్తివేయడ మా లేక వేరే విభాగాల్లో విలీనం చేయాలా? అనే అంశాలపై సుదీర్ఘంగా అధ్యయనం చేసినట్లు తెలిసింది. దీంట్లో భాగంగానే గత నెల రోజుల నుంచి సెర్ప్ ఆధ్వర్యంలో పనిచేస్తున్న అన్ని విభాగాల్లో ఎలాంటి సంస్కరణలు చేపట్టాలనే అంశాలపై చర్చిస్తున్నారు. ఈ సంస్కరణలను త్వరలోనే అమలు చేయాలని యోచిస్తున్నారు. వీటిలో ప్రధానంగా గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయిలో పనిచేస్తున్న సిబ్బంది పనితీరును బేరీజు వేయనున్నారు. ఈ సిబ్బంది పనితీరు ఆధారంగానే గ్రేడ్లను ఇవ్వనున్నది. దీని కోసం ప్రత్యేకంగా కొన్ని సూచికలను కూడా తయారు చేసి దాని ఆధారంగానే పనితీరు సూచికలను రూపొందించారు. అంతేకాకుండా అయా యూనిట్లల్లో జరుగుతున్న పనులు, దానికి అవసరమైన సిబ్బంది, తదితర అంశాలపై కూడా ముసాయిదాలో చేర్చారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్రస్థాయికి వర్తించే విధంగా ఈ సంస్కరణలను సెర్ప్ చేపట్టనున్నది. క్షేత్రస్థాయిలో 5 మండలాల్లో ఇందిరా క్రాంతి పథం కార్యక్రమాలను పర్యవేక్షించేందుకు ఏరియా కోఆర్డినేటర్లను నియమించింది. ఈ ఏరియా కోఆర్డినేటర్ల వ్యవస్థను ఎత్తివేయనున్నారు. ఈ వ్యవస్థ వల్ల పెద్దగా ఉపయోగం లేదని సెర్ప్ సీఇఒ భావిస్తున్నట్లు తెలిసింది. ఏరియా కో ఆర్డినేటర్లకు అన్ని రకాల పనులను అప్పగించనున్నది. అదే విధంగా జిల్లాస్థాయిలో చాలా విభాగాలున్నాయి. వాటికి ఒక్కో ఇంఛార్జ్ ఉన్నారు. వీరిలో ప్రత్యేక ఏపీఎంలు, ప్రత్యేక డీపీఎంలు కూడా ఉన్నారు. ఈ విభాగాలన్నింటిని విలీనం చేసి జిల్లాస్థాయిలో డీపీఎం అన్ని పనులకు బాధ్యతను చేయాలని భావిస్తున్నారు. నియోజకవర్గ స్థాయిలో క్లస్టర్ కో ఆర్డినేటర్ల వ్యవస్థను కూడా తీసేయ్యానున్నట్లు తెలిసింది. మండలస్థాయిలో ఒక్కో విభాగానికి ఒక ఇంఛార్జ్ కాకుండా ఏపీఎంలకే అన్ని విభాగాలకు బాధ్యత ఇవ్వనున్నారు. దీంతో పనిలేని విభాగాలను పూర్తిగా తొలగించి సిబ్బందికి చేతినిండా పనులను కల్పించాలని సెర్ప్ భావిస్తుంది. ఇటీవల జరిగిన డైరెక్టర్ల సమావేశంలో అయా విభాగాలకు సంబంధించిన అంశాలను ముసాయిదాలో విలీనం చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. వీటిలో సిబ్బంది పనితీరు ఆధారంగానే గ్రేడ్లు ఇవ్వడం. దీంతోపాటు అన్ని విభాగాలను ఒకే గొడుగు కిందకు చేర్చి ఒకే అధికారి పర్యవేక్షణలో ఉండే విధంగా రూపొందించనున్నట్లు తెలిసింది. దీనివల్ల పనుల్లో సిబ్బందికి స్పష్టత ఉంటుందని భావిస్తున్నట్లు తెలిసింది. ప్రస్తుతం ఒక్కో విభాగానికి ఒక అధికారి ఉండడం వల్ల కిందస్థాయి సిబ్బంది చాలా మంది అధికారుల ఆదేశాల అనుగుణంగా పనిచేయాల్సి ఉంటుంది. దీనివల్ల పనులకు ప్రాధాన్యత ఇవ్వలేకపోతున్నట్లు తెలిసింది. ఇదే కాకుండా నిధులు లేని పథకాలకు స్వస్తి చెప్పాలనే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. స్త్రీ, శిశు సంక్షేమం, వ్యవసాయం, విద్య, వైద్య, ఆరోగ్యం, ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనార్టీ సంక్షేమశాఖలకు సంబంధించిన పథకాలను కూడా సెర్ప్ నోడల్ ఏజెన్సీగా ఉండి అమలు చేస్తున్న విషయం తెలిసిందే. దీంతో ఈశాఖల్లో నిధులు లేని వాటిని సంబంధిత శాఖకు బదిలీ చేసి చేతులు దులుపుకోవాలని కూడా యోచిస్తున్నది ఇదిలా ఉండగా పనితీరు ఆధారంగా గ్రేడ్లు, సూచికలు ఇవ్వడం సెర్ప్‌లో కొత్తేమి కాదని పలువురు ఉద్యోగులు పెదవి విరుస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 22 జిల్లాల్లో పనిచేస్తున్న సిబ్బందికి పనితీరు సూచికలుండేవి. కానీ తెలంగాణ నూతన రాష్ట్రం ఏర్పడిన తర్వాత వాటిపై పెద్దగా దృష్టి కేంద్రీకరించలేదని తెలిసింది.దీంతో ఉన్నతాధి కారుల పరిధి తగ్గడంతో పాటు కొరత కూడా ఏర్ప డింది. దీంతో అన్ని విభాగాలను ఒకే గొడుగు కిందకు చేర్చాల ని నిర్ణయించినట్లు సమాచారం. దీంతో సెర్ప్ డైరెక్టర్లు తయా రు చేసిన ముసాయిదా వల్ల సెర్ప్‌కు పూర్వ వైభవం వస్తుందా? అని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం.



చంద్రబాబు ప్రచారానికి వస్తే నిలదీయండి

● వచ్చేది రాజన్న రాజ్యమే ● బాబు హామీలన్నీ హుళక్కే ● రోడ్‌షోలో జగన్ ధ్వజం

గోస్పాడు , ఆంధ్రప్రభ : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రచారానికి వస్తే నిలదీయాలని గట్టిగా హామీలపై అడగాలని వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అన్నారు. చంద్రబాబు చేసిన మోసాలు, ఆయన మూడేళ్ళ పరిపాలనకు రెఫరేండంగా ఓటు వేసే సమయం ఆసన్నమైందని, ఆలోచించి ఓటు హక్కు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. అన్ని విధాలుగా మోసం చేసిన చంద్రబాబును ఉరి తీసినా తప్పులేదన్నారు. నంద్యాల నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన శనివారం గోస్పాడు మండలంలో విస్తృతంగా పర్యటించారు. రోడ్ షోల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగన్మోహన్‌రెడ్డి తనదైన శైలిలో ప్రసంగిస్తూ నంద్యాల ఉప ఎన్నికలు 2019లో జరిగే కురుక్షేత్రానికి నాంది అన్నారు. రేషన్ షాపుల్లో ముఖ్యమంత్రిగా చంద్రబాబు లేనప్పుడు 9 వస్తువులు ఇచ్చేవారని, కానీ ఇప్పుడు ఒక్క బియ్యం తప్ప ఏమైనా ఇస్తున్నారా అని ప్రశ్నించారు. కర్నూలులో కొత్తగా ఎయిర్‌పోర్ట్ , ఫుడ్ పార్క్, టెక్స్‌టైల్స్ ఏర్పాటు చేస్తామని ఇచ్చిన మాట తప్పారని, రూ. 2 వేల నిరుద్యోగి భృతి పట్టించుకోవడం లేదని, ఓటు బ్యాంక్ కోసం చదువుకున్న పిల్లలను మోసం చేశారని, పొదుపు , డ్వాక్రా రుణాలు మాఫీ కాలేదని ధ్వజమెత్తారు. రైతుల దుస్థితికి చంద్రబాబే కారణమని విమర్శించారు. మూడేళ్ళుగా పట్టించుకోని చంద్రబాబు, మంత్రులు నంద్యాల రోడ్లపై తిరగడంలోని ఔచిత్యాన్ని ప్రశ్నించారు. రూ. 5 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి అని చెప్పి మోసం చేశారని, పసుపు, శనగ, కంది సహా ఏ పంటకు కూడా రేటు లేదని, ఇప్పుడు మిర్చి పంటను కూడా నడి రోడ్డుపై తగలపెట్టే పరిస్థితి ఏర్పడిందన్నారు. వైఎస్ హాయాంలో కెసి కెనాల్ ద్వారా రెండు పంటలు పండేవని, ఇప్పుడు చంద్రబాబు పాలనలో ఒక పంట అయినా లేదన్నారు.



రుణాల మాఫీ దేవుడు ఎరుగు వడ్డీలేని రుణాలు కూడా ఎగ్గొట్టారని ధ్వజమెత్తారు. వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి రాగానే నవరత్నాలను అమలు చేయటం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు అన్నారు. గత మూడు సంవత్సరాల్లో ఇచ్చిన ఒక్క హామీ కూడా ముఖ్యమంత్రి అమలు చేయటం లేదని ఆరోపించారు. కనీసం కర్నూలులో ఇచ్చిన హామీలు కూడా అమలుకు నోచుకోక పోవటం విడ్డూరంగా ఉందని వ్యాఖ్యానించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన నంద్యాల మండల పరిధిలో శనివారం రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో హాజరైన వారిని ఉద్దేశించి జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ డబ్బుతో దేనినైనా కొనవచ్చునే అహంకారం చంద్రబాబులో ఉందని విమర్శించారు. అనేక అన్యాయాలు, మోసాలు చేస్తున్న వ్యక్తిని పట్టించుకోకపోతే ఈ వ్యవస్థలో మార్పు రాదన్నారు. చంద్రబాబు మూడు సంవత్సరాల పాలనపైనంద్యాల ఎన్నిక ప్రజలు ఇచ్చే తీర్పు అన్నారు. తన దగ్గర డబ్బులు, అధికారం, దుర్బుద్ధి లేవని, పోలీసుల అండకూడా లేదని అన్నారు. లేనిది ఉన్నట్టుగా, ఉన్నది లేనట్టుగా చెప్పటం తన వల్ల కాదని, అదే విధంగా పేపర్లే, ఛానళ్లు కూడా లేవన్నారు. తనకు ఉన్న ఆస్థి వైఎస్సార్ అని, నాన్న ఇచ్చిన పెద్ద కుటుంబమే తనకు ముఖ్యమన్నారు. చంద్రబాబు బెదిరింపులు, దౌర్జన్యాలు మానుకోవా లని డిమాండ్ చేశారు. 2014లో జరిగిన ఎన్నికల్లో ప్రజలను మోసం చేసి చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చాడని అన్నారు. పరిపాలన పేరుతో అవినీతి చేయబట్టే అభివృద్ధి వెనుకాడుతుందని విమర్శించారు. వైసీపీకి మద్ధతుగా ఉన్నందునే నంద్యాలలో అరాచకాలు సాగుతున్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో సామాజిక న్యాయం లోపించిందని, అదే విధంగా ప్రజల మీద కేసుల మీద కేసులు బనాయిస్తూ భయాందోళనకు గురి చేస్తున్నారని ఆరోపించారు. తాను మాట తప్పనని, మడమ తిప్ప నని తెలియజేశారు. వైసీపీ అధ్యక్షుడు శిల్పా మోహనరెడ్డి మాట్లా డుతూ రాజన్న రాజ్యం రావాలంటే వైసీపీని నంద్యాల ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. తాను గతంలో మంత్రిగా, ఎమ్మెల్యేగా ఈ ప్రాంతానికి ఎంతో సేవలు చేశానని, అంతకు మించి అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. గోస్పాడు మండలంలోని ఎంపీ వంటివేలగల జన తదితర ప్రాంతాల్లో ఆయన రోడ్‌షో నిర్వహిస్తే ప్రజలు నుంచి బాగా స్పందన లభించింది. ఈ రోడ్ షోలో వైఎస్సార్‌సీపీ నంద్యాల అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యూహాత్మకంగా మంత్రాంగం

అమరావతి, ఆంధ్రప్రభ : నంద్యాల ఎన్నికల ప్రచారంలో మంత్రులు వ్యూహాత్మకంగా ముందుకు సాగుతున్నారు. ఎప్పటికప్పుడు ప్రచార సరళిని మార్చేస్తూ విస్తృతంగా పర్యటిస్తున్నారు. గెలుపే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. శనివారం మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో మంత్రులు అమరనాథ్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి , అఖిలప్రియ, కాల్వ శ్రీనివాసులులు పలు మార్లు మంతనాలు జరిపారు. ఎన్నికల్లో ఎదుర్కొనే దిశగా పకడ్బందిగా ప్రచారాన్ని పదునెక్కించాలని నిర్ణయించారు. ముఖ్యంగా గత నాలుగు రోజులలో జరిగిన సంఘటనలపై భేరీజు వేసిన మంత్రులు వైఎస్సార్‌సీపీ దూకుడుగా వెళ్తే నియంత్రిం చాలని, వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం పై, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై చేస్తున్న విమర్శ లను బాగా ప్రజల్లోకి తీసుకెళ్ళాలని నిర్ణయించారు. సర్వేలో పాల్గొన్న టీడీపీ సానుభూతి పరులు కొందరిని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పట్టుకోవడాన్ని మంత్రులు ఖండించారు. గత వారం రోజుల్లో నంద్యాల నియోజకవర్గంలో టీడీపీకి పాజిటివ్ వాతావరణం సృష్టించడంలో కృతకృత్యులు అయ్యామన్న సంతృప్తిని వ్యక్తం చేసిన మంత్రులు రూరల్ పరిధిలో, నంద్యాల టౌన్‌లోని మైనార్టీ, ఇతర సామాజిక వర్గాల ఓట్లపై ప్రత్యేకంగా దృష్టిసారించాలని నిర్ణయించారు. అంతేకాకుండా సామాజిక వర్గాల ప్రభావం గణనీయంగా ఉన్న నేపథ్యంలో వివిధ వర్గాలకు చెందిన పార్టీ నేతలను ప్రచారం బరిలోకి దించాలనే దిశగా కసరత్తు జరిగింది. ఈ నెల 19,20వ తేదీల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జరుపనున్న నంద్యాల ఎన్నికల పర్యటనపై కూడా చర్చ జరిగింది.

సెన్సార్ బోర్డిదే

న్యూఢిల్లీ: కేంద్ర ఫిలిం సెన్సార్ బోర్డు అధ్యక్షపదవి నుంచి పహ్లాద్ నీహలనీని తొలగించి ఆయన స్థానే గీత రచయిత,స్క్రీన్‌ప్లే రచయిత, యాడ్ గురుగా పేరొందిన ప్రసూన్ జోషిని కేంద్ర ప్రభుత్వం నియమించింది. కేంద్ర ఫిలిం సెన్సార్ బోర్డులో విద్యాబాలన్, జీవిత రాజ శేఖర్, తాడిమళ్ళ గౌతమిలకు సభ్యత్వం లభించింది. బోర్డు చైర్మన్ పదవి నుంచి నీహలనీని తొలగించడంతో చలనచిత్ర రంగానికి చెందిన వారెంతోమంది ఊరట చెందారు.

విద్యాబాలన్: పునర్వ్యవస్థీకరించిన సెన్సార్ బోర్డులో సభ్యత్వం పొందిన విద్యాబాలన్ డర్టీ పిక్చర్, కహానీ చిత్రాల ద్వారా దేశవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించారు.టెలివిజన్‌లో ప్రసారమైన హమ్ పాంచ్‌తో ఆమె తన కెరీర్‌ని ప్రారంభించారు.బాలీవుడ్‌లో పరిణీత లో చోటు సంపాదించేందుకు అది దోహదం చేసింది. ఆమె నటిగానే కాక, సామాజిక ఉద్యమాల్లో కూడా తరచూ పాల్గొంటున్నారు. ముఖ్యంగా మహిళా సాధికారత కోసం ఉద్యమాల్లో ప్రముఖ పాత్ర వహిస్తున్నారు.

కొత్త బాధ్యతలకు న్యాయం చేస్తా: కేంద్ర ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యురాలిగా తనను నియమించడం పట్ల విద్యా బాలన్ ఆనందాన్ని వ్యక్తం చేశారు. కొత్త బాధ్యతను శక్తివంచన లేకుండా నిర్వహిస్తానని ఆమె చెప్పారు.

రమేష్ పతంగే: రమేష్ పతంగే ఆర్ఎస్ఎస్ సభ్యుడు. ఆయన సెన్సార్ బోర్డులో 2015లో చేరారు. సామాజిక్ సమరసత మంచ్ అనే మరాఠీ వారపత్రికకు వ్యవస్థాపక సంపాదకుడు.

జీవిత రాజశేఖర్: తెలుగు సినీ రంగంలో జీవిత రాజశేఖర్ పరిచయం అవసరం లేని పేరు.ఆమె అనేక విజయవంతమైన చిత్రాల్లో నటించారు. వాటిల్లో అంకుశం (1990)., ఆహుతి (1988), ధర్మపత్ని (1986) ముఖ్యమైనవి.

గౌతమి తాడిమళ్ళ: గౌతమి తాడిమళ్ళ దక్షిణాది చిత్రాలన్నింటిలో నటించారు. తమిళం, తెలుగు, మలయాళం, కన్నడ రంగాల్లో ఆమె నటించిన చిత్రాలు ఎన్నో విజయవంతం అయ్యాయి. రజనీకాంత్, కమల్ హసన్, ముమ్ముట్టి వంటి అగ్రనటులతో నటించారు. తాజాగా ఆమె తెలుగులో మనమంతా చిత్రంలో నటించిన విషయం తెలిసిందే. కాగా, సెన్సార్ బోర్డులో తలకాడు శ్రీనివాసయ్య నాగాభరణ, వాణి త్రిపాఠి టికో, మిహిర్ భూటా, నరేష్ చందర్‌లాల్, నరేంద్ర కోహ్లీ, నీల్ నాంగ్యాన్, వామన్ కేంద్రే, వివేక అగ్నిహోత్రిలు కూడా సభ్యత్వాన్ని పొందారు.

ఎన్డీయేలోకి రండి


కొని తెచ్చుకున్న వేటు

- నితీశ్‌కు అమిత్ షా స్వాగతం
- కో కన్వీనర్ పదవి ఇచ్చేందుకు సిద్ధం
- జేడీయూ కూడా సుముఖం
- అడ్డంగా ఉన్న శరద్ యాదవ్ తొలగింపు
- రాజ్యసభలో పార్టీ నాయకుడిగా ఆర్సీపీ సింగ్ నియామకం
- నితీశ్‌పై శరద్‌యాదవ్ ధ్వజం
- జేడీ(యూ) తనదని, నితీశే బయటి వ్యక్తని బుకాయింపు


అందివచ్చిన అవకాశం

పాట్నా, న్యూఢిల్లీ: బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయేలోకి నితీశ్ కుమార్ చేరిక ఖరారైంది. కూటమికి కో-కన్వీనర్ బాధ్యతలను బిహార్ సీఎంకు ఇచ్చేందుకు ప్రధాని మోడీ, బీజేపీ చీఫ్ అమిత్ షా సిద్ధపడ్డారు. ఈ విషయాన్ని అమిత్ షా ట్విట్టర్ వేదికగా ప్రకటించగా, నితీశ్ కుమార్ అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. ఇందుకు అడ్డుగా ఉన్న శరద్ యాదవ్‌ను పార్టీ రాజ్యసభ నాయకుడిగా తప్పించారు. ఈ మేరకు జేడీ(యు) జాతీయాధ్యక్షుడు, బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ నిర్ణయించినట్లు, రాష్ట్ర అధ్యక్షుడు వశిష్ట నారాయణ్ ప్రకటించారు. శరద్ యాదవ్ స్థానే పార్టీ సీనియర్ నేత, నితీశ్ కుమార్ అనుచరుడిగా పేరొందిన ఆర్సీపీ సింగ్‌ను నియమించినట్లు చెప్పారు. అనంతరం ఆర్సీపీ సింగ్‌ను తమ పార్టీ నాయకుడిగా గుర్తించాలని రాజ్యసభ ఛైర్మన్ వెంకయ్య నాయుడుకి జేడీ(యు) ఎంపీలు ఓ లేఖ అందజేశారు. 1984 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారిగా పని చేసిన ఆర్సీపీ సింగ్ తన పదవికి 1999లో స్వచ్ఛందంగా విరమణ తీసుకున్నారు. నితీశ్ కుమార్‌తో ఏర్పడ్డ పరిచయం కారణంగా సింగ్ జేడీ(యు)లో చేరి అప్పటినుంచి క్రియాశీల రాజకీయాల్లో కొనసాగుతున్నారు. మహాకూటమి వదిలి బీజేపీ సాయంతో నితీశ్ ప్రభుత్వం ఏర్పాటు చేయడంపై శరద్ యాదవ్ మొదటి నుంచి అసంతృప్తి వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే. నితీశ్ తన దారి చూసుకున్నా, తాను మాత్రం మహా కూటమితోనే ఉంటానని ప్రకటించారు. పార్టీ మొత్తం తనతోనే ఉంటుందని చెప్పారు. దీంతో నితీశ్ కుమార్ సైతం ఈ విషయంపై ఘాటుగానే స్పందించారు. శరద్ యాదవ్‌కు నచ్చిన దారి చూసుకోవచ్చని దీటైన సమాధానం ఇచ్చారు.పార్టీ రాజ్యసభ నాయకుడిగా తొలగించిన వెంటనే శరద్ యాదవ్ నితీశ్ కుమార్‌పై మండిపడ్డారు. జేడీ(యు) పార్టీ కేవలం నితీశ్‌ది మాత్రమే కాదని... తనది కూడా అని వ్యాఖ్యానించారు. నితీశే బయటి వ్యక్తని అన్నారు.ప్రస్తుతం రాష్ట్రంలో రెండు పార్టీలున్నాయన్నారు. అధికార జేడీ(యు) ఒకటి కాగా, రెండోదైన ప్రజల జేడీ(యు) తమదన్నారు. ఆత్యాయికపరిస్థితి సమయంలో ఇందిరా గాంధీనే ఎదురించిన రోజులున్నాయని గుర్తు చేశారు. జేడీ(యు)లో తనవర్గాన్ని నితీశ్ కుమార్ ఆయన వైపు తిప్పుకునేందుకు బెదిరింపులకు దిగుతున్నారని ఆరోపించారు.


తప్పలేదు మరి

ఆర్జేడీలో చేరబోతున్నట్లు వస్తున్న వార్తలను ఖండించారు. రెండున్నరేండ్ల ఎడబాటు తర్వాత భారత జనతా పార్టీతో జత కట్టిన బిహార్ సీఎంకు కీలక బాధ్యతలు కట్టబెట్టాలని బీజేపీ హైకమాండ్ భావిస్తుంది. కేంద్రంలో అధికారపక్షమైన నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ (ఎన్డీఏ)కు నితీశ్ కుమార్‌ను కో-కన్వీనర్‌గా నియమించాలని ప్రధాని మోడీ, బీజేపీ చీఫ్ అమిత్ షా నిర్ణయించినట్లు వార్తలు వస్తున్నాయి.

పాక్ కాల్పుల్లో మహిళ మృతి

జమ్మూ/శ్రీనగర్: కశ్మీర్‌లో పాక్ సైన్యం కాల్పుల్లో ఒక మహిళ మృతి చెందగా, మిలిటెంట్ల దాడిలో ఒక జవాన్‌కు గాయాలయ్యాయి. పూంచ్ జిల్లాలో నియంత్రణ రేఖ పొడవునా పాక్ సైన్యం శనివారం విచక్షణారహితంగా కాల్పులు జరిపింది. భారతసైన్యం ఈ కాల్పులను తిప్పికొట్టిందని సైన్యం ప్రతినిధి చెప్పారు. అయితే.. పాక్ జరిపిన కాల్పుల్లో ఒక ఫిరంగి గుండు మొహమ్మద్ షబీర్ అనే వ్యక్తి ఇంటిపై పడగా, ఆయన భార్య రకియా బీ మరణించారు. మరో ఘటనలో కుప్వారా జిల్లాలో మిలిటెంట్లు సైనిక శిబిరంపై కాల్పులకు తెగబడ్డారు. సునీల్ రణ్‌ధావా అనే జవాన్ గాయపడ్డాడు.

కర్ణాటకలో అమిత్‌షా



బెంగళూరు: కర్ణాటకలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా పర్యటన మొదలైంది. శనివారం నుంచి మూడూ రోజుల పాటు జరిగే పర్యటనలో అమిత్ షా బీజేపీ శ్రేణులను ఉత్తేజపరచడంపై దృష్టి కేంద్రీకరిస్తారు. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బీఎస్ యడ్యూరప్ప నాయకత్వంలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి రావడమే ఆయన లక్ష్యంగా పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కెంపెగౌడ విమానాశ్రయంలో కార్యకర్తలతో మాట్లాడిన అమిత్ షా, రానున్న రోజుల్లో కర్ణాటకలో బీజేపీ ప్రభుత్వాన్ని చూడాలనుకుంటున్నానని అన్నారు. తమ అధ్యక్షుడికి బీజేపీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికాయి. ఈ సందర్భంగా అవినీతిలో మునిగిపోయిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలదోసి బీజేపీని గద్దెనెక్కించడానికి కర్ణాటకలో ప్రజలు సిద్ధంగా ఉన్నారని షా అన్నారు. 'ఈ సారి బీజేపీ సర్కార్' అన్న నినాదాన్ని నిజం చేయడానికి తాను వచ్చానని ఆయన చెప్పారు. వచ్చే ఏడాది ప్రధాని నరేంద్ర మోడీ విజయ రథం కర్ణాటకలో అడుగుపెట్టగానే విజయానికి పునాది వేసి దక్షిణాదిన పార్టీ విస్తరణను సుగమం చేయాలని అమిత్ చెప్పారు. ఆదివారం రాజకీయ వ్యవహారాల కమిటీతో సమావేశమై మాండ్యా జిల్లాలో చుంచన్‌గిరి మఠానికి వెళతారు. సోమవారం పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారు.

సైనిక క్రీడల నుంచి భారత్ ఔట్

మాస్కో: రష్యాలో జరుగుతున్న అంతర్జాతీయ సైనిక క్రీడల్లో భారత్ జోరుకు బ్రేక్ పడింది. తాజా పరిణామాల్లో భాగంగా భారత్ వాడుతున్న టి-90 యుద్ధ ట్యాంకుల్లో సాంకేతిక లోపాలు తలెత్తాయి. దీంతో భారత జట్టుపై అనర్హత వేటు వేసారు. ఈ నెల ఆరో తేదీ నుంచి మొదలైన ఈ విన్యాసాల్లో 28 దేశాల నుంచి 4,000 మంది సైనికులు పాల్గొంటున్నారు. మొదట్లో భారత సైనికులు తమ ట్యాంకులను ఇతర దేశాల వారికంటే బ్రహ్మాండంగా నడిపినా, తాజాగా అవి మొరాయించాయి. అవి నడిచే పరిస్థితి లేకపోవడంతో, భారత సైనిక జట్టుపై వేటు పడింది. ఈ సైనిక క్రీడలు రష్యాలోని ఆల్బినో పర్వత ప్రాంతాల్లో జరుగుతున్నాయి. ఇందులో మొత్తం 28 ఈవెంట్లలో పోటీలుంటాయి. రష్యా, బెలారస్, అజర్‌బైజాన్, కజకిస్థాన్, చైనాల్లో జరిగే ఈ క్రీడల్లో 2014 నుంచి భారత్ పాల్గొంటోంది. యుద్ధ రంగ పరిస్థితులకు కృత్రిమంగా సృష్టించి సైనికులు ఎలా వ్యవహరిస్తారో పరీక్షిస్తారు.

అక్కాచెల్లెళ్లకు నిప్పు



బరైలీ (యూపీ): ఉత్తరప్రదేశ్‌లోని బరైలీలో ఇద్దరు టీనేజ్ యువతులకు ఎవరో నిప్పు పెట్టారు. ఇంట్లో నిద్రిస్తుండ గా ఇంటికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. దీంతో వీరిని జిల్లా కేంద్రంలోని ఆస్పత్రిలోని ఐసీయూలో చేర్చారు. వరుసగా 19,17 ఏళ్లు వయ సున్న అక్కా చెల్లెళ్ల గదికి నిప్పు పెట్టగా వారి అరుపులకు పక్క గదిలో నిద్రిస్తున్న కుటుంబ సభ్యులు లేచారు. నిప్పును ఆర్పడానికి ప్రయత్నించినా అప్పటికే అక్కకు 95 శాతం కాలిన గాయాలు కాగా, చెల్లికి 65 శాతం దేహం కాలిపోయింది. తమకు ఎవరితోనూ విభేదాలు లేవని కుటుంబ సభ్యులు చెప్పి నా, చెల్లెలు మాత్రం తమను కొందరు అబ్బాయిలు వేధిస్తున్నారని, కొన్ని నెలల నుంచి తమను వెంటాడుతున్నారని చెప్పింది.

ప్రియుడితో కలిసి మాజీ ప్రియుడి హత్య



న్యూఢిల్లీ: ఇది ప్రేమ, బులెట్, మోసంతో కూడిన కథ. తన ప్రియురాలి ని అరెస్టు చేయడంతో ఒక వ్యక్తి ఏకంగా పోలీసులనే బెదిరించడం మొదలుపెట్టా డు. వినోద్ బేనీవాల్ అనే వ్యక్తిని రాజస్థాన్‌లోని శ్రీగంగానగర్‌లో హత్య చేసిన ఆరోపణలతో ఇందుబాల అనే 23 ఏళ్ల యువతిని పోలీసులు అరెస్టు చేసారు. ఈ కేసులో పోలీసులు గాలిస్తున్న దీపక్ మాలిక్ అనే వ్యక్తి వారికే బెదిరింపులు పంపుతున్నాడు. ఇందుబాలతో అసభ్యంగా ప్రవర్తించారంటూ ముగ్గురు కానిస్టేబుళ్లను మాలిక్ బెదిరించాడు. పోలీసుల కథనం ప్రకారం జూలై 31న బేనివాల్‌ను ఇందుబాల ఇంటికి పిలిచింది. మత్తు మం దు కలిపిన డ్రింక్ ఇచ్చింది. ఆ తరువాత అతడిని కాల్చి చంపి కారుతో తొక్కిం చేసింది. బేనీవాల్ మృతదేహం ఆధారంగా అతడెవరో గుర్తించడం కూడా పోలీ సులకు కష్టమైంది. గుర్తించిన తరువాత ఇందుబాలను అరెస్టు చేసారు. బేనివాల్‌ను ఇందుబాల మాజీ ప్రియుడిగా గుర్తించారు. ఏం వివాదాలు ఉన్నాయో కానీ ప్రస్తుత ప్రియుడు మాలిక్‌తో కలిసి బేనీవాల్‌ను చంపాలని ఇందుబాల ప్లాన్ చేసిం దని పోలీసులు చెబుతున్నారు. అయితే.. ఈ కేసులో ఇందుబాలను అరెస్టు చేసిన పోలీసులు మాలిక్ జాడ కనుక్కోలేదు. సోషల్ మీడియాలో మాత్రం పోస్టులు పెడుతూ పోలీసులను కూడా బెదిరిస్తున్నాడు

నేపాల్ వరదల్లో 23 మంది మృతి

మోరాంగ్ (నేపాల్): నేపాల్‌లో పలు జిల్లాల్లో కురుస్తున్న కుండపోత వానలకు వరదలతో అతలాకుతలమవుతోంది. ఇప్పటివరకు అందిన సమాచారం ప్రకారం 23 మంది మృతిచెందినట్టు శనివారంనాడు అధికారులు వెల్లడించారు. మృతుల సంఖ్య పెరగవచ్చునని, సహాయ చర్యలు చేపట్టినట్టు హోం మంత్రిత్వ శాఖ తెలిపింది. మోరాంగ్ జిల్లాలో వందలాది ఇండ్లు వరదల్లో మునిగిపోయినట్టు, బిరాట్‌నగర్ విమానాశ్రయం వరదనీటితో నిండిపోవడంతో మూసివేసినట్టు ఎయిర్‌పోర్టు అధికారులు తెలిపారు.

దాడి జరిగితే తాట తీస్తాం

- ఉత్తర కొరియాకు అమెరికా హెచ్చరిక
- తొందరపడొద్దని అగ్రరాజ్యానికి జిన్‌పింగ్ సూచన





వాషింగ్టన్, టోక్యో: అమెరికా గనక రంగంలోకి దిగితే ఉత్తర కొరియా నియంత కిమ్ జాంగ్‌కు మిగిలేది శోకమేనని ట్రంప్ కఠినంగా హెచ్చరించారు. కిమ్ జోంగ్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులు కొన్ని సంవత్స రాలుగా అమెరికా ఐల్యాండ్ గువామ్‌పై దాడి చేస్తామని ప్రకటిస్తున్నారన్నా రు. హద్దులు దాటితే ఉత్తర కొరియాపై అణు దాడి చేసేందుకు సర్వం సిద్ధంగా ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. అయితే, కిమ్ జోంగ్ అటువంటి పద్ధతిని ఎంచుకోరని ట్రంప్ విశ్వాసం వ్యక్తం చేశారు. కొరియా దాడి చేస్తానని ప్రకటించిన గువామ్ రాష్ట్ర గవర్నర్ కాల్వోతో ట్రంప్ శనివా రం ఫోన్‌లో మాట్లాడారు. అమెరికా భద్రతా బలగాలు గువాను రక్షించేందుకు సిద్ధంగా ఉన్నాయని ఆయనకు హామీనిచ్చారు. ఉత్తర కొరియాపై తాను చేసిన వ్యాఖ్యలపై యావత్ అమెరికా ప్రజానీకం సంతోషంగా ఉన్నారని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. తన ట్విట్టర్ ఖాతాదారులు ఇచ్చిన మద్ధతతో తన చర్యలను సమర్థించుకున్నారు. ఎదుటివాడు తమపై దాడి చేస్తానంటే తాము చేతులు ముడుచుకొని కూర్చొమని ఘాటుగా సమాధానమిచ్చారు. అందుకే అమెరికా ప్రజానీకం తమకు మద్ధతు ఇస్తుందన్నారు. ప్రజల భద్రతే తమకు అవసరమన్నారు. కాబట్టి ఉత్తర కొరియా తన పరిధి అర్థం చేసుకొని మెలగాలని సూచించారు. ఆ దేశానికి సంబంధించిన మరేవరితో మాట్లాడేది లేదన్నారు.

రెచ్చగొట్టే ధోరణికి కొరియా స్వస్తి చెప్పాలి: జిన్‌పింగ్‌తో ట్రంప్

కిమ్ జోంగ్ చర్యలపై తీవ్రంగా ధ్వజమెత్తిన ట్రంప్, కొరియా తాటా తీస్తామని హెచ్చరించడంతో జిన్‌పింగ్ రంగంలోకి దిగారు. కిమ్ తన రెచ్చగొట్టే ధోరణికి స్వస్తి చెప్పాలని ట్రంప్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో చెప్పారు. శుక్రవారం రాత్రి ట్రంప్‌తో ఫోన్ మాట్లాడిన జిన్‌పింగ్ ఈ మేరకు చర్చించినట్లు శ్వేతభవనవర్గాలు వెల్లడించాయి. రెచ్చగొట్టే ధోరణి తగ్గాలని, అప్పుడే ఆ దేశంతో శాంతియుతంగా ముందకెళ్ళగలమని నిర్ణయించారు.ఉత్తర కొరియా నియంత కిమ్ జోంగ్ అమెరికా అణు దాడి చేస్తామని ప్రకటించిన కొద్ది సేపటికే, జపాన్ తన మిస్సైల్‌లను కొరియా భూభాగంపైకి ఎక్కుపెట్టినట్లు ప్రకటించింది. దీంతో ఒక్కసారిగా వాతావరణం వేడెక్కింది. ప్రస్తుతం అమెరికా-ఉత్తర కొరియా మధ్య నెలకొన్న సంక్షోభం తగ్గించేందుకు భారత్ కీలక పాత్ర పోషించాలని యూఎస్ ఫసిఫిక్ కమాండర్ అడ్మిరల్ హారీ హ్యారీస్ అభిప్రాయపడ్డారు.

ఆస్పత్రిలో మృత్యుఘోష

- యూపీలో పిట్టల్లా రాలిన చిన్నారులు
- ఆక్సిజన్ అందక 63 మంది మృతి
- వాస్తవం లేదన్న యూపీ మంత్రి
- న్యాయ విచారణకు సర్కారు ఆదేశం
- ఘటనపై ప్రధాని మోడీ విచారం
- మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌పై వేటు

లక్నో: ఉత్తర్ ప్రదేశ్‌లోని గోరఖ్ పూర్‌లో ఆక్సిజన్ అందక 63 మంది చిన్నారులు మృతి చెందడం కలకలం రేపింది. బాబా రాఘవదాస్ మెడికల్ కళాశాలలో చిన్న పిల్లలు పిట్టల్లా రాలడంతో ప్రతిపక్షాలు సీఎం యోగి ఆధిత్యనాథ్ రాజీనామాకు పట్టుబట్టాయి. ఈ ఘటనపై తీవ్రంగా స్పందించిన యోగి సర్కారు ఇప్పటికే ఆస్ప త్రి ప్రిన్సిపల్‌పై వేటు వేసింది. ఘటనపై న్యాయవిచారణకు ఆదే శించామని.. పూర్తి స్థాయిలో దర్యాప్తు చేసేం దుకు రాష్ట్ర ముఖ్య కార్యదర్శి నేతృత్వంలో కమిటీ వేశామని యూపీ సీఎం యోగి ఆధి త్యనాథ్ తెలిపారు. ఆస్పత్రి ఆక్సిజన్ సరఫ రా చేసే సంస్థకు చెందిన వ్యక్తులను కూడా విచారిస్తున్నారు. మెదడువాపు వ్యాధి కూడా తమకు పెను సవాల్‌గా మారిందన్న యోగి ఆ వ్యాధి నిర్మూలనకు ప్రయత్ని స్తున్నాని చెప్పారు. మెదడువాపు వ్యాధి బారిన పడిన చిన్నారులకు ఆక్సిజన్ తక్కువగా అందడంతో వారి కి కృత్రిమంగా ఆక్సిజన్ అవసరమౌతుందన్నారు.1978 నుంచి ఈ వ్యాధి ఉందనిఉత్తర ఉత్తర్ ప్రదేశ్ లో ఎక్కువ మంది శిశువులు ఈ వ్యాధి బారిన పడటానికి పరిశుభ్రత లేకపోవడం, బహిరంగ మలమూత్ర విసర్జనే కారణమని తెలిపారు. ఆక్సిజన్ సరఫరాలో అంతరాయం వల్లే చిన్నారు లు మృతి చెందారన్న ప్రచారంలో వాస్తవం లేదని యూపీ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సిద్ధార్థనాథ్ అన్నారు. వైద్యకారణాలతోనే చిన్నారులు మృతి చెందారని తెలి పారు. సీఎం యోగి ఆధిత్యనాథ్ ఈనెల 9న బీఆర్డీ ఆస్పత్రిని సంద ర్శించారని... ఆ సమయంలో ఆస్పత్రిలో ఎలాంటి సమస్యలు లేవని వైద్యులు సీఎం దృష్టికి తీసుకువచ్చారని చెప్పారు. డాక్టర్లుగానీ, అధికారులుగానీ ఆస్పత్రిలో ఆక్సిజన్ సరఫరాఅందడం లేదన్న విషయాన్ని చెప్పడం లేదని సిద్ధార్థసింగ్ తెలిపారు.

సీఎం వెళ్లిపోయిన కాసేపటికి 23 మంది మృతి

బీఆర్డీ ఆస్పత్రిలో ఈనెల 7,8 తేదీల్లో 21 మంది చిన్నారులు మృతి చెందగా...9 వ తేదీన సీఎం యోగి ఆధిత్యనాథ్ ఆస్పత్రిని సందర్శించి వెళ్లిపోయిన కాసేపటికే 23 మంది చిన్నారులు చనిపోయినట్లు తెలుస్తోంది. గురువారం ఒక్కరోజే 23 మంది చిన్నారులు చనిపోయినా ఆ విషయాన్ని ఆస్పత్రి వర్గాలు బయటకు పొక్కనీయలేదు. సీఎంకు కూడా సమస్యలను తెలియజేయకపోవడం గమనార్హం.

ఆక్సిజన్ సరఫరా సంస్థపై చర్యలు

బీఆర్డీ ఆస్పత్రికి ఆక్సిజన్ సరఫరా చేసే సంస్థ కార్యాలయంపై పోలీసులు, వైద్యాధి కారులు సంయుక్తంగా దాడి చేసి పలు కీలకపత్రాలు స్వాధీనం చేసుకున్నారు. ప్రభు త్వం తమకు రూ.70 లక్షల బకాయి చెల్లించాల్సి ఉందని.. డబ్బులు ఇవ్వాలని ఎన్ని సార్లు చెప్పినా వినకపోవడం తోనే సిలిండర్లు నిలిపివేశామని సదరు సంస్థ వాదిస్తోంది.

బీఆర్డీ కాలేజీలో ఆక్సిజన్ విషాదంపై ప్రధానమంత్రి నరేంద్రమోడీ విచారం వ్యక్తం చేశారు. ఘటనపై ప్రధాని వివరాలు అడిగి తెలుసుకున్నారని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి అనుప్రియ పటేల్ తెలిపారు. అంతకు ముందు కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేడీ నడ్డా ఉత్తర్ ప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి అశుతోష్ టాండన్ ను ఘటనపై నివేదిక కోరారు. ఆక్సీజన్ అందక తమ బిడ్డలు కళ్లముందే పిట్టల్లా రాలిపోవడం వారి తల్లిదండ్రులు, బంధువులను తీవ్రంగా కలచివేసింది.



డోక్లామ్‌పై అంతా శాంతి మంత్రం

- భారత్ వైపు అగ్రరాజ్యం
- సహకరిస్తామన్న భూటాన్, నేపాల్
- చర్చలే మేలని అభిప్రాయం
- భారత్‌కు మిత్రదేశాల సలహా





వాషింగ్టన్ డీసీ: సిక్కిం సెక్టర్‌లోని డొక్లామ్ వివాదానికి చెక్ పెట్టేందుకు అమెరికా ప్రయత్నాలు ప్రారంభించింది. డొక్లామ్ వివాదం విషయంలో భారత్‌కు అనుకూలంగా వ్యవహరిస్తున్న అమెరికా 50 రోజులకు పైగా నెలకొన్న ప్రతిష్టంభనకు తెరతీసేందుకు రెండు దేశాలకు అవసరమైన సహాయసహకారాలను అందించేందుకు ముందుకొచ్చింది. ఇరు దేశాలు డోక్లామ్ వివాదాన్ని శాంతియుత చర్చల ద్వారానే పరిష్కరించుకోవాలని అమెరికా పసిఫిక్ కమాండర్ అడ్మిరల్ హ్యారీ బి హ్యారీస్ సలహా ఇచ్చారు. డొక్లామ్ ప్రాంతంలోని రోడ్డు నిర్మిస్తున్న చైనా లిబరేషన్ ఆర్మీని ...భారత సైన్యం అడ్డుకోవడంతో మొదలైన వివాదాన్ని దౌత్యపరమైన చర్చల ద్వారానే పరిష్కరించుకోవాలనని సూచించారు. భారత్, చైనాలకు ఉన్న ఒకే సరిహద్దు వెంబడి రెండు దేశాలకు బలమైన శక్తి సామర్థ్యాలు కలిగిన ఆర్మీ ఉంటడం కూడా ఒకవిధంగా ప్రమాదకరమే అన్నారు. దక్షిణ చైనా సముద్రంపై అనుసరించిన వైఖరినే చైనా డొక్లామ్ విషయంలోనూ అనుసరిస్తుందని అన్నారు. అదే సమయంలో భారత్ కూడా డొక్లామ్‌లో చైనా నిర్మిస్తున్న రోడ్డు పనులు ముందుకు సాగకుండా భారత్ ధైర్యంగా నిలబడగలిగిందన్నారు. తూర్పు, దక్షిణ చైనా సముద్రం విషయంలో చైనా వైఖరి పక్కదేశాలపై దౌర్జన్య పూరితంగా ఉందని హ్యారీ అభిప్రాయపడ్డారు.

డొక్లామ్‌పై చైనాది అనవసర జోక్యం: అమెరికా నిపుణుడు

డొక్లామ్ వివాదానికి చైనా అత్యుత్సాహమే కారణమని ప్రముఖ అమెరికన్ నిపుణుడు జేమ్స్ ఆర్ హోల్మ్స్ అన్నారు. వివాదాన్ని శాంతియుతంగా పరిష్కరించుకునేందుకు భారత్ అన్ని రకాలుగా ప్రయత్నిస్తున్నప్పటికీ..చై నా సరైన విధంగా స్పందించడం లేదని తెలిపారు. డోక్లమ్‌పై భారత్‌కు పూర్తి అవగాహన ఉందన్న ఆయన...ఈ విషయంలో చైనాదే అనవసర జోక్యం అని తేల్చిచెప్పారు. సముద్రం తీరం విషయంలో



అత్యుత్సాహం ప్రదర్శించిన చైనా...సరిహద్దు భూభాగాల్లో కూడా ఆధిపత్య ధోరణిని ప్రదర్శించడం గర్హనీయమన్నారు. హిమాలయాల విషయంలోనూ భారత్ హేతుబద్ధతతోనే మెసులు కుంటున్నప్పటికీ చైనా మాత్రం అక్కడ కూడా పైచేయి కోసం ప్రయత్నాలు చేస్తోంది. హిమాలయాల వివాదంపై భారత్ తమను ఆశ్రయిస్తే తప్పకుండా పూర్తి సహకారం న్యూఢిల్లీకే ఉంటుందని స్పష్టంచేశారు.

చైనా మీడియా విష ప్రచారం

డొక్లామ్ విషయంలో చైనా అత్యుత్సాహం ఆదేశ అధికార మీడియా ద్వారానే స్పష్టమౌతోంది. భూటాన్ ఆధీనంలోని ప్రాంతంలో రోడ్ పనులు ప్రారంభించిన చైనా..భూటాన్ అభ్యంతరాలను పెడచెవిన పెట్టడంతోనే భారత్ రంగంలోకి దిగింది. అయితే ఈ విషయంలో చైనా మీడియా విష ప్రచారం చేస్తోంది. భూటాన్ ను ఆధిపత్యం కోసమే భారత్ డొక్లామ్ వివాదాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుందని చైనా మీడియా ఆరోపించింది. జులై 29న భూటాన్ ప్రభుత్వం..చైనా తీరుపై అభ్యంతరం వ్యక్తంచేస్తూ ప్రెస్ రిలీజ్ చేసింది. తమ భూభాగంలో రోడ్ నిర్మాణ పనులు ప్రారంభించడంపై భూటాన్ విదేశాంగ శాఖ చైనాను ప్రశ్నించింది. దీంతో చైనా భారత్ పై నిప్పులు కక్కడం ప్రారంభించింది. డొక్లామ్ వివాదాన్ని దౌత్య పరమైన చర్చల ద్వారానే పరిష్కరించుకోవాలని భూటాన్ పదేపదే కోరినా చైనా ఆజ్యం పోస్తోంది.

తూర్పుసెక్టర్‌లో నో వార్..నో పీస్ పద్ధతి

డొక్లామ్ వివాదంపై ప్రతిష్టంభన కొనసాగుతున్న నేపథ్యంలో తూర్పు రాష్ట్రాల సరిహద్దుల్లో భారత్ భద్రతను కట్టుదిట్టం చేసింది. అరుణాచల్ ప్రదేశ్, అస్సాం సరిహద్దుల్లో సుక్నా బేస్డ్ 33 బలగాలను రంగంలోకి దించారు. ఇప్పటికే సరిహద్దుల సమీప ప్రాంతాలకు చేరుకున్న ఆర్మీ సిబ్బంది నో వార్...నో పీస్ అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. చైనా సరిహద్దుల్లోకి ఆ దేశ ఆర్మీ పెద్దసంఖ్యలో మొహరిస్తుందన్న వార్తలు అంద డంతో భారత సైన్యం అప్రమత్తమైంది. ఈనేపథ్యంలోనే తూర్పు సరిహద్దు ప్రాంతాల్లో తన బలాన్ని పెంచుకునేందుకు భారత్ ఆర్మీ సంసిద్ధమైంది.


సామరస్యంగా పరిష్కరించుకుందాం: భూటాన్

భారత్- చైా- భూటాన్ సరిహద్దుల్లోని డొక్లామ్ వివాద పరిష్కారానికి సామరస్యపూర్వక వాతావరణం అవసరమని భూటాన్ విదేశాంగ మంత్రి డమ్చో డోర్జి తెలిపారు. బిమ్‌స్టెక్ దేశాల మంత్రుల సమావేశం కోసం భూటాన్ వెళ్లిన భారత విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్‌తో డోర్జి చర్చలు జరిపారు. డొక్లామ్ వివాదాన్ని పరిష్కరించుకునేందుకు మూడు దేశాలు శాంతియుత మార్గాన్ని అనుసరించాలని సుష్మాను కోరారు. చైనా మీడియా విషప్రచారంపై కూడా ఇరువురు చర్చించారు. వ్యక్తుల అభిప్రాయాలను చైనా అధికార పత్రికలో ప్రచురిస్తూ భారత్‌ను బ్లేమ్ చేస్తోందని ఆరోపించారు.

డొక్లామ్‌పై నేపాల్ శాంతి మంత్రం

డొక్లామ్ విషయంలో దౌత్యపరమైన చర్చలే సమస్యకు పరిష్కారమార్గమని నేపాల్ విదేశాంగ మంత్రి క్రిష్ణ బహద్దూర్ మెహర తెలిపారు. భారత విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్‌తో భేటీ అయిన మెహర్ సరిహద్దు వివాదాలను దౌత్యపరమైన చర్చల ద్వారానే పరిష్కరించుకోవడం మంచిదని సలహాఇచ్చారు. భారత్- చైనా- భూటాన్ మధ్య నెలకొన్న సరిహద్దు వివాదాన్ని శాంతియుతంగా పరిష్కరించుకునేందుకు పొరుగుదేశాలు కూడా సహాయ సహకారాలు అందిస్తాయని అన్నారు. ఇరుగుపొరుగు దేశాల మధ్య ఎన్నో వివాదాలు ఉన్నప్పటికీ వాటి పరిష్కారానికి నేపాల్ స్నేహ హస్తాన్నందించేందుకు ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని చెప్పారు.ఎలాంటి వివాదమైనా చర్చల ద్వారానే పరిష్కారమౌతుందని తమ ప్రగాఢ విశ్వాసమని మెహర్ తెలిపారు.

స్మార్ట్ ఫోనే రోగ నిర్ధారణ చేస్తుంది



న్యూయార్క్: రోగ నిర్ధారణ పరీక్షల ఫలితాల కోసం డయాగ్నస్టిక్ సెంటర్ల వద్ద గంటల తరబడి వేచి చూస్తున్నారా.. అయితే ఇకనుంచి మీరు అంత సమయం వృథా చేసుకోనవసరం లేదు. మీ స్మార్ట్ ఫోనే డయాగ్నస్టిక్ టూల్‌గా పనిచేస్తుంది. కాకపోతే ఇందుకోసం మీరు కొంచెం ఖర్చు చేయక తప్పదు. సుమారు 36వేల రూపాయలు ఖర్చు చేస్తే అత్యవసరమయ్యే పరీక్షల ఫలితాలు నిమిషాల్లోనే తెలుసుకోవచ్చు. ట్రాన్స్ మిషన్ రిప్లెటెన్స్ ఇన్టెన్సిటీ- ట్రై గా పిలిచే ఈ అనలైజర్‌ను మీ స్మార్ట్ ఫోన్‌కు అనుసంధానం చేస్తే చాలు..మూత్ర, రక్త, లాలాజల పరీక్షల ఫలితాలను నిమిషాల్లో తెలుసుకోవచ్చు. ఈ పరికరాలన్ని వ్యక్తులు, ఆరోగ్యకేంద్రాలు తమ ఫోన్లకు అనుసంధానం చేయడం ద్వారా తక్కువ సమయంలో ఖచ్చితమైన ఫలితాన్ని పొందవచ్చని అమెరికా ప్రొఫెసర్ బ్రెయిన్ కున్నింఘమ్ తెలిపారు. ట్రై పరికరాన్ని ఉపయోగించి పరిశోధకులు ఇప్పటికే నెలలు నిండాకుండానే శిశువులు జన్మించేందుకు గల కారణాలను విశ్లేషించారు. ఆయా పరీక్షలు ఇతర ల్యాబ్‌లలోనే ఫలితాలకు సరితూగినట్లు పరిశోధకులు తెలిపారు. ఈ ట్రై పరికరం స్మార్ట్ ఫోన్ కెమెరాను హై ఫర్ఫామెన్స్ స్పెక్ట్రోగ్రామ్‌గా మార్చడం ద్వారా పనిచేస్తోంది.

ఆంధ్రప్రభ
క్రీడాప్రభ
ఆదివారం 13 ఆగస్టు 2017 | హైదరాబాద్ | 10

మళ్లీ శతక్కొట్టాడు

• సిరీస్‌లో ధావన్ రెండో శతకం • తొలి వికెట్‌కు రికార్డు భాగస్వామ్యం • రాహుల్ వరుసగా ఏడో అర్థసెంచరీ • భారత్ 329/6 • లంక బౌలర్ల పోరాటం

శిఖర్ ధావన్.. అదే దూకుడు.. అదే కొట్టుడు. బంతికో పరుగు. మైదానం ఏదైనా.. పిచ్ ఎలాంటిదైనా అతనికి పట్టదు. బౌలర్లపై విరుచుకుపడడమే లక్ష్యం. పేసైనా, స్పిన్నైనా బంతి బౌండరీ దాటాల్సిందే. పరుగుల వరద పారాల్సిందే. తక్కిన పిచ్‌లకు భిన్నంగా ఉన్నా పల్లెకెలెకు కూడా అందుకు మినహాయింపు లేదు. ధావన్ (119) దూకుడు, రాహుల్ (85) నిలకడతో తొలి వికెట్ అత్యధిక భాగస్వామ్యానికి గ్రహణం పట్టింది. ఈ వికెట్‌కు వీరిద్దరు 188 పరుగుల రికార్డు భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. లంకలో ఏ విదేశీ జట్టుకైనా ఇదే అత్యుత్తమ భాగస్వామ్యం. తొలి సెషన్లో విరివిగా పరుగులిచ్చిన లంక బౌలర్లు తర్వాత బ్యాట్స్‌మెన్‌కు కళ్లెం వేయగలిగారు. ఎడమచేతి వాటం స్పిన్నర్లు పుష్పకుమార (3/40), సండకన్ (2/84) భారత్ జోరుకు బ్రేకులు వేశారు. తొలి రోజు ఆట ఆఖరుకు 6 వికెట్లు కోల్పోయి 329 స్కోరు చేసిన భారత్ గత రెండు టెస్టుల మాదిరిగా భారీ స్కోరు నమోదు చేయడం కష్టమే కావచ్చు. ఐతే చివరి వరుస బ్యాట్స్‌మెన్ విజృంభిస్తే మాత్రం అందుకు అవకాశం లేకపోలేదు. దూకుడు మరోపేరైన పాండ్య (1), నిలకడగా ఆడే కీపర్ సాహా (13) క్రీజులో ఉన్నారు. రెండో రోజు భారత లోయర్ ఆర్డర్ విజృంభిస్తుందో.. లేక లంక బౌలర్లు చెలరేగి భారత్‌ను త్వరగా ఆలౌట్ చేస్తారో.. వేచి చూడాల్సిందే.



పల్లెకెలె: సిరీస్‌లో వరుసగా మూడోసారి టాస్ గెలిచి కెప్టెన్ విరాట్ కోహ్లి ఎలాంటి సందేహం లేకుండా బ్యాటింగ్ ఎంచుకున్నాడు. అతని నమ్మకానికి తగినట్లే ఓపెనర్లు ధావన్ (119, 123 బంతుల్లో, 17 ఫోర్లు), కేఎల్ రాహుల్ (85, 135 బంతుల్లో, 8 ఫోర్లు) మంచి ఆరంభాన్నిచ్చారు. తొలి ఓవర్లలోనే ఆరు పరుగులు సాధించి తమ ఉద్దేశాన్ని చెప్పకనే చెప్పారు. ఓ వైపు ధావన్ దూకుడుగా ఆడుతుంటే.. మరోవైపు రాహుల్ తనదైన శైలిలో కుదురుగా ఇన్నింగ్స్‌ను నిర్మించాడు. పేసర్ ఫెర్నాండో (1/68) వేసిన మూడో ఓవర్లో ధావన్ తొలి బౌండరీ సాధించాడు. తర్వాత మరో పేసర్ కుమార బౌలింగ్‌లో రాహుల్ కూడా బౌండరీ కొట్టి దూకుడు పెంచాడు. 10 ఓవర్లు ముగిసేసరికే భారత్ స్కోరు 53 పరుగులకు చేరిందంటే వీరి జోరు ఎలాంటిదో అర్థం చేసుకోవచ్చు. 12వ ఓవర్లో కరుణరత్నే బౌలింగ్‌లో రాహుల్ ఇచ్చిన క్యాచ్‌ను కుమార మిడాన్‌లో నేలపాలు చేశాడు. అప్పటికి రాహుల్ 28 పరుగులతో ఉన్నాడు. ఓపెనర్ల జోరులో భారత్ స్కోరు 18 ఓవర్లలోనే 100 పరుగులకు చేరుకుంది. ధావన్ 17.4 ఓవర్లో ఫోర్ కొట్టి అర్ధసెంచరీ పూర్తి చేసుకోగా.. రాహుల్ 19.4 ఓవర్లో వరుసగా ఏడో ఫిఫ్టీని సాధించాడు. లంక స్పిన్నర్లు సైతం ఈ జోడీ జోరును అడ్డుకోలేకపోయారు.

అలవోకగా సెంచరీ: లంచ్ విరామం సమయానికే భారత్ 27 ఓవర్లలో 134 పరుగులు చేసింది. అప్పటికి ధావన్ 64 పరుగులతో, రాహుల్ 67 పరుగులతో ఆడుతున్నారు. లంచ్ తర్వాత సైతం ధావన్, రాహుల్ అదే ఊపును కొనసాగించి 36వ ఓవర్‌కల్లా స్కోరును 176 పరుగులకు చేర్చి రికార్డు భాగస్వామ్యాన్ని నమోదు చేశారు. వీరికి చెక్ పెట్టడానికి లంక కెప్టెన్ చండిమాల్ 40 ఓవర్లో స్పిన్నర్ పుష్పకుమారను రంగంలోకి దించాడు. అతను కెప్టెన్ నమ్మకాన్ని వమ్ముచేయకుండా ధావన్, రాహుల్ భాగస్వామ్యానికి తెరదించాడు. పుష్పకుమార బంతిని రాహుల్ మిడాన్ మీదుగా బౌండరీకి తరలించబోయి కరుణరత్నేకు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు.

ధావన్‌తో పుజారా (8) జతకలిశాడు. 40 ఓవర్లు పూర్తి అయ్యేసరికి 98 పరుగులు మీదున్న ధావన్.. పుష్పకుమార బౌలింగ్‌లో బంతిని బౌండరీకి పంపి సిరీస్‌లో రెండో శతకాన్ని పూర్తిచేసుకున్నాడు. అంత దూకుడుగా ఆడినా ధావన్ ఇన్నింగ్స్‌లో ఒక్క సిక్స్ అయినా లేకపోవడం విశేషం. రాహుల్‌ను వెనక్కి పంపిన పుష్పకుమార మరోసారి భారత్‌ను దెబ్బతీశాడు. 42వ ఓవర్లో అతను వేసిన బంతిని ధావన్ స్వీప్ చేయబోయి చండిమాల్‌కు దొరికిపోయాడు. దీంతో ధావన్ అద్భుత ఇన్నింగ్స్‌కు తెరపడింది. అప్పటికే ఓ సారి జీవనదానం పొందిన ధావన్ ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నాడు.

లంక బౌలర్ల విజృంభణ: పుజారాకు కోహ్లి (42) జత కలిశాడు. ఎక్కువ సేపు క్రీజులో నిలదొక్కుకున్నప్పటికీ ఎక్కువ పరుగులు చేయని పుజారా జట్టు స్కోరు మరో 10 పరుగులకే మూడో వికెట్‌గా పెవిలియన్ దారి పట్టాడు. తర్వాత కోహ్లి, రహానే (17) టీ విరామం వరకు వికెట్ పడకుండా జాగ్రత్తపడ్డారు. టీ తర్వాత పుష్పకుమార మరోసారి దెబ్బతీశాడు. నాలుగో వికెట్‌కు 34 పరుగులు జోడించిన కోహ్లి, రహానే భాగస్వామ్యానికి పుష్పకుమార తెరదించాడు. రహానేను పెవిలియన్ దారిపట్టించాడు. మరో 32 పరుగులకే భారత జట్టు కెప్టెన్ వికెట్‌ను కోల్పోయింది. కోహ్లి వికెట్ సండకన్‌కు దక్కింది. చివర్లో అశ్విన్ (31) సాహా (13 బ్యాటింగ్) కలిసి ఆరో వికెట్‌కు 26 పరుగులు జోడించిన తర్వాత ఫెర్నాండో బౌలింగ్‌లో అశ్విన్ వెనుదిరిగాడు. 39.2 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 188 స్కోరు సాధించిన భారత్ చివరి 50.4 ఓవర్లలో 141 పరుగులకే 6 వికెట్లు కోల్పోయింది.



ప్రపంచ రికార్డును సమం చేసిన రాహుల్

భారత జట్టు ఓపెనర్ కేఎల్ రాహుల్ వరుసగా ఏడు అర్ధసెంచరీలతో ప్రపంచ రికార్డును సమం చేశాడు. తొలి ఇన్నింగ్స్‌లో 85 పరుగులు చేసిన రాహుల్.. గతంలో ఆ ఘనత సాధించిన సర్ ఎవర్టన్ వీక్స్ (1948-49), చందర్ పాల్ (2000-01), ఆండీఫ్లవర్ (2006-07), సంగక్కర (2013-14) క్రిస్ రోజర్స్ (2014-15) సరసన చేరాడు. రాహుల్ ఈ ఫీట్‌ను 2016-17లో సాధించాడు.

భాగస్వామ్యంలోనూ..: తొలి ఇన్నింగ్స్‌లో ఓపెనర్ ధావన్‌తో కలిసి రాహుల్ అత్యధిక ఓపెనింగ్ భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. ఇంతవరకు లంకలో ఓ విదేశీ జట్టుకు ఓపెనింగ్ వికెట్ భాగస్వామ్యం రికార్డు 171 పరుగులతో మనోజ్ ప్రభాకర్, సిద్ధూ (1993)ల పేరిట ఉంది. ధావన్, రాహుల్ కలిసి పల్లెకెలెలో తొలి వికెట్‌కు 188 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పి ఆ రికార్డును అధిగమించారు.

స్కోరుబోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: ధావన్ (సి) చండిమాల్ (బి) పుష్పకుమార 119; రాహుల్ (సి) కరుణరత్నే (బి) పుష్పకుమార 85; పుజారా (సి) మాథ్యూస్ (బి) సండకన్ 8; కోహ్లి (సి) కరుణరత్నే (బి) సండకన్ 42; రహానే (బి) పుష్పకుమార 17; అశ్విన్ (సి) డిక్వెల్ (బి) ఫెర్నాండో 31; సాహా (బ్యాటింగ్) 13; పాండ్య (బ్యాటింగ్) 1; ఎక్స్‌ట్రాలు 13; మొత్తం (90 ఓవర్లలో 6 వికెట్లకు) 329, **వికెట్ల పతనం:** 1-188 (రాహుల్), 2-219 (ధావన్), 3-229 (పుజారా), 4-264 (రహానే), 5-296 (కోహ్లి), 6-322 (అశ్విన్), **బౌలింగ్:** ఫెర్నాండో 19-2-68-1 కుమార 15-1-67-0 కరుణరత్నే 5-0-23-0 పెరెరా 8-1-36-0 సండకన్ 25-2-84-2 పుష్పకుమార 18-2-40-3

ఎదురులేని షిఫర్స్

• **200మీ. పరుగు స్వర్ణం మళ్లీ వశం**



లండన్: ప్రపంచఅథ్లెటిక్స్‌లో మహిళల 200 మీటర్ల పరుగు స్వర్ణాన్ని నెదర్లాండ్స్ అథ్లెట్ డఫ్నే షిఫర్స్ నిలబెట్టుకుంది. శుక్ర వారం రాత్రి ఉత్కంఠభరితంగా జరిగిన రేసులో 25 ఏళ్ల షిఫర్స్ 22.05 సెకన్లను పరుగును పూర్తి చేసి పసిడిని దక్కించుకుంది. తద్వారా ప్రపంచ టైటిల్‌ను ఒకటి కంటే ఎక్కువ సార్లు దక్కించుకున్న అథ్లెట్‌గా ఫిలిక్స్, మార్లిన్ ఒట్టి సరసన చేరింది. షిపర్స్‌కు 100 మీటర్ల పరుగులో కాంస్యం లభించింది. ఐవరీ కోస్ట్‌కు చెందిన మారీ జోస్ 22.08 సెకన్లతో రజతాన్ని, బహమాస్ అథ్లెట్ మిల్లర్ 22.15 సెకన్లతో కాంస్యాన్ని దక్కించుకున్నారు.

బ్రిట్నీ రీస్‌కు నాలుగోసారి స్వర్ణం



లండన్: ప్రపంచ అథ్లెటిక్స్‌లో అమెరికాకు చెందిన బ్రిట్నీ రీస్ రికార్డు స్థాయిలో నాలుగో సారి పసిడి పతకం సాధించింది. శుక్రవారం రాత్రి జరిగిన లాంగ్ జంప్ ఫైనల్లో రీస్ 7.02 మీటర్ల దూరం దూకి నాలుగో సారి స్వర్ణం దక్కించుకుంది.

ఆనంద్‌కు రెండో స్థానం



సెయింట్ లూయీస్ (యుఎస్ఏ): సింక్వెఫీల్డ్ కప్ చెస్‌లో విశ్వనాథన్ ఆనంద్ (5.5) సంయుక్తంగా రెండో స్థానంలో నిలిచాడు. చివరిదైన తొమ్మిదో రౌండ్ గేమ్‌ను ఆనంద్.. అమెరికాకు చెందిన వెస్లి సోతో డ్రా చేసుకోవడంతో అతని ఖాతాలో 5.5 పాయింట్లు జమయ్యాయి. ఆనంద్‌కు ఏడు డ్రాలు, రెండు విజయాలు దక్కాయి. రేటింగ్ పాయింట్లు 2800కు చేరుకోవడంతో ప్రపంచ ర్యాంకింగ్స్‌లో ఏడు స్థానాలు ఎగబాకాడు.



అదరగొట్టాడు

• **4X100 రిలే పరుగులో జమైకాను ఫైనల్ చేర్చిన బోల్ట్**

లండన్: పదిహేనో పసిడిని ఒడిసిపట్టాలని ఉవ్విళ్లూరుతున్న జమైకా పరుగుల చిరుత ఉసేన్ బోల్ట్ .. కెరీర్‌లో తన చివరి పరుగును ఆరంభించాడు. 4X100 మీటర్ల రిలే పరుగులో జమైకా జట్టును ఫైనల్ చేర్చాడు. అర్హత పోటీలో బోల్ట్ 37.95 సెకన్ల సమయంలో లక్ష్యానికి చేరుకొని జట్టును ఫైనల్‌కు తీసుకుపోయాడు. పరుగును ముందుగా జట్టులోని ట్రాసీ, జులియన్ ఫోర్ట్, మైకేల్ క్యాంప్‌బెల్ పరుగు ఆరంభించారు. చివర్లో అనుభవశాలి బోల్ట్ బ్యాటన్‌తో సురక్షితంగా గమ్యానికి చేరాడు. ''అద్భుతంగా ఉంది. మైదానంలో కోలాహలం చాలా ఉత్సాహాన్ని ఇచ్చింది'' అన్నాడు. లండన్ మైదానంలో ప్రేక్షకుల మద్దతు తనకు నచ్చిందని చెప్పాడు. ''నాకే కాదు అందరికీ ఇదే విధమైన మద్దతు లభించింది.

ఫైనల్లో బ్లేక్‌తో కలిసి పరుగెత్తబోవడం సంతోషంగా ఉంది. ఇది యువజట్టు. కఠిన శిక్షణ పొందినా కొన్ని పొరపాట్లు జరిగాయి. అయినా ఫర్వాలేదు. బ్లేక్ ఉన్నాడు'' అని బోల్ట్ చెప్పాడు.

మళ్లీ ఓడిన తెలుగు టైటాన్స్



అహ్మదాబాద్: ప్రో కబడ్డీ మూడో దశలోనూ తెలుగు టైటాన్స్ భాగ్యరేఖలు మారలేదు. శనివారం జరిగిన పోరులో టైటాన్స్ మరోసారి యూపీ యోధాస్ చేతిలో 32-39 తేడాతో ఓడింది. కెప్టెన్ రాహుల్ చౌదరి 12 పాయింట్లు సంపాదించినా లాభం లేకపోయింది. దీంతో టైటాన్స్ పరాజయాల సంఖ్య ఆరుకు చేరింది. యోధాస్‌ను నితిన్ తోమర్ ముందుండి నడిపించాడు. అతను ఏకంగా 10 పాయింట్లు సాధించాడు. అతనికి రిషాంక్ ఆరు పాయింట్లతో తోడ్పాటునందించాడు. టైటాన్స్ 8 మ్యాచ్‌ల తర్వాత 12 పాయింట్లతో, యోధాస్ నాలుగు మ్యాచ్‌లాడి 15 పాయింట్లతో నిలిచాయి. మరో పోరులో గుజరాత్ 29-25తో దబాంగ్ ఢిల్లీపై గెలిచింది



మహిళల రిలే జట్టుపై అనర్హత వేటు

• **విఫలమైన పురుషుల జట్టు**


లండన్: ప్రపంచ అథ్లెటిక్స్‌లో భారత బృందం పేలవ ప్రదర్శన కొనసాగుతోంది. శనివారం 4X400 రిలే హీట్స్‌లో పాల్గొన్న మహిళల జట్టుపై అనర్హత వేటు పడింది. జిస్నా మాథ్యూస్, పూవమ్మ, అనిల్డా, నిర్మలతో కూడిన జట్టు తొలి అర్హత పోటీలో 3 నిమిషాల 28.62 సెకన్లలో రేసును పూర్తిచేసి ఏడో స్థానంలో నిలిచింది. కానీ పరుగును ఆరంభించిన జిస్నా లేన్ దాటి పరుగెత్తడంతో రేసు పూర్తయిన తర్వాత నిర్వాహకులు ఐఏఏఎఫ్ నిబంధనల ప్రకారం జట్టుపై అనర్హత వేటు వేశారు. ఆమె 250 మీటర్ల తర్వాత లేన్ దాటి పక్క లేన్‌లో పరుగు తీసిందని తెలిసింది. పురుషుల రిలే జట్టు అర్హత పోటీలో పదో స్థానంలో నిలిచి భారత శిబిరాన్ని నిరాశలో ముంచెత్తింది.

క్రికెట్ పాలనకు లలిత్‌మోడీ దూరం



న్యూఢిల్లీ: క్రికెట్ పాలనకు ఇక దూరం కాదలచుకున్నానని రాజస్థాన్ క్రికెట్ సంఘం మాజీ అధ్యక్షుడు లలిత్ మోడీ శనివారం ప్రకటించాడు. రాజస్థాన్ క్రికెట్ ప్రయోజనాలను ఆశించే తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పాడు. ఇక రాజస్థాన్‌కు సొమ్ములు ఇచ్చే బాధ్యత బీసీసీఐదేనని, బోర్డు తన మాట నిలబెట్టుకోవాలని సూచించాడు. తాను క్రికెట్ పరిపాలనలో ఉండడం వల్ల తన రాష్ట్రానికి నిధులు స్తంభించి పోయాయని లలిత్ ట్విటర్లో అన్నాడు.

సెమీస్‌లో ఫెదరర్



మాంట్రియల్: మాంట్రియల్ మాస్టర్స్ టోర్నీలో రోజర్ ఫెదరర్ సెమీఫైనల్ చేరుకున్నాడు. క్వార్టర్స్‌లో అతను 6-4, 6-4తో రొబెర్టో బటిస్టాపై గెలిచాడు. ఫెదరర్ సెమీస్‌లో నెదర్లాండ్స్ ఆటగాడు రాబిన్ హాస్‌తో తలపడతాడు.



ప్రపంచ అథ్లెటిక్స్‌లో శుక్రవారం రాత్రి మహిళల లాంగ్‌జంప్ ఫైనల్లో పోటీ పడుతున్న రష్యా అథ్లెట్ దర్యా క్లిషినా

Printed & Published by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.



దాదాపు పదిహేనేళ్లుగా ప్రేక్షకులను తన అందంతో, నటనతో అలరిస్తోంది శ్రియా శరణ్. తన సమకాలీన నాయికలు సర్దుకుని వెళ్లిపోయినా...శ్రియా క్రేజ్ తగ్గలేదు. ఆమెకు అవకాశాలూ ఆగలేదు. తను పరిశ్రమకు వచ్చినప్పుడు సినిమాలు చేసిన నాగార్జున, బాలకృష్ణ లాంటి హీరోలతో ఇప్పటికీ సినిమాలు చేస్తోంది. నటిస్తూనే...ప్రత్యేక గీతాల్లోనూ మెరుస్తోంది. ఎందరు నాయికలు వచ్చి వెళ్లినా...తెలుగు ప్రేక్షకులకు శ్రియా నటన ఒక ప్రత్యేక అనుభూతి. ఆమె జీవిత విశేషాలు ఈ వారం 'ఆంధ్రప్రభ లైఫ్' లో చూద్దాం...

టాలీవుడ్ ఇష్టసఖి శ్రియా!

కథక్‌లో శిక్షణ...వర్షంలో తడుస్తూ సినిమా

నేను పుట్టింది ఉత్తర్ ప్రదేశ్ హరిద్వార్‌లో. అక్కడి భెల్ కాలనీలో ఉండేవాళ్లం. నాన్న పుష్పీందర్ శరణ్, భెల్‌లో సివిల్ ఇంజినీర్. అమ్మ కెమిస్ట్రీ టీచర్‌గా పనిచేసేది. చదువుతో ఆటపాటలను ప్రోత్సహించేవారు. అలా నాకు కథక్ నృత్యాన్ని నేర్పించారు. శోవన నారాయణ్ దగ్గర కథక్ నేర్చుకున్నాను. అప్పుడు మా దగ్గర్లో ఓపెన్ థియేటర్లు ఉండేవి. ఈ థియేటర్లను ఝూన్‌కార్ అని పిలిచేవారు. వాటిలో పాత హిందీ చిత్రాలను ప్రదర్శించేవారు. నేనూ అమ్మ కలిసి వాటిని చూసేందుకు వెళ్లేవాళ్లం. ఒక్కోసారి వర్షం పడేది. గొడుగు కింద కూర్చొని అమ్మతో సినిమాలు చూసేదాన్ని. బాల్యంలో అదొక మంచి జ్ఞాపకం.

చదువు కోసం ఢిల్లీకి...

నాకు పద్నాలుగేళ్ల వయసున్నపుడు ఢిల్లీలోని డీపీఎస్ పాఠశాలలో చేరాను. అక్కడే కథక్ శిక్షణ కొనసాగించాను. మధురా రోడ్‌లో మా పాఠశాల ఉండేది. మా ఇంటి నుంచి రోజూ అమ్మే స్కూలుకు తీసుకెళ్లేది. తర్వాత మా నాన్న కూడా ట్రాన్స్‌ఫర్ మీద ఢిల్లీకి వచ్చారు. కథక్ నేర్చుకున్నాక, ప్రదర్శనలు ఇవ్వడం ప్రారంభించాను. గురువు గారి ట్రూప్‌తో కలిసి దేశమంతటా ప్రదర్శనలు ఇచ్చేవాళ్లం. ప్రదర్శనల కోసం నేను ఎక్కడికి వెళ్లినా అమ్మ నాతో పాటు వచ్చేది.

మ్యూజిక్ వీడియో 'ఇష్టం'గా మారింది...

వారణాసికి చెందిన ఓ సంస్థ కథక్ నృత్యం తెలిసిన వాళ్లతో ఓ మ్యూజిక్ వీడియో చేయాలనుకుంది. మా గురువు శోవనను సంప్రదిస్తే...ఆమె నా పేరు సూచించింది. వాళ్లు నిర్వహించిన ఆడిషన్‌లో పాల్గొని ఎంపికయ్యాను. ఆ మ్యూజిక్ వీడియో చేశాను. ఈ వీడియో చూసిన దర్శకుడు విక్రమ్ కె కుమార్ 'ఇష్టం' సినిమాలో నాయికగా నటించే అవకాశం ఇచ్చారు.

భాషే ప్రధాన సమస్యయింది!

ఇష్టం సినిమాలో నటిస్తున్నప్పుడు తెలుగు ఒక్క పదం కూడా రాదు. స్క్రిప్టులో సంభాషణలు చూస్తే ఏదీ అర్థమయ్యేది కాదు. వాటిని హిందీలో రాసుకుని చెప్పేదాన్ని. మొదట్లో అంత ఏకాగ్రత కుదిరేది కాదు. నువ్వు ఈ డైలాగ్స్ చెప్పకుంటే మళ్లీ ఢిల్లీ వెళ్లొచ్చు... అని దర్శకుడు విక్రమ్ చెప్పారు. నాకు మళ్లీ ఢిల్లీ వెళ్లి చదువుకోవడంపై ఆసక్తి లేదు. దాంతో కష్టపడి నాకు ఇచ్చిన సంభాషణలు చెప్పాను.

ఎంతో 'సంతోషం' కలిగించింది..

తొలి సినిమా 'ఇష్టం' ప్రేక్షకాదరణ పొందలేదు. ఈ సినిమా చిత్రీకరణ సమయంలో దర్శకుడు దశరథ్ తన సినిమా కోసం సంప్రదించారు. అదే 'సంతోషం'. నాగార్జున సరసన నటించిన ఈ సినిమా మంచి విజయాన్నందుకుంది. 'సంతోషం' టాలీవుడ్‌లో కావాల్సినంత గుర్తింపు తీసుకొచ్చింది. దాదాపు ఇదే సమయంలో రజనీకాంత్ సరసన 'శివాజీ'లో నటించే గొప్ప అవకాశం దక్కింది. ఈ రెండు చిత్రాలతో మొత్తం దేశమంతా తెలిసిపోయాను.

అలాంటి వాడు కావాలి..

నాకు స్నేహితులు తక్కువ. ఎప్పుడూ ఒంటరిగా ఉండేందుకు ఇష్టపడుతుంటాను. ఇంట్లో వాళ్లకు స్నేహితులతో వెళ్తున్నాను అని చెప్పి..ఒక్కదాన్నే పర్యటనలకు వెళ్తుంటాను. అక్కడ ప్రకృతిని చూస్తూ గడిపేస్తాను. ఇక నా జీవితంలో ఇంతవరకు ప్రేమ ఎదురవలేదు. ప్రేమించేందుకు సిద్ధంగానే ఉన్నాను. నాతో నటించిన ప్రతి ఒక్క నటుడినీ ఇష్టపడతాను. అయితే అది ప్రేమ కాదు. మరో నటుడిని పెళ్లి చేసుకునే ఉద్దేశం లేదు. రోజులో సగం సమయం అద్దం చూసుకుని గడిపే నటుడితో జీవితాన్ని ఆస్వాదించలేను. అద్దాన్ని కాకుండా నన్ను చూసే అబ్బాయి కావాలి.

ప్రతినాయికగా మెరవనుందా...?

అందాల తారలు ముద్దుగా ఆడితేనో, సిగ్గుపడుతూ పాడితేనో చూసి ఆనందిస్తుంటారు ప్రేక్షకులు. సినిమాలో వీళ్ల పాత్ర గ్లామర్ లోటును తీర్చడమే. కొన్నిసార్లు నాయికలు కథలో భాగమై కథానాయకుడికి తోడుగా ఉంటూ.. .ప్రతినా యకులపై పోరాడటంలో కొద్దిగా సహాయం చేస్తుంటారు. హీరో విలన్‌ను ఓడించేందుకు...అతనికి ధైర్యంగా నిలబడు తుంటారు. అలాంటి నాయికలే విలన్లు అయితే... కొత్తగా ఉంటుంది కదా. సుందరాంగులు ప్రతినాయక పాత్రల్లో కనిపిస్తే...హీరో కూడా నేనూ... మీ గ్యాంగులో చేరిపోతా అని వెళ్లిపోతాడు. ప్రేక్షకులూ ఈ ప్రతినాయికే బాగుందంటూ ప్రశంసిస్తారు. తెరపై ఈ సందర్భాన్ని త్వరలో తీసుకురానుంది శ్రీయా. త్వరలో ఆమె ఓ బాలీవుడ్ చిత్రంలో ప్రతినాయికగా నటించనుందట.

ఈత దుస్తులు ధరించేందుకు సిద్ధమే...

వేసుకునే దుస్తులను బట్టి యువతి వ్యక్తిత్వాన్ని చెప్పలేరు. చీరలు కట్టినవాళ్లు మంచి వాళ్లని, స్కర్ట్ వేస్తే రోజూ పబ్‌కు వెళ్తారని ఊహిస్తుంటారు. ఈ ఆలోచన మారాలి. ఇక నేను నటిగా బికినీ ధరించడానికి కూడా సిద్ధమే. కానీ అలా వేసుకునేందుకు తగినంత అవకాశం కథలో, సన్నివేశంలో ఉండాలి. దర్శకుడు తన ఆలోచనతో నన్ను మెప్పించగలగాలి. అప్పుడు తప్పకుండా ఈత దుస్తులు ధరిస్తా. హాలీవుడ్ సినిమాల్లో ముద్దు సన్నివేశాలు, బికినీలు చూసేందుకు ఇష్టపడే ప్రేక్షకులు మన సినిమాల్లో మాత్రం అలాంటివి ఉండొద్దని అంటారా...?



అవకాశాలను అందిపుచ్చుకుంటూ...!

శ్రియ పని అయిపోయిందని అనుకున్న ప్రతీసారి ఆమె అవకాశాలను అందిపుచ్చుకోవడం చాలా మందిని ఆశ్చర్యానికి గురిచేస్తూనే ఉంది. గౌతమీపుత్ర శాతకర్ణి తర్వాత తెలుగులో నక్షత్రం సినిమాలో ప్రత్యేకపాటలో ఆమె నర్తించిన విషయం తెలిసిందే. గౌతమీపుత్ర శాతకర్ణి చిత్రం తర్వాత మళ్లీ బాలకృష్ణ సరసన పైసా వసూల్ చిత్రంలో నటించే అవకాశం లభించింది. అందులో జర్నలిస్ట్ పాత్రలో ఆమె కనిపించనుంది. మరోవైపు తమిళంలో నరకాసుర చిత్రంలో నటిస్తున్న శ్రియకు తెలుగులో ఇంకో అవకాశం తలుపుతట్టింది. నారా రోహిత్, సుధీర్‌బాబు నటించేవీరభోగ వసంతరాయలు చిత్రంలో పోలీస్ ఆఫీసర్ పాత్రలో నటించే అవకాశం ఆమెను వరించినట్లు సమాచారం. కేవలం దక్షిణాది సినిమాలే కాకుండా బాలీవుడ్‌లో ఎప్పుడు అవకాశాలు లభించినా...నటిస్తోంది. హిందీ దృశ్యం తర్వాత ప్రస్తుతం మరో మంచి చిత్రం తడకాలో నటిస్తోందట. నటుడు ప్రకాష్‌రాజ్ దర్శకత్వంలో తెరకెక్కే ఈ చిత్రంతో పాటు ప్రస్తుతం నటిస్తున్న చిత్రాలన్నీ తన కెరీర్‌ను మరింత ముందుకు కొనసాగించేవేనని భరోసాగా చెబుతోంది టాలీవుడ్ ఇష్టసఖి శ్రియ

నేను గ్లామర్ ఐకాన్...

పాఠశాలలో ఉండగా అబ్బాయిలు నా పట్ల ఆకర్షితులయ్యేవారు కారు. ఎందుకంటే సంప్రదాయ దుస్తులు ధరించి, తలకి నూనె పెట్టుకుని ఉండేదాన్ని. నాలో అందం వాళ్లకు కనిపించేది కాదు. ఇండస్ట్రీలోకి వచ్చాక గ్లామర్ ఐకాన్ అని పిలవటం చూస్తుంటే ఆశ్చర్యమేస్తుంటుంది. నేనేనా... అనే భావం కలుగుతుంది. నాకు రొమాంటిక్ కామెడీ సినిమాలంటే ఇష్టం. దాదాపు అందరు హీరోలతో లవ్, యాక్షన్ చిత్రాల్లో నటించాను. అవకాశాలు లేకుంటే కథక్ గురువుగా మారిపోతా. దక్షిణాదిలో తమిళం, తెలుగు, మలయాళం, కన్నడ నాలుగు భాషలు మాట్లాడగలను.

- రమేష్ గోపిశెట్టి


మ్యూచువల్ డైవర్స్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ తప్పనిసరా!

ప్రశ్న: మేడం! ఆరు నెలల క్రితం నేను, నా భార్య పరస్పర అంగీకారంతో విడాకులు తీసుకునేందుకు నిర్ణయించుకుని హైదరాబాద్‌లోని సివిల్‌కోర్ట్‌లో మ్యూచువల్ డైవర్స్ పిటిషన్ ఫైల్ చేశాం. శాశ్వత భరణం కింద రూ.5లక్షలు సెటిల్ అయింది. ఆరు నెలల క్రితం కేసు ఫైల్ చేసిన రోజు రూ.2,50,000/- డీడీ రూపంలో చెల్లించాము. మిగతా సగం డబ్బుని ఆమెకు ఇచ్చేయాలనే ఉద్దేశంతో దానికి డీడీ తీసుకుని...క్రితం వారం కేసు ఉన్నప్పుడు కోర్టుకు వెళ్లాం. మా సాక్ష్యం పేపర్లు వేశాక జడ్జి గారు మొత్తం డబ్బు ముట్టింది కదా అని అడిగారు. ఆమె అవునండీ మొత్తం డబ్బులు తీసుకున్నాను అని చెప్పింది. అయితే ఆ డబ్బుని ఫిక్స్‌డ్ డిపాజిట్ రూపంలో తీసి... కోర్టులో సబ్‌మిట్ చెయ్యమని చెబుతూ మాకు నెల రోజుల గడువు ఇచ్చారు. మొత్తం డబ్బుని ఫిక్స్‌డ్ వేద్దామంటే ఆమె ముందు తీసుకున్న డబ్బు ఖర్చయిపోయింది.. నా దగ్గర డబ్బు లేదని అంటోంది. ఇప్పుడు ఏం చెయ్యాలి. అసలెక్కడైనా ఇలా ఫిక్స్‌డ్ డిపాజిట్ తీయాలి... అని రూల్ ఏమైనా ఉందా..దయచేసి తెలియజేయగలరు.

- కె. కిరణ్ కుమార్

జవాబు: మ్యూచువల్ డైవర్స్‌లో రూ.10 తీసుకుని దానిని పర్మినెంట్ భరణంగా అంగీకరించినా భవిష్యత్‌లో క్లెయిమ్ చేయడానికి అర్హత కోల్పోయినట్లే. ఫిక్స్‌డ్ డిపాజిట్ రూపంలో ఆ డబ్బు ఉండాలి అని ఏ చట్టం, ఏ సెక్షన్ చెప్పడం లేదు కానీ కొంతమంది జడ్జీలు... వాళ్ల సొంత ఆలోచనా విధానం బట్టి.. దీన్ని కండిషన్‌గా పెడుతూ ఉంటారు. డబ్బు తీసుకున్న వ్యక్తి ఆ డబ్బును ఏ అవసరానికి వాడుకోవాలి అనేది ఆమె ఇష్టం. అది న్యాయమూర్తి నిర్ణయించలేరు. అయితే జడ్జిగారి ఉద్దేశ్యం... ఒకవేళ పిల్లలు ఉంటే వారి భవిష్యత్ అవసరాల నిమిత్తం ఆ డబ్బు ఉంటుందని కావచ్చు. ఫిక్స్‌డ్ డిపాజిట్‌గా ఉంటే కొంతమందయినా ఆ డబ్బుని అనవసరంగా వాడకుండా ఉంటారని ఆయన భావిస్తుండవచ్చు. కేసు ఫైల్ చేసే ముందే ఆ రూల్ చెప్పి ఉంటే బాగుండేది. ఆర్డర్/ఎవిడెన్స్ రోజున ఆ విషయం చెప్పడం కొంత వరకు పార్టీలకు ఇబ్బంది కలిగించటమే అవుతుంది. మరో విషయం... పార్టీని నమ్మి ముందుగానే పూర్తి మొత్తం ఫిక్స్‌డ్ డిపాజిట్‌గా ఇచ్చి కేసును నడిపించలేం. ఒక్కోసారి ఆ పార్టీల్లో డబ్బు తీసుకున్నవాళ్లు కోర్టుకు రాకుండా ఇబ్బంది పెట్టవచ్చు. లేదా వాళ్లు ఎక్కువ అమౌంట్ డిమాండ్ చేసే అవకాశం ఉంటుంది.

న్యాయ సలహా



ఇక మీ విషయానికి వస్తే... డిడి రూపంలో ఉన్న మిగిలిన డబ్బుని మీరు ఆమెకు ఇవ్వకపోతే దానిని ఆపండి. ఆమెపై నమ్మకం ఉంటే ఆ మొత్తం ఇచ్చి మిగతా అమౌంట్ ఎక్కడైనా అడ్జస్ట్ చేసుకుని ఫిక్స్‌డ్ డిపాజిట్ తీయమని ఆమెకు చెప్పండి. లేదా వేరే కోర్టులో కొత్తగా కేసు ఫైల్ చేసుకోండి. ఆరు నెలలు ఆగడం కుదరకపోతే ఒకరు డైవర్స్ కేసు ఫైల్ చేసి... దానిలో రెండోవారిని మొదటి డేట్‌కు హాజరు అవ్వమని చెప్పి... కాంప్రమైజ్ పిటిషన్ ఫైల్ వేయండి. ఒకే రోజులో అయిపోతుంది. ఆమెకు ఇవ్వాల్సిన డబ్బుని అప్పుడు ఇచ్చివేయవచ్చు. డబ్బుని ఫిక్స్‌డ్ డిపాజిట్‌లో కచ్చితంగా వేయాలనడం కొంత ఇబ్బందికరమైన విషయం. ప్రిసైడింగ్ ఆఫర్స్‌లో వాళ్లకు తోచిన లేక వాళ్లకు నచ్చిన నిర్ణయం తీసుకుని పార్టీలను ఇబ్బంది పెట్టకూడదు. ఒకవేళ ఇబ్బందికరంగా అనిపిస్తే ఆ విషయంపై మీరు హై కోర్టుకు వెళ్లి అక్కడ ఈ విషయాన్ని తెలియజేసి మీకు కలిగిన ఇబ్బందిని వివరిస్తే...మీకు కొంత న్యాయం జరిగే అవకాశం ఉంటుంది.



రమ్యకుమారి ఆకుల
ప్రముఖ న్యాయవాది
సెల్ : 88856 65733

మనతో మమేకమైన...కృష్ణతత్వం!

రేపు కృష్ణాష్టమి



చిన్ని కృష్ణుడు అనగానే చాలామందికి ఆయన అల్లరి, చిలిపిదనాలే గుర్తొస్తాయి. శ్రీకృష్ణుడి బాల్యంలో కనిపించే వింతలు, విశేషాల వల్లలే మనకు అలాంటి అభిప్రాయం కలుగుతుంది. అయితే నిజంగా కృష్ణుడి వ్యక్తిత్వం గురించి చెప్పాలంటే...ఆయనలో ఎన్నో గొప్ప గుణాలు ఉన్నాయి. విజ్ఞానము, దయ, జాలి, ప్రేమ, మేధస్సు, శక్తి, ధైర్యము. వైవాహిక జీవన నైపుణ్యాలు, నిర్భయత్వం, నిష్కపటత్వం, ఉత్తేజము, నిలకడతనం, సమదృష్టి...ఇలా శ్రీకృష్ణునిలో లేని మంచి గుణం లేదు. శ్రీ కృష్ణుడు మూర్ఖులను, చెడుగుణాలున్న వ్యక్తులను సహించడనే పేరుంది. అలాగే ఆయన అవసరమైతే నిర్దయగా వ్యవహరించగలడని ప్రతీతి.

అయన ఆది గురువు

ఇప్పుడు పర్సనాలిటీ డెవలప్‌మెంట్‌లో శిక్షణ ఇస్తున్నవారిని లైఫ్‌స్కిల్స్ శిక్షకులుగా చెబుతున్నారు. కానీ శ్రీకృష్ణుడు ఆనాడే అర్జునునికి ఎన్నో లైఫ్‌స్కిల్స్‌ని బోధించాడు. అందుకే ఇప్పుడు మనం ఎలాంటి క్లిష్ట సందర్భంలో అయినా భగవద్గీతలో కృష్ణుడు ఏమన్నాడంటే...అంటూ చెప్పుకుంటున్నాం. ప్రాక్టికల్ జీవితంలోని సమస్యలకు ఆధ్యాత్మిక ఉపశమనాన్ని ఎంతో సులభంగా...అందరూ అంగీకరించేలా చెప్పగలిగాడు కృష్ణుడు. ఇప్పుడు మనం వింటున్న స్పిరిట్యువల్ గురు, మేనేజ్‌మెంట్ గురు, లైఫ్‌స్కిల్స్ గురు అన్నీ ఆయనే. అంతేకాదు..మనిషిలో ప్రతిభ ఉంటే...ఎక్కడ పుట్టినా...ఆటంకాలను అధిగమించి ఎంత ఎత్తులకు అయినా ఎదగవచ్చనే వాస్తవానికి సైతం శ్రీకృష్ణుడు రుజువుగా కనబడతాడు. లైఫ్‌స్కిల్స్‌లో ఇది అత్యున్నతమైనది. మనిషి తనని తాను తీర్చిదిద్దుకోవటం. శ్రీకృష్ణుని పాత్రలో మనకు ఇలాంటి ధోరణులతో పాటు విప్లవాత్మకమైన భావాలు సైతం కనబడతాయి. బాధితులకు అండగా నిలబడటం, కంసుని అంతమొందించడం, తాటకి లాంటి రాక్షసుల పనిపట్టటం... లాంటివన్నీ కృష్ణునిలోని ధైర్యాన్ని, ఎదిరించి నిలిచే లక్షణాన్ని వెల్లడిస్తాయి.

ఎన్నో పాత్రలు...

మన జీవితంలో ఉండే అన్నిరకాల పాత్రలు కృష్ణుని కథలో కనబడతాయి. బాలుడిగా, సోదరుడిగా, కుమారుడిగా, రథ సారధిగా, సైనికుడిగా, గురువుగా, శిష్యుడిగా, ప్రేమికుడిగా, భర్తగా, బంధువుగా, స్నేహితుడిగా, రాజకీయ నిపుణుడిగా, బోధకుడిగా, మార్గదర్శిగా...చివరికి దైవంగా....ఇలా ఎన్నో రకాలుగా కృష్ణతత్వం మనకు కనబడుతుంది. ఏ పాత్రలోనూ ఏ చిన్నలోపం కనిపించని పరిపూర్ణత్వం గోచరిస్తుంది. అన్నిటికంటే ముఖ్యంగా కష్టసుఖాల్లో ఒకేలా ఉండటం...అనే కృష్ణుని ఉపదేశం నిత్య సత్యం...మనిషి ఉన్నంత వరకు నిలిచి ఉండే తత్వం.భక్త, జ్ఞాన, కర్మ యోగాల ద్వారా...నిరంతరం మనిషితో మనిషి జీవితంతో మమేకమైనది కృష్ణతత్వం.



పొట్ట కండరాలను గట్టిపరుస్తాయి!

పొట్ట కండరాలతో పాటు వీపు వెన్నెముకలకు మంచి వ్యాయామం ఇచ్చి...అనారోగ్యాలను నివారించే రెండు ఆసనాలను ఇప్పుడు చూద్దాం-

యోగా టైమ్

కడుపు కండరాలకు వ్యాయామం...

ఉదరాకర్షణాసన

రెండు మోకాళ్లనూ మడిచి దగ్గరగా ఉంచి మోకాళ్లు గొంతు వద్దకు వచ్చేలా కూర్చోవాలి. రెండుచేతులనూ మోకాళ్లమీద ఉంచాలి. శ్వాసని వదులుతూ కుడి మోకాలుని కిందకు వంచాలి. ఎడమకాలు అలాగే పైకి ఉండి... కుడి మోకాలి పక్కకు ఎడమ పాదం వస్తుంది. ఎడమమోకాలిని కొంచెం కుడివైపుకి వంచి ఉంచాలి. పొట్ట కండరాలను కాస్త లోపలికి లాగుతూ తలను ఎడమవైపుకి తిప్పాలి. ఇలా నాలుగు లేదా ఐదు సెకన్ల వరకు ఉండాలి. తరువాత శ్వాసని తీసుకుంటూ సాధారణ స్థితికి రావాలి. ఇదే విధంగా ఎడమ మోకాలిని నేలకు ఆన్చుతూ కూడా చేయాలి. ఇలా మూడు లేదా నాలుగుసార్లు చేయాలి.

ఉపయోగాలు..

ఇది పొట్ట కండరాలను గట్టిపరచి... కడుపుకి సంబంధించిన సమస్యలు రాకుండా నివారిస్తుంది. అలాగే పొట్టకి సంబంధించిన అనారోగ్యలకు ఉపశమనం కలిగించి...నిద్ర బాగా పట్టేలా చేస్తుంది.

గమనిక... మోకాళ్ల నొప్పులు సయాటికాతో బాధపడేవారు దీన్ని సాధన చేయకూడదు.



వీపు వెన్నెముకలకు మేలు....చక్కి చలనాసనం

రెండుకాళ్లూ ముందుకు చాపి కాళ్ల మధ్య ఒక మీటరు దూరం ఉండేలా కూర్చోవాలి. రెండుచేతులను కాళ్లకు సమాంతరంగా చాపి...చేతుల వేళ్లను కలిపి గట్టిగా పట్టుకోవాలి. మోచేతులు వంగకుండా చూసుకోవాలి. ఇప్పుడు శ్వాస తీసుకుని మోకాళ్లు పైకెత్తకుండా...చేతులు పాదాలకు తాకేలా ముందుకు వంగుతూ...చేతులను తిప్పాలి. అంటే ముందుకు వెనక్కు వంగుతూ..చేతులతో సున్నా రాస్తున్నట్టుగా చేయాలన్నమాట. ముందుకు వంగినప్పుడు శ్వాసని వదులుతూ వెనక్కు వెళ్లినప్పుడు శ్వాసని తీసుకోవాలి. ఇలా గడియారంలో ముల్లు తిరిగే వైపుకి ఆరుసార్లు, అందుకు వ్యతిరేకంగా ఆరుసార్లు తిప్పాలి. పాతకాలంలో తిరగలిని తిప్పే విధానంలాగా దీనిని ఊహించుకోవచ్చు.

ఉపయోగాలు...

దీనివలన పొట్టకండరాలు గట్టిపడతాయి. నెలసరి క్రమబద్ధం అవుతుంది. కడుపుతో ఉన్నవారు కూడా మొదటి మూడునెలలు చేస్తే ప్రయోజనాలు ఉన్నాయి (వారి ఆరోగ్యాన్ని బట్టి డాక్టరు సలహా అవసరం). వీపు వెన్నెముకలు మృదువుగా... సులువుగా ఎటైనా వంగేలా మారతాయి.



గాయత్రి
యోగా ట్రైనర్



మోడల్: కె. స్నేహిత

చింతన

కృష్ణస్తు భగవాన్ స్వయం



శ్రీకృష్ణుడు పరిపూర్ణావతారం. మత్స్యాది అవతారాలు ఒక ప్రయోజనం కోసం వచ్చి ఆ ప్రయోజనం సిద్ధించగానే ఉపసంహరించబడ్డాయి. శ్రీరాముడు పూర్ణావతారమే అయినా, తాను పరమాత్మ స్వరూపమేనన్న లక్షణాన్ని బహిర్గతం చేయకుండా కేవలం మానవుడినే అంటూ ధర్మాన్ని రక్షించడమే తన కర్తవ్యమంటూ ఇతరులకు మార్గదర్శకంగా నిలిచారు. కృష్ణావతారం పూర్తిగా విలక్షణమైనది. జన్మించినదాదిగా ప్రతి సందర్భంలో తన పరమేశ్వర తత్త్వాన్ని, సర్వ సాక్షి త్వాన్ని, సర్వజ్ఞత్వాన్ని, సర్వ కారణత్వాన్ని ప్రదర్శించాడు. శ్రీకృష్ణునిలోని మరో విశిష్ట లక్షణం జగద్గురుత్వం.



చైతన్య మహాప్రభు భక్త్యావేశంతో బాహ్య స్పృహ లేకుండా శ్రీకృష్ణ నామాన్ని జపిస్తున్నాడు. కొందరు అతణ్ని చూసి పిచ్చివాడనుకున్నారు. మరికొందరు ఎందుకయ్యా! అతని కోసం అంతగా పరితపిస్తున్నావు? అని ప్రశ్నించారు. చైతన్య మహాప్రభు సమాధానమిస్తూ, 'భగవచ్ఛబ్దం ఒక్క కృష్ణునికే పర్యాయపదంగా వాడబడింది కనుక. కృష్ణస్తు భగవాన్ స్వయం అన్న మాటను మీరు వినలేదా' అని ఎదురు ప్రశ్న వేశారు.

శ్రీకృష్ణుడు పరిపూర్ణావతారం. మత్స్యాది అవతారాలు ఒక ప్రయోజనం కోసం వచ్చి ఆ ప్రయోజనం సిద్ధించగానే ఉపసంహరించబడ్డాయి. శ్రీరాముడు పూర్ణావతారమే అయినా, తాను పరమాత్మ స్వరూపమేనన్న లక్షణాన్ని బహిర్గతం చేయకుండా కేవలం మానవుడినే అంటూ ధర్మాన్ని రక్షించడమే తన కర్తవ్యమంటూ ఇతరులకు మార్గదర్శకంగా నిలిచారు. కృష్ణావతారం పూర్తిగా విలక్షణమైనది. జన్మించిన దాదిగా ప్రతి సందర్భంలో తన పరమేశ్వర తత్త్వాన్ని, సర్వ సాక్షిత్వాన్ని, సర్వజ్ఞత్వాన్ని, సర్వ కారణత్వాన్ని ప్రదర్శించాడు.



శ్రీకృష్ణునిలోని మరో విశిష్ట లక్షణం జగద్గురుత్వం. ఈ విషయాన్ని బ్రహ్మ పురాణం చెప్పింది. ఇక 'ఎవరు ఎలా సేవిస్తే వారిని ఆ ప్రకారం అనుగ్రహిస్తాను. వారే మార్గాన్ని అనుసరించినా ఆ మార్గం నన్నే చేరుతుంది' అంటూ అన్ని మార్గాలను సమన్వయం చేస్తూ భగవద్గీతలో శ్రీకృష్ణ పరమాత్మ తన అవతార తత్త్వాన్ని తెలియపరిచాడు.



భాగవత పురాణాన్ని రచించిన వేద వ్యాసులే శ్రీకృష్ణ అవతారోద్దేశాన్ని ఇలా వివరించారు. శ్రీకృష్ణుడు దుష్ట శిక్షణకు, ధర్మ రక్షణకు మాత్రమే అవతరించలేదు. అజ్ఞానం చేత విషయవాంఛా సుఖంలో మునిగి సంసార బంధంలో చిక్కుకున్న వారికి తరించే మార్గాన్ని తన లీలల ద్వారా తెలియజెప్పి కేవలం స్మరణ మాత్రం చేతనే మోక్షగాముల్ని చేస్తాడు. చిన్ని కృష్ణుని చిలిపి చేష్టలు, గోవులు, గోపాలురు, గోవత్సములు, అన్నీ తానే అయి బ్రహ్మకు కనువిప్పును కలిగించడం, గోవర్ధన గిరిని ఎత్తి ఇంద్రుని గర్వమణగించడం, కాళీయ మర్దనం, ఇవన్నీ తెలుసుకున్నపుడు శ్రీకృష్ణుడు భగవత్స్వరూపుడేనని అర్థమవుతుంది. సాక్షాత్తు భగవంతుడే తన పూర్ణ కళలతో శ్రీకృష్ణునిగా అవతరించాడని స్పష్టమవుతుంది. శ్రీకృష్ణుడు ఏ రూపంలో తన లీలలను ప్రదర్శించినా అతడు జగతిన వెలగించిన దివ్య దీప్తి, ఆదర్శ, ఆరాధ్య లీలలను కలబోసినది. కృష్ణావతారం విస్తృతికి ఎల్లలు లేవు. అది అంతు తెలియని అగాధం.

కృష్ణునికి ఆ పేరు పెట్టినది గర్గ మహర్షి. కృష్ణ అంటే నల్లనివాడు అని తెలిసినదే. విశాలమైన సాగరం నీలం (నలుపు)గానే కనిపిస్తుంది. ఏ వర్ణమూ లేని అనంతాకాశం కూడా నీలంగానే కనిపిస్తుంది. అన్నిటిని లీనం చేసుకునేదే నీలం. దీనిని నిరాకార పరబ్రహ్మ రూపానికి సంకేతంగా చెప్పుకోవచ్చు.

మరొకనిర్వచనాన్ననుసరించి కృష్ణ శబ్దంలో రెండక్షరాలున్నాయి. అవి కృష్, ణ. కృష్ అంటే శాశ్వతమైన ఉనికి కలవాడు అని అర్థం. ణ అంటే చిదానందం అని అర్థం. 'అథవాకర్షయేత్ సర్వం జగత్ స్థావర జంగమం' అనే నిర్వచనాన్ని అనుసరించి తన రూప, గుణ, మహిమాతత్త్వలీలా మాధుర్యాలతో సమస్త జగత్తునీ సమ్మోహింపజేసేవాడని అర్థం.

గర్గ మహర్షి కృష్ణ నామ కరణం చేస్తూ నామ్నాం భగవతో నంద! కోటీనాం స్మరణే చయత్ తత్ఫలం లభతే సూనం కృష్ణేతి స్మరణాన్నరః అన్నాడు. కోటి భగవన్నామాలతో సమానమైనది ఒక్క కృష్ణనామమని గర్గ వచనం.

భగవన్నామాలలో అర్థ, శబ్ద శక్తులు మేళవించిన మంత్రశక్తి నిబిడీకృతమై ఉంటుంది. భగవంతుని ప్రతి నామం అమృతతుల్యం. నిత్య నామస్మరణ సర్వ పాప హరం. పాప హరణంతో భగవత్ప్రేమ ఉదయిస్తుంది. దివ్య గుణాలు ఉత్పన్నమై భగవంతుని పాదాలను ఆశ్రయిస్తుంది. చివరకు కైవల్యం పొందడానికి మార్గదర్శిగా ఉంటుంది.

శ్రీకృష్ణుడు జన్మిస్తూనే దేవకీ వసుదేవులకు తన నిజ స్వరూపాన్ని చూపి తాత్కాలిక జ్ఞానాన్ని కలిగించాడు. మన్నుతిన్నాడని మందలించిన యశోదకు నోరు తెరిచి తన నిజస్వరూపాన్ని వెల్లడించాడు. గొల్ల పడుచుల ఇంట వెన్న దొంగిలించిన, చిన్ని కృష్ణున్ని రోటికి బంధించాలని తలపోసి తల్లి తెచ్చిన త్రాడు (దామం) రెండంగుళాలు తగ్గడంతో ఆశ్చర్యపడిన యశోదకు కష్టం కలగకుండా బద్ధుడయ్యాడు. దేహాత్మ భావనతో సతమతమయ్యేవారికి తానే బద్ధుడైపోయాడు. గోపికల అనన్య భక్తికి దాసుడై ఒక్కొక్క గోపికకు ఒక్కొక్క కృష్ణునిగా కనిపించి రాసలీలలో పాల్గొన్నాడు. అందరికీ కైవల్యాన్ని అందించాడు. ఇంద్రుని గర్వమణచి గోవిందుడైనాడు. ఇక మధురలో ప్రదర్శించిన లీలలు, కువలయాపీడాన్ని సంహరించడం, కుబ్జను సౌందర్యవతిగా మార్చడం ఇలా చెప్పుకుంటూ పోతే కృష్ణలీలలకు అంతెక్కడుంది.

శ్రీకృష్ణుడు తనను ప్రేమించిన వారినే కాక విద్వేషంతో మాటిమాటికీ తన నామ స్మరణ చేసిన వారికి మోక్షాన్ని ప్రసాదించాడు. కంసుడు, శిశుపాలుడు ఇలా ఎందరో ఉన్నారు. అర్జునునికి కురుక్షేత్రంలో రథ సారథిగా ఉండి పార్థసారథిగా ధర్మరక్షణకై తన అవతార లక్షణాన్ని తెలియజేయడమే గాక సమస్త ఉపనిషత్తుల సారాన్ని రంగరించి భగవద్గీతను అర్జునుని ముందుంచుకుని సర్వ మానవాళికి జ్ఞాన ప్రబోధం చేశాడు. శ్రీకృష్ణుని అవతార తత్త్వాన్ని శ్రద్ధగా పరిశీలిస్తే అతనిలో పరిపూర్ణావతారం, సగుణ, నిర్గుణ రూపాలు, అనుగ్రహం, మోక్షదాయి, యోగీశ్వరుడు, దేవాదిదేవుడు, వీరుడు, సులభుడు, అమృతతుల్యుడు వంటి అవతార లక్షణాలు కనిపిస్తాయి. కృష్ణుడు అనేక అవతారాల కలబోత. అందుకే వేద వ్యాసుడు కృష్ణస్తు భగవాన్ స్వయం అని కృష్ణతత్త్వాన్ని ఒక్క వాక్యంలో తెలియజేశారు.

- ఏ.సీతారామారావు



శ్రీకృష్ణం ధర్మం సనాతనం

'కృష్ణం ధర్మం సనాతనం' అని పురాణ వాక్యం. కృష్ణః అంటే అపరిమిత ఆనంద స్వరూపుడు. ''పరిత్రాణాయ సాధూనాం వినాశాయచ దుష్కృతాం ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే'' అనగా సాధు జన రక్షణ, దుష్ట జన శిక్షణ, ధర్మ సంస్థాపనానికై తాను మళ్ళీ మళ్ళీ అవతరిస్తానని స్వయంగా ప్రకటించిన వాడు శ్రీకృష్ణ భగవానుడు.

రామావతారంలో రాజుగా ఆర్తులను, దీనులను, భక్తులను ఆదుకున్నా అందరికీ అందుబాటులో లేని కారణంగా కృష్ణుడుగా క్షత్రియ వంశంలో పుట్టి రేపల్లెలోని గోపాలకులతో, గోపికలతో, గోవులతో కలసి మెలసి తిరిగాడు. పాపాలకు దూరంగా ఉన్న వారితోనే, వారిలోనే ఉంటానని చాటాడు. బాలునిగా ఉండి రేపల్లెలో ధర్మానికి హాని కలిగించే కంసుడు పంపిన రాక్షసులను వధించాడు. చివరికి కంసుని కూడా వధియగా ఆ వైరంతో తనపై కక్షకట్టి దాడి చేసిన జరాసంధుని సైన్యాన్ని పద్దెనిమిది సార్లు హతమార్చాడు. చక్రవర్తి అయిన జరాసంధుడు ఎప్పుడు యుద్ధానికి వచ్చినా 23 అక్షౌహిణిల సైన్యాన్ని తీసుకొని వచ్చేవాడు. (అక్షౌహిణి అంటే 10 వేల రథాలు, ఇరవై వేల ఏనుగులు, ఇరవై వేల గుర్రాలు, 40 వేల సైన్యం). ఈ విధంగా 18 సార్లు ఓడించి అనగా 414 అక్షౌహిణిల సైన్యాన్ని కృష్ణ బలరాములు ఇద్దరు మాత్రమే వధించారు. 18 అక్షౌహిణిల సైన్యాన్ని కృష్ణుడు వెనకుండగా వధించిన అర్జునుడు, భీముడు మహా వీరులుగా కీర్తించబడితే 414 అక్షౌహిణిలను వధించిన కృష్ణుడు ధర్మ నిర్వహణ కర్తవ్య దీక్ష మూర్తీభవించిన అవతారం.


కృష్ణావతారంలో ఆశ్రిత వాత్సల్యం, ఆశ్రిత పక్షపాతం, భక్తజన సౌలభ్యం ప్రస్ఫుటంగా కనపడతాయి. పాండవులకు దూత, సారథి అయి అనుక్షణం వారికి కంటికి రెప్పలాగా ఉన్నాడు. ఒక సారథిగా అర్జునుని గుర్రాల ఆలనాపాలనా చూసి, రథానికి ఉన్న దుమ్ము, దూళి తొలగించినట్లే మీ శరీరం, మనస్సులలోని మలినాలను తొలగించి గమ్యానికి చేర్చే రథసారథిని నేను అని పాండవులకు చాటినవాడు కృష్ణుడు. ధుర్యోధనుడు విందుకు పిలిస్తే కాదని విదురుని ఇంట్లో భోజనం చేసి ఆశ్రిత పక్షపాతాన్ని చాటిన ఆశ్రిత వత్సలుడు, ధర్మ వత్సలుడు శ్రీకృష్ణుడు. తప్పుచేసిన దేవతలను ఓడించి భక్తులైన గోపాలురను, గోవులను, గోపికలను అక్కున చేర్చుకున్న ధర్మ పక్షపాతి శ్రీకృష్ణుడు. అందుకే కృష్ణం ధర్మం సనాతనం.



- డా॥ కందాడై రామానుజాచార్య

శ్రీ రమణాశ్రమ లేఖలు, స్మృతులు

గురియే గదా గురువు?



శ్రీ రమణాశ్రమం

8-8-46

నిన్న ఉదయం రామయోగిగారు భగవానులనిట్లా ప్రశ్నించారు: ''స్వామీ! సాయిబాబా శిష్యులు కొందరు బాబా పటం పెట్టుకొని పూజిస్తూ ఆ పటమే గురువంటారే ఎట్లా పొసగుతుంది? దైవమని పూజింపవచ్చుగాని గురువని సేవిస్తే వీరు పొందే లాభమేమిటి?'' అన్నారు. దానికి భగవాన్ సమాధానమిస్తూ ''చిత్త ఏకాగ్రత కలుగుతుంద'న్నారు. కాని ఆ ఏకాగ్రత స్థిరపరచుకోటానికి గురువు కావద్దా?'' అన్నారు యోగి గారు. ''అవునండీ గురియేగదా గురువు'' అన్నారు భగవాన్. ''ఆ గురి కుదరటానికి ఆచరణ రూపంగా చూపించే సజీవ గురువు కావాలి గాని, నిర్జీవ ప్రతిమ యేం జేస్తుంది? అట్లా సజీవ గురువు లేకుండానే సిద్ధి పొందటం భగవాన్ కంటే సరిపోయిందిగాని మాబోంట్లకు సాధ్యమా?'' అన్నారు యోగి.

''వాస్తవమే, అయినా, నిర్జీవ ప్రతిమను ఆరాధించినందువల్ల కొంత వరకు చిత్తైకాగ్రత కలుగుతుంది. ఆ ఏకాగ్రత స్థిరపడేందుకు తానెవరో విచారించి తెలుసుకుంటేగాని కుదరదు. ఆ విచారణకు గురు సహాయమవసరమే. అందుకే ఉపాసనతో ఆగకూడదంటారు పెద్దలు. అయితే, ఈ ఉపాసన వృథా కాదు. ఎప్పటికైనా ఫలిస్తుంది. కాని ఈ ఉపాసనలో డాంబికం ఉండరాదు. మనస్సు స్వచ్ఛంగా వుంటే అంతా ఫలిస్తుంది. లేకుంటే చవిటినేలన నాటిన విత్తనంవలె వృథా అవుతుంది'' అన్నారు భగవాన్.

''ఏమో స్వామి! మీరు నూరు చెప్పండి. వెయ్యి చెప్పండి. తన నడత సరిచూచుకోటానికి మీవంటి సజీవ గురువు కావాలి గాని, నిర్జీవ ప్రతిమలకు గురుస్థానం ఎట్లా ఇవ్వటం?'' అన్నారు వారు. భగవాన్ మందహాసంతో ''ఊ ఊ'' అంటూ తలవూపి మౌనం వహించారు. మౌన సహితమైన ఆ మంద హాసంలో మాణిక్యాలు ఒలికినయ్యన్నా! ఏం వ్రాయమంటావు?


- సూరినాగమ్మ

శ్రీ రమణాశ్రమము, తిరువణ్ణామలై వారి సౌజన్యంతో

Facebook page https://www.facebook.com/ Sri Ramana Telugu
website http://www.sriramanamaharshi.org/ tel/

దివ్యత్వం నిర్గుణమైనది

కృష్ణుడు ''దివ్యత్వం నీలో ఉంది'' అని చెప్పినప్పుడు అర్జునుడు ఇలా ప్రశ్నించాడు. నువ్వు అన్నింటిలోనూ దివ్యత్వం ఉంది అని అన్నావు...! అదే దివ్యత్వం దుర్యోధనుడిలో కూడా ఉంటుంది. అప్పుడు అతను ఎందుకు ఇలా ప్రవర్తిస్తున్నాడు...నువ్వు, అతనిని సరిచెయ్యలేవా...? ఈ యుద్ధాన్ని ఆపలేవా...? మీరు...''నేను అన్నింటిలోనూ ఉన్నాను.. నేనే అన్నీ'' అని చెప్పినప్పుడు...నీవు దుర్యోధనుడిలో కూడా ఉంటే... అతనిలోనికి కొంత ఇంగితాన్ని ఎందుకు తీసుకొని రావు...?! మనం ఈ యుద్ధాన్ని అరికట్టవచ్చు కదా...?- అని. సరైన మాటే కదూ....?! దానికి కృష్ణుడు- దివ్యత్వం నిర్గుణమైనది అని చెప్పాడు. అంటే దీనికి ఎటువంటి గుణమూ లేదు. దీనికి ఎటువంటి తత్త్వమూ లేదు. దీనికి ఎటువంటి విచక్షణా లేదు. మీకు దాని నుంచి ఏది కావాలంటే...అది చేసుకోవచ్చు.



దివ్యత్వం అనేది ఏదో ఒక చోటులో కాదు, అది అందరిలో ఉంది అని, దానికి ఎటువంటి విచక్షణ ఉండదని సద్గురు చెబు తున్నారు.

శివుడు దీనికి ఎంతో గొప్ప ఉదాహరణ. శివుడు ఎంతో అందమైనవాడు. ఎంతో ఘోరమైనవాడు కూడా...! ఈయన ఒక గొప్ప గృహస్థు. అలాగే ఒక తాగుబోతు. ఒక తాపసి...మాదక ద్రవ్యాలకు బానిస. ఈయన ఒక్కడిలోనే అన్నీ...! ఇక్కడ మనం ఏం చెప్తున్నామంటే..మీరు ''దైవం'' అంటున్న దానికి విచక్షణ లేదు. మీరు దాని నుంచి ఏదైనా చేయవచ్చు. ఏదైతే సృష్టికి మూలమో అదే అన్నిటినీ తయారు చేస్తోంది.. మీరు కూడా సృష్టిలో భాగమే కదా...! అంటే, ఏదైతే సృష్టికి మూలమో...అది కచ్చితంగా మీలో కూడా ఉంది.

ఒకసారి ఇలా జరిగింది. కృష్ణుడు ''దివ్యత్వం నీలో ఉంది'' అని చెప్పినప్పుడు అర్జునుడు ఇలా ప్రశ్నించాడు. నువ్వు అన్నింటిలోనూ దివ్యత్వం ఉంది అని అన్నావు...! అదే దివ్యత్వం దుర్యోధనుడిలో కూడా ఉంటుంది. అప్పుడు అతను ఎందుకు ఇలా ప్రవర్తిస్తున్నాడు...నువ్వు, అతనిని సరిచెయ్యలేవా...? ఈ యుద్ధాన్ని ఆపలేవా...? మీరు...''నేను అన్నింటిలోనూ ఉన్నాను..నేనే అన్నీ'' అని చెప్పినప్పుడు...నీవు దుర్యోధనుడిలో కూడా ఉంటే... అతనిలోనికి కొంత ఇంగితాన్ని ఎందుకు తీసుకొని రావు...?! మనం ఈ యుద్ధాన్ని అరికట్టవచ్చు కదా...?- అని. సరైన మాటే కదూ....?! దానికి కృష్ణుడు- దివ్యత్వం నిర్గుణమైనది అని చెప్పాడు. అంటే దీనికి ఎటువంటి గుణమూ లేదు. దీనికి ఎటువంటి తత్త్వమూ లేదు. దీనికి ఎటువంటి విచక్షణా లేదు. మీకు దాని నుంచి ఏది కావాలంటే...అది చేసుకోవచ్చు.

సద్గురుబోధ

ఇక్కడా...అక్కడా... అంతటా ఉన్నది ఒక్కటే...! మీరు దాని నుంచి ఏదైనా చేయవచ్చు. మీరు దీనిని ఒక కిరాతకుడిగానైనా మలచవచ్చు. లేదా ఒక దివ్యమైనదానిగానైనా మలచ వచ్చు. రెండూ కూడా...మీలోనే ఉన్నాయి. మీరు గనుక కొంత ఎరుక కలిగి ఉంటే, ఖచ్చితంగా ఏదైతే ఉన్నతమైనదో దానినే మీరు చేస్తారు. మీకు గనుక ఈ ఎరుక లేకపోతే, మీరు దానిని ఒక గందరగోళంగా తయారుచేస్తారు. మీరు మీ నుంచి ఏ గందరగోళం సృష్టించుకున్నారో మీరు అదే రకమైన ప్రపంచంలో జీవిస్తారు. నేను ఇది సహజంగా చెప్తున్నాను. మనం ఎలాంటి గందరగోళాన్నైతే సృష్టించుకుంటామో అదే రకమైన సమాజంలో ఉంటాము. అదే రకమైన ప్రపంచంలో ఉంటాము. మనందరమూ కూడా ఒక ఉన్నత స్థాయి చైతన్యంలో ఉంటే, అందరం ఒక పూర్తిగా విభిన్నమైన సమాజంలో జీవించేవాళ్లం.

- సద్గురు జగ్గీ వాసుదేవ్


ధర్మం-మర్మం

ఆత్మ ప్రదక్షిణ అంతరార్థం ఏమిటి?

శాస్త్రం ప్రకారం మన ఎదురుగా. రెండు పక్కలా వెనుక ఏ దేవతామూర్తి లేనపుడే ఆత్మలో ఉన్న అంతర్యామికి ప్రదక్షిణం చేయాలి అన్నది విధి. కాని నేటి సామాజిక ఆచారం ప్రకారం దేవాలయంలో స్వామి విగ్రహం ముందు కూడా ఆత్మప్రదక్షిణ చేస్తారు. అలాగే వ్రతాలలో పూజలలో పురోహితుడు ఆత్మప్రదక్షిణ చేయిస్తారు. ఏ పూజ చేసినా వ్రతం చేసినా దేవతామూర్తి మన ఎదురుగానే ఉంటారు. '**అర్చాయాం స్థండిలే మూర్తౌ ప్రతికృతౌ రేఖా మూలకే సన్నిధౌ విద్యమానేచ తం పశ్యన్ విబుధోజనఃనాత్మ ప్రదక్షిణం కుర్యాత్ఇతి వేద విదోవిదుః**' అని స్కాందం లోని శంకరోక్తి. నదీతీరంలో, దేవతా వృక్షాలు లేని వనంలో, కరువు కాటకాలలో దేవతామూర్తి సన్నిధికి వెళ్ళ లేని స్థితిలో మనం మనంగా పరమాత్మకు అర్పించుకోవడం ఆత్మప్రదక్షిణలోని ఆంతర్యం. స్వామి ఎదురుగా ఆత్మప్రదక్షిణ విహితం కాదు.

భగవద్గీత

కృష్ణభక్తులు మనోనిగ్రహంతో ఉంటారు



అధ్యాయం 4

శ్లోకం 26:

శ్రోత్రాదీనీంద్రియాణ్యన్యే
సంయమాగ్నిషు జుహ్వతి।
శబ్దాదీన్ విషయానన్య
ఇంద్రియాగ్నిషు జుహ్వతి॥

తాత్పర్యం

కొందరు (నిష్ఠ కలిగిన బ్రహ్మచారులు) శ్రవణాది కార్యాలను, ఇంద్రియాలను మనోనిగ్రహమనెడి అగ్నిలో హోమం చేయగా, మరికొందరు (నియమితులైన గృహస్థులు)ఇంద్రియార్థాలను ఇంద్రియాలనే అగ్నికి అర్పిస్తారు.

భాష్యం

మానవ జీవితం ఇంద్రియ భోగమునకు కానందున మానవుడు క్రమేణా ఆధ్యాత్మిక జీవితములో పరిపూర్ణుడయ్యే విధంగా బ్రహ్మచారి, గృహస్థ, వానప్రస్థ, సన్యాస అను నాలుగు ఆశ్రమాలను ఏర్పాటు చేయటం జరిగినది. గురువు ఆశ్రమంలో ఉండి శిక్షణ పొందే విద్యార్థులను బ్రహ్మచారులు అంటారు. వారు మనస్సును నిగ్రహించడం ద్వారా ఇంద్రియ భోగవాంఛలకు దూరంగా ఉంటారు. ఎప్పుడూ కృష్ణునికి సంబంధించిన వచనాలే వినటం ద్వారా లౌకిక విషయాల పట్ల ఆసక్తిని కలిగి ఉండరు. ఈ విధంగా భగవంతుని గురించి శ్రవణ, కీర్తనాదులందు నిమగ్నులై ఉంటారు. అదే విధంగా ఇంద్రియ భోగానికి అనుమతి కలిగి ఉన్న గృహస్థులు కూడా నియమంతో మైథున భోగం, ఇంద్రియ భోగం పాటిస్తూ ఉన్నత ఆధ్యాత్మిక లక్ష్యం కోసం తమ సహజ నైజాన్ని సైతం త్యాగం చేస్తారు.

అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘ సంస్థాపకాచార్యులు కృష్ణ కృపామూర్తి శ్రీశ్రీల ఎసి భక్తి వేదాంతస్వామి ప్రభుపాదులు రచించిన 'భగవద్గీత' యధాతథము ఆధారంగా సమర్పిస్తున్నాము.

ఆంధ్రప్రభ యాప్‌లో శ్రావ్యమైన ఆడియోతో...






ప్రపంచంలో అత్యధిక జనసాంద్రత గల ప్రాంతాలలో సంగీత వాయిద్యాలు విడివిడిగా అభివృద్ధి చెందాయి. నాగరికతల మధ్య సంబంధాల ఫలితంగా ఇవి వాటి పుట్టిన ప్రదేశాల నుండి సుదూర ప్రాంతాలలో కూడా వ్యాప్తి చెందాయి. మధ్యయుగాల నాటికల్లా మెసప టోమియా యొక్క సంగీత వాయిద్యాలు మలయాద్వీప సమూహం లోనూ అలాగే ఉత్తరాఫ్రికా సంగీత వాయిద్యాలు యూరోపియా ప్రాంతాలకు వ్యాపించి ఉపయోగించబడ్డాయి.

సంస్కృతి



సంగీత వాయిద్యాల పుట్టుకెప్పుడు?



ధ్వనులను సృష్టించడానికి ఉపయోగించే పరికరం సంగీత వాయిద్యం. సూత్రబద్ధంగా, లయాత్మకంగా ధ్వనిని జనింపజేసే ఏదైనా సంగీతవాయిద్యంగా చెప్పవచ్చు. సంగీత వాయిద్యాల చరిత్ర మానవ సంస్కృతి ప్రారంభంతోనే మొదలవుతుంది. సంగీత వాయిద్యాల శాస్త్రీయ అధ్యయనాన్ని అర్గనాలజీ అంటారు. సంగీతవాయిద్యంగా గుర్తింపు పొందిన మొదటి పరికరం 67000సంవత్సరాల పూర్వం రూపొందించబడిందని అంటారు. అయితే దీన్ని కొందరు శాస్త్రవేత్తలు అంగీకరించరు. అయితే ఎక్కువమంది అంగీకరించిన సంగీత పరికరం 37000సంవత్సరాల పూర్వం రూపొందిం చబడింది. అయితే అసలు సంగీత పరికరం కచ్చితంగా ఎప్పుడు రూపొందించబడిందో తెలపటం కష్టమని కొందరి వాదన.

ప్రపంచంలో అత్యధిక జనసాంద్రత గల ప్రాంతాల లో సంగీత వాయిద్యాలు విడివిడిగా అభివృద్ధి చెందాయి. నాగరికతల మధ్య సంబంధాల ఫలితంగా ఇవి వాటి పుట్టిన ప్రదేశాల నుండి సుదూర ప్రాంతాలలో కూడా వ్యాప్తి చెందాయి. మధ్యయుగాల నాటికల్లా మెసపటోమియా యొక్క సంగీత వాయిద్యాలు మలయాద్వీప సమూహం లోనూ అలాగే ఉత్తరాఫ్రికా సంగీత వాయిద్యాలు యూరోపియా ప్రాంతాలకు వ్యాపించి ఉపయోగించబడ్డాయి. అమెరికాలో అభివృద్ధి నెమ్మదిగా జరిగినా, ఉత్తర, మధ్య, దక్షిణ అమెరికాలు సంగీత వాయిద్యాలను మాత్రం పంచుకున్నాయి. సంగీత వాయిద్యాల పురాతత్వ ఆధారాలు సుమేరియా నగరమైన 'ఉర్'లో రాయల్ సిమెట్రి వద్ద జరిపిన తవ్వకాలలో లభించాయి. ఈ వాయిద్యాలలో తొమ్మిది వీణ వంటి వాయిద్యాలు, రెండు అనేక తీగలు గల తంత్రీ వాయిద్యాలు, ఒక వెండి ద్విముఖ వేణువు, పురాతన తంత్రీ వాయిద్యం, కంచుతాళములు వంటివి అక్కడ లభించాయి. అలాగే ఆధునిక బాగ్‌పైప్‌ల కు పూర్వరూపమనదగిన పీకతో ధ్వనిని పుట్టించే వెండిగొట్టాల సముదాయాన్ని 'ఉర్'లో పురావస్తు పరిశోధనా శాస్త్రవేత్త లు కనుగొన్నారు. ఈ స్థూపాకారపు గొట్టాలకు మూడు పక్క రంధ్రాలు అన్ని స్వర ప్రమాణాలను పలికించగలిగేవిగా ఉన్నాయి. 1930లలో లియోనార్డ్ పులేచే జరిపించబడిన తవ్వకాలలో శిథిలం కాని వాయిద్య భాగాలు మరియు శిథిలమైన భాగాల ఖాళీలు, రెండింటిని కలిపి వాటిని తిరిగి నిర్మించేటట్లుగా లభించాయి. ఈ వాయిద్యాలతో సంబంధం కలిగిన సమాధులు క్రీస్తుపూర్వం 2600 మరియు 2500 మధ్యకాలానివిగా కార్బన్ డేటింగ్‌చే నిర్ధారించబడి, ఈకాలానికే ఇవి వాడారనడా నికి సాక్షాలు లభించాయి.

మెసపటోమియాలోని నిప్పూరుకు చెందిన క్రీ.పూ 2000 సంవత్సరాల నాటి క్యూనిఫాం (చెక్కబడిన చిహ్నాలు) పలక, వీణపై ఉన్న తంత్రుల పేర్లను సూచిస్తూ సంగీత రచన యొక్క అతిపురాణ ఉదాహరణగా ఉంది.

విభిన్న సంస్కృతులలో సంగీత వాయిద్యాల ఖచ్చిత కాల నిర్ణయం చేయడానికి పూర్తిగా ఆధారపడదగిన పద్ధతులేవీ లేవని పండితుల అభిప్రాయం.

వాయిద్యాలను వాటి సంక్లిష్టతపై ఆధారపడి పోల్చడం మరియు నిర్వహించడం దోషపూరి తమైనది.

ఎందుకంటే సంగీత వాయిద్యాల అభివృద్ధి కొన్నిసార్లు ఈ సంక్లిష్టతను తగ్గిస్తుంది. ఉదాహరణకు ప్రారంభ చీలిక భేరీల తయారీలో పెద్ద చెట్లను కూల్చి వాటిని గుల్ల చేయడం ద్వారా జరిగేవి. తర్వాత కాలంలో వచ్చిన చీలిక భేరిలు సులువైన పద్ధతిలో వెదురు కాండాలను తెరిచి తయారుచేయబడ్డాయి. సంగీత వాయిద్యాల అభివృద్ధి వాటి తయారీ నైపుణ్యంపై ఆధారపడి వర్గీకరించడం కూడా తప్పుపట్టేదిగానే ఉంటుందంటారు పండితులు.

ఎందుకంటే అన్ని సంస్కృతులు విభిన్న స్థాయిలలో పురోభివృద్ధి చెంది విభిన్న పదార్థాలను కలిగి వుండేవి. నిర్వహణ, సంస్కృతి మరియు చేతి తయారీలలో విభిన్నత కలిగి ఒక కాలంలో మనుగడలో ఉన్న రెండు సంస్కృతులలో తయారుచేయబడ్డ వాయిద్యాలను పోల్చడానికి ప్రయత్నించినప్పుడు ఆ వాయిద్యాలలో ఏది ఎక్కువ పురాతనమైనదనే విషయాన్ని నిర్ధారించలేకపో యారని పండితులు తెలిపారు. సంస్కృతులు ఒకదానితో ఒకటి ఏవిధంగా ఎప్పుడు సంబంధాన్ని ఏర్పరుచుకొని జ్ఞానాన్ని పంచుకున్నాయనే విషయా న్ని ఎవరూ నిర్ధారించలేరు గనుక సంగీత వాయిద్యా లను భౌగోళికంగా క్రమపర చడం కూడా పాక్షికంగా విశ్వసనీయత కలిగి వుండదు.

ఆధునిక కాలంలో అత్యంత ప్రసిద్ధులైన సంగీత శాస్త్రవేత్తలు మరియు సంగీత తెగల శాస్త్రవేత్తలలో ఒకరైన జర్మన్ సంగీత శాస్త్రవేత్త కర్ట్‌శాక్స్ కొంతవరకు పరిమిత కేంద్ర భావన కలిగి ఉన్నప్పటికీ సుమారు 1400 వరకూ భౌగోళిక కాలనిర్ణయం ప్రాధాన్యత ఇవ్వదగినదని ప్రతిపాదించారు. 1400 తర్వాత సంగీత వాయిద్యాల యొక్క అభివృద్ధిని కాలవ్యవధిగా నిర్ణయించవచ్చని నిర్ణయించారు. సంగీత వాయిద్యాల క్రమాన్ని గుర్తించే శాస్త్రం పురావస్తు కళాఖండాలు, కళాత్మక వర్ణనలు, మరియు సాహితీ సూచికలపై ఆధారపడి ఉంటుంది. ఒకే పరిశోధనా మార్గంలో సేకరించిన సమాచారం అసంపూర్ణమైనది కాబట్టి మొత్తం మూడు మార్గాలూ కలిపి స్పష్టమైన చారిత్రక చిత్రాన్ని అందించగలవు.

క్రీస్తు శకం 19వ శతాబ్దం వరకు ఐరోపా యొక్క లిఖిత సంగీత చరిత్రలు, సంగీత వాయిద్యాలు కనుగొనబడిన విధానాన్ని తెలిపే పౌరాణిక గాథలతో ప్రారంభ మైనాయి. అలాంటి గాథలకు తండ్రివంటివాడైన జుబాల్ పాన్‌ఫ్లెప్స్ కనుగొన్న 'పాన్', ఎండిన తాబేలు పెంకు నుండి తయారుచేయబడ్డ మొదటి 'లైర్'ను తయారు చేసిన మెర్క్యూరీ వంటివి ఉన్నాయి. పౌరాణిక గాథలను పురాతత్వ శాస్త్ర ఆధారాలతో సందర్భానుసారంగా సమాచారం అందించబడిన మానవశాస్త్ర అంచనాలతో ఆధునిక చరిత్రలు పూరించాయి.

మొదటి పరికరాలలో గిలక్కాయలు, కాలితో తట్టడం ద్వారా శబ్దం చేసేవి, అనేక రకాల ఢంకాలు వంటివి ఉన్నాయి. ఇవి నాట్యం వంటి సందర్భా లకు తగినట్టు ధ్వనిని పుట్టించడానికి ఉద్భవిం చాయి. కొన్ని సంస్కృతులలో మతకర్మలకు వాయిద్యాలు ఉపయోగించేవి. చివరగా సంగీత వాయిద్యాలను శ్రావ్యతను కలిగించేవిగా తయారుచేసుకున్నారు. అప్పటివరకు వాయిద్యాల పరిణామంలో శ్రావ్యత పాడటానికి మాత్రమే పరిమితమయ్యాయి. శ్రావ్యత యొక్క మొదటి రూపం విభిన్న పరిమాణాలు గల రెండు గొట్టాలను కొట్టడం ద్వారా జనించింది. ఒక గొట్టం స్పష్టమైన శబ్దాన్ని ఇవ్వగా మరొకటి గాఢమైన స్థాయిలో జవాబిస్తుంది. సంగీతవాయిద్యాలు ఈ రూపంలో వేల సంవత్సరాలు ఉనికిలో ఉన్న తర్వాత, మూడు లేక అధిక స్వరాలు కలిగిన 'జైలో ఫోన్' వంటి నమూనాలు ఏర్పడ్డాయి. జైలో ఫోన్‌లు ఆగ్నేయ ఆసియా, అలాగే ద్వీప సమూహాలలో ప్రారంభమై అమెరికా, ఐరోపాలకు విస్తరించాయి. సరళమైన మూడు కాలి కమ్మీల సముదాయం నుండి శ్రద్ధగా స్వరపరిచిన సమాంతర కమ్మీల 'జైలో ఫోన్'లతో పాటు నేలవీణ, నేల జితేర్, సంగీత కమాన్, మరియు దవడ హార్స్ వంటి వాయిద్యాలను అభివృద్ధి పరిచారు.

- నియోగి
553097319

సంప్రదాయపు వెలుగులు కొండపల్లి బొమ్మలు



తెలుగు రాష్ట్రాలలో కొన్ని ప్రాంతాలు కొన్ని అంశాల విషయంలో అగ్రగామిగా నిలిచి ప్రపంచాన్ని ఆకర్షించడం కనిపిస్తుంది. కొన్ని ప్రాంతాలు వివిధ కళలతో విలసిల్లి తమ ప్రత్యేకతను ప్రపంచానికి తెలియజెప్పటం కూడా కనిపిస్తుంది. అటువంటి ప్రత్యేకత కలిగిన గ్రామం కొండపల్లి. కొండపల్లి పేరు చెప్పగానే అక్కడ తయారుచేయబడే బొమ్మలు మనసులో మెదులుతాయి. ఈ బొమ్మ లతోనే ఆ గ్రామానికి అంతటి పేరు వచ్చిం దంటే అతిశయోక్తి కాదు. కొండపల్లి విజయవాడకు 15కి.మీ. దూరంలో ఇబ్రహీంపట్నంకు దగ్గరలో ఉంటుంది.

కొండపల్లి గ్రామంలో సుమారు 400ఏళ్లుగా బొమ్మల తయారీ ఒక పరిశ్రమంగా విలసిల్లుతుంది. ఇక్కడ, బొమ్మల తయారీ కళాకారులతో ఒక కాలనీయే ఉంది. ఈ కాలనీలోని కళాకారులందరూ ఈ బొమ్మల తయారీతోనే జీవనం గడుపుతారు.


ఈ కళాకారులు రాజస్థాన్ నుండి చాలా కాలం క్రితం వలస వచ్చిన వారు. వీరిని ఆర్య క్షత్రియులుగా చెపుతారు. వీరు తయారుచేసే బొమ్మలు సంప్రదాయాక సౌందర్యంతో కనిపిస్తాయి. తరతరాల వార సత్వంగా ఈకళ ను వారు కాపాడు కుంటూ వస్తున్నారు.

కొండపల్లి బొమ్మ లు ఒకప్పుడు ప్రపంచమంతా కనిపిం చేవి. కొండపల్లి బొమ్మలు తెలియని తెలుగువారు ఉండరు. అంతగా ఇవి ప్రసిద్ధి చెందాయి. ఈ బొమ్మ లను తెల్ల పొణికి కలప ద్వారా వీరు తయారు చేస్తారు. కుటుంబంలోని సభ్యులం దరూ ఈ బొమ్మల తయారీలో పాలుపం చుకోవడం కనిపిస్తుది. ఈ తెల్లపొణికి వృక్షాలు ఇబ్రహీంపట్నం పరిసరాలలో కనిపిస్తాయి. ఈ చెట్ల కలప చాలా మృదు వుగా, సుతి మెత్తంగా ఉండి ఈ బొమ్మల తయా రీకి అనువుగా ఉంటుంది. ఇక్కడి కళాకారుల సాంప్రదా యబద్ధమైన ఈ కళపట్ల ఎంతో శ్రద్ధ వహించి వీటి తయారీలో నిమగ్న మవుతారు. వీరు తయారుచేసే బొమ్మల్లో తెలుగు వారి సంస్కృతి, సంప్రదాయాలు కొట్టొచ్చి నట్లు కనిపిస్తాయి.

తెలుగువారి సంప్రదాయపు పెళ్ళిళ్లకు సంబంధిం చిన బొమ్మ లతో పాటు చిన్న పిల్లలతో పాటు అందరినీ ఆకట్టుకు నే విధంగా వీటిని తయారు చేస్తారు.

పెళ్లికూతురు, పెళ్లికొడుకు, బ్రాహ్మణుడు, వ్యవసాయదారుడు, పేరంటాడ్రు, ఎడ్లబండ్లు వంటివే కాకుండా అనేక రకాల జంతువులు కూడా కొండపల్లి బొమ్మల్లో కనిపిస్తాయి. అలాగే తెలుగు ప్రాంతా లలోని గ్రామీణ వాతావరణం కూ డా ఈ బొమ్మల్లో ప్రస్ఫుట మవుతుంది. వ్యవసాయపు పైరు, తాడిచెట్లు ఎక్కే దృశ్యాలు, పిండి రుబ్బుతున్న స్త్రీలు, వరినాట్లు వేసే గ్రామీణ మహిళలు అలాగే పక్షులు, రామచిలుకలు, పులి, సింహం వంటి బొమ్మలు, రథం నడుపుతున్న శ్రీకృష్ణ డు, అర్జును డు ఇలా జానపద, పౌరా ణిక, సాంఘీక పర్మైన బొమ్మలు కనిపిస్తాయి. అందువల్లనే కొండపల్లి బొమ్మలు తెలుగువారి హృదయాలలో గొప్పస్థా నాన్ని ఆక్రమించాయి. ఈ కళాకారులకు పురాణాలు, జానపదగాథలు, గ్రామీణ జీవనం వంటి అంశాలు తెలియటం వల్లనే ఇన్ని రకాల బొమ్మలను తయారుచే యగలగు తున్నారని చెప్పవచ్చు.

ఒకప్పుడు వీరు తయారుచేసిన బొమ్మలను అనేక దేవాలయాలలో అలంకరించేవారు. ఈ బొమ్మల తయారీకి ఎటువంటి హాని కలగని రంగులను ఉపయోగిస్తారు. ఆకుల నుండి, కూరగాయల నుండి కావాల్సిన రంగులను తయారుచేసుకోవడం కనిపిస్తుంది. ఏ బొమ్మలకు ఏ రంగులు ఉపయోగించాలో ముందుగా నిర్ణయించుకోని దాని ప్రకారం బొమ్మలకు రంగులు అద్దుతారు. టామరింగ్ సీడ్, పౌడర్ మిశ్రమం, పసుపు, పువ్వులు వంటి వాటి నుంచి తయారుచేయబడ్డ రంగులు ఉపయోగించడం వల్ల ఈ బొమ్మలు సహజసౌం దర్యంతో కనిపిస్తూ ఆకట్టుకుంటాయి. అయితే రాను రాను ఈ బొమ్మలకు ఆదరణ తగ్గుతున్నట్లు కనిపిస్తున్నది. వందల కుటుంబాలు ఈ కళనే నమ్ముకొని జీవిస్తున్నాయి. వీరిని ఈ కళ నుండి దూరంగా జరిగిపోకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద అలాగే ప్రతి ఒక్కరి మీదా ఉంది. తెలుగు సంస్కృతిలో చోటు చేసుకుంటున్న అనే పాశ్చాత్యధోరణులు కూడా ఈ కళాకారుల జీవనం మీద ప్రభావం చూపిస్తున్నది. అనేక కళారూపాలు తెలుగువారి జీవనంలో భాగంగా అనాదిగా వస్తున్నాయి. కాలక్రమంలో చాలా కళలు అత్యదశ లో మిణుకు మిణుకు మంటున్నాయి. కళలు అంతరించడమంటే సంస్కృతి అంతరిం చడంగా భావించాల్సి ఉంటుంది. కనుక కళాకా రులు ఆదుకుంటూ, కళలను ప్రోత్సహిస్తూ ముందుకు సాగాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉంది.





- ముప్పిడి రాంబాబు.
9441701667

జనపదాలు కళానిలయాలు



ఒకనాడు పల్లెలు కళానిలయాలుగా ఉండేవి. ప్రతి గ్రామ కూడళ్లలో వివిధ కళారూప ప్రదర్శనలు జరిగేవి. ఒక్కో కళారూపం ఒక్కో ప్రత్యేకత కలిగి అందరిని ఆకట్టుకునేవి. ఇవి పగటివేషాలుగా చెపుతారు. తోలుబొమ్మలాటలు, వీధి భాగవతాలు, యక్షగానం, హరికథ ఇవన్నీ స్థూలంగా కొన్ని పోలికలున్న జానపద కళలు. వీటిని రాత్రిపూటే ప్రదర్శిస్తారు. వీటన్నింటికి వేదిక కావాలి. మరి పగటి వేళలలో విశ్రాంతిగా ఉన్న ప్రజలకి వినోదం వద్దా? వినోదం కావాలంటే ఎక్కడెక్కడికో వెళ్లవలసిందేనా? ఇంటి ముంగిట వినోదం లభించే మార్గమే లేదా? ఆనాటి ప్రజలకు వచ్చిన ఇటువంటి సందేహాలకు సమాధానంగా ఆవిర్భవించినవే పగటి వేషాలు.

పగటి వేషగాళ్లకి అద్భుతమైన అనుకరణ శక్తి ఉండాలి. బ్రాహ్మణుని వేషం ధరిస్తే, ఆ వేషభాషలు, కోమటివాని పాత్ర వేస్తే వైశ్యుల బొంగురు గొంతు, యాస ఇవన్నీ ప్రజల ముందుంచి దానికి నటన, హాస్యం జోడించాలి. అప్పుడే పగటివేషగాళ్ళ జోలె నిండేది. ఈనాడు తెలుగు ప్రజలకు తెలిసిన పగటి వేషాలలో పిట్టలదొర, కోతలరాయుడు చాలా పేరు పొందాయి.

కనీవినీ ఎరుగని, అసాధ్యమైన విషయాలను గడగడా ప్రజల ముందు పాఠం వలె అప్పచెబుతూ, తాము గొప్ప కోటీశ్వరులమనే భావన ఎదుటివారిలో కలిగించడానికి పిట్టలదొర పడే పాట్లు ప్రజలను కడుపుబ్బ నవ్విస్తాయి. నెత్తిన టోపీ, చేతిలో కొయ్య తుపాకీ, చిరుగులు లేదా మాసికలున్న చొక్కా, ప్యాంటు...సాధారణంగా ఇదీ పిట్టల దొర వేషం. ఈ వేషంలో అతడు గృహస్థులతో సాగించే సంభాషణ వాస్తవికతకు దూరంగా ఉండడమే గాక హాస్యాన్ని పండిస్తుంది.

పగటి వేషాలలో ప్రజలకు అచ్చెరువు కలిగించేది అర్ధనారీశ్వర వేషం. ఈ వేషం ధరించడంలో కూచిపూడి కళాకారులు సిద్ధహస్తులు. ఆనాడు వారు వేసిన వేషం చూసినవారెవరూ ఈనాటికీ దానిని మరచిపోలేరు. వారు చూపిన బాటలో ఈనాడు కొంతమంది నడుస్తున్నా అది కూచిపూడి కళాకారులకు సాటి రాగల స్థాయిలో లేదు.

అర్ధనారీశ్వర వేషంలో శరీరానికి నిలువునా సగం శివుడు, సగం పార్వతి వేషాన్ని ధరిస్తారు. సాధారణంగా పురుషులే వేషం వేస్తారు. ఎల్లవేళలా ఒక్క భాగమే ప్రజలకు కనిపిస్తుంది. రెండవ అర్ధభాగాన్ని మేలిముసుగుతో కప్పివేస్తారు. అవసరాన్ని బట్టి వేషధారుడు చటుక్కున మేలిముసుగును ఒక వైపు నుంచి మరోవైపునకి తప్పించి రెండవ పాత్రలోకి మెరుపు వేగంతో పరకాయ ప్రవేశం చేస్తాడు. ఈ వేషధారుడిని చూస్తున్నంతసేపూ ఎవరూ కనులు తిప్పలేరు. రెప్పవాల్చలేరు. అలా సాగుతుంది ప్రదర్శన. అర్ధనారీశ్వర వేషం వేసేటప్పుడు చెంత మరో ఇద్దరు, ముగ్గురు వేషగాళ్ళుండి పాటలు పాడుతుంటారు.

శివుని వేషంలో ఉన్నప్పుడు ఫాలభాగం నుంచి పాదాల వరకు అంతా పరమేశ్వరుడి ఆకృతి కనిపిస్తుంది. నుదుటిని విభూది రేఖలు, ఫాలనేత్రం, మీసం...ఇలా పరమేశ్వరుని రూపం మనకు గోచరిస్తుది. అకస్మాత్తుగా పార్వతి రూపంలోకి మారిపోగానే అ అర్ధభాగంలో ఒక స్త్రీమూర్తి కనపడుతుంది. ఇలా రెండు వేషాలకీ దేనీ ఆహార్యం దానిదే. ఒక దానితో ఒక దానికి పొంతన ఉండదు. అందుకే ఈ వేషం అంతగా అందరినీ ఆకట్టుకోగలిగింది. దక్షయజ్ఞం, పార్వతీ పరిణయం, వినాయక జననం, తదితర శివలీలలను ప్రదర్శిస్తారు. చెంతన ఉన్నవారు ప్రమధగణం వేషాలు వేస్తారు.

జంగం దేవర,సోమయాజులు, సోమదేవమ్మ వేషం, బ్రాహ్మణులు, మాదిగలు, కోమటిశెట్టి వేషం...ఇలా విభిన్న వేషాలు వేసి ప్రజలను వినోదంలో ముంచి తేల్చుతారు పగటివేషగాళ్లు. గంగిరెడ్లను ఆడించేవారు, గారడీలు చేసేవారు కూడా పగటి వేషగాళ్ల కోవలోకి వస్తారు. ప్రజలను వినోదపరచి, యాచించడమే వీరి వృత్తి.

వీధి భాగవతం వలె పూర్వకాలం పగటి వేషగాళ్లు గ్రామంలోకి ప్రవేశించిన తర్వాత కొద్దిరోజులు ఆ వేషాలతో ఇంటింటికి తిరుగుతూ వినోదం కలిగించి చివరిరోజున పారితోషికాలు పొందేవారు. కొన్ని పగటివేషాలలో ఇంద్రజాలం, కనికట్టు వంటి విద్యలతో పాటు మంత్ర తంత్రాదులు ప్రదర్శించేవారు. ఇప్పుడిలాంటి వారు ఆంధ్రదేశంలో అంతగా లేరు. ఆంధ్రదేశంలో ఒకనాడు పగటివేషంతో ప్రజలను మెప్పించిన వారిలో పసుమర్తి శేషయ్య, భాగవతుల కుమారస్వామి వంటి అగ్రగణ్యులుండేవారు. వీరిలో శేషయ్య పండితుడు. బైరాగి, భట్రాజు, సోమయాజులు వంటి వేషాలను సునాయాసంగా వేసేవారు. ఆ కాలంలో ఆయనకు సాటి రాగల వారు వేరెవరూ లేరనడం అతిశయోక్తి కాదు.

కుమారస్వామి అద్వితీయ ప్రతిభావంతులు. సుమారు 32 వేషాలను వేసి ప్రజలను మెప్పించగలిగారు. ఇంద్రజాలం వంటి విద్యలను ఆయన అవలీలగా ప్రదర్శించేవారు. కూచిపూడి పగటి వేషగాళ్లలో మొదటి తరానికి చెందిన కుమారస్వామి తర్వాత తరాల వారికి ఆదర్శప్రాయులుగా నిలిచారు.

కూచిపూడి వారు జనబాహుళ్యంలో కులవృత్తులు, జానపదాలకు సంబంధించిన 30సాధారణ వేషాలు, సుమారు పదిహేను పౌరాణికవేషాలు వేసేవారు. ఇటీవల ప్రజానాట్యమండలి వారు తమ ప్రచారానికి ఈ పగటి వేషాలను ఉపయోగించుకుంటున్నారు. రాజకీయాలను ప్రబోధించి సమాజంలోని కుళ్ళును కడిగి వేసే రీతిలో పగటివేషాలను వారు వినియోగించుకున్నారు. మొత్తం మీద వందకు పైగా పగటి వేషాలు ఆంధ్రనాట ప్రజలను అలరించాయి.

-రమణ



బాలకృష్ణ

అభిమానుల సమక్షంలో పైసా వసూల్ పాటలు

బాలకృష్ణ తాజా చిత్రం పైసా వసూల్. పూరి జగన్నాథ్ దర్శకత్వంలో వి.ఆనందప్రసాద్ నిర్మిస్తున్నారు. తొలుత ప్రకటించిన రిలీజ్ తేదీకంటే నెలరోజులు ముందుగానే ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తున్నారు. సెప్టెంబర్ ఒకటవ తేదీన రిలీజ్ అవుతున్న ఈ చిత్రం పాటల వేడుకను ఈనెల 17న ఖమ్మంలో నిర్వహిస్తున్నారు. అభిమానుల సమక్షంలో జరిగే ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి బాలకృష్ణ పూరి జగన్నాథ్‌తో పాటుగా నిర్మాత కలిసి ప్రత్యేక హెలికాప్టర్‌లో హైదరాబాద్ నుండి ఖమ్మం చేరుకుంటారు. అదే రోజున సినిమా ట్రైలర్‌ను కూడా విడుదల చేస్తారు. నిర్మాత మాట్లాడుతూ బాలకృష్ణగారితో సినిమా చేసినందుకు ఆనందంగా, గర్వంగా ఉంది. స్టంపర్‌కు మంచి స్పందన వస్తుంది. ఈ సిమాపై ప్రేక్షకుల్లో ఉన్న అంచనాలను చేరుకుంటామనే నమ్మకం ఉంది. బాలకృష్ణగారి నటన, పూరిగారి టేకింగ్ సినిమాకు హైలెట్‌గా నిలుస్తాయి. ప్రస్తుతం రీ రికార్డింగ్ జరుగుతోంది. అనూప్ రూబెన్స్ అందించిన పాటలను ఖమ్మంలో రిలీజ్ చేయబోతున్నాం అని చెప్పారు.

శ్రియ, ముస్కాన్, కైరా దత్ హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రంలో కబీర్ బేడీ ప్రత్యేక పాత్రలో నటిస్తున్నారు.

చిరు 151 ముహూర్తం ఎప్పుడు?

మెగాస్టార్ చిరంజీవి 151వ సినిమా గురించి అనేక ఆసక్తికరమైన విషయాలు వెల్లడవుతున్నాయి. ఈ ఏడాది సంక్రాంతికి ఆయన నటించిన ఖైదీ నెంబర్ 150 రిలీజై భారీ విజయాన్ని నమోదు చేసింది. తొమ్మిదేళ్ళ విరామం తర్వాత నటించినప్పటికీ అదే ఆదరణ లభించింది. దీని తర్వాత చేయబోయే చిత్రం మరింత ప్రతిష్టాత్మకంగా ఉండాలని ఆలోచించారు. స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవిత కథను వెండితెరపై ఆవిష్కరించేందుకు కసరత్తు చేశారు. కొద్ది నెలలుగా ఉయ్యాలవాడ కథా చర్చలు జరుగుతున్నాయి. చిరంజీవి 151వ సినిమాగా రూపొందే ఈ చిత్రం షూటింగ్ ఇదే నెల అంటే ఆగస్టు 15న మొదలవుతుందని ప్రచారం జరుగుతోంది. లేదా ఈ నెల 22న చిరంజీవి పుట్టినరోజు కావడంతో అదే రోజు ప్రారంభించే అవకాశం కూడా ఉందని తెలిసింది. రామ్‌చరణ్ నిర్మించే ఈ చిత్రానికి సురేందర్ రెడ్డి దర్శకత్వ బాధ్యతలు తీసుకున్నారు.

దక్షిణాది సినిమాలు బహు భాషా చిత్రాలుగా నిర్మాణమవుతున్న నేపథ్యంలో ఉయ్యాలవాడ చిత్రాన్ని తెలుగుతో పాటుగా హిందీ, తమిళ, కన్నడ భాషల్లో నిర్మించడానికి సన్నాహాలు చేస్తున్నారు. అన్ని భాషలకు అనువైన విధంగా మహావీర అనే టైటిల్ నిర్ణయిస్తారని తెలిసింది. బడ్జెట్ కూడా భారీగా కేటాయించారు. ఈ సినిమాలో చిరంజీవి లుక్ ఇలా ఉంటుందంటూ సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది.

ఈ చిత్రంలో నటించే హీరోయిన్ ఎవరనే దానిపై సస్పెన్స్ కొనసాగుతోంది. నయనతార, అనుష్క, ఐశ్వర్యరాయ్ పేర్లు పరిశీలనలో ఉన్నట్టు తెలిసింది. అలాగే ఇతర భాషలకు చెందిన నటీనటులు కూడా నటిస్తారని సమాచారం. ఇప్పటి వరకు ఉయ్యాలవాడ సినిమాకు సంబంధించి అధికారికంగా ఎలాంటి సమాచారం చిత్ర నిర్మాణ సంస్థ వెల్లడించలేదు.





కృతి సనన్

రజనీ సినిమా తెలుగు హక్కులు రూ.75 కోట్లు!!

తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ సినిమాల తెలుగు మార్కెట్ పెరుగుతోంది. తెలుగు స్టార్స్ నటించిన చిత్రాల స్థాయిలో రజనీ సినిమాల మార్కెటింగ్ జరుగుతోంది. శంకర్ కాంబినేషన్‌లో రజనీ నటిస్తున్న తాజా చిత్రం 2.0. సుమారు 400 కోట్ల బడ్జెట్‌తో తీస్తున్న ఈ చిత్రం తెలుగు రాష్ట్రాల హక్కులను రూ.75 కోట్లకు అమ్ముడయ్యాయనేది తాజా వార్త. సినీ ట్రేడ్ సర్కిల్స్‌లో ఆశ్చర్యానికి గురి చేసింది. గ్లోబల్ సినిమాస్ సంస్థ హక్కులు దక్కించుకుంది.

రజనీ, శంకర్ కలయికలో వచ్చిన రోబో చిత్రం తెలుగు రాష్ట్రాల్లో 40 కోట్లు వసులు చేసిందని తెలిసింది. రోబోకు సిక్వెల్‌గా 2.0 తెరకెక్కుతోంది. సాంకేతికంగా మరింత అత్యున్నతంగా ఈ సినిమాను తీర్చిదిద్దుతున్నారు. రజనీకాంత్ సినిమాలకు తెలుగుతో పాటు విదేశీ మార్కెట్ ఉంది. ఈ కారణంగానే భారీ బడ్జెట్‌తో తీయడానికి ప్లాన్ చేశారు. దర్శకుడు శంకర్‌పై ఉన్న నమ్మకం, రజనీకాంత్ మాస్ ఫాలోయింగ్ వెరసీ ఈ చిత్రాన్ని భారీ రేటుకు కొనుగోలు చేశారని తెలిసింది. జనవరి 25న ఈ చిత్రాన్ని రిలీజ్ చేస్తున్నట్టు నిర్మాణ సంస్థ గతంలోనే ప్రకటించింది.

బాలీవుడ్ స్టార్ అక్షయ్‌కుమార్ ఈ చిత్రంలో ప్రతి నాయకునిగా కీలక పాత్రని పోషిస్తున్నారు. దాంతో 2.0 హిందీ శాటిలైట్ హక్కులను 100 కోట్లకు అమ్మినట్టుగా తెలిసింది. రిలీజ్‌కు ముందే బిజినెస్ పరంగా సంచలనం సృష్టిస్తున్న 2.0 రజనీ కెరీర్‌లోనే అత్యుత్తమ చిత్రంగా నిలుస్తుందని ఆయన అభిమానులు విశ్వసిస్తున్నారు.





మిర్యాల రవీందర్

నిర్మాతే హీరో అంటున్నారు

బెల్లంకొండ శ్రీనివాస్, రకుల్ ప్రీత్‌సింగ్ జంటగా నటించిన చిత్రం 'జయ జానకి నాయక'. బోయపాటి శ్రీను దర్శకత్వం వహించారు. ద్వారకా క్రియేషన్స్ పతాకంపై ఈ చిత్రాన్ని మిర్యాల రవీందర్ నిర్మించారు. గతంలో 'సాహసం శ్వాసగా సాగిపో', 'యమన్' లాంటి చిత్రాలు చేసిన ఈ నిర్మాతకు 'జయ జానకి నాయక' భారీ సినిమా. శుక్రవారం ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ చిత్రానికి మంచి స్పందన వస్తోందని చెబుతున్నారు మిర్యాల రవీందర్. నిర్మాణ విలువలు భారీగా ఉండటంతో నిర్మాతే హీరో అని ప్రశంసిస్తున్నారని చెబుతున్నాడు. మిర్యాల రవీందర్ మాట్లాడుతూ...'అన్ని కేంద్రాల నుంచి స్పందన బాగుంది. మంచి వసూళ్లు వస్తున్నాయి. కథను నమ్మి మేము పెట్టి ఖర్చుకు ప్రతిఫలం వస్తోంది. కథానాయకుడి పేరుకు మించి ఖర్చు పెట్టామంటే అది కథ బాగుందనే. అనవసరంగా ఎక్కడా వ్యయం చేయలేదు. దర్శకుడు దాన్ని ప్రేక్షకులకు నచ్చేలా రూపొందిస్తాడని నమ్మాం. అది ఇప్పుడు నిజమవడం సంతోషంగా ఉంది. నిర్మాత అల్లు అరవింద్ లాంటి వాళ్లు ఫోన్ చేసి అభినందిస్తున్నారు. హీరో శ్రీనివాస్ కెరీర్లో నిలిచిపోతుంది. అనుభవమున్న నటీనటులు తమ పాత్రలను ఆకట్టుకునేలా పోషించారు. కథను బట్టి ఇకపైనా భారీ చిత్రాలు నిర్మిస్తాను.' అని చెప్పారు.

నాయికల నుంచి అందం కంటే ఆశించేది ఏముంటుందనేది మూడొంతుల దర్శకుల ఆలోచన. వీళ్ల కోరికకు తగినట్లే దొరికింది కృతి సనన్. కావాల్సినంత ఎత్తు, ఎత్తుకు తగిన ఆకృతి గల ఈ సుందరి చిత్ర పరిశ్రమను త్వరగానే ఆకట్టుకుంది. అభినయం మాట అటుంచితే..ఆమెను సినిమాలోకి ఎవరైనా తీసుకున్నారంటే దానికి అందాల ఆకర్షణే కారణం. ఇప్పటిదాకా గ్లామర్ పాత్రలే ఆమెకు అవకాశాలుగా వచ్చాయి. అయితే ఇన్నాళ్లూ తనకు బలమైన అందాన్ని కోల్పోయి ఈ భామ ఓ సినిమా చేయాల్సివస్తోంది. అదే 'బరేలీ కి బర్ఫీ'. ఈ చిత్రంలో అందవిహీనమైన పాత్రలో కనిపించబోతోంది కృతి సనన్. ఇది ఆమె చేస్తున్న తొలి డీగ్లామర్ పాత్ర. ముక్కోణపు ప్రేమ కథతో దర్శకుడు అశ్వినీ అయ్యర్ తివారీ రూపొందిస్తున్న 'బరేలీ కి బర్ఫీ'లో పల్లెటూరి అమ్మాయి పాత్రలో కృతి సనన్ నటిస్తోంది. రాజ్‌కుమార్ రావ్,

ఇద్దరు యువకుల ప్రేమలో...

ఆయుశ్మాన్ ఖురానా ఆమె ప్రేమికుల్లా నటిస్తున్నారు. ఈ చిత్రం గురించి కృతి మాట్లాడుతూ. ''బరేలీ కి బర్ఫీ' ముక్కోణపు ప్రేమ కథ. ఇందులో నా పేరు బిట్టీ. చిరాగ్, ప్రీతమ్ అనే ఇద్దరు యువకులు నన్ను ప్రేమిస్తుంటారు. ఉత్తర ప్రదేశ్‌లోని ఓ చిన్న ఊరిలో ఆమె నివసిస్తుంటుంది. ఇది అందవిహీనమైన పాత్ర. తొలిసారి ఇలాంటి పాత్ర చేస్తున్నాను. స్థానిక యాసను కూడా నేర్చుకుంటున్నాను. నా తొలి ప్రాధాన్యం కథకే. మంచి కథ నన్ను ఉద్వేగపరుస్తుంటుంది. నటిగా ఎదగాలన్నదే నా ప్రయత్నం. ప్రతి చిత్రంలో కొత్తగా కనిపించాలని అనుకుంటాను.' అని చెప్పింది. 'వన్ నేనొక్కడినే', 'దోచెయ్' సినిమాలతో తెలుగు ప్రేక్షకులకు కూడా ఈ భామ పరిచితమే.

సచ్చిందిరా గొర్రె



శ్రీనివాసరెడ్డి, వేణు, రాకేష్, శివారెడ్డి, సత్యవతి

హాస్యనటుడు శ్రీనివాసరెడ్డి, వేణు, రాకేష్, శివారెడ్డి, సత్యవతి ముఖ్యతారాగణంగా సచ్చిందిరా గొర్రె పేరుతో ఓ చిత్రం తెరకెక్కుతోంది. పవన్ కల్యాణ్ క్రియేటివ్ వర్క్స్ హెడ్‌గా వ్యవహరించిన శ్రీధర్ రెడ్డి యార్వా ఈ చిత్రానికి దర్శకుడు. సోహం రాక్‌స్టార్, ఎంటర్‌టైన్‌మెంట్ స్టూడియో సంయుక్తంగా నిర్మిస్తున్నారు.

మంచి కథలను, టాలెంట్‌ను ప్రోత్సహిస్తూ, అనుకున్న వ్యయంలో సినిమాలను నిర్మించడమే తమ సంస్థ ఉద్దేశమని ఎంటర్‌టైన్‌మెంట్ స్టూడియో అధినేత పాషా తెలిపారు.

దర్శకుడు మాట్లాడుతూ మంచి క్వాలిటీ ఉన్న సినిమాలు నిర్మించిన అనుభవం ఉన్న సంస్థలు నిర్మిస్తున్న చిత్రానికి దర్శకత్వం వహించడం ఆనందంగా ఉందని అన్నారు.

ఈ మధ్యనే సచ్చిందిరా గొర్రె షూటింగ్ ప్రారంభించారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో షూటింగ్ జరుగుతోంది. నవంబర్ నెలాఖరుతో చిత్రీకరణ పూర్తిచేసి, డిసెంబర్‌లో విడుదల చేస్తారు.

దెయ్యం కంటే మనిషి శక్తివంతుడు



మహి

టాలీవుడ్‌లో దశాబ్ద అనుభవం ఉన్న దర్శక నిర్మాత మహి. గతంలో 'విలేజ్‌లో వినాయకుడు', 'కుదిరితే కప్పు కాఫీ', లాంటి చిత్రాలను నిర్మించారు. 'పాఠశాల' సినిమాకు దర్శకత్వం వహించారు. ఆయన తాజాగా రూపొందించిన చిత్రం 'ఆనందో బ్రహ్మ'. తాప్సి ప్రధాన పాత్రలో నటించిన ఈ సినిమా త్వరలో విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా దర్శకుడు మహి చిత్ర విశేషాలు తెలిపారు. మహి మాట్లాడుతూ...' పదేళ్లుగా పరిశ్రమలో ఉన్నాను. నిర్మాతగా సినిమాలు చేశాను. దర్శకుడిగా మారి 'పాఠశాల' అనే చిత్రాన్ని రూపొందించాను. ఈ సినిమా నాకు ఇష్టమైన అంశాలతో రూపొందించాను. సినిమా బాగుందన్నా ..అనుకున్నంత హిట్ అవలేదు. 'పాఠశాల' సమయంలో పరిశ్రమలో ఉన్న కష్టాలు తెలిశాయి. తర్వాత ఏడాదిన్నరగా ఓ కథ రాసుకున్నాను. హారర్ తరహాలో సినిమా చేయాలనుకున్నాను. వారానికో హారర్ సినిమా వస్తోంది. వాటిని చూసినప్పుడు చాలా అవివేకంగా ఉన్నాయనిపించింది. దెయ్యాలు మనుషులతో ఆడుకోవడం, కొట్టడం లాంటివి ఉన్నాయి. దెయ్యాలు ఉన్నాయనేది నమ్మకం మాత్రమే. ఒకవేళ ఉన్నా అవి మనిషి కంటే శక్తివంతమైనవి కావు. వాటికి ఆత్మ ఒక్కటే ఉంటుంది. మనిషికి శరీరం, ఆత్మ రెండూ ఉంటాయి. కాబట్టి మనిషే గొప్ప. 'ఆనందో బ్రహ్మ' అనే పేరుకు కథకు సంబంధం లేదు. త్వరగా ప్రేక్షకులకు చేరుతుందని పెట్టాం. అయితే ఇందులోని హాస్యం పేరుకు దగ్గరగా ఉంటుంది. ఈ సినిమాలో తాప్సీది ప్రధాన పాత్ర. ఈ స్క్రిప్టు ఆమెకు చెప్పినప్పుడు బాలీవుడ్‌లో అంత బిజీగా లేరు. కానీ నాకు నిర్మాత దొరికి తాప్సీ దగ్గరకు వెళ్లేప్పటికి ఆమె తీరిక లేకుండా అయిపోయారు. అయినా సినిమా చేసేందుకు ముందుకొచ్చారు. తాప్సీ పారితోషకం గురించి ఆలోచించలేదు. కేవలం కథ, పాత్ర బాగుందని ఆసక్తి చూపించారు. కథలో ఆమె చుట్టూ మరికొన్ని పాత్రలుంటాయి. ఈ పాత్రలకు కొన్ని వైకల్యాలు ఉంటాయి. అంటే ఒకరు తాగుబోతు, మరొకరికి రేచీకటి, ఇంకో పాత్రకు స్ప్లిట్ పర్సనాలిటీ ఇలా. గుడ్డివాడి ముందు దెయ్యం వస్తే వాడికి ఏం తెలుస్తుంది. ఇందులో పాత్రలు తమ వైకల్యాలతో దెయ్యాలు చేసే పనులను అడ్డుకుంటాయి. ఈ క్రమంలోని సన్నివేశాలు ప్రేక్షకులను నవ్విస్తాయి. కథ మొత్తానికీ ఓ కారణం ఉంటుంది. హారర్ సినిమాల్లో వచ్చే శబ్దాలకు భిన్నంగా నేపథ్య సంగీతాన్ని రూపకల్పన చేశాం. దాదాపు మూడు నెలల సమయం దీనికే పట్టింది. హాలీవుడ్ సినిమాల్లో స్క్రిప్టుకు చాలా ప్రాధాన్యమిస్తారు. ఇక్కడ రూపకల్పనకే ఎక్కువ ఖర్చు పెడతారు. సినిమా మొత్తానికి కథే కీలకం. అలాంటి కథ తయారీకి మనవాళ్లు చేసే వ్యయం చాలా తక్కువ. ఈ దృక్పథంలో మార్పు రావాలి.' అన్నారు.